# LITERARY CRITICISM AND THEORY OF LITERATURE (DT21)

# (M.A. TELUGU)


## ACHARYA NAGARJUNA UNIVERSITY

CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

పాఠం 2

# కావ్యం/కవిత్వం

## 2.0 లక్ష్యం:

కావ్యం/కవిత్వం అనే భావనల్ని పరిచయం చెయ్యడం, అందులోని అంతర విభాగాలను విశ్లేషించి చూపడం ఈ పాఠం లక్ష్యం. ఈ పాఠం ద్వారా మీరు కావ్యం, కవిత్వం అనే అంశాలను గురించిన సర్వవిషయాలను అవగాహన చేసుకుంటారు.

**విషయసూచిక**

2.1. కావ్య కవిత్వ శబ్దచర్చ

2.2. కవి కావ్య సంబంధం

2.3. కావ్య–కవిత్వ నిర్వచనం

2.4. కావ్య శరీర ఆత్మ జీవితవాదాలు

2.5. కావ్య హేతువులు

2.6. కావ్య ప్రయోజనం

2.7. కావ్య స్వరూపం

2.8. నమూనా ప్రశ్నలు

2.9 చదువదగిన గ్రంథాలు

## 2. 1. కావ్య, కవిత్వ శబ్దచర్య:

కావ్యంలో కవిత్వం ఉంటుంది. కవిత్వంతో కూడినది కావ్యం. భారతీయ ఆలంకారికులు కావ్యచర్చ చేశారు. పాశ్చాత్యులు కవిత్వచర్య చేశారు. "నానృషిఃకురుతే కావ్యం" అపారా కావ్యసంసారే కవి రేవ ప్రజాపతిః" "కవయతేతి కవిః తస్యకర్మ కావ్యం" "శబ్దార్థే సహితౌకావ్యం" ఇలా మన ప్రాచీనులు 'కావ్య' శబ్దాన్నే ఉపయోగించారు. అలంకార శాస్త్రాల పేర్లలో 'కావ్య' శబ్దమే ఉపయోగింపబడింది: కావ్యాలంకారం, కావ్యాదర్శం, కావ్యప్రకాశం, కావ్యమీమాంస, కావ్యకౌతుకం, కావ్యాను శాసనం మొ॥. కవిత్వ మీమాంస వంటి మాటల్ని ఎవరూ ఉపయోగించినట్లు లేదు. ప్రాచీన తెలుగు కవులు మాత్రం కావ్య, కవిత్వ శబ్దాలను రెండింటినీ ఉపయోగించారు.

"ఇక్కావ్యంబ రచియించెద" నన్నయ్య. ఆంధ్రమహాభారతం, అవ–20.
"కృతులు చెప్ప" నన్నెచోడుడు – కుమార సంభవం. అవ–42.
"తెలుగు, కవిత్వము జెప్పదలంచిన కవి" తిక్కన – నిర్వచనోత్తర రామాయణం. అవ–7.
"కావ్యంబు నిర్మింప గదంగి" – పింగళిసూరన. కళాపూర్ణోదయం – అవ – 16
"కవిత్వము రచించు మేటి కవులు – రఘునాథనాయకుడు – వాల్మీకి చరిత్ర – అవ–14.

భారతీయ సాహిత్య సంప్రదాయంలో 'కావ్య' శబ్దము ఉపయోగింపబడింది. తెలుగు కవులు, కావ్య, కవిత్వ శబ్దాలను రెండింటినీ ఉపయోగించారు. కవిత్వంతో నిండింది కావ్యం. కవిత్వం లేకుండా కావ్యం ఉండదు.

## 2. కవి – కావ్య సంబంధం:

కవికీ కావ్యానికీ మధ్య సంబంధం విడదీయరానిదీ, విడదీయకాది, విడదీయలేనిది. కవి కళాకారుడు, కావ్యం కళ. కవి శిల్పి, కావ్యం శిల్పం. కవికీ, కావ్యానికీ మధ్య గల సంబంధం రైతుకూ, పంటకు మధ్య గల సంబంధం వంటిది. కార్మికునికీ వస్తువుకీ మధ్యగల సంబంధం వుంది. కావ్యం కవి ఉత్పత్తి. అతని శ్రమఫలం. కవి స్రష్ట. కావ్యం అతని సృష్టి. కవి దార్శనికుడు. కావ్యం అతని దర్శనం. కవి అనుభూతికి అక్షరాకృతి కావ్యం. కవి నిబద్ధతకు అద్దం కావ్యం. కవి దోసిళ్ళలోంచి జారిన అక్షరాల అల్లిక కావ్యం. కవి చూపుడువేలు కావ్యం. కవి ఆలోచనల పేటిక కావ్యం. కవి అనుభూతుల మాలిక కావ్యం. కవి అంతరంగ గీతిక కావ్యం. కవి సమాజంతో చేసే సంభాషణ కావ్యం. కవి న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు కావ్యం. కవి వైద్యుడు చేసే వైద్యం కావ్యం కవి. వీరుడు ధరించిన ఆయుధం కావ్యం. కవి నర్తకుని నాట్యం కావ్యం. కవిగాయకుని గానం కావ్యం. కవి కుమ్మరి కావ్యం కుండ. కవి మేదరి కావ్యం చాప. కవి వడ్రంగి కావ్యం నాగలి.

దుష్టవ్యవస్థ మీద కవి దూసే కరవాలం కావ్యం. శిష్ట వ్యవస్థకు కవి అందించే స్నేహహస్తం కావ్యం. ఊపిరాడని సమాజానికి కవి అందించే ప్రాణవాయువు కావ్యం. దిక్కు తోచనివాళ్ళకు కవి ఇచ్చే అభయహస్తం కావ్యం. స్థలకాలబద్ధమైన జీవితానికి కవిచేసే కళాత్మక వ్యాఖ్యానం కావ్యం. చారిత్ర కవిభాత సంధ్యల మధ్య నిలబడి కవివేసే పొలికేక కావ్యం. చరిత్ర నిర్మాతలకు కవి ఇచ్చే కితాబు కావ్యం. సమాజ గమనంలో కవి గుర్తించిన పాదముద్ర కావ్యం.

## 2.3. కావ్య/కవిత్వ నిర్వచనం:

ప్రాచీన భారతీయ ఆలంకారికులు, పాశ్చాత్య కవులు విమర్శకులు, ప్రాచీన తెలుగు కవులు, ఆధునిక తెలుగు కవులు విమర్శకులు కావ్యాన్ని–కవిత్వాన్ని నిర్వచించారు. వీళ్ళ నిర్వచనాలు దేశకాల సామాజిక సందర్భాలను విభిన్న రకాలుగా ఉన్నాయి. ప్రతిదేశంలోనూ ప్రతియుగంలోనూ కవిత్వం తనను తాను నిర్వచించుకుంటూ వస్తున్నది. వాటిలో కొన్నిటిని తెలుకుందాం.

### ప్రాచీన భారతీయ ఆలంకారికుల కావ్యనిర్వచనం:

భామహుడు: శబ్దార్థౌ సహితౌ కావ్యమ్ (కావ్యాలంకారం)
శబ్దార్థాలతో కూడుకున్నది కావ్యం.

దండి: ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావలీ కావ్యం (కావ్యాదర్శం)
ఇష్టార్థంతో కూడిన పద సమూహం కావ్యం

రుద్రటుడు: ననుశబ్దార్థౌకావ్యం (కావ్యాలంకారం)
శబ్దార్థాలు కావ్యం

వామనుడు: కావ్యశబ్దో యం గుణాలంకార సంస్కృతయోః శబ్దార్థయోః
వర్తత (కావ్యాలంకార సూత్ర వృత్తి)

మమ్మటుడు: తత్–అదోషౌ, శబ్దార్థౌ సగుణా వనలంకృతా పునః క్వాపి (కావ్య ప్రకారం)
దోషాలు లేనివి. గుణాలతో కూడినవీ, కొంచెం
నిరంకారికాలైనా శబ్దార్థాలు కావ్యం

విద్యానాథుడు: గుణాలంకార సహితౌ శబ్దార్థౌ దోషవర్జితౌ
గద్యపద్యోభయమయం కావ్యం. కావ్యవిరోవిదుః (ప్రతాపరుద్ర యంచ భూషణం)

విశ్వనాథుడు: వాస్యం రసాత్మకం కావ్యం (సాహిత్య దర్పణం)
రసాత్మకమైన వాస్యమే కావ్యం

జగన్నాథుడు: రమనాశాయార్థ ప్రతిపాదక శబ్దఃకావ్యం (రసగంగాధరం)
రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దం కావ్యం

ఈ నిర్వచనాలను పరిశీలిస్తే శబ్దమే కావ్యమని అనేకులు నిర్వచించినట్లు అర్థమౌతుంది. మరికొందరు శబ్దార్థాల సమాహారాన్ని కావ్యంగా భావించారు. భాష శబ్దం రూపం. అభిప్రాయం భాషలో వ్యక్తమౌతుంది. భాషశబ్దరూపం. కవిత్వం శబ్దరూపంలోనే వ్యక్తమౌతుంది. అయితే కావ్యశబ్దం నిస్సారంగా నిస్తేజంగా ఉండకూడదు. శబ్దం అర్థవంతమై ఉండాలి. అర్థగాంభీర్యం కలిగి ఉండాలి. వ్యావహారిక శబ్దం వేరు, కావ్యం శబ్దం వేరు. కావ్య శబ్దం పాఠకునిలో గాఢమైన అనుభూతి ముద్రవేసేదిగా ఉండాలి. కావ్యం శబ్దం పాఠకునిలో ఆనందాన్ని, ఆలోచనను కలిగించాలి. పాఠకుని 'మూడ్'ను 'డిస్టర్బ్' చెయ్యాలి. సాధారణ శబ్దం కావ్యంలో అసాధారణ అర్థాన్ని సంతరించుకొని కావ్యానికి జన్మనిస్తుంది. 'ఇష్టార్థం', 'రసాత్మకం', 'రమణాయార్థం' – వంటి పదాలు ఈ అభిప్రాయాన్నే ధ్వనిస్తాయి. శబ్దార్థాలను దంపతులతో పోల్చారు ప్రాచీనులు. అవి విడదీయరానివని అర్థం. కావ్యంలో శబ్దం రూపమైతే, అర్థం వస్తువు. ప్రకృతిలో ప్రతిరూపమూ వస్తురూప సమ్మేళనమే. కావ్యమూ అంతే శబ్దమే కావ్యమన్నంత మాత్రాన, శుష్క శబ్దమని అర్థం కాదు. అర్థసహితమైన శబ్దమే కావ్యం.

"కవిత్వం పిడకకాదు
పిడకలో మెరిసే నిప్పు" (కందుకూరి శ్రీరాములు)

పిడక శబ్దం – రూపం, నిప్పు అర్థం – వస్తువు. నిప్పు లేని పిడక అంటే అర్థం లేని శబ్దం. నిప్పుతో కూడిన పిడక రమణీయార్థాన్ని ప్రతిపాదించే శబ్దం. అదే కావ్యం.

**పాశ్చాత్యుల కవిత్వ నిర్వచనం:**

పాశ్చాత్యులు కవిత్వాన్ని నిర్వచించారు. భారతీయలంకారికులెవరూ కవిత్వం ఛందస్సులో ఉండాలని చెప్పలేదు. భారతీయ కవులకు కవిత్వం ఛందస్సులోనే ఉంటుందనన్నది అవగాహన. కాని డా. జాన్సన్ **"Poetry is Metrical Composition"** అని చెప్పాడు. అలాగే కార్లైల్ పండితులు కవిత్వాన్ని లయాత్మక భావన అన్నాడు. **"Poetry we call Musical thought"** ప్రపంచ ప్రసిద్ధి చెందిన కాల్పనిక కవి వర్డ్స్‌వర్త్" **"All good poetry is the spontaneous overflow of powerful feelings. It takes its origin from a motion recollected in tranquility"** అన్నాడు. అప్రయత్నంగా పొర్లుకొని వచ్చే తీవ్రమైన భావోద్వేగం కవిత్వమౌతుంది. ఆ భావోద్వేగాన్ని ప్రశాంత సమయంలో స్మృతికి తెచ్చేది కవిత్వం అని అర్థం. బేన్ అనే పండితుడు భాషలో వ్యక్తం చేసే భావరూపంలో నిర్వహించే లలిత కళ కవిత్వమంటున్నాడు"

**"Poetry is a fine art operating by means of thought conveyed in language".** ఉత్తమ కవిత్వ గొప్ప తాత్త్వికార్థాన్ని ప్రతిపాదిస్తుందని యీ అభిప్రాయం. **"The best poetry is that which is informed by the soundest Philosophy".** కోల్‌రిజ్ కవిత్వానికి మహోన్నతమైన గౌరవాన్నిస్తూ" కవిత్వం మానవవిజ్ఞానం, ఆలోచనలు, అభిరుచులు, అనుభవాలు, భాష మొదలైన వాటిసారం, పరిమళం" అన్నారు. **"Poetry is the blossom and the**

**fragnance of all human knowledge, human thought, human passions, human language etc."** మాథ్యూ ఆర్నాల్ట్ వాస్తవిక దృక్పథంతో "ఒక్క మాటలో చెప్పాలంటే కవిత్వం జీవిత విమర్శనం" అన్నాడు. **Poetry is, at bottom, a criticism of life".** అంతేకాక మానవ భాష చేరుకోగల అత్యున్నత సమగ్ర అభివ్యక్తి దశ కవిత్వమని కీర్తించాడు. **"Poetry is simply the most delightful and perfect form of utterence that human word cam reach".** మనం ప్రారంభంలోనే డా. జాన్సన్ ఛందోబంధం గలది కవిత్వమని చెప్పినట్లు చెప్పుకున్నాం. కాని కోల్ రిజ్ అనే కవి, గొప్ప కవిత్వం ఛందస్సు లేకపోయినా రాణిస్తుందన్నాడు. **"Poetry of the highest kind mayescist without metra."**

**తెలుగు కవులు:**

ప్రాచీన తెలుగు కవులు కావ్యాన్ని గురించి కవిత్వాన్ని కావ్యావతారికలలో, కావ్యకథా సందర్భాలలో అనేకాభిప్రాయలు వ్యక్తం చేశారు. నన్నెచోడుడు కావ్యం సప్తసంతానాలలో ఒకటిని చెప్పారు. అగ్రహారం, కొడుకు, దేవాలయం, ఉద్యానవనం, చెరువు, నిధి, కావ్యం–అనేవి సప్త సంతానాలని, వీటిలో ఉత్కృష్ట సంతానంబు కృతియ" అని పేర్కొన్నాడు. ఆ తర్వాత శ్రీకృష్ణదేవరాయలు మొదలుకొని అనేకమంది కవులు ఈ ప్రసక్తి తెచ్చారు. వీళ్ళు కావ్యం అక్షర సముదాయమని, అది ఎప్పటికి నాశనంకాదని, కావ్యం గొప్పభావ ప్రచారసాధనమని భావించినట్లు తెలుస్తుంది. ప్రాచీన తెలుగు కవులు చాలామంది కవిత్వం సరస్వతీదేవి దయ వల్లనే పుడుతుందనే అభిప్రాయముంది!! "చతుర కవిత్వతత్త్వ పటు సంపద భారతిదయ" అన్నారు అనిరుద్ధ చరిత్రములో కనుపర్తి అభ్యమాత్యుడు. "వాణిశబ్దముల నర్థములన్ సతతంబు మానిదున్" అని ప్రార్థించారు రామాభ్యుదయములో అయ్యలరాజు రామభద్రుడు. ప్రాచీన తెలుగు కవులు చేసిన కావ్యచర్యలో పింగళి సూరన కళాపూర్ణోదయంలో చెప్పిన పద్యం అనుభూతి భావకతల సంగమమై ఆంగ్ల కాల్పనిక కవులకన్న ముందే భావ కవిత్వ సంప్రదాయాన్ని తలపిస్తున్నది.

"చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము
గలిగినను, సౌరభము జలువయు దలిర్చం
బొలుపెసగు కప్పురపుబలుకులకు గోమలత
నెలకొనిన, సౌరభము జలువ పథసయుంగో
మలతయును గలిగి జనముల మిగుల బెంపెసగు
మలయ పవనంపు గొదమలకు మధురత్వం
బలవడిన నీడును మతిగలదనగ వచ్చుగడు
వెలయగల సుకవి పలుకులకు నెంచన్"

చల్లదనం గలిగిన వెన్నెల అందానికి వాసన జోడైతె, వాసన, చల్లదనం గల కర్పూరం పలుకులకు కోమలత్వం తోడైతే, వాసన, చల్లదనం, కోమలత్వం గల మలయపవనానికి మాధుర్యం తోడైతే సుకవి చెప్పిన కవిత్వానికి ఈడు కుదురుతుంది అని భావం. అంటే కవిత్వ శబ్దానికి రంగు రుచి వాసనలతోపాటు సౌకుమార్యాది గుణాలు కూడా ఉండాలని సూరన అభిప్రాయం. క్రీ.శ. 17, 18 శతాబ్దాలలో కావ్య/కవిత్వ తత్వాన్ని గురించి ఇలాంటి అభిప్రాయాలు చాలామంది కవులు వ్యక్తం చేశారు.

ఉదా : చెప్పవలె గప్పురంబులు
కుప్పలుగా బోసినట్లు, కుంకుమపైపై
గుప్పిన క్రియ, విరిపొట్లము
విప్పిన గతి ఘమ్మనం గవిత్వము సభలన్ (రఘునాథ నాయకుడు – వాల్మీకి చరిత్ర)

ఆధునిక కవులు విభిన్న ఉద్యమ కాలాలలో మారిన సామాజిక సందర్భాల కనుగుణంగా కవిత్వ/కావ్య నిర్వచనాలను చేసుకుంటూ వచ్చారు. కందుకూరి వీరేశలింగం పంతులు నుండి ఈ ధోరణిని మనం గమనింపవచ్చు. 'సరస్వతీ నారద విలాపం' అనే అధిక్షేప కావ్యంలో సరస్వతి నారదునితో ఇలా అంది.

"సుందర బహురసపుష్టి నమందానందంబు బుధులమది కిడదేనిన్

ఛందోబద్ధంబగు పదబృందాటోపంబు తా కవిత్వంబగునే?"

ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్రలో క్షీణయుగంగా పేరు పడ్డ నాటి కవిత్వ తీరును నిరసించిన కందుకూరి, రసానందం కలిగించని, కేవలం ఛందస్సులో కూర్చిన పద సమూహం కవిత్వం కాదని తేల్చి చెప్పాడు. అప్పటి నుంచి అనేకమంది కవులు తమ కవితల్ని నిర్వచించుకుంటూ వస్తున్నారు.

"ఆకులందున అణశిమణిగే
కవిత కోయిల పలుకవలెనోయ్" (గురజాడ)

కదిలేదీ కదిలించేదీ
మారేదీ మార్పించేదీ
పాడేదీ పాడించేది
మునుముందుకు సాగించేదీ
పెనునిద్దర వదిలించేదీ
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకావ్యానికి (శ్రీశ్రీ)

"కవిత కొత్త అనుభవాల కాంతి పేటికలను తెరవాలి కదిలించాలి
నువ్వు చెప్పేదేదైనా నీదై వుండాలి, నీలోంచి రావాలి చించుకు రావాలి
కవిత్వం అంతరాంతర జ్యోతి స్యామల్ని బహిర్గతం చెయ్యాలి" – (బాలగంగాధర తిలక్)

"ఈనాడు కవిత్వం
వర్తమాన చరిత్రలోని ప్రజోద్యమ చైతన్యానికి
పేరు మోసిన ప్రతినిధి" (కుందుర్తి)

"ఇవ్వాలటి కావ్యానికి ఛంధస్సు – ఉద్యమం
కవి సమయం – తిరుగుబాటు
విప్లవం యీనాటి కావ్యానికి స్పందన" (వరవరరావు)

"కవిత్వం నా మాతృభాష
ఇతివృత్తం మానవత్వం" (సి.నారాయణరెడ్డి)

"ప్రజల కన్నీటి బొట్టు
నా కలంలోన సిరాచుక్క" (కె.శివారెడ్డి)

"కలలో మనస్కలించిన నైరూప్రభావం కవిత"
"బహిరంతర చైతన్యాల సంఘర్షణ స్వప్నం
అంతర్యహిర్వేదనల సమాన్వయం కవిత
తగాదాగల రాజీ కవిత" (వేగంటి మోహన ప్రసాద్)

"కవిత్వం వేడుక కాదు
గాయాల గొంతుక" (నదిని సిధారెడ్డి)

"కవిత్వం కావాలి కవిత్వం"
అక్షరం నిండా జలజలలాడిపోయే
కవిత్వం కావాలి కవిత్వం" (త్రిపురనేని శ్రీనివాస్)

"నా కవితలో కమ్మని కలలుంటాయి
అంతుచిక్కని ఊహలుంటాయి
అక్షరాల గమ్మత్తులుంటాయి
నా కవితకు రంగు ఉంది రసం ఉంది వాసనా ఉంది
అన్నింటినీ మించి అనుభూతి నిలువెల్లా ఉంది (పాపికాని శివశంకర్)

ఈ ఉదాహరణలన్నీ పరిశీలిస్తే కావ్య, కవిత్వ నిర్వచనం కాలానుగుణంగా మారుతూ వస్తున్నట్లు అర్థమౌతుంది.

## 2.4. కావ్యం : శరీర ఆత్మ జీవితవాదాలు

భారతీయ ఆలంకారికులు కావ్యాన్ని నిర్వచించడమే కాకుండా కావ్యానికి ఒక శరీరం, దానికొస ఆత్మ, జీవితం ఉంటాయని కూడా గుర్తించారు. అంటే మనిషికి ఉంటాయనుకున్నవన్నీ కావ్యానికి కూడా ఉంటాయని వాళ్ళు భావించారన్నమాట.

మనకు లభిస్తున్నంతలో తొలిభారతీయ ఆలంకారికుడు భరతుడు. ఈయన గ్రంథం నాట్యశాస్త్రం. ఈయన "ఇతివృత్తంతు నాట్యస్య శరీంర పరికీర్తితం" అని చెప్పారు. నాటకానికి నాటక ఇతివృత్తమే శరీరం అని స్పష్టంగా భరతుడు చెప్పాడు. ఈయన ఆత్మను గురించి ప్రత్యేకంగా చర్చించినట్లు లేదు. ఆ భరతుడు పేర్కొన్న కావ్య శరీరానికి అలంకారాలు సౌందర్యాపాదకాలని భావహుడు, అలంకారాలు కావ్యబాహ్య సౌందర్యాన్ని పెంచగా, గుణాలు కావ్యం అంతః సౌందర్యాన్ని పెంచుతాయని దంతి ప్రతిపాదించారు. భామహుని ప్రకారం శబ్దార్థాలు రెండూ కావ్య శరీరమని వ్యాఖ్యాతలు విమర్శకులు భావించారు.

కావ్యానికి ఆత్మ ఉంటుందని మొదట ప్రతిపాదించినది వామనుడు. ఈయన "రాతి రాత్మాకావ్యస్య" అని కావ్యానికి ఆత్మరీతి అని చెప్పాడు. రాతి అంటే విశిష్టపదరచన అని కూడా వామనుడు స్పష్టం చేశాడు. ఇతని తరువాత వచ్చిన ఆనంద వర్ధనుడు వామనుని సిద్ధాంత స్థానంలో కొత్త సిద్ధాంతాని ప్రతిపాదించాడు. ఈయన ధ్వని కావ్యాత్మ అన్నాడు. "కావ్యస్యాత్మా ధ్వనిరి తిబుధైః" కావ్యానికి ధ్వని ఆత్మ అని బుధులు చెప్పారు అన్నారు. ధ్వని అంటే కావ్యంలో స్ఫురించే వ్యంగ్యార్థం కావ్యంలో పైకి కనిపించే అర్థం ఉన్నట్లుగానీ ప్రతీయమానార్థం – స్ఫురించే అర్థం కూడా ఉంటుందని చెప్పారు. అది స్త్రీల అవయవాల మీద స్ఫురించే లావణ్యం వంటిదని వివరించాడు.

“ప్రతీయ మానం పునరన్యదేవ వస్త్వస్తివాణీషు మహాకవీకాం
యతతత్ ప్రసిద్ధావయవాతిరిస్తం విభాతి లావణ్యమివాంగనాసు”

ధ్వనిని వస్తు, అలంకార, రసధ్వనులని మూడు రకాలుగా విభజించారు. ఆనంద వర్ధనుడూ ఇతని ధ్వన్యా లోకానికి అభినవలోచనమ్ అనీ వ్యాఖ్య రాసిన అభినవగుప్తుడు. కావ్యానికి రసధ్వనీ ఆత్మ అని మరింత స్పష్టం చేశాడు.

“రసేనైవ సర్వం జీవతి కావ్యం
నహిరస శూన్యం కావ్యం నించిదపి
రసపవ వస్తుతః ఆత్మా
వస్త్వలంకార ధ్వనీతుసర్వధా
రసం ప్రతిపర్యవస్యతే”

రసం చేతనే కావ్యం జీవిస్తుంది. రసశూన్యమైన కావ్యం ఉండదు. నిజానికి రసధ్వనీ కావ్యాత్మ. వస్తు, అలంకార ధ్వనులు రసపర్యవసాయులు అవుతాయి. భరతుడు ఇంతబలంగా కాకపోయినా రస ప్రాధాన్యాన్ని ప్రతిపాదించాడు. “నహిరసాదృత్ కశ్చిదర్థః ఏప్రవర్తతే”, రసం లేకుండా కావ్యార్థమేదీ ప్రవర్తింపదు.

వీళ్ళ తర్వాత మహిమభట్టు వ్యక్తి వివేకమనీ గ్రంథంలో ధ్వని సిద్ధాంతాన్ని అనుమానాల మీద ఆధారపడినదిగా ఖండించాడు. అయితే ఇతని ప్రతిపాదనను తర్వాత వచ్చిన మమ్మట విశ్వనాథ జగన్నాథులు వ్యతిరేకించారు.

ఈ నేపథ్యంలో ధ్వని సిద్ధాంతం జోలికి పోకుండా కావ్యానికి జీవితం ఉంటుందని ప్రకటించాడు కుంతకుడు” “వక్రోక్తిః కావ్య జీవితం” కావ్య జీవితం వక్రోక్తి అన్నది ఈయన వాదం. శబ్దార్థాలు రెండింటినీ కావ్య శరీరంగా గుర్తించి వక్రోక్తిని దాని జీవితంగా భావించారు.

“శబ్దార్థౌ సహితౌ వక్రకవివ్యాపారశాలిని

బంధౌ వ్యవస్థితౌ కావ్యం తద్విహ్లాదకారిణి

వక్రోక్తిని వర్ణవిన్యాస, పదపూర్వార్థ, పదపరార్థ, వాక్య, ప్రకరణ, ప్రబంధ వక్రతలని ఆరు విధాలుగా విభజించారు. ఇతని తర్వాత క్షేమేంద్రుడు ఔచిత్యాన్ని కావ్య జీవితంగా ప్రతిపాదించాడు. ఔచిత్యం రస “సిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితం”. అయితే ఆనంద వర్ధనుడు అనౌచిత్యాన్ని గురించి ముందే ప్రస్తావించడం గుర్తు పెట్టుకోవాలి.

అనౌచిత్యాద్రాత్ నాన్య ద్రస భంగస్య కారణం
ప్రసిద్ధౌచిత్య బంధస్తు రసస్యోప నిషత్పృణ
అనౌచిత్యం కన్నా రసభంగానికి వేరే కారణం లేదు. ఔచిత్యం గల కావ్యం రసోప నిషత్ – అని అర్థం.
ఇలా భారతీయ ఆలంకారికులు కావ్య శరీరాత్మ జీవితాలను గురించి వారాలు చేశారు.

## 2.5. కావ్యహేతువులు:

ప్రకృతిలోగాని ప్రపంచంలోని కారణం లేకుండా ఏ కార్యం జరగదు. ప్రతిదీ హేతుబద్ధంగానే జరుగుతుంది. కవిత్వం పుట్టుక కూడా అంతే. భారతీయాలంకారికులు ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం, ఈ మూడింటిని హేతువులుగా పేర్కొన్నారు.

"నైసర్గికోచ ప్రతిభా్రశుతంచ బహునిర్మలమ్
అమందశ్చాభియోగో స్యాః కారణం కావ్య సంపదః" (దండి - కావ్యాదర్శం)
(సహజమైన ప్రతిభ, బహునిర్మలమైన పాండిత్యం, గొప్ప రచనా ప్రయత్నం–ఈ మూడూ కలిసి కావ్యసంపదకు కారణం)

"శక్తిర్నిపుణతా లోకశాస్త్ర కావ్యాద్య లేక్షణాత్

కావ్యజ్ఞ శిక్షయాభ్యాస ఇతిహేతు స్తదుర్భతౌ" (మమ్మటుడు - కార్యప్రకాశం)

శక్తిని, (ప్రతిభ)లోకాన్ని శాస్త్రాలను, కావ్యాలను చదవడం ద్వారా లభించిన నిపుణత, పండితుల శిక్షణ ద్వారా చేసే ఆభ్యాసం ఈ మూడూ కలిసి కావ్య హేతువు.

"త్రితయమిదం వ్యాప్రియతౌ శక్తిర్వ్యుత్పత్తిరభాసః" (రుద్రటుడు–కావ్యాలంకారం)

శక్తి, వ్యుత్పత్తి, అభ్యాసం, ఈ మూడు కావ్యహేతువులవుతున్నవి. ఈ అభిప్రాయాలన్నిటినీ బట్టి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం–అనే హేతువుల వల్ల కావ్యం పుట్టుతున్నదని మన ఆలంకారికుల అభిప్రాయమైనట్లు తెలుస్తుంది.

ప్రతిభ ఏదైనా ఒక పనిని అందంగా ఆకర్షణీయంగా యుక్తియుక్తంగా చేసే శక్తి గల వానిని ప్రతిభావంతుడు అంటుంటాం. ఒక పనిని సమర్థవంతంగా సృజనాత్మకంగా నిర్వహింపగల శక్తి ప్రతిభ.

"ప్రజ్ఞానవనతోన్మేష శాలనీ ప్రతిభామతా"

తదనుప్రాణనా జీవ వర్ణనా నిపుణఃకవిః

"తస్య కర్మస్మృతం కావ్యం" అని భట్టతౌతురు తన "కావ్యకాతుకం'లో నిర్వచించారు. కొత్త కొత్త పోకడలను కలిగించే ప్రజ్ఞయే ప్రతిభ. దానిననుసరించి వర్ణన చేసేవాడు కవి. అతని కర్మ కావ్యం అని అర్థం. అభినవగుప్తుడు "ప్రజ్ఞా అపూర్వ వస్తునిర్మాణక్షమా" కొత్తకొత్త వస్తువులను నిర్మించే నేర్పు ప్రతిభ–అని ప్రతిభను నిర్వచించాడు. ఒక వస్తువును అపూర్వంగా ముందటి కవుల కన్నా మహోన్నంతా నిర్మించగల శక్తి ప్రతిభ. వస్తువుకు సంబంధించిన అనుభూతి ముద్రను పాఠకునిలో గాఢంగా వెయ్యగల విద్య ప్రతిభలో దాగి ఉంటుంది. ఈ ప్రతిభనే భావనాశక్తి అని ఇవాళ అంటున్నాం. ఒక సామాజికాంశాన్ని కావ్యయోగ్యాంశంగా రూపాంతరీకరింపగలిగిన విద్య భావనాశక్తి.

ఈ ప్రతిభ రెండు రకాలుగా ఉంటుందని జగన్నాథ పండిత రాయలు అభిప్రాయం. 1. అదృష్ట జన్యం 2. వ్యుత్పత్తి అభ్యాస జన్యం. 3. పూర్వ జన్మ సుసృతం వల్ల, దైనవాను గ్రహం వల్ల సిద్ధించేది అదృష్ట జన్య ప్రతిభ. కవి సమాజాన్ని సాహిత్యాన్ని అధ్యయనం చేసి పొందిన కవిత్వ శక్తి రెండవది. మొదటి దానికి రుజువు లేదు. రెండవది అనుభవసిద్ధం.

రాజశేఖరుడనే ఆలంకారికుడు ప్రతిభ కారయిత్రి, భావయిత్రి అని రెండు రకాలుగా ఉంటుందని, వస్తువును భావింపజేసేది భావయిత్రి, రచనను చెయ్యించేది కారయిత్రి అని పేర్కొన్నాడు. ఈ రెండు రకాల ప్రతిభ కావ్యరచనకు అవసరమే. భావయిత్రి ఆంతరం, కారయిత్రి బాహిరం. "రచయిత చైతన్యం కేవలం భౌతిక జగత్తును ప్రతిఫలించదు. దానిని సృష్టించదు" అంటాడు లెనిన్. ఇందుకు ప్రతిభ ప్రధాన కారణం.

## వ్యుత్పత్తి:

కవి స్థలకాలబద్ధమైన జీవితాన్ని అనుభవించి, అధ్యయనం చేసి పొందే జ్ఞానం వ్యుత్పత్తి. కవి అధ్యయనం ద్వారా అనేక సామాజికాంశాలను అర్థం చేసుకుంటాడు. శాస్త్రార్థాలను తెలుసుకుంటారు. సాహిత్య రహస్యాలను అవగతం చేసుకుంటాడు.

భాషాపాటవం సంపాదిస్తాడు. ఇవన్నీ కలిసి వ్యుత్పత్తి అవుతాయి. కవికి ఇతర కళల పరిజ్ఞానం ఉండడం కూడా మంచిది. గుడ్‌హర్ట్ రెండెల్ **Some general knolwedge of all the Art is soil in which particular knowledge in any one of them should be planted if it is to flourish and bear fruit** అని సూచించారు.

రచనకు రక్తమాంసాలు చేకూర్చడానికి ప్రతిభతోపాటు వ్యుత్పత్తి కూడా అవసరం. "కవి బాధ్యత ఎంతటిదో కదా" అని భామహుడు ఆశ్చర్యాన్ని ప్రకటించింది వుత్పత్తి దృష్టితోనే.

## అభ్యాసం

"అభ్యాసం కూసు విద్య" అని సామెత "అనగ నన‌గ రాగ మతిశయిల్లుచునుండు" అన్నాడు వేమన. "సాధనము పనులు సమకూరు ధరలోన" అన్నది మరో సూక్తి. కావ్యరచనలో నిరంతర అభ్యాసం కవిని ఉత్తమ కావ్యనిర్మాణదక్షుని చేస్తుంది. సాధారణ జీవితంలోనే సాధన జీవితానికి సానబెట్టుతుంది. చెట్లెక్కడం, ఈతాడడం, పొలం దున్నడం, మోటతోలడం వంటి వాటిలో అభ్యాసం చేసినవాడికి చేయనివాడికి తేడాను కనిపెట్టవచ్చు. కవిత్వ రచనలో కూడా అంతే. రాసిన ప్రతిదీ గొప్ప రచన కాదు. మాటిమాటికీ సంస్కరించుకున్నదే మహారచన అవుతుంది. చాగంటి సోమయాజులు అనేక పథల్ని అనేక పర్యాయాలు రాసేవారట.

కావ్యహేతువులుగా మన పూర్వికులు ప్రతిభ వ్యుత్పత్తి అభ్యాసాలను పేర్కొని వాటిలో ఏది ముఖ్యం అనే విషయాన్ని కూడా చర్చించారు.

"కావ్యంతు జాయత్ కస్యచిత్ ప్రతిభావతః"

అని భామహుడు ప్రతిభావంతుడైన ఒకానొకవికి మాత్రమే కావ్యనిర్మాణం సాధ్యమౌతుందన్నాడు. వ్యుత్పత్తి అభ్యాసం ప్రతిభను సంస్కరించి ఉత్తేజితం చేస్తామని రుద్రటుడు, హేమచంద్రుడు అభిప్రాయపడ్డారు.

"అవ్యుత్పత్తికృతో దోషః శక్త్యా సంవ్రియతేకవేః
యస్త్వశక్తి కృతో దోషః సఝటిత్యవభాసత్" (ధ్వన్యాలోకం)

అన్నాడు ఆనందవర్ధనుడు. వ్యుత్పత్తి కొరత వల్ల కలిగే దోషాన్ని ప్రతిభ పూర్తిగా కప్పిపెడుతుంది. ప్రతిభ లేకపోవడం వల్ల కలిగే దోషం వెంటనే కనిపిస్తుంది అని ఆనందవర్ధనుని అభిప్రాయం. అందుకే ఆయన "ప్రతిభావ్యుత్పత్త్యోః ప్రతిభా శ్రేయసే." అని ప్రతిభకు అగ్రస్థానమిచ్చాడు. ఇలాంటి అభిప్రాయాన్నే రాజశేఖరుడు కూడా వ్యక్తం చేశారు. అయినా ప్రాపంచిక జ్ఞానం లేకుండా భావనా శక్తి ఒక్కటే ఉన్నా, భావనాశక్తి లోపించి, ప్రాపంచిక జ్ఞానమొక్కటే ఉన్నా, ఈ రెండూ ఉండి రచనా సామర్థ్యం లోపించినా కావ్యం రాణించదు. సమాజానికి మేలు జరగదు. అందువల్ల గొప్పకావ్యం పుట్టడానికి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం మూడూ అవసరమే.

## మరొక్క విషయం:

మంచి కవిత్వం రాయడానికి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం అనేవి ఉండాల్సినవే. కాని, గొప్పరచన పుట్టడానికి ఇవే సరిపోవు. ఈ మూడింటిని కవిత్వహేతువులనడం కన్నా, కవి కుండవలసిన అర్హతలనడం మేలు. ఈ మూడూ ఉంటేనే కవిత్వం పుట్టుతుంది. ఇంకేమి అక్కర్లేదా ? ఇవి లేకుంటే గొప్పకావ్యం రాయలేని మాట వాస్తవమే. అయితే వీటితోపాటు ఉండవలసింది, అనివార్యంగా ఉండేది మరొకటుంది. అది సామాజిక ప్రేరణ.

సామాజిక ప్రేరణ లేకుండా కావ్యం పుట్టదు. విభిన్న కాలాల్లో విభిన్న సామాజిక వస్తువులతో కావ్యాలు రావడానికి ఆయాకాలాల సామాజిక ప్రేరణలే లేదా సామాజిక అవసరాలే. అలాగే ఒక్కొక్క ప్రాంతం నుంచి ఒక్కోరకం సాహిత్యం రావడానికి కూడా సామాజిక ప్రేరణలే హేతువులు. సామాజిక పరిస్థితి కవిని రెచ్చగొట్టితే ప్రతిభా వ్యుత్పత్తి అభ్యాసం గల కవి కావ్యం రాస్తున్నాడు. కోడికి కూత వెయ్యడం చేతనౌనని అది ఎప్పుడు కూస్తే అప్పుడు తెల్లవారదు. కూతవేసే శక్తి కోడి కుండాలనడంలో సందేహంలేదు. కాని కూత కుయ్యాల్సిన సమయానికి కూయాలి. కవికి కావ్యానికి కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. "ఒక సమస్య ఉన్నందువల్లనే మహా గ్రంథం రాదు. గొప్ప రచయిత ఉన్నందువల్లనే అది వచ్చును". "వరవిక్రయ" నాటక కాలమున కంటే వరకట్న పద్ధతి యిప్పుడే ముమ్మరముగా నున్నను 'వరవిక్రయ' నాటకస్థాయికయినను వచ్చు ఒక్క రచన కూడా ఇప్పుడు రాలేదే?" అన్నది డా॥ సర్దేశాయి తిరుమలరావు ప్రశ్న (కన్యాశుల్కనాటక కళ) అప్పటికే నశించిపోతున్న కన్యాశుల్క నాటక సమస్య మీద గురజాడ రాసిన కన్యాశుల్క నాటకం, ఆ సమస్య నశించిపోయినా ఇవాళ కూడా సజీవంగా ఉంది. వరవిక్రయ నాటకం నాటికన్నా ఇవాళ వేయిరెట్లు బలపడి ఉంది వరకట్న సమస్య. అయినా అంతగొప్ప నాటకం కాలేదు. అంటే ఒక గొప్పరచన రావడానికి అనుకూలమైన సామాజిక పరిస్థితి ఇవాళ ఉంది. దానికి ప్రతిభా రాహిత్యమే కారణం కాదు. ఇందుకు వేరే కారణాలు చెప్పుకోవాలి.

సాహిత్యం సామాజిక చైతన్యరూపం. దీని సృష్టికి ఆయాకాలాల సామాజిక అస్తిత్వమే ప్రేరణ. సాహిత్యానికి జన్మస్థానం, గమ్యస్థానం. రెండూ సమాజమే. మరోరకంగా కవి పాత్రధారి, సమాజం సూత్రధారి. ప్రపంచం తనను తాను అందంగా సుఖంగా మార్చుకోవడానికి, పురోగామిగా దిద్దుకోడానికి విభిన్న కాలాల్లో తనదైన సాహిత్యాన్ని సృష్టించుకుంటుంది. అందుకు కవులు, రచయితలు ఉపకరణాలుగా ఉపయోగపడతారు. అందువల్ల అసలైన కవిత్వ హేతువు స్థలకాలబద్ధమైన సామాజిక ప్రేరణ. ప్రతిభ వ్యుత్పత్తి అభ్యాసం కవికి కావలసిన అర్హతలు, పరిసరాలు.

## 2.6. కావ్య ప్రయోజనం:

ప్రకృతిలో ప్రపంచంలో ప్రయోజనారహితంగా ఏదీ పుట్టదు, బతకదు. కవిత్వం కూడా అంతే. కవిత్వం సమాజంలోంచే పుట్టుతుంది. సమాజంలోకే చేరుతుంది. ఈ ప్రక్రియ ప్రయోజనారహితంగా జరగదు. జ్వరం వచ్చిన పిల్లవాడు కోతి నవ్వినా లేచి కూర్చుంటాడు. అలాంటిది సాహిత్యంవల్ల ప్రయోజనం ఉండదా? అన్న డా॥ సర్దేశాయి తిరుమలరావు ప్రశ్నను అర్థం చేసుకోవాలి. కవిత్వానికి సమాజమే రంగస్థలం కనుక దాని ప్రయోజనం కూడా సామాజికమే. కవిత్వ ప్రయోజనమంటే కవిత్వం నిర్వహించే సామాజిక భూమిక అని అర్థం.

కవిత్వ / కావ్య ప్రయోజనాన్ని గురించిన ఆధునిక ఆలోచనల్ని చెప్పుకునే ముందు, ప్రాచీన ఆలంకారికులు ఏమనుకున్నారో సమీక్షించుకుందాం. ప్రాచీన భారతీయ ఆలంకారికులు సాహిత్యానికి ఆనందం ఉపదేశం అనే రెండు ప్రధాన ప్రయోజనాలను ఉద్దేశించారు.

భరతుడు నాట్యశాస్త్రం ఉపదేశాత్మకం కావడమే గాక, హితాన్ని, ధైర్యాన్ని, క్రీడను, సుఖాన్ని కలిగిస్తుందని చెప్పాడు. సర్వకర్మలతోను, కూడి భావరసాల మూలంగా అందరికీ ఉపదేశజనకమౌతుందన్నాడు.

"దుఃఖార్తానాం శ్రామార్తానాం శోకార్తానాంతపస్వినామ్
విశ్రామజననం లోకే నాట్యమే తద్భవిష్యత్" అన్న శ్లోకంలో విశ్రాంతిని నాట్యప్రయోజనంగా భామహుడు పేర్కొన్నాడు.
ధర్మార్థకామ మోక్షేషు వైచక్షణ్యం కళాసుచ
ప్రీతించ కరోతికీర్తించ సాధుకావ్యనిషేవణం (భామహుడు–కావ్యాలంకారం)

చతుర్విధపురుషార్థాలు, కళావైచక్షణ్యం ప్రీతి కీర్తి మంచికావ్యం వల్ల కలిగే ప్రయోజనాలు.

"కావ్యంయశస్కేర్థస్పతే వ్యవహారవిదే శివేతర క్షతయే
సద్యఃపరని ర్వృతయే కాంతా సమ్మితతయోపదేశయుజే (మమ్మటుడు-కావ్యప్రకాశం)

యశస్సు, ధనం, వ్యవహార జ్ఞానం, అమంగళ పరిహారం, తక్షణానందం మంచిమాటలతో సన్మార్గోపదేశం మమ్మటుని దృష్టిలో కావ్యప్రయోజనాలు.

దండి కావ్యంలో ఆది రాజయశోబింబాలు ప్రతిబింబిస్తాయన్నాడు. భోజుడు సరస్వతీ కంఠాభరణంలో కీర్తిని ప్రీతిని కావ్య ప్రయోజనాలుగా పేర్కొన్నాడు.

"నిర్దోషం గుణవత్కావ్యమలంకారైరలంకృతం
రసానిత్వం కవిః కుర్వన్ కీర్తిం ప్రీతించవిందతి"!
వామనుడూ ఇలాగే భావించాడు.

కావ్యం సత్‌దృష్టా దృష్టార్థం ప్రీతి కీర్తి హేతుత్వాత్ (కార్యాలంకార సూత్రవృత్తి)

ఇలా భారతీయ ఆలంకారికులు ప్రధానంగా ఆనందోపదేశాలను కావ్యప్రయోజనాలుగా భావించగా ఆనందవర్ధనుని కాలానికి ఆనందమే పరమప్రయోజనమైంది. ఆనందవర్ధనుడు "సహృదయ జన మనంః ప్రకాశం" ప్రధాన కావ్యప్రయోజనమనగా, ధ్వన్యాలోక వ్యాఖ్యాత అభినవ గుప్తుడు "తథా పి ప్రీతిరేవ ప్రధానం" అని తేల్చాడు. "చతుర్వర్గ వ్యుత్పత్తేరపిచ ఆనందపవ పార్యంతికంఫలం" అని కూడా నిగ్గుతేల్చాడు. అయితే ప్రాచీనులు చెప్పిన ఆనందం ఎలాంటిది ? ఎవరికది ఆనందం, వాళ్ళ ఉపదేశం ఏది ? ఎలాంటింది ? – అన్న ప్రశ్నలు నేటి పాఠకులకు కలగడం సహజం. ఒకరికి ఆనందదాయకమైంది అందరికీ ఆనందదాయకం కాదు. ఒకరు చేసిన ఉపదేశం అందరికీ సదుపదేశం కాకపోవచ్చు. అందువల్ల ఆనందోపదేశాలను సాపేక్షపదాలుగా గుర్తించాలి.

నన్నయ భారతంలోను, పోతన భాగవతంలోనూ 'జగద్ధితం' తమ కావ్య ప్రయోజనంగా పేర్కొన్నారు. వాళ్ళ దృష్టిలో హితమైనది ఆధునిక కాలానికి హితం కాకపోవచ్చు.

ఆధునిక రచయితల్లో గురజాడ ఉన్నత నైతిక విలువల్ని ప్రతిపాదించడం కన్యాశుల్క నాటక రచనోద్దేశ్యంగా పేర్కొన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్రగతిశీల రచయిత మాక్సిమ్‌గోర్కీ "ఉద్దేశపూర్వకంగా గానీ అనుద్దేశపూర్వకంగా గానీ సర్వకళలచే వుండే ప్రయోజనం యేమిటంటే మనవునిలో కొన్ని అనుభూతులను జాగృతం చెయ్యడం, ఒక ప్రత్యేక జీవిత దృగ్విషయం పట్ల ఒక ప్రత్యేక దృక్పథాన్ని పెంపొందించడం" అని చెప్పారు. (గోర్కు సాహిత్య వ్యాసాలు). అలాగే ప్రసిద్ధ భారతీయ ప్రగతిశీల రచయిత "జీవిత సమస్యలను పరిష్కరించటానికి జీవితాన్ని సుఖవంతంగాను అర్థవంతంగాను చెయ్యటానికి సాహిత్యం ఉపయోగపడటం కంటే ఎక్కువ ప్రయోజనం ఏమీ వుండదు" అన్నారు. (ప్రేమ్‌చంద్-సాహిత్య వ్యాసాలు)

ఈ అభిప్రాయాలను అర్థం చేసుకుంటే కవిత్వం కేవల ఉపదేశం కన్నా మించిన ప్రయోజనాన్ని సాధించే ప్రక్రియగా బోధపడుతుంది. సాహిత్యం ఉన్నత భావప్రచారం చెయ్యాలి. కవిత్వం భావప్రచార సాధనమని పూర్వ కవులే గుర్తించారు. ఏ భావాలను ప్రచారం చెయ్యాలన్నదని కాలం నిర్ణయిస్తుంది. కవిత్వం భావ ప్రచార సాధనంటే ఆధునిక కాలంలోని సంప్రదాయవాదులు అభ్యంతరం చెప్పవలసిన పనిలేదు. ఏ. శివరామ కారంత్ అనే కన్నడ రచయిత తాను మరణించే లోపల ఈ ప్రపంచాన్ని మరింత అందంగా మలచడమే తన రచనోద్దేశంగా పేర్కొన్నారు. పి.సి.గుప్త అనే విమర్శకుడు కళ జీవితాన్ని సౌందర్యాత్మకం చెయ్యాలనే

కోరికతో మొదలవుతుందన్నారు. ఈ అభిప్రాయాలు కవిత్వ ప్రయోజనం విషయంలో ఆధునికులకు విభిన్నమైన ఆలోచనలున్నట్లు తెలుస్తుంది.

"ఆత్మ కోసం సాహిత్యం, రాజుకోసం సాహిత్యం. ఆనందం కోసం సాహిత్యం అనేది సంప్రదాయ దృక్పథం. సాహిత్యం కోసం సాహిత్యం. అందం ఆనందం కోసం సాహిత్యం. సౌందర్యంకోసం సాహిత్యం అనేది ఆధునిక ముసుగులోని సాంప్రదాయిక దృక్పథం. కళ ప్రజలకోసం. మనవతామహితమైన వర్గరహిత సమాజ ధ్యేయం కోసం సాహిత్యం నిబద్ధం కావాలి" అంటారు త్రిపురనేని మధుసూదనరావు (సాహిత్యంలో వస్తుశిల్పాలు). ఇది ఆధునిక సాహిత్యచైతన్యం లోంచి పుట్టిన ఆలోచన. అందువల్ల సాహిత్యం నుంచి ప్రాచీనులు ఆశించిన ప్రయోజనం వేరు. ఆధునికులు ఆశిస్తున్న ప్రయోజనం వేరు అని అర్థం చేసుకోవాలి.

ఆధునిక కాలంలో సామాజిక ఉద్యమాలు వస్తున్న కొలదీ సాహిత్య ప్రయోజనం విషయంలో ఆలోచనలు మారాయి. సంఘసంస్కరణోద్యమ సాహిత్యం శాస్త్రీయాలోచనల్ని ప్రచారం చేసింది. సంస్కరణ భావాలను వెదజల్లింది. మూఢనమ్మకాలను, మూఢాచారాలను ఖండించింది. భారతజాతీయోద్యమం. దేశీయత దేశభక్తి, స్వపరిపాలన వంటి భావాలను ప్రచారం చేసింది. అభ్యుదయ విప్లవ సాహిత్యాలు వర్గరహిత సమాజ నిర్మాణాన్ని లక్ష్యంగా ప్రచారం చేశాయి. దళిత సాహిత్యం కులరహిత సమాజాన్ని, స్త్రీవాద సాహిత్యం పురుషాధిక్యత లేని సమాజాన్ని ప్రచారం చేశాయి.

"సాహిత్యం కేవలం మనోరంజనానికే పరిమితంగా వున్నంత వరకు జోలపాటలుపాడి నిద్రపుచ్చటానికి ప్రయత్నించినంత వరకు క్రియాశక్తి అవసరము వుండదు. అది ఒక ఉన్మాదం లాంటింది. కాని మనము సాహిత్యం కేవలం మనోరంజనానికి విలాసానికి అనుకోవటం లేదు. మన గీటురాయి మీద సాహిత్యానికి మెరుగు పెట్టాలి. దానిలో ఉన్నత భావాలు స్వతంత్రాలోచనలు, సౌందర్యారాధన, ఆత్మవికాసం, నిండి వుంటాయి". (ప్రేమ్‌చంద్-సాహిత్య వ్యాసాలు)

మానవ సంబంధాలలో ఆరోగ్యపరమైన మార్పుతేవడం ఉత్తమ కవిత్వ ప్రయోజనం. మనిషి సంస్కారాన్ని ఉన్నతీకరించడం మంచి కవిత్వ లక్ష్యం. కవిత్వం సామాజిక స్పృహను సామాజిక చైతన్యాన్ని పాఠకులలో కలిగించాలి, వాళ్ళను కర్తవ్యోన్ముఖుల్ని చెయ్యాలి. మనిషిని స్వావలంబుని చెయ్యడం గొప్ప కావ్యప్రయోజనం. మహాప్రస్థానం చదివితే మనకొక నూతన ప్రపంచం కనిపిస్తుంది. జీవితం మీద విశ్వాసం కుదురుతుంది. కవిత్వ/కావ్య ప్రయోజనమదే.

## 2.7. కావ్యస్వరూపం:

ప్రాచీన సాహిత్యంలో పురాణేతిహాసాలు కావ్యప్రబంధాలు విభిన్న ప్రక్రియలుగా వచ్చాయి. ఆధునిక సాహిత్యంలో మహాకావ్యాల జోరు తగ్గింది. స్వాతంత్ర్యానంతరం ఇంకాబాగా తగ్గిపోయింది. ఆధునిక కవిత్వంలో ప్రాచీన కవిత్వంలోలాగా పద్దెనిమిది పర్వాలుండవు. పద్దెనిమి పాదాలుంటాయి. అందుకనే ఒక ఆధునిక కవి అన్నారు. "ఎన్ని గజాలు రాశామన్నది కాదు, ఎన్ని నిజాలు చెప్పామన్నది ప్రధానం" అని. అభ్యుదయ సాహిత్యంలోనూ వచన కథాకావ్యాలు రావాలని కుందుర్తి ఆంజనేయులు బాగా ప్రచారం చేశారు. అయినా ఆయన రాసిన 'తెలంగాణా', ఆరుద్ర 'త్వమేవాహం' సోమసుందర్ 'వజ్రాయుధం' వంటి కావ్యాలు ఎక్కువ రాలేదు. ఇటీవలి కాలంలో నగ్నముని 'కొయ్యగుర్రం', శేషేంద్రశర్మ 'నాదేశం నాప్రజలు', సి. నారాయణరెడ్డి 'విశ్వంభర', 'మట్టీమనిషీ ఆకాశం', కె.శివారెడ్డి 'ఆసుపత్రిగీతం', ఛాయారాజ్ 'శ్రీకాకుళం' వంటి దీర్ఘకావ్యాలు సుమారుగా వచ్చాయి. ఇవి ఆధునిక కావ్యాలు. ప్రాచీనకాలం కవులు చెప్పిన కావ్య స్వరూప లక్షణాలు వీటిని సరిపడవు. వీటిలో పాత్రలు, రసం వంటి ప్రాచీన కవ్య విశేషాలుండవు. అందువల్ల ఇప్పుడు మనం తెలుసుకునే కావ్యస్వరూపం భారతీయలంకారికులు చెప్పిన సంప్రదాయ కావ్య స్వరూపమే. మొదట భామహుడు చెప్పిన కావ్య స్వరూపం తెలుసుకుందాం.

"సర్వబంధోమహాకావ్యం మహతాం చమహచ్చయత్
అగ్రామ్య శబ్ద మర్థంచ సాలంకారం సదాశ్రయం
మంత్ర దూత ప్రయాణాజి నాయకాభ్యుదయైశ్చయత్
పంచభిః సంధిభిర్యుక్తం నాతివ్యాఖ్యేయే మృద్ధిమత్
చతుద్వర్గాభిధానే పి భూయసార్థో పదేశకృత్
యుక్తం లోకస్వభావేన రసైశ్చసకవైః పృథన్" (కావ్యాలంకారం)

మహాకావ్యం సర్గలలో బంధింపబడి ఉంటుంది. గొప్ప విషయాన్ని నిరూపించేదిగా ఉంటుంది. గ్రామ్యాలు కాని శబ్దార్థాలతో, అలంకారాలతో కూడుకొని మంచిని ఆశ్రయించి ఉంటుంది. మంత్రం, దూతం, ప్రయాణం, యుద్ధం, నాయకాభ్యుదయం–అనే అయిదు వర్ణనలు కావ్యంలో ఉంటాయి. పంచసంధులుంటాయి. అతివ్యాఖ్యానాన్ని కోరనిదై ఉంటుంది కావ్యం. అది సమగ్రతను కలిగి ఉంటుంది. ధర్మార్థకామ మోక్షాలనే చతుర్విధపురషార్థాలను ప్రతిపాదిస్తుంది. ఉపదేశం, లోకస్వభావంలతో కూడిన కావ్యం సకల రసాలతో అలరారుతుంది. భామహుని తర్వాత దండి మరింత విసృతంగా కావ్య స్వరూపాన్ని చెప్పాడు – కావ్యదర్మంలో

సర్గబంధో మహాకావ్యముచ్య తౌతస్య లక్షణం
ఆశీర్న మస్క్రియా వస్తు నిర్దేశోహిపి తన్ముఖం
ఇతిహాసకథోద్భూత మితరద్వాసదాశ్రయం
చతుర్వర్గఫలాయత్తం చతురోదాత్తనాయకం
నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయం వర్ణనైః
ఉద్యాన సలిల క్రీడా మధుపానరతోత్సవైః
విప్రలంభ వివాశ్చ కుమారోదయ వర్ణనైః
మంత్రదూత ప్రయాణాజినాయకాభ్యుదయై రపి
అలంకృతర సంక్షిప్తం రసభావ నిరంతరం
సర్గే నతి విస్తే ర్ణైః శ్రవ్య వృత్తైః సుసంధిభిః
సర్వభిన్న వృత్తాం తైరుపేతం లోకరంజనం
కావ్యం కల్పోత్తరస్థాయి జాయతే సదలంకృతి
న్యూనమప్యత్రయైః కైశ్చిదంగైః కావ్యం నదుష్యతి
యద్యుపాత్తేషు సంపత్తి రారాధయతి తద్విధః

సంధి బంధమైనది మహాకావ్యమౌతుంది. దాని లక్షణం చెప్పబడుతున్నది. కావ్యం ఆశీస్సుతోగాని, నమస్కారంతోగాని, వస్తువును నిర్దేశిస్తూగాని ప్రారంభం కావాలి. ఇతిహాస ప్రసిద్ధమైన కథమీదగాని, ఇతరత్రా ఉత్కృష్టమైన కథపైన గాని ఆధారపడి ఉండాలి. ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను ప్రతిపాదించాలి. చతురుడు ఉదాత్తుడు అయిన నాయకుని ఆశ్రయించి ఉండాలి. నగరం సముద్రం, పర్వతం, ఋతువులు, సూర్యచంద్రోయాలు, ఉద్యానవనం, జలక్రీడ, మధుపానం, రతోత్సవం, విప్రలంభం, వివాహం, పుత్రజననం, మంత్రం, దూతం, ప్రయాణం, యుద్ధం, నాయకాభ్యుదయం అనే పద్దెనిమిది (అష్టాదశ) వర్ణనలు ఉండాలి. కావ్యం అలంకృతం కావాలి. అసంక్షిప్తమై రసభావాలు ఎడతెగకుండా పరిమిత విస్తీర్ణం గల సర్గలతో కూడి,

శ్రవ్యవృత్తాలతో సుసంధులతో ఒప్పారాలి. ఇందులో కొన్ని విషయాలు లేకున్నా మహాకావ్య గుణసంపత్తి సహృదయులను రంజింప జేసినట్లైతే కావ్యానికి దోషం అంటదు.

ఇంకా అనేక మంది ఆలంకారికులు అనేక అదనపు అంశాలను కలిపి కావ్య స్వరూపాన్ని నిర్వచించారు. విశ్వనాథుడు సాహిత్య దర్పణంలో నాయుకుడు దేవజాతికిగాని క్షత్రియ జాతికి గాని చెందినవాడు కావాలన్నాడు. ఒకే వంశంలో పుట్టిన పలువురైనా నాయకులు కావచ్చన్నాడు. శృంగార వీర రసాలలో ఒకటి అంగి (ప్రధాన) రసంగాను, తక్కినవి అంగ (సహాయక) రసాలుగానూ ఉండాలన్నాడు. కావ్యవిభాగాలైన సర్గలు ఎనిమిది నుండి ముప్ఫై లోపల ఉండాలన్నాడు. కావ్య వర్ణనల్ని ఇరవై నాల్గింటికి పెంచారు. వీటిలో వేట మొదలైనవి ఉన్నాయి. విద్యానాథుడు ముప్ఫై రెండు వర్ణనల్ని పేర్కొన్నాడు. వీటిలో రాణి, దేశగ్రామ ఆశ్రయాదులున్నాయి.

ప్రాచీనాలంరికులు పేర్కొనిన కార్యవర్ణనలు కథకు సంబంధించిన స్థలకాలపాత్ర క్రియావర్ణనలే. అంటే కథ ఎక్కడ జరుగుతున్నది, ఎప్పుడు జరుగుతున్నది, ఎవరి మధ్య జరుగుతున్నది, ఏమి జరుగుతున్నది అనే నాలుగు అంశాలను కావ్యవర్ణనలు వివరిస్తాయి. కావ్యం ఒక నాయకుని చుట్టూ తిరుగుతుంది. నాయకుడున్నాడు గనుక నాయిక, ప్రతినాయకుడు ఉంటారు.

ఈ రకమైన కావ్యస్వరూపం ఆధునిక కాలంలో వచ్చిన సంప్రదాయ కావ్యాలకు, చారిత్రక కావ్యాలకు వర్తిస్తుంది. ఆధునిక జీవితాన్ని ఆధునిక దృక్పథంతో చిత్రించే కావ్యాలు ఈ స్వరూపంలో ఒరగవు.

## భారతీయ ఆలంకారికులు - అలంకార శాస్త్రాలు

| | | |
|---|---|---|
| భరతుడు | : | నాట్యశాస్త్రం (క్రీ.పూ. 4వ శతాబ్దం) |
| భామహుడు | : | కావ్యాలంకారం (క్రీ.శ. 6వ శతాబ్దం) |
| దండి | : | కావ్యాదర్శం (క్రీ.శ. 6వ శతాబ్దం) |
| వామనుడు | : | కావ్యాలంకార సూత్రవృత్తి (క్రీ.శ. 8వ శతాబ్దం) |
| ఉద్భటుడు | : | అలంకార సారసంగ్రహం (క్రీ.శ. 8వ శతాబ్దం) |
| ఆనంద వర్ధనుడు | : | ధ్వన్యాలోకం (క్రీ.శ. 840-870) |
| రాజశేఖరుడు | : | కావ్యమీహాసం (క్రీ.శ. 870-950) |
| కుంతకుడు | : | వక్రోక్తి జీవితం (క్రీ.శ10వ శతాబ్దం) |
| ధనంజయుడు | : | దశరూపకం (క్రీ.శ. 900-1000) |
| భట్టతౌతుడు | : | కావ్యకౌతుకం (క్రీ.శ. 950-980) |
| అభినవ గుప్తుడు | : | ధ్వన్యాలోకలోచనం (క్రీ.శ. 11వ శతాబ్దం) |
| మహిమభట్టు | : | వ్యక్తివివేకం (క్రీ.శ. 1020-1060) |
| క్షేమేంద్రుడు | : | ఔచిత్య విచారచర్చ (క్రీ.శ. 1000-1063) |
| భోజుడు | : | సరస్వతీ కంఠాభరణం (క్రీ.శ 1000-1050) |
| మమ్మటుడు | : | కావ్యప్రకాశం (క్రీ.శ 1050-1150) |
| విద్యానాథుడు | : | ప్రతాపరుద్ర యశో భూషణం (క్రీ.శ. 1296-1325) |
| విశ్వానాథుడు | : | సాహిత్యదర్పణం (క్రీ.శ. 14వ శతాబ్దం) |
| జగన్నాథుడు | : | రసగంగాధరం (క్రీ.శ. 1620-1660) |

## 2.8 ప్రశ్నలు నమూనా

1. కవికి కావ్యానికి ఉండే సంబంధాన్ని మీ మాటల్లో రాయండి.
2. కావ్యాన్ని కవిత్వాన్ని ప్రాచ్యపాశ్చాత్య ఆలంకారికులు నిర్వచించిన తీరును విశ్లేషించండి.
3. కావ్యం శరీరం, ఆత్మ, జీవితాలను గురించి భారతీయ ఆలంకారికుల అభిప్రాయాలను సమీక్షించండి.
4. కావ్య హేతువులను గురించి రాయండి.
5. కావ్య ప్రయోజనాన్ని గురించి ఆలోచించండి.
6. భారతీయ సంప్రదాయంలో కావ్య స్వరూపాన్ని తెలపండి.
7. కావ్యం అంటే తెలియజేసి కవిత్వ స్వరూపస్వభావాలను వివరించండి.
8. కావ్యం – కవిత్వం అంటే వివరించండి.

## 2.9 చదువదగిన గ్రంథాలు


1. లక్ష్మీకాంతం, పింగళి : సాహిత్య శిల్ప సమీక్ష
2. నరసింహం, కె.వి.ఆర్ : సాహిత్య దర్శనము
3. సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం (వ్యాఖ్యాత) : కావ్యాలంకార సంగ్రహము
4. నారాయణరెడ్డి సి. : ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు, ప్రయోజనములు.


**– ఆచార్య . రాచపాళెం. చంద్రశేఖర్ రెడ్డి.**

పాఠం - 4

# విమర్శ - సూక్ష్మ విభజన

విషయక్రమం


**4.1** విమర్శ - నిర్వచనం

**4.2** విమర్శ - వర్గీకరణ

**4.3** ప్రాచీన విమర్శ

**4.4** ఆధునిక విమర్శ

**4.5** సద్విమర్శ

**4.6** అసద్విమర్శ

**4.7** సమగ్ర విమర్శ

**4.8** అసమగ్ర విమర్శ

**4.9** పౌరాణిక విమర్శ

**4.10** చారిత్రక విమర్శ

**4.11** నైతిక విమర్శ

**4.12** సాంఘిక విమర్శ

**4.13** మనో వైజ్ఞానిక విమర్శ

**4.14** విమర్శనాత్మక విమర్శ

**4.15** అభినందనాత్మక విమర్శ

**4.16** తులనాత్మక విమర్శ

**4.17** నిర్ణయాత్మక విమర్శ

**4.18** గ్రంథ విమర్శ

**4.19** కవిజీవిత విమర్శ

**4.20** పునర్వ్రిత విమర్శ

**4.21** కాల్పనిక విమర్శ

**4.20** మాదిరి ప్రశ్నలు

**4.21** ఆధార గ్రంథాలు


## 4.1 విమర్శ - నిర్వచనం :

'విమర్శ' అనే పదానికి విమర్శనం, పరామర్శ, సమీక్ష, చర్చ, విచారణ, అవలోకనం,అవలోచనం, పరామరిస, పరామరిక, సంఖ్య, సమూహా అనే పదాలు పర్యాయ పదాలుగా ఉంటున్నాయి. 'విమర్శ' అనే పదం 'మృశ్' అనే ధాతువు నుంచి ఏర్పడింది. మృశ్ అనే ధాతువుకు స్పృశించు, తాకు అనే అర్థాలు చెప్పబడ్డాయి. ఏదైనా ఒక వస్తువును స్పృశించడం మూలంగా అందులోని

మంచి చెడ్డలు - మృదుత్వం, కాఠిన్యం, రూపురేఖలు లాంటివి మనకు అవగతమవుతాయి. అలా అవగతమైన విషయాలను మనం ఇతరులకు చెబుతాం. ఇలాగే సాహిత్యాన్ని కూడా స్పృశించి, తాకి లేదా పరిశీలించి అందులోని మంచి చెడ్డల్ని వివరించి చెప్పడమే విమర్శగా పేరుపొందింది.

## 4.2 విమర్శ - వర్గీకరణ :

ఏదైనా ఒక వస్తువును లేదా ఒక విషయాన్ని మనం చూసినప్పుడు దానికి సంబంధించిన మంచి చెడ్డలు మనకు స్ఫురిస్తాయి. ఇలా మంచి చెడ్డలు మనకు స్ఫురించడం వలన పూర్వ వాసనల్ని బట్టి జరుగుతూ ఉంటాయి. ఈ పూర్వవాసనలు వ్యక్తిగతమైన, కుటుంబ పరమైన, సామాజిక పరమైన వాటి ప్రభావాల కారణంగా సంభవించేవిగా ఉంటాయి. ఇలాగే సాహిత్య విషయంలో కూడా ఒక రచయిత లేదా ఒక కవి వ్రాసిన రచనల్ని లేదా కావ్యాల్ని మనం చూసినప్పుడు లేదా చదివినప్పుడు వాటిలోని మంచి చెడ్డలు మనకు స్ఫూరిస్తాయి. అలాంటి మంచి చెడ్డల్ని వివరించి చెప్పడమే విమర్శ లేదా సాహిత్య విమర్శ అవుతుంది. ఒక రచయిత లేదా కవి తన రచనను లేదా కావ్యాన్ని రచించడానికి సంకల్పించుకొన్నప్పుడే ఒక రకంగా విమర్శ మొదలవుతుంది. ఒక రచనను చేయడానికి సంకల్పించుకొన్న రచయితకు ముందుగా ఏ రచనను చెపట్టాలి ? ఎందుకు చేపట్టాలి ? ఎలా చేపట్టాలి ? అనే ప్రశ్నలు పుట్టుకొస్తాయి. వీటికి సమాధానాల్ని ఆ రచయిత తన మనసులోనే తాను తర్జన భర్జనలు చేసుకొని, ఇతరులతో చర్చించి ఒక నిర్ణయానికి వస్తాడు. తన రచనా వ్యాసంగాన్ని చేపడతారు. రచయిత తాను రచన చేస్తున్నప్పుడు అనుక్షణం తన రచనకు సంబంధించిన అనేక రకాలైన విషయాలను గూర్చి ఆలోచిస్తూ, అందులోని మంచి చెడ్డల్ని అంచనా వేసుకొంటూ, మార్పులు చేర్పులు చేస్తూ తన రచనను కొనసాగిస్తూ వింటాడు. ఏ రచనకు సంబంధించైనా సరే తొలి విమర్శ రచయితతోనే ప్రారంభం అవుతుంది. ఆ తరువాత అతని సన్నిహితులైన మిత్రుల మూలంగా కొంత విమర్శ కొనసాగుతుంది. ఆపైన కావ్య అవతారికలు, కావ్య పీఠికలు, పండితుల చర్చలు, గోష్ఠులు, పత్రికా వ్యాసాలు, గ్రంథ సమీక్షలు లాంటి వివిధ రూపాల్లో విమర్శ కోనసాగేదిగా ఉంటుంది. ఇలా వివిధ రూపాల్లో, వివిధ దశల్లో కొనసాగే విమర్శను మనం స్థూలంగా, సూక్ష్మంగా విభజించి పరిశీలన చేయొచ్చు.

విమర్శ అది వెలువడిన కాలాన్నిబట్టి స్థూలంగా మనం రెండు రకాలుగా వర్గీకరించుకోవచ్చు. అవి - 1. ప్రాచీన విమర్శ. 2. ఆధునిక విమర్శ అనేది. దీనికంటే భిన్నంగా విమర్శను మనం దాని స్వరూప స్వభావాల్ని బట్టి మరో రెండు రకాలుగా కూడా వర్గీకరించుకోవచ్చు. అవి - 1. సద్విమర్శ 2. అసద్విమర్శ అనేవి. ఇలాగే విమర్శను దాని స్వరూప స్వభావాల్ని బట్టే మరో రెండు, రకాలుగా కూడా మనం వర్గీకరించుకోవచ్చు. అవి. 1. సమగ్ర విమర్శ 2. అసమగ్ర విమర్శ అనేవి. వీటికంటే భిన్నంగా విమర్శను మనం సూక్షాతిసూక్ష్మంగా - అలంకారిక విమర్శ, పౌరాణిక విమర్శ, చారిత్రక విమర్శ, నైతిక విమర్శ, సాంఘిక విమర్శ, మనో వైజ్ఞానిక విమర్శ, వివరణాత్మక విమర్శ, అభినందనాత్మక విమర్శ, తులనాత్మక విమర్శ, నిర్ణయాత్మక విమర్శ, గ్రాంథ విమర్శ, కవిజీవిత విమర్శ, పునర్నవ విమర్శ, కాల్పనిక విమర్శ అని వివిధ రకాలైన విమర్శలుగా వర్గీకరించుకోవచ్చు. ఈ వివిధ రకాలైన విమర్శల్ని వాటి తీరు తెన్నుల్ని గూర్చి మనం ఇక్కడ కొంత వివరంగా తెలుసుకొందాం. ఇక్కడ మనం ముందుగా సాహిత్య విమర్శలోని స్థూలవిభజనను గూర్చి, ఆ తరువాత సాహిత్య విమర్శలోని సూక్ష్మ విభజనను గూర్చి తెలుసుకోబోతూ ఉన్నాం.

## 4.3 ప్రాచీన విమర్శ :

ఈ విమర్శనే సాంప్రదాయిక విమర్శ అని మనం వ్యవహరిస్తూ ఉన్నాం. ప్రాచీన విమర్శ అంతా కవి, కావ్యం, కావ్య లక్షణాలు, లక్ష్యలక్షణ సమన్వయం పైన్నే కొనసాగేదిగా ఉంటుంది. ఒకే రకంగా అలంకారిక విమర్శ, పౌరాణిక విమర్శ, చారిత్రక

విమర్శ, నైతిక విమర్శలాంటి విమర్శలు ప్రాచీన లేదా సాంప్రదాయిక విమర్శ కిందికి వస్తాయి. ప్రాచీన విమర్శలో కావ్యలక్షణాలకే ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వబడి ఉంటుంది. ప్రాచీనకాలంలో వెలువడిన కావ్యాల అవతారికలు, పీఠికలు, వ్యాఖ్యానాలు, టీకలు, టిప్పణలు లాంటివి ఈ కోవలోకి వస్తాయి. సంస్కృత సాహిత్యాన్ని, సంస్కృత విమర్శను ఆధారం చేసుకొని ఈ విమర్శ అంతా కొనసాగింది.

ప్రాచీన విమర్శ అంతా విధేయాత్మకంగా కొనసాగిన విమర్శగా మనకు కనిపిస్తుంది. ఆలంకారికులు, లాక్షణికులు తమ అలంకార శాస్త్ర గ్రంథాల్లో తమ లక్షణ గ్రంథాల్లో తమ వేటిని ప్రమాణాలుగా నిర్ధారించారో వాటినే పరిగణనలోకి తీసుకొని, కొలమానాలుగా స్వీకరించి ప్రాచీన విమర్శ అంతా కొనసాగింది. ఇందులో కవుల, విమర్శకుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఏ మాత్రం తావుండదు. ఈ విమర్శలంతా కవి, కావ్యం, కావ్యలక్షణాలు కావ్యాంగాలైన వస్తువు, పాత్రలు శిల్పం, అలంకారాలు, ఛందస్సు, రసం లాంటి అంశాలపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించి కొనసాగిన విమర్శగా మనకు కనిపిస్తుంది. తెలుగులో పురాణాలకు, ఇతిహాసాలకు, ప్రబంధాలకు, శతకాలకు, నాటకాలకు సంబంధించిన విమర్శ అంతా ఈ కోవలోకే వస్తుంది. వీటి లక్ష్యలక్షణ సమన్వయంగానే ఈ విమర్శ అంతా కొనసాగిందిగా ఈ విమర్శ మనకు కనిపిస్తుంది. ప్రాచీన విమర్శ అంతా తొలుత గ్రాంథిక భాషలోనే కొనసాగింది. ఆ పైన సరళ గ్రాంథిక భాషలోనూ, ఆ తరువాత వ్యవహారిక భాషలోనూ కొనసాగింది. ప్రాచీన విమర్శ అంతా కళ కోసమే అనే దృక్పథంతో కొనసాగిన విమర్శగా మనకు దర్శనమిస్తుంది. భక్తి, వేదాంతం, యోగం లాంటి అంశాల విశ్లేషణలతో కూడా ఈ విమర్శ కొంత కొనసాగిందిగా మనకు కనిపిస్తుంది.

## 4.4 ఆధునిక విమర్శ :

ఆధునిక సాహిత్యం వెలువడడం మొదలైన తర్వాత వ్యాప్తిలోకి వచ్చిన విమర్శగా ఆధునిక విమర్శ మొదలైంది. ఈ విమర్శ ప్రాచీన విమర్శ లేదా సాంప్రదాయిక విమర్శ కన్నా భిన్నమైన విమర్శగా మనకు కనిపిస్తుంది. మనో వైజ్ఞానిక విమర్శ, అభినందనాత్మక విమర్శ, తులనాత్మక విమర్శ, నిర్ణయాత్మక విమర్శ. గ్రంథ విమర్శ, కవి జీవిత విమర్శ, పునర్నవ విమర్శ, కాల్పనిక విమర్శ లాంటి విమర్శనా పద్ధతులు ఆధునిక విమర్శనా విభాగంలో చేరేవిగా ఉంటాయి. ఆధునిక విమర్శ అంతా కొత్త సిద్ధాంతాల ప్రతిపాదనలతోనూ, ప్రయోగ వాదాల విశ్లేషణలతోనూ కొనసాగిన విమర్శగా ఉంటుంది. ఆంగ్ల సాహిత్యాన్ని, ఆంగ్ల సాహిత్య, విమర్శను ఆధారం చేసుకొని ఈ విమర్శ ప్రధానంగా కొనసాగేదిగా ఉంటుంది.

ఆధునిక విమర్శ చాలా మటుకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని కొరుకొనే విమర్శగా కొనసాగింది. ఆంగ్ల సాహిత్యాన్ని ఆంగ్ల సాహిత్య విమర్శను దృష్టిలో ఉంచుకొని ఈ విమర్శ కొనసాగినా దీనికంటే భిన్నంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని ఆశ్రయించి చాలా విమర్శకుల స్వతంత్ర అభిప్రాయాలకునుగుణంగా ఈ విమర్శ కొనసాగింది. పాశ్చాత్య సాహిత్యాల్లో లేని కొన్ని భారతీయ సాహిత్య ధోరణుల్ని విశ్లేషించి చూపే సందర్భంల్లో ఈ విమర్శ ఎక్కువగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని ప్రదర్శించే విమర్శగా కొనసాగింది. దేశభక్తి, సంఘసంస్కరణ స్త్రీవాద, దళితవాద, మైనారిటీవాద, ముస్లిం వాద ధోరణులకు చెందిన సాహిత్యాల్ని వివరించేటప్పుడు ఈ ఆధునిక విమర్శ దేశీయమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని కొరుకొనే ధోరణిలో ఈ ఆధునిక విమర్శ కొనసాగింది.

ఈ ఆధునిక విమర్శ కళ కళకోసమే అనే దృక్పథంతో కాకుండా కళ ప్రయోజనం కోసం అదీ సామాజిక ప్రయోజనం కోసం అనే దృక్పథంలో ప్రధానంగా కొనసాగిన విమర్శ. ఆధునిక విమర్శ ఒక రకంగా Marxism మొదలైన తర్వాతే బాగా ప్రచారంలోకి వచ్చింది. ఈ విమర్శ అంతా తెలుగులో వ్యావహారిక భాషలోనే కొనసాగింది.

## 4.5 సద్విమర్శ :

ఈ విమర్శ కవి, విమర్శకుల రాగద్వేషాలకు అతీతమైందిగా కొనసాగేదిగా ఉంటుంది. ఈ విమర్శ పక్షపాత ధోరణిని తిరస్కరించి కొనసాగే విమర్శగా ఉంటుంది. విమర్శకులు సహజంగా ఏదో ఒక కవిని, రచయితను, ఏదో ఒక సాహిత్య ప్రక్రియను ఇష్టపడేవాళ్ళుగా ఉంటారు. ఆ కవినే, ఆ రచయితనే, ఆ సాహిత్య ప్రక్రియనే ఉదాత్తమైనదిగా భావించి వాళ్ళు తమ విమర్శను కొనసాగిస్తూ ఉంటారు. కొన్ని సందర్భాల్లో కులాభిమానంతోనో, వర్ణాభిమానంతోనో జాత్యాభిమానంతోనో, మతాభిమానంతోనో, ప్రాంతాభిమానంతోనో ఒక కవిని లేదా రచయితను అమితంగా ప్రేమిస్తూ విమర్శను కొనసాగిస్తూ ఉంటారు. ఇదంతా మంచి విమర్శ కాదు.

వీటికి భిన్నంగా రాగద్వేషాలకు, ఇష్టాఇష్టాలకు అతీతంగా చేసే విమర్శే సద్విమర్శ అవుతుంది. ఈ విమర్శలో పక్షపాత దృష్టి ఉండదు. ఉత్తమమైన ఎల్లప్పుడూ ఆదరణీయమైన విమర్శగా ఈ సద్విమర్శ ఉంటుంది. ఉత్తమమైన ప్రవృత్తి కలిగిన విమర్శకుడు ఈ కోవకు చెందిన మంచి విమర్శను-సద్విమర్శను చేస్తూ ఉంటాడు. ఈ కోవకు చెందిన విమర్శలో మొగమాటాలకు తావుండదు. నిక్కచ్చిగా కుండ బద్దలు గొట్టినట్లుగా మంచి చెడ్డల్ని వివరించేదిగా ఈ విమర్శ ఉంటుంది. అనవసరమైన పొగడ్తలకు కానీ, అనవసరమై తెగడ్తలకు కానీ ఈ సద్విమర్శలో తావుండదు. లక్షణ కర్తలు, అలంకారికులు తమ లక్షణ గ్రంథాల్లోనూ, ఆలంకార శాస్త్ర గ్రంథాల్లోనూ ప్రతిపాదించిన లక్షణాలకు, సిద్ధాంతాలకు, సూత్రాలకు కట్టుబడి ఈ విమర్శ కొనసాగేదిగా ఉంటుంది. ఉత్తమ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని కొనసాగే విమర్శగా ఈ కోవకు చెందిన విమర్శ ఉంటుంది.

సద్విమర్శ సాహిత్యంలోని మంచి చెడ్డల్ని చర్చించి మంచిని గూర్చి వివరించి పాఠకులకు సాహిత్యంతోటి పరిచయాన్ని, సాహిత్యంపై ఆసక్తిని రేకెత్తించేదిగా ఉంటుంది. అంతేకాదు సాహిత్యంలోని మెళకువల్ని గూర్చి వివరిస్తూ సాహిత్యాభిమానుల అభ్యుదయానికి ఈ విమర్శ దోహదం చేసేదిగా ఉంటుంది. కొత్త కొత్త రచనలకు శ్రీకారం చుట్టేదిగా ఉంటుంది. ఇది కలకాలం నిలబడగలిగిన విమర్శగా ఉంటుంది.

## 4.6 అసద్విమర్శ :

ఈకోవకు చెందిన విమర్శ రాగద్వేషాలతో కూడుకొని ఉండి మంచిని చెడుగానూ, చెడును మంచిగానూ చిత్రీకరించేదిగా ఉంటుంది. వ్యక్తుల లేదా విమర్శకుల ఇష్టా ఇష్టాలకు ఈ విమర్శలో తావుటుంది. ఒక జాతి, కుల, మత, తెగ, ప్రాంతాల వ్యక్తుల్ని ప్రోత్సహిస్తూ వాళ్ళ రచనలను పొగడ్తలతో ఆకాశానికెత్తేదిగా ఉంటుంది. ఇంకొక జాతి, కుల, మత, తెగ ప్రాంతాల వ్యక్తుల్ని వాళ్ళ రచనల్ని అధఃపాతాళానికి తొక్కి వాళ్ళకు అన్యాయం చేసేదిగా ఉంటుంది. ఈ కోవకు చెందిన విమర్శ ఆయా జాతి, కుల, మత, తెగల, ప్రాంతాల వ్యక్తుల ప్రాబల్యం అంత వరకే కొనసాగి ఆ తరువాత నీరుగారి పోయేదిగా ఉంటుంది. అసద్విమర్శలో కేవలం వ్యక్తిగతమైన రాగద్వేషాలకే అధిక ప్రాధాన్యం ఉండటంతో సాహిత్య విలువలకు ప్రాధాన్యం ఇచ్చేదిగా ఈ విమర్శ ఉండదు. అందువల్ల ఈ కోవకు చెందిన విమర్శ అశాశ్వితమైందిగా ఉంటుంది.

కుడవులైన వాళ్ళకు విమర్శకులైన వాళ్ళు ఈ తరహా విమర్శను ప్రోత్సహించే వాళ్ళుగా ఉంటారు. ఈ కోవకు చెందిన విమర్శ పాఠకలోకాన్ని పక్కదారి పట్టించేదిగా ఉంటుంది. మంచి విషయాల్ని చెడుగాను, చెడు విషయాల్ని మంచిగానూ చూపెట్టే విమర్శగా ఈ అసద్విమర్శ ఉంటుంది. ఆలంకారికులు, లాక్షణికులు తన అలంకార శాస్త్ర గంధాల్లోనూ, లక్షణ గ్రంథాల్లోనూ ప్రతిపాదించిన సిద్ధాంతాలను, సూత్రాలను, లక్షణాలను ప్రక్కన పెట్టి కేవలం వ్యక్తిగతమైన దురభిమానంతో తిమ్మిని బొమ్మిని చేసేదిగా బొమ్మిని తిమ్మిని చేసేదిగా ఈ అసద్విమర్శ ఉంటుంది. సాహిత్య ప్రపంచంలో తక్కువ విలువల్ని సృజించి, గౌరవించి

చివరకు మూసించి సాహిత్య క్షీణతకు అసద్విమర్శ పాల్పడేదిగా ఉంటుంది. సాహిత్యంలో కలుషితమైన వాతావరణాన్ని సృష్టించి సాహిత్య విమర్శను పతన స్థితికి దిగజార్చే విమర్శగా ఈ అసద్విమర్శ ఉంటుంది.

## 4.7 సమగ్ర విమర్శ :

ఒక కావ్యానికి లేదా ఒక రచనకు సంబంధించిన అన్ని విషయాలను లేదా ఒక కవికి లేదా ఒక రచయితకు సంబంధించిన అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని కొనసాగే విమర్శగా ఈ సమగ్ర విమర్శ ఉంటుంది. ఒక కావ్యాన్ని తీసుకొంటే అందులోని ఇతివృత్తాన్ని, పాత్రల్ని, ఛందస్సుల్ని, అలంకారాల్ని, రసాన్ని, సందేశాన్ని అందులోని విశేషాంశాలను ఒక్కటేమిటి ఆ కావ్యానికి సంబంధించిన సమస్త విషయాలను దృష్టిలో ఉంచుకొని వాటి మంచి చెడ్డల్ని పరామర్శించి విడమర్చి చెప్పేదిగా ఈ కోవకు చెందిన విమర్శ ఉంటుంది.

ప్రాచీన కాలంలోని టీకలు, టిప్పణులు, వ్యాఖ్యానాలు ఈ కోవకు చెందిన విమర్శలుగా ఉంటున్నాయి. ఒక కావ్యానికి సంబంధించిన సూక్ష్మాతిసూక్ష్మమైన సమస్త విషయాలను వివరించేవిగా ఈ టీకలు, టిప్పణులు, వ్యాఖ్యానాలు ఉంటాయి. సమగ్ర విమర్శ ఎప్పుడూ ఆదరణీయమైందిగానే ఉంటుంది. సమగ్ర విమర్శ ఎప్పుడూ ఆదరణీయమైందిగానే ఉంటుంది. ఈ కోవకు చెందిన విమర్శ సాహిత్య అభివృద్ధి, సాహిత్య సృజనకు, విమర్శనా సాహిత్యానికి దోహదం చేసేదిగా ఉంటుంది.

ప్రాచీన కాలంలో వెలువడిన విమర్శల్లో కొంతమటుకు ఈ సమగ్ర విమర్శ కోవలోకే వస్తాయి. ఒకే కావ్యాన్ని సమగ్రంగా పరిశీలించి అందులోని వివిధ విషయాల్ని వివరిస్తూ తీర్పునిచ్చేదిగా ఈ విమర్శ ఉంటుంది. వివిధ విమర్శనా విధానాల్లోని అలంకారిక విమర్శ, పౌరాణిక విమర్శ, గ్రంథ విమర్శ లాంటి విమర్శలు సమగ్రమైన విమర్శల కోవలోకి వచ్చి చేరుతాయి. సమగ్ర విమర్శ ఎల్లప్పుడు కవికి, కావ్యానికి న్యాయం చేకూర్చే విమర్శగా ఉంటుంది.

## 4.8 అసమగ్ర విమర్శ :

ఒక కావ్యంలోని లేదా రచనలోని ఏదో ఒక విషయానికి లేదా ఒక కవికి రచయితకు సంబంధించిన ఏదో ఒక రచనను దృష్టిలో ఉంచుకొని అందులోని ఏదో ఒక అంశానికి మాత్రమే పరిమితమై కొనసాగే విమర్శ అసమగ్రమైన విమర్శగా ఉంటుంది. అసమగ్ర విమర్శ పాక్షిక దృక్పథాన్ని కలిగి ఉన్న విమర్శగా ఉంటుంది. కావ్య అవతారికలు కావ్య పీఠికలు, లఘుటిప్పణులు, లఘుటీకలు, లఘువ్యాఖ్యానాలు, లఘువ్యాసాలు లాంటివి అసమగ్ర విమర్శలలోకి చేరుతాయి. లభినందనాత్మక విమర్శ, కవి జీవిత విమర్శ లాంటి విమర్శలు అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని కొనసాగేవిగా ఉండవు. అందువల్ల ఇవి అసమగ్ర విమర్శ కొవలోకి చెందినవిగా ఉంటాయి.

అభినందనాత్మక, కవిజీవిత విమర్శలాంటి విమర్శలు కవిని, కావ్యాన్ని, కవి జీవిత విశేషాలను మాత్రమే అధికంగా పరిగణనలోకి తీసుకొని కొనసాగటం మూలంగా వీటిలో పాక్షిక దృక్పథం ఉంటుంది. అందువల్ల ఈ కోవకు చెందిన విమర్శలు కావ్యన లక్షణాలను, కావ్య సిద్ధాంతాలను, పూర్వ విమర్శకుల అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకొకుండా కొనసాగేవిగా ఉంటాయి. అందువల్ల ఈ కోవకు చెందిన విమర్శలు అసమగ్ర విమర్శలుగా ఉంటాయి. అసమగ్ర విమర్శ అంత ఆదరణీయమైన విమర్శకాదు. నన్నయ అక్షరరమ్యత, తిక్కన నాటకీయత లాంటి విమర్శలో నన్నయ అనువాద విధానం, నన్నయ కథాకతనం, నన్నయ సూక్తి నిధత్వం లాంటి అంశాలను పట్టించుకోవు. తిక్కన నాటికీయతలో కేవలం తిక్కన నాటకీయతను గూర్చి మాత్రమే పట్టించుకొని తిక్కన అనువాదం, శైలి లాంటి విషయాలను వొదిలేసేదిగా ఉంటుంది. కాబట్టి నన్నయ అక్షరరమ్యత, తిక్కన నాటకీయతలాంటి విమర్శనలు సమగ్రమైన విమర్శలుగా ఉండవు.

కవులు, రచయితలు ఆవేశానికి లోనై ఏదో ఒక అంశాన్ని తమకు నచ్చిన విషయాలను గూర్చి మాత్రమే వివరించే, ప్రసంగాలు లాంటివి కూడా అసమగ్రమైన విమర్శలుగానే ఉంటాయి. అసమగ్ర విమర్శ వల్ల ఇటు సాహిత్యానికి కానీ, అటు విమర్శనా సాహిత్యానికి కానీ ఏమీ ఒరిగేది లేదు. కొంతమేర ప్రయోజనం జరగవచ్చు.

ఆలంకారిక విమర్శ : అలంకారికులు అలంకారశాస్త్ర గ్రంథాల్లో చెప్పిన విషయాలను లేదా ఆ క్షణికాలు లక్షణ గ్రంథాల్లో ప్రస్తావించిన విషయాలను దృష్టిలో ఉంచుకొని కొనసాగే విమర్శను ఆలంకారిక విమర్శ అని పేర్కొంటారు. ఈ విమర్శ సాంప్రదాయక విమర్శ (Traditional criticism) అనే పేరు కూడా వ్యవహారంలో ఉంది. ఈ విమర్శనే ఇంకా అస్వతంత్ర విమర్శ (Deductive Criticism) అనీ, నిర్ణయాత్మక విమర్శ (Judicial Criticism) అనీ, అలంకార శాస్త్ర విమర్శ (Rhetorical Criticism) అనీ వ్యవహరిస్తారు.

ఈ విమర్శలో ఆలంకారికులు, లాక్షణికులు, పూర్వ విమర్శకులు ప్రతిపాదించిన కావ్యలక్షణాలు, సూత్రాలు సిద్ధాంతాలే ప్రమాణం, వాటికి లోబడి ఉన్న సాహిత్యాన్నే ప్రామాణికమైన సాహత్యంగా తక్కిన సాహిత్యాన్ని అ ప్రామాణికమైన సాహిత్యంగా పరిగణిస్తూ ఉంటారు. ఇటు దేశీయమైన సంస్కృత అలంకారికులు, లాక్షణికులు, అటు విదేశీయమైన ఆంగ్ల సాహితీవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాలను, సూత్రాలను, పరిగణనలోకి తీసుకొని కొనసాగే విమర్శగా ఆలంకారిక విమర్శ ఉంటుంది. ఇది పూర్తిగా విధేయమైన విమర్శగా ఉంటుంది. కవుల, రచయితల, విమర్శకులకు ఎంత మాత్రం స్వేచ్ఛా స్వాతంత్రాలుండి చేసిన విమర్శగా ఈ విమర్శ ఉండదు. ఇది అతి ప్రాచీనమైన సిద్ధాంతాలకు సూత్రాలకు కట్టుబడి ఉండటం మూలంగా కాలానుగుణంగా వచ్చిన మార్పుల్ని క్రొంగొత్త ధోరణుల్ని అదరించేదిగా ఈ విమర్శ ఉండదు. అందువల్ల ఈ విమర్శ అంతా పాత చింతకాయ పచ్చడిలా ప్రాచీన సిద్ధాంతాలకు, సూత్రాలకు, విలువలకు ప్రధాన్యతనిచ్చేదిగా ఉంటూ నవ్యతను ఆదరించదు.

దేశ కాల పరిస్థితుల్ని బట్టి ఎన్నో మార్పులు చేర్పులు సాహిత్య విషయంగా జరుగుతూ ఉంటాయి. కొత్త కొత్త సాహిత్యం సాహిత్య ప్రక్రియలు పట్టుకొస్తూ ఉంటాయి. కాబట్టి వీటిని కూడా దృష్టిలో ఉంచుకొని కొనసాగే విమర్శగా ఉత్తమ విమర్శ ఉండాలి. ఈ విషయంలో ఆలంకారిక విమర్శ నవ్యసాహిత్యానికి కొంత అపకారం చేసేదిగా తింటుంది. కొన్ని పరిధులు పరిమితులకు లోబడి ఆలంకారిక విమర్శ కొనసాగేదిగా ఉండటం వల్ల సర్వత్రా ఇది ఉపకరించేదిగా ఉండదు.

## 4.9 పౌరాణిక విమర్శ :

ఈ విమర్శ ఒక పురాణంలోని లేదా కావ్యంలోని మౌళికమైన సాంస్కృతిక రసాల్ని లేదా నమూనాను నిరూపించే ప్రయత్నం చేస్తుంది. ఈ విమర్శలో సామూహిక అవ్యక్తచేతనకు (Collective Unconcious) ప్రాధాన్యం ఉంటుంది. కళావిమర్శలో లేదా ఈ విమర్శనా విధానంలో సూక్ష్మాతిసూక్ష్మమైన, సమగ్రమైన కావ్యపరిశీలన చేసే అంశం ప్రధానమైందిగా ఉంటుంది. అయితే ఇది కేవలం కళా పరిశీలనకు మాత్రమే నిబద్ధం కాకుండా కళతో సంబంధం లేని ఇతర విషయాలను కూడా పరిగణనలోకి తీసుకొని కొనసాగేదిగా ఉంటుంది. ఈ విమర్శకు ఆంగ్లంలో Archytypal criticism అనీ, Totamic criticism అనీ Mytsological Critisism అని వివిధ, పేర్లు వ్యాప్తిలో ఉన్నాయి.

పౌరాణిక విమర్శకు ఆధునిక విమర్శనా రీతుల్లో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ విమర్శనా విధానంలోని ఒక్కోరకమైన అంశం పరిశీలనలో ఒక్కోరకమైన విమర్శనా రీతులతో సంబంధం ఉంటుంది. అట్లని ఈ విమర్శనా విధానం కలగాపులమైన విమర్శగా ఉండదు.

పౌరాణిక విమర్శ కేవలం పురాణాలకు, ఇతిహాసాలకు మాత్రమే, పరిమితమై కొనసాగే విమర్శకాదు. ఇతర కావ్యాలకు, ఇతర రచనలకు కూడా ఇది వర్తించేదిగా ఉంటుంది. ఈ విమర్శనా విధానంలో సాంస్కృతిక అంశాలకు, మానసిక అంశాలకు

ప్రాధాన్యం ఉంటుంది. కళా విషయంలో ఈ విమర్శ కవి, రచయితకు సంబంధించిన భావుకతని కూడా పరిగణనలోకి తీసుకొని కొనసాగే విమర్శగా ఉండటం మూలంగా కళా విమర్శకు, మనో వైజ్ఞానిక విమర్శలకు ఇది అవకాశం కలిగించేదిగా ఉంటుంది.

ఈ విమర్శనా విధానంలో విమర్శకుడి సామర్థ్యం వ్యక్తం అవుతుందేకానీ, సత్య స్వరూపం వ్యకం కాదనీ, సాహిత్య విలువల్ని ఓ విమర్శనా విధానం నిరూపించ లేదనీ కొందరు విమర్శకులు ఈ విమర్శ పట్ల కొంత అసంతృప్తిని వ్యక్తం చేశారు. రచనల పట్ల మనకు ఆకర్షణ ఎందుకు కలుగుతుంది అనే కారణాలను ఇది విశ్లేషించి చూపెడుతుందే తప్ప ఇతర విషయాలను ఇది పట్టించుకోదు అనే విమర్శ ఈ విమర్శనా విధానంలో వెలువడింది.

## 4.10 చారిత్రక విమర్శ :

ఒక రచనలోని వివిధ విషయాలను లేదా ఒక కవికి సంబంధించిన వివిధ విషయాలను కాలక్రమ దృష్టితో పూర్వాపర సంబంధాల్ని బట్టి నిరూపించేదిగా ఈ విమర్శ ఉంటుంది. ఆంగ్లంలో ఈ విమర్శకు Historical criticism అని పేరుంది. సాహిత్యం సమాజానికి అద్దం పడుతుంది. సమకాలీన సాంఘీక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, నైతిక స్థితిగతుల్ని కవి లేదా రచయిత తన కావ్యంలో కానీ తన రచనలో కానీ ప్రతిబింబించేట్లు చేస్తాడు. వీటిని గురించి పరిశీలించాలంటే ఆరచనాకాలం, ఆ కవి కాలం లాంటి విషయాలు, ఆనాటి చారిత్రక అంశాలు లాంటివి అవసరమైనవిగా ఉంటాయి. కాబట్టి వాటిని పరిశీలించి వాటి స్థితిగతుల్ని వివరించాల్సిన అవసరం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కవి కాలం, కవి రచనా కాలం లాంటివి తెలియకపోవచ్చు. అలాంటి వాటిని నిర్ధారించడానికి ఆ రచనలోని సాంఘీక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, నైతిక అంశాలు, ఆ రచనలోని శైలిలాంటి అంశాలే ఆధారభూతాలవుతూ ఉంటాయి.

చారిత్రక విమర్శ ఒక రచనలోని సాంఘీక అంశాల్ని వివరించడానికి, కవి, రచయిత కాలాదుల్ని నిర్ధారణ చేయడానికి దోహదం చేసేదిగా ఉంటుంది. రచనలోని వివిధ విషయాలను వాటి ఔచిత్యాల్ని, అనౌచిత్యాల్ని నిర్ధారించడానికి కూడా ఈ చారిత్రక విమర్శ ఉపకరించేదిగా ఉంటుంది. ఒక రకంగా ఈ చారిత్రక విమర్శ అందులోని వివిధ విషయాల ఆధారంగా కవికాలాదుల్ని నిర్ధారించడానికి, కవి కాలాదుల ఆధారంగా ఒక రచనలో చిత్రితమైన విషయాల ఉచితానుచితాల్ని తేల్చి చెప్పడానికి ఉపకరించేదిగా ఉంటుంది.

ఈ చారిత్రక విమర్శ గ్రంథ పరిష్కరణకు కూడా ఉపకరించేదిగా ఉంటుంది. అంతే కాకుండా ఈ చారిత్రక విమర్శ కవి జీవిత విమర్శకు ఆధారభూతమైందిగా కూడా ఉంటుంది. చారిత్రక విమర్శ, కవి జీవిత విమర్శ ఇవి రెండూ పరస్పరం ఒక దానిపైన మరొకటి ఆధారపడినవిగా ఉంటాయి.

## 4.1 నైతిక విమర్శ :

ఈ విమర్శ కూడా చాలా ప్రధానమైన విమర్శే, ప్లేటో లాంటి ప్రాచీన తత్వవేత్తలు కూడా ఈ విమర్శను ఆదరించారు. ఈ విమర్శ అతి ప్రాచీనమైన విమర్శగా అలరారుతూ ఉంది. ఈ విమర్శలో మానవ జీవితంలోని నైతిక విలువలకే అగ్ర తాంబూలం ఇవ్వబడి ఉంటుంది. మనిషి వ్యక్తిత్వం, ఔన్నత్యం, సాంఘీక విలువలు, నీతి, న్యాయం, ధర్మం లాంటి అంశాల ప్రాతినిధ్యంలో ఈ విమర్శ కొనసాగేదిగా ఉంటుంది. ఈ విమర్శ నైతికాలైన ఆదర్శాలను ఆధారం చేసుకొని కొనసాగే విమర్శగా ఉంటుంది. ఈ విమర్శను ఆంగ్లంలో Ethical cristicism అని వ్యవహరిస్తారు.

భారతీయ జీవిత విధానంలో ధార్మర్థకామ మోక్షాలకి అతి ప్రాచీన కాలం నుంచి ప్రాధాన్యం ఉంది. వీటిని సాధించడమే ఉత్తమ పురుషుడి ధ్యేయమై ఉండాలి. భారతీయ జీవిత విధానం. ఏకపత్నీ వ్రతం, ఆడినమాటను తప్పకుండా పాటించడం,

అభయాన్నిచ్చిన వాళ్ళను కాపాడటం, తనకు లేకున్నా ఇతరులకు పెట్టడం, దానధర్మాలు చెయ్యడం, స్త్రీని గౌరవించడం లాంటి అంశాలు మానవ విలువలుగా, నైతిక విలువలుగా పాటింపబడుతూ వస్తున్నాయి. దయాగుణం, దానగుణం, ఆర్తత్రాణ పరాయణత్వం, పాతివ్రత్యం - ఇలా ఇంకా ఎన్నో అంశాలు ఉత్తమమైన, ఉదాత్తమైన మానవ విలువలుగా 'నైతికం' అనే పదం కిందికి వచ్చిచేరుతూ ఉంటాయి. ఈ 'నీతి' లేదా 'నైతికం' అనే పదం బహుళార్థ ప్రతిపాదికమైందిగా ఉంటుంది. ఇది ఆయా దశకాల పరిస్థితుల్ని బట్టి ఆధారపడేదిగా కూడా ఉంటుంది. ఒక దేశంలోని, ఒక కాలంలోని మంచి ఇంకొక దేశంలో ఇంకొక కాలంలో చెడ్డ అవుతుంది. ఒక దేశంలోని ఒక కాలంలోని చెడ్డ ఇంకొక దేశంలో ఇంకొక కాలంలో మంచి అవుతూ ఉండొచ్చు.

సాహిత్యములో సాహిత్య విలువలకు, శిల్ప పరామర్శకు కాకుండా సాహిత్యంలో ప్రతిపాదితమైన నైతిక విలువలకే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి సాహిత్యాన్ని అంచనా వేసే విమర్శగా నైతిక విమర్శ ఉంటుంది. మానవ జీవితంలోని ఉచ్ఛనీచాల్లో ఉచ్చాన్ని ప్రోత్సహించి నీచాన్ని నిరసించేదిగా ఈ విమర్శ ఉంటుంది. మన పురాణ, ఇతిహాసాల్లోని శ్రీ కృష్ణుడు, ధర్మరాజు, అర్జునుడు, భీముడు, శ్రీరామచంద్రుడు, ఆంజనేయులు, హరిశ్చంద్రుడు, శిబిచక్రవర్తి, కర్ణుడు, సత్యభామ, సీత, ద్రౌపది, సావిత్రిలాంటి వాళ్ళను ఆదర్శవంతమైన వ్యక్తులుగానూ, దుర్యోధనుడు, కీచకుడు, సైందవుడు, బకాసురుడు, శూర్పణఖలాంటి వ్యక్తుల్ని ఆనాదర్శ వంతమైన వ్యక్తులుగానూ ఈ కోవకు చెందిన విమర్శే నిర్ధారించింది.

## 4.12 సాంఘిక విమర్శ :

ఈ విమర్శ ప్రాచీన కాలం నుంచీ ఉన్నా ఇటీవలి కాలంలోనే బాగా ప్రచారంలోకి వచ్చిన విమర్శగా మనకు కనిపిస్తుంది. పురాణాల్లోనూ, ఇతిహాసాల్లోనూ, కావ్యాల్లోనూ, శతకాల్లోనూ ప్రతిఫలించిన సాంఘిక అంశాల్ని వివరించే సంప్రదాయం ప్రాచీన కాలంలో వెలువడిన విమర్శల్లో మనకు కొంత కనిపిస్తుంది. నన్నయ భారత రచనకు దోహదం చేసిన నాటి సాంఘిక పరిస్థితుల వివరణ, రాయలనాటి రసిక జనజీవనం లాంటి విషయాలు ఆయా కాలాల్లోని సాంఘిక స్థితిగతుల్ని వివరించేవిగా ఉంటూ కొంతమటుకు సాంఘిక విమర్శ ఉనికిని మనకు తెలియజేసేవిగా ఉంటున్నాయి.

కానీ ఇటీవలి కాలంలో Carl Marx Marxisim ను వ్యాప్తిలోకి తీసుకువచ్చిన తర్వాత ప్రాచీన సాంఘిక విమర్శలో ఎన్నో మార్పులు సంభవించాయి. సాహిత్యం అనందం కోసం కాదు సాహిత్యం సామాజిక ప్రయోజనంకోసం అనే వాదన బలపడింది. కార్ల్‌మార్క్స్ తన మార్క్సిజంలో ప్రతిపాదించిన గతి తార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదం లాంటి వాదాల, సిద్ధాంతాల, సాంఘిక విలువల ఆధారంగా ఈ సమజాన్ని మనం విశ్లేషించి చూడాలనే వాదన బలపడింది. బూర్జువా వ్యవస్థ నిరసనం, కార్మిక వర్గ అభ్యుదయ కాంక్షలు ప్రబలాయి. శ్రామికుడి ప్రక్షాన నిలబడి రచయితలు రచనలు చేయాలనే దృక్పథం ప్రబలింది. సాహిత్యంలో అభ్యుదయ దృక్పథం, విప్లవ దృక్పథాలు ప్రబలాయి.

ఈ ధోరణుల్ని విలువల్ని ఆధారంగా చేసుకొని సాహిత్య విలువల్ని అంచనా వేసే విధానంగా సాంఘిక విమర్శ మారింది. ఈ విమర్శకే మార్క్సు విమర్శ (Marxistic criticism) అనే పేరొచ్చింది.

ఈ విమర్శనా విధానంలో ఒక కవి లేదా రచయిత తన రచనల్లో తన కాలం నాటి సామాజిక స్థితిగతుల్ని అభ్యుదయ దృక్పథంతో ఏ మేరకు చిత్రించాడు ? ఏ వర్గానికి ప్రాతినిధ్యం ఇచ్చాడు ? బూర్జువా వర్గానికా ? శ్రామిక వర్గానికా ? బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం ఇచ్చి ఉంటే ఆ కవి లేదా రచయిత రచనలు ఆదరణీయమైనవి కాక, శ్రామిక వర్గానికి ప్రాతినిధ్యం ఇచ్చి ఉంటే ఆ కవి, ఆ రచయిత, ఆ రచనలు ఆదరణీయమైనవి అనే అభిప్రాయాలను ఈ కోవకు చెందిన విమర్శ వ్యక్తం చేసేదిగా ఉంటుంది. ఈ మార్క్సు విమర్శ బూర్జువా వ్యవస్థకి ప్రాధాన్యం ఇచ్చిన ప్రాచీన సాహిత్యాల్ని, ప్రాచీన సాహిత్య విమర్శల్ని నిరసిస్తుంది. సామాజిక అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ వెలువడిన రచనల్ని, విమర్శల్ని అభిలషించేదిగా ఉంటుంది. సాహిత్యాన్ని ఒక భోగవస్తువుగా పరిగణించడాన్ని ఈ విమర్శ ఒప్పుకోదు.

## 4.13 మనో వైజ్ఞానిక విమర్శ :

ఈ విమర్శ ఆధునిక విమర్శ కొవలోకి చేరుతుంది. ఇటీవలి కాలంలో అత్యంత ప్రాచుర్యం పొందిన విమర్శగా ఈ విమర్శ ఉంది. ప్రాచీనకాలంలో మనిషి బాహ్యవిషయాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవాడు కానీ ఆధునిక కాలంలో దీనితోపాటు, మనిషి మేధస్సుకు, ఆలోచనలకు, మనిషి ప్రవర్తనలకు, మనిషి మనస్సుకు ప్రాధాన్యం ఇచ్చి మనిషిని అంచనా వేసే స్థితిగతులు నెలకొన్నాయి. ఫ్రాయిడ్, అడ్లర్, యాంగ్, బెర్గ్‌సన్ లాంటి శాస్త్రవేత్తలు మనిషిని, అతని మనసును, అందులో పొడచూపే ఆలోచనలను, భావాలను విశ్లేషించి చూపి మనో వైజ్ఞానిక శాస్త్రాన్ని రూపొందించారు. ఈ మనో విజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని కొనసాగే విమర్శను మనో వైజ్ఞానిక విమర్శ (Psycholosical Criticism) అనే పేరు వ్యాప్తిలోకి వచ్చింది. ఈ కోవకు చెందిన విమర్శలో మనిషి, అతని ఆలోచనలు, వాస్తవాలు, కలలు, కల్పనలు, ఊహలు లాంటి మానవీయ అంశాలు, వాటికి గల కారణాలు లాంటి ఎన్నో అంశాలకు ప్రాధాన్యాన్నిచ్చే ధోరణి ఎక్కువగా ఉంటుంది. మానవ మస్తిష్కంలో అజ్ఞాతంగా దాగి ఉన్న శక్తులు సృజనాత్మక రచనల్లో ఎలా ప్రభావాల్ని చూపిస్తూ ఉంటాయో అనే విషయాల విశ్లేషణలతో ఈ మనోవైజ్ఞానిక విమర్శ కొత్త పుంతల్ని తొక్కింది. రచయిత అంతరంగిక ప్రవృత్తులు, వాటి ప్రభావం సాహిత్యంపైన ఎలా పనిచేస్తూ ఉంటాయో అనే విషయాన్ని ఈ విమర్శ విడమర్చి చెప్పేదిగా ఉంటుంది. సృజనాత్మకమైన రచనల్లో మానవ ప్రవర్తనకు (Human Behaviour) ఉండే ప్రాధాన్యాన్ని ఈ విమర్శ విడమర్చి చెప్పి వాటి ఫలితాల్ని అంచనా వేసేదిగా ఉంటుంది.

మనో విశ్లేషణ సిద్ధాంతాల్ని (Psycho analitical Theories) ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని ఈ విమర్శ కొనసాగుతుంది. మానవ ప్రవృత్తుల్లోని ఆత్మాధిక్యతాభావం (Superiority complex) అత్మ న్యూనతాభావం (Inferiority complex) లాంటి అంశాల్ని అధారం చేసుకొని వెలువడిన రచనల్ని, అస్తిత్వవాదం (existentialism) అధివాస్తవికతా వాదం (surrialism) లాంటి వాదాల్ని ఆధారం చేసుకొని వెలువడిన రచనల్ని ఈ కోవకు చెందిన విమర్శ అంచనావేసి వాటి తీరుతెన్నుల్ని వివరించేదిగా ఈ విమర్శ కొనసాగుతుంది. తెలుగులో ప్రధానంగా మనోవైజ్ఞానిక దృక్పథంతో వెలువడిన నవలల్ని, కథానికల్ని, కవితల్ని విశ్లేషించి చూపెట్టేదిగా మనోవైజ్ఞానిక విమర్శ ప్రధానంగా కొనసాగింది. తెలుగులో వెలువడిన అస్తిత్వవాద, మనస్తత్వ నవలల్ని, కథల్ని కూడా ఈ విమర్శ విశ్లేషించి చూపెట్టింది. అంతేకాకుండా తెలుగులో వెలువడిన అధివాస్తవికతా వాద కవితల్ని కూడా ఈ మనోవైజ్ఞానిక విమర్శ పరిగణనలోకి తీసుకొని విశ్లేషించి చూపెట్టింది.

## 4.14 వివరణాత్మక విమర్శ :

ఈ విమర్శనే మనం వ్యాఖ్యానాత్మక విమర్శలనీ, వర్ణనాత్మక విమర్శ అనీ వ్యవహరిస్తూ ఉన్నాయి. వివరణాత్మక విమర్శను ఆంగ్లంలో Explanatory Criticism, వ్యాఖ్యానాత్మక విమర్శను Interpretative అనీ, వర్ణనాత్మక విమర్శను Discriptive Criticism అనీ మనం వ్యవహరించుకోడానికి అవకాశం ఉంది.

ఈ విమర్శ ముఖ్యంగా మన ముందున్న విషయాల్ని లేదా సాహిత్యాన్ని వివరించి చెప్పేదిగా ఉంటుంది. ఇందులో విశ్లేషణ అధికంగా ఉంటుంది. వ్యాఖ్యానం చేయడం ఇందులో ప్రధానమైన అంశంగా కూడా ఉంటుంది. వివిధ రచనల్లోని వివిధ విషయాలను విశ్లేషించి చూపి వాటి ఆశయాల్ని సిద్ధాంతాల్ని, గమ్యాల్ని వివరించి చెప్పేదిగా వివరణాత్మక విమర్శ ఉంటుంది. ఉన్నది ఉన్నట్లు చెప్పడం లేనిది లేనట్లుగా చెప్పడం ఈ విమర్శ ధ్యేయంగా ఉంటుంది. సిద్ధాంతీకరించడం, లక్షణ నిర్ధేశం చేయడంలాంటి విషయాల జోలికి ఈ విమర్శ వెళ్ళదు, కేవలం రచనల్ని గూర్చి అందులోని విశేషాల్ని గూర్చి, లోతుపాతుల్ని గూర్చి విడమర్చి చెప్పడమే ఈ విమర్శనా విధానంగా ఉంటుంది.

ఈ కోవకు చెందిన విమర్శ అతి ప్రాచీన కాలం నుంచీ వ్యాప్తిలో ఉంది. ఈ విమర్శ సామాన్యమైన పాఠకులకి సాహిత్యంలోని మంచిచెడ్డల్ని, లోతుపాతుల్ని వివరించి, వ్యాఖ్యానం చేసి చెప్పడం వల్ల ఇది ఎంతో ఆదరణీయమైన విమర్శగా కొనసాగింది. కొన్ని

సందర్భాల్లో పండితులకు కూడా ఈ విమర్శ ఆదరణీయమైందిగానే కొనసాగింది. ఈ విమర్శ ఇటు సంస్కృతంలోనూ, తెలుగుల్లోనూ అటు ఆంగ్లంలోనూ ప్రాచీన కాలం నుంచీ బహుళ ప్రచారంలో ఉంది. ఈ కోవకు చెందిన విమర్శలో కేవలం విమర్శకులకే కాకుండా కవులకు, రచయితలకు తావుంటుంది. కవులు రచయితలైన వాళ్ళు తమతమ కావ్యాల్లోని, కవితల్లోని, రచనల్లోని వివరాలను ఆయా కావ్యాల్లోనే కవితల్లోనే, రచనల్లోనే చెప్పుకోడానికి అవకాశం ఉంటుంది. ప్రాచీన కావ్యాల్లోని కావ్య అవతారికలు, పీఠికలు, అక్కడక్కడా ఉన్న పద్యాలు, వ్యాఖ్యానాలు, పీఠికలు, టిప్పణులు, వ్యాసాలు, చర్చలు, గోష్ఠులు, ఉపన్యాసాలు, గ్రంథావిష్కరణ సభలు, సమావేశాల్లో వ్యక్తీకరింపబడిన కవుల రచయితల, విమర్శకుల అభిప్రాయాలన్నీ ఈ వివరణాత్మక విమర్శ కోవలోకి వస్తాయి.

సంస్కృతంలో మల్లినాథసూరి చేసిన వ్యాఖ్యలు, నారాయణీయం, శ్రీధరీయం, వీరరాపులీయం, నీలకంఠీయం లాంటి రచనలు; తెలుగులో వెలువడిన వసు చరిత్ర వ్యాఖ్య, శృంగారనైషధం వ్యాఖ్య, అముక్త మాల్యద వ్యాఖ్య, విజయవిలాసం వ్యాఖ్య లాంటి వ్యాఖ్యానాలు, భారత భాగవత రామాయణాలకు వచ్చిన వ్యాఖ్యలు ఈ కోవకు చెందిన విమర్శకు కొన్ని ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

## 4.15 అభినందనాత్మక విమర్శ :

ఈ కోవకు చెందిన విమర్శ ఆలంకారికుల, లాక్షణికుల, పండితుల, విమర్శకుల దృక్కోణాలననుసరించి చేసే విమర్శగా అంటే విధాయాత్మకమైన విమర్శగా ఉండదు. విమర్శకుడు ఒక రచనపట్ల ఒక రచయితపట్ల తనకున్న వ్యక్తిగత అభిమానాన్ని తానే నేరుగా, స్వయంగా వ్యక్తం చేసేదిగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కవి లేదా రచయిత తనను గురించి తానే స్వయంగా చెప్పుకొనేదిగా కూడా ఉంటుంది. ఒక కవి లేదా రచయిత తన రచన తనకు ఎలా ఇష్టమో విడమర్చి చెప్పేదిగా ఈ విమర్శ ఉంటుంది. ఇలాగే ఇతరులు కూడా ఒక కావ్యం లేదా ఒక రచన తనకు ఎలానచ్చిందో చెప్పడం కూడా ఈ విమర్శ కిందికే వస్తుంది. ఆంగ్లంలో ఈ విమర్శను Impressionistic criticism అని పిలుస్తారు. ఒక కావ్యానికి లేదా రచనకు లేదా ఒక కవికి లేదా రచయితకు సంబంధించిన కళాత్మక విలువల్ని గూర్చికానీ, అందులోని సౌందర్యాన్ని గూర్చికానీ ఈ విమర్శ ప్రస్తావించదు. కేవలం అభినందనాత్మకంగా కానీ, పొగడ్తల రూపంలో కానీ ఈ విమర్శ కొనసాగేదిగా ఉంటుంది.

ఈ విమర్శలో అలంకారశాస్త్ర గ్రంథాలకు కానీ, లక్షణ గ్రంథాలకు కానీ, పూర్వకావ్యాలకు కానీ, పూర్వ విమర్శలకు కానీ ఏ మాత్రం తావుండదు. విమర్శకుడి లేదా రచయిత వ్యక్తిగతమైన ఇష్టాయిష్టాలకు లేదా అభిప్రాయాలకు ఈ విమర్శలో ప్రాధాన్యం ఉంటుంది. ఈ విమర్శ విమర్శకుల లేదా రచయితల సృజనతను గురించిన ఆత్మ వ్యక్తీకరణగా మాత్రమే ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే ఈ విమర్శ ఆత్మాశ్రయ ధోరణి కలిగి ఉంటుంది. ఒకే రచనలోని మంచి చెడ్డల్ని అంచనా వేసేదిగా, నిర్ణయించేదిగా, నిర్ధారణ చేసేదిగా ఈ విమర్శ ఏ మాత్రమూ ఉండదు. ఒక రచనకు ఈ విమర్శ విలువకట్టదు. ఈ విమర్శలో ఒంటెద్దు పోకడ కనిపిస్తుందే కానీ సమతూకం (Balance) ఉండదు. ఇది పాక్షికమైన విమర్శగా ఉంటుంది. సంపూర్ణమైన, సమగ్రమైన విమర్శగా ఇది ఉండదు. ఇది కేవలం పొగడ్తలకే పరిమితమైందిగా ఉంటుంది.

ఈ విమర్శ రచనల్లోని ప్రాథమిక అంశాలను మాత్రమే పరిగణలోకి తీసుకొని కొనసాగేదిగా ఉంటుంది. అంటే రచనా స్వరూపాల్ని, స్వభావాల్ని, వాటి ఫలితాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొనేదిగా ఉంటుంది. ఈ విమర్శ కల్పనలకు, ఊహలకు, ఆవేశాలకు, ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చేదిగా ఉంటుంది. ఇది సృజనాత్మక ధోరణిని కలిగి ఉంటుంది. సాహిత్యంలో సౌందర్యం, ఆనందం అనేవి మాత్రమే ప్రధానమైన అంశాలు అనే విషయాలను మాత్రమే ఈ విమర్శ చెప్పేదిగా ఉంటుంది. అంటే కళ కళ కొసమే అనే వాదాన్ని ఈ విమర్శ బలపరిచేదిగా ఉంటుంది. సర్వసాధారణంగా కవులు, రచయితలు స్వీయాత్మకంగా వ్రాసుకొన్న

ఆయా వర్గాల పీఠికలు; ఇతరులు మెచ్చుకోలుగా వ్రాసిన పీఠికలు, గ్రంథ సమీక్షలు, పత్రికా వ్యాసాలు, గ్రంధావిష్కరణ సభల్లో చేసిన ఉపన్యాసాలు ఈ కోవకు చెందినవిగా ఉంటాయి. అభినందనాత్మక విమర్శ ఒకప్పుడు బాగా ప్రచారంలో ఉండిన విమర్శే. కానీ దానికున్న ఆత్మాశ్రయ ధోరణివల్ల, పాక్షిక దృక్పథం వల్ల ప్రస్తుతం ఈ విమర్శ అంతగా ప్రచారంలో లేదు.

## 4.16 తులనాత్మక విమర్శ :

ఈ విమర్శ ఆధునిక కాలంలో బాగా వ్యాప్తిలోకి వచ్చిన విమర్శ. భిన్న దేశాలకు రాకపోకలు బాగా కొనసాగాక భిన్న సాహిత్యాలకు బాగా పరిచయం కలిగాక ఈ కోవకు చెందిన విమర్శ వ్యాప్తిలోకి వచ్చింది. ఆంగ్ల సాహిత్య పరిచయం, ప్రభావం అధికం అయిన కొద్దీ ఈ విమర్శ బాగా విస్తరించి వ్యాపించింది. ఈ విమర్శ నేడు అగ్రస్థానంలో ఉంది. ఈ విమర్శకు ఆంగ్లంలో comparative criticism అని పేరుంది. ఒక రచయిత రచనను గూర్చిన పరామర్శ చేయాల్సివస్తే దాన్ని ఇతరుల మంచి రచనలతో పోల్చి చెప్పడం తులనాత్మక విమర్శలో ప్రధానమైన అంశంగా ఉంటుంది. ఇలా పోల్చి చూసి చెప్పడంలో ఒకే భాషలో వెలువడిన మంచి రచనలతో కానీ లేదా ఇతర భాషల్లో వెలువడిన మంచి రచనలతో కానీ పోల్చి చూసి ఆ రచనలోని మంచి చెడ్డల్ని అంచనా వేయడం జరుగుతుంది. ఇలా పోల్చి చూసి చెప్పడం అనేది ఆయా రచనల్లో సామాన్యమైన లక్షణాలున్నప్పుడే జరుగుతుంది. ఇలాగే సామాన్యమైన లక్షణాలున్న ఒక కవిని లేదా రచయితను మరో కవిత లేదా రచయితతో వాళ్ళ సాహిత్యాలతో పోల్చి చూడడం కూడా తులనాత్మక విమర్శే అవుతుంది. ఈ కోవకు చెందిన విమర్శ చేయడానికి ఒక కవి లేదా రచయిత రచనలతోనే కాకుండా మొత్తం సాహిత్యంతో బాగా పరిచయం ఉండాలి. అంతే కాకుండా ప్రపంచంలోని వివిధ సాహిత్యాలతో కూడా పరిచయం ఉండాలి.

మనిషి మనిషికీ కొన్ని పోలికలు, తేడాలు ఉన్నట్లే మనిషి ఆలోచనా విధానాల్లోనూ సామ్యాలు, భేదాలు ఉంటాయి. వీటిని పరిగణనలోకి తీసుకొని ఈ కోవకు చెందిన విమర్శను నిర్వహించాల్సిన అవసరం ఉంటుంది. ఈ విమర్శలో ఒకే సాహిత్య ప్రక్రియకు చెందిన భిన్న రచనల్ని పోల్చిచూడ్డం అంటే పురాణాన్ని పురాణంతో, కావ్యాన్ని కావ్యంతో, శతకాన్ని శతకంతో పోల్చి చూడ్డం ప్రధానంగా జరుగుతూ ఉంటుంది. ఇతర భాషల్లో ఈ ప్రక్రియలుంటే వాటితో కొన్ని వీటిని పోల్చిచూడ్డం కూడా తులనాత్మక విమర్శలో ఉంటుంది.

తెలుగు - సంస్కృతం, తెలుగు - ఆంగ్లం, తెలుగు - తమిళం, తెలుగు-కనడం, తెలుగు - మళయాళం, తెలుగు - హిందీ భాషల్లో వెలువడిన సాహిత్యాల్ని సర్వసాధారణంగా పోల్చిచూసి తులనాత్మక అధ్యనంచేసి విమర్శల్ని కొనసాగించడం తెలుగు సాహిత్య విమర్శలో బాగా ప్రచారంలో ఉంది.

తెలుగులో మను వసు చరిత్రల తులనాత్మక పరిశీలన, ఆంగ్ల కాల్పనిక కవుల రచనల్ని భావ కవులరచనలతో పోల్చి చూడ్డం, హిందీ భక్త కవులైన కబీర్ దాస్ సూరదాస్, మీరా లాంటి కవుల్ని కవయిత్రుల రచనల్ని పోతన, వ్యాసయ్య, అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్యల్లాంటి తెలుగు భక్త కవులతో పోల్చి చూసి చేసిన విమర్శలన్నీ తులనాత్మక విమర్శ కిందికి వస్తాయి.

## 4.17 నిర్ణయాత్మక విమర్శ :

ఈ విమర్శకే ఆంగ్లంలో Judicial criticism అనీ, Evaluative criticism అనే పేర్లున్నాయి. ఈ కోవకు చెందిన విమర్శనా విధానంలో కొన్ని సిద్ధాంతాల్ని, సూత్రాల్ని అధారం చేసుకొని ఒక కావ్యాన్ని లేదా ఒక రచనను లేదా ఒక కవిని లేదా ఒక రచయితను అంచనావేసి తీర్పు చెప్పే, విలువ కట్టే ప్రయత్నం చేయబడుతుంది. ఈ విమర్శనా విధానం ఒక రకంగా ఆలంకారిక విమర్శను పోలిన విమర్శగా ఉంటుంది. ఆలంకారిక విమర్శలోలాగే ఆలంకారికులు, లాక్షణికులు ప్రతిపాదించిన మంచి సిద్ధాంతాల్ని,

లక్షణాల్ని, సూత్రాల్ని ఆధారం చేసుకొని ఒక రచనలోని మంచి చెడ్డల్ని గూర్చి తీర్పునిచ్చేదిగా ఉంటుంది. ఇది విధేయాత్మకమైన విమర్శగానే ఉంటుంది. లక్ష్య లక్షణ సమన్వితమైన రచనలకు మాత్రమే ఇందులో ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఈ విమర్శ అభినందనాత్మక విమర్శ కంటే భిన్నమైంది. ఈ విమర్శనా విధానంలో కవుల, రచయితల వ్యక్తిగతమైన ఇష్టాయిష్టాలకు ఎంతమాత్రం తావుండదు. ఇది అత్యంత ప్రాచీనమైన విమర్శనా విధానం దేశ కాల పరిస్థితులకు అనుకూలంగా ఈ విమర్శ మారేదిగా ఉండదు. అందువల్ల ఈ విమర్శలో కొన్ని పరిధి పరిమితులు ఉంటాయి అనే విషయం మనకు స్పష్టం అవుతుంది. దేశకాల పరిస్థితుల్ని బట్టి మార్పు చెందుతూ ఉండే సాహిత్యాన్ని ఈ విమర్శ ఒప్పుకోదు. పాత విలువలకు, పాత సిద్ధాంతాలకు, పాత సూత్రాలకు, పాత అభిప్రాయాలకు మాత్రమే ఈ విమర్శ ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చేదిగా ఉంటుంది. ఈ విమర్శ అధునికతను ఒప్పుకోదు ఈ లక్షణం సాహిత్య విమర్శలో ఒక అవరోధంగా ఉంటుంది. ఎందుకంటే పాత విలువలు, సంప్రదాయాలు, పాత అభిప్రాయాలే ఎప్పుడూ గొప్పవిగా కానీ, మంచివిగా కానీ ఉండవు. వాటిల్లో కూడా కొన్ని లోటుపాట్లు, లోపాలు ఉంటాయి.

ఒకప్పుడు సాహిత్యం అనందంకోసం, బ్రహ్మానందం కోసమే అనే అభిప్రాయం ప్రబలంగా ఉండేది. కానీ నేడు సాహిత్యం ప్రయోజనం కోసం సామాజిక ప్రగతికోసం లేదా సామాజిక అభ్యుదయంకోసం పాటుపడేదిగా ఉండాలనే అభిప్రాయం ప్రబలంగా, సర్వత్రా ఉంది. అందువల్ల పాతదే మేలు కొత్తది పనికిరాదు అనే అభిప్రాయం ఇక్కడ పొసగదు, ప్రాచీన సాహిత్యం అంతా పనికిరానిదని తీర్పు చెప్పడం కూడా పనికి రాని విషయమే. కాబట్టి సద్విమర్శ దేశకాల పరిస్థితుల్ని బట్టి మార్పు చెందేదిగా ఉంటూ అంటే Flexibility ని కలిగి ఉండి ఏది మంచిది ఏది చెడు అని నిర్ణయించేదిగా మాత్రమే ఉండాలి. నిర్ణయాత్మక విమర్శలాగా ఏదో కొన్ని ప్రమాణాల్ని దృష్టిలో ఉంచుకొని ఇదే మంచి ఇదే చెడు అని శాసించేదిగా ఉండ కూడదు. సద్విమర్శ పూర్తిగా విధేయాత్మకమైన విమర్శగా ఉండకూడదు.

నిర్ణయాత్మక విమర్శ సాహిత్యంలో 'మూస పద్ధతిని' (Sterio type system) ప్రోత్సహించేదిగా ఉంటుంది. ఒక రచనకు మాతృకల్ని అనేకం సృష్టించడానికి అవకాశాన్ని కల్పిస్తుంది. ఎందుకంటే ఇది లక్ష్య లక్షణ సమన్వితమైందిగా ఉంటుంది. అనుకరణల్ని ఈ విమర్శ ప్రోత్సహించేదిగా ఉంటుంది. తెలుగు సాహిత్యంలో ఈ విమర్శనా విధానం వల్ల పల్లవ సుచరిత్రలు పుట్టుకొచ్చాయి. ఇవి ప్రబంధ సాహిత్య ప్రక్రియకే స్వస్తి పలికాయి.

## 4.18 గ్రంథ విమర్శ :

ఈ విమర్శను ఆంగ్లంలో Textud Criticism అని వ్యవహరిస్తూ ఉన్నారు. దీనికి ఇంకా రూపవిమర్శ (Formalistic Criticism) అనీ, సత్య మిమాంసా విమర్శ (Ontalogical Criticism) అనీ పేర్లున్నాయి. ఈ విమర్శ అంతా గ్రంథాన్ని (Text) ఆధారం చేసుకొని మాత్రమే కొనసాగేదిగా ఉంటుంది. ఏదైనా ఒక గ్రంథాన్ని అందులోని వివిధ విషయాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని దాని మంచిచెడ్డల్ని గూర్చి పరామర్శించేదిగా ఈ విమర్శ కొనసాగుతుంది. ఇతర విషయాలకి ఈ విమర్శలో ఏ మాత్రం తావుండదు. ఈ విమర్శలో కవి జీవితం, చారిత్రక అంశాలు, సాంఘిక అంశాలు, మనో వైజ్ఞానిక విషయాల్లాంటి ఇతరత్రా ప్రతిపాదితమైన అంశాలకు ఏ మాత్రం తావుండదు.

ఈ కోవకు చెందిన విమర్శలో విమర్శకూడ రచనా నిర్మాణ సామాగ్రిని - వస్తువు, భావం, శైలి అనే వాటిని; వాటి నిర్మాణ క్రమాన్ని మాత్రమే దృష్టిలో ఉంచుకొని తన విమర్శను కొనసాగించే వాడుగా మాత్రమే ఉంటాడు. ఒక రచనలోని ఇతివృత్తం, పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు, ఛందస్సు, అలంకారాలు, భావాలు పదాలు, భాషలాంటి రచనా అంశాలను చాలా సూక్ష్మ దృష్టితో అధ్యయనం చేసి లేదా పరిశీలించి చెప్పడం మాత్రమే ఈ కోవకు చెందిన విమర్శలో ప్రధానంగా ఉంటుంది.

రచనలోని రచయిత ఉద్దేశం ఏంటో, రచనలోని వాస్తవమైన అర్థాలేంటో వివరించి చెప్పడం మాత్రమే ఈ విమర్శ ఉద్దేశంగా ఉంటుంది.

ఈ విమర్శలోని ప్రధానమైన దృక్పథం ఒక రకంగా ప్రాచీనకాలం నుంచీ వ్యాప్తిలో ఉన్నా ఒక రచనలో పొందుపరచబడిన వివిధ విషయాలను విమర్శకుడి సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలన చేసి క్రొంగొత్త వాస్తవాల్ని కావ్య అవతారికలు, పీఠికలు, వివరించి చెప్పే విమర్శగా ఈ గ్రంథ విమర్శ ఉంటుంది. గ్రంథ సమీక్షలు, గ్రంథ పరిష్కరణలు కూడా ఈ కోవకు చెందిన విమర్శలుగానే ఉంటాయి. ఒక గ్రంథానికి సంబంధించిన పాఠాల్ని, పాఠాంతరాల్ని నిర్ణయించి రచయిత ఉద్దేశాన్ని బహిర్గతం చేసేదిగా ఈ విమర్శ ఉంటుంది. లోపించిన పాఠాల్ని (Text ను) పూరించేదిగా అంటే పాఠపూరణల్ని చేసేదిగా, కొత్త వ్యాఖ్యానాల్ని చేసేదిగా ఈ విమర్శ ఉంటుంది.

## 4.19 కవి జీవిత విమర్శ :

ఈ విమర్శ ప్రధానంగా కవి లేదా రచయిత జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని అతని జీవిత నేపథ్యాన్ని పరిగణలోకి తీసుకొని కొనసాగే విమర్శగా ఉంటుంది. ఈ విమర్శకు ఆంగ్లంలో Biographical Criticism అనే పేరుంది. ఇది ఒక రకంగా చారిత్రక విమర్శను పోలిన విమర్శగా ఉంటుంది. చారిత్రక విమర్శలో చారిత్రక విషయాల్ని ఒక రచనకు సంబంధించిన నేపథ్య అంశాలుగా స్వీకరించి పరిశీలన చెయ్యడం జరగుతుంది. ఇలాగే ఈ విమర్శలో కవి జీవితాన్ని ఒక రచనకు సంబంధించిన నేపథ్య అంశాలుగా స్వీకరించి పరిశీలన చెయ్యడం ప్రధానంగా ఉంటుంది. ఇంతే కాకుండా కవి జీవించిన కాలం నాటి సాంఘిక స్థితిగతుల్ని కూడా పరిగణలోకి తీసుకోవడం ఈ విమర్శనా విధానంలో ఉంటుంది.

ఈ విమర్శనా విధానంలో కేవలం కవి, రచయిత జీవిత విశేషాలనే కాకుండా, అతని కుటుంబ సభ్యుల, బంధువుల, మిత్రుల లాంటి వ్యక్తుల జీవిత విశేషాలను కూడా పరిగణలోకి తీసుకొని ఈ విమర్శ కొనసాగేదిగా ఉంటుంది. ఈ కవి జీవిత విమర్శనా విధానంలో కవి లేదా రచయిత వ్యక్తిత్వం ఎలాంటిది ? అతని జీవన శైలి, సమకాలీన సాంఘిక అంశాలు అతని రచనలో ఏ మాత్రం చోటు చేసుకొన్నాయి ? ఎంత మాత్రం ప్రభావితం చేశాయి ? అనే అంశాలను విశ్లేషించి చూపించే విధానం ఉంటుంది. ఇలాగే అతనికి సన్నిహితులైన వాళ్ళ విషయంలో కూడా.

కవి జీవిత విమర్శనా విధానంలో ఒక ఇబ్బంది ఉంది. అది ఏంటంటే ఈ విమర్శనా విధానంలో కేవలం కవి జీవితానికి అతని కుటుంబ సభ్యుల, బంధువుల, మిత్రుల జీవిత విశేషాలకి, జీవన శైలులకి, వాళ్ళ సమకాలీన సాంఘిక అంశాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి విమర్శను చేసే పద్ధతి ఉంది. దీనివల్ల కావ్య లక్షణాలు, అలంకారికుల, లాక్షణికుల, పూర్వ విమర్శకుల సిద్ధాంతాలకు, సూత్రాలకు, అభిప్రాయాలకు ఏ మాత్రం తావుండదు. అందువల్ల ఈ విమర్శ పాక్షికమైన విమర్శగానే ఉంటుంది.

## 4.20 పునర్నవ విమర్శ :

ఈ విమర్శకు ఆంగ్లంలో (Neo Classical Criticism) అనీ, New Classical Criticism అనీ పేర్లున్నాయి. తెలుగులో నవ్య సంప్రదాయ విమర్శ అని కూడా దీన్ని వ్యవహరిస్తూ ఉన్నారు. ఆంగ్ల సాహిత్యంలో Neo Classicism అనే ఒక సాహిత్య ఉద్యమం ఒకప్పుడు వ్యాప్తిలో ఉండేది. ఆ సాహిత్య ధోరణుల్ని విశ్లేషించి చూపించడానికే ఈ విమర్శనా విధానం ఆంగ్ల సాహిత్య విమర్శలో పొడచూపింది. ఈ విమర్శ ప్రతీక వాదంతోనూ (Symbolism) , సంగీత శాస్త్ర సిద్ధాంతాలతోనూ సంబంధాల్ని కలిగి కొనసాగే విమర్శగా ఉంటుంది. ఈ విమర్శలో కవి జీవిత విమర్శలో లాగే కవి జీవితానికి, వ్యక్తిత్వానికి కొంత ప్రాధాన్యం ఇవ్వబడి ఉంటుంది.

ఈ అంశాలతో పాటు ఈ విమర్శలో ఇంకా విశ్వజనీనత (Universality) వాస్తవాశ్రయ ధర్మం, విషయ స్పష్టత, భావానికి - వాక్కుకే మధ్య సమన్వయం వంటి విషయాలు పరిగణలోకి తీసుకోబడే అంశాలుగా ఉంటాయి. అంతే కాకుండా కవి, రచయితకు ఉండే కళాకౌశలం కూడా ఈ విమర్శలో ప్రధానమైన అంశంగానే ఉంటుంది. ఈ విమర్శ ఆలంకారిక విమర్శకంటే కొంచెం భిన్నమైంది. కళా విమర్శకంటే కూడా కొంచెం భిన్నమైంది. ప్రాచీన విలువల్ని ఆధారం చేసుకొని వెలువడిన ఆధునిక విమర్శగా ఇది ఉంటుంది.

ఈ పునర్వి విమర్శ అటు ప్రాచీనతను చాలా మటుకు ఇటు ఆధునికతను కొంతవరకు ఒప్పుకొని కొనసాగే విమర్శగా ఉంటుంది. తెలుగులో విశ్వనాథ సత్యనారాయణ అతని శిష్యులు నవ్య సంప్రదాయ సాహిత్యాన్ని నవ్య సంప్రదాయ విమర్శను ప్రోత్సహించిన వాళ్ళుగా మనకు కనిపిస్తారు. విశ్వనాథ సత్యనారాయణ శిష్యుల్లో లేదా శిష్యతుల్యుల్లో డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు, డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం, డా॥ కోవెల సంపత్కుమారాచార్య, డా॥ కోవెల సుప్రసన్నాచార్య లాంటి వాళ్ళు నవ్య సంప్రదాయాన్ని, నవ్య సంప్రదాయ విమర్శను తెలుగులో కొనసాగించిన వాళ్ళుగా మనకు కనిపిస్తున్నారు.

## 4.21 కాల్పనిక విమర్శ :

ఈ విమర్శనే ఆంగ్లంలో Romantic Criticism అనేపేరుంది. ఈ విమర్శ ఆంగ్లంలో వెలిసిన Romantic Poetry లాంటి సాహిత్యాలను విశ్లేషించి చూపెట్టడానికి ఆవిర్భవించిన ఆధునిక సాహిత్య విమర్శగా ఉంటుంది. ఈ విమర్శ Romanticism లోని ప్రధానమైన అంశాలైన కల్పనలకు, ఊహలకు, భావుకతలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేదిగా ఉంటుంది. కవుల, రచయితల వ్యక్తిగత అభిప్రాయాలకు, అనుభవాలకు, అనుభూతులకు ఈ విమర్శనా విధానంలో ఎక్కువగా తావుంటుంది. ఈ విమర్శనా విధానంలో ఎక్కువగా ఆత్మాశ్రయ ధోరణికి (Subjectivity) ప్రాధాన్యం ఇచ్చేదిగా ఉంటుంది.

ఈ విమర్శ ఆలంకారిక విమర్శకంటే, పునర్వవ విమర్శకంటే భిన్నమైందిగా ఉంటుంది. ఇది వీటిలాగా విధేయాత్మకమైందిగా ఉండదు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని కోరుకొనే విమర్శగా ఇది ఉంటుంది. ఈ విమర్శనా విధానంలో వాస్తవికా వాద దృక్పధానికి (Realism) తావుండదు. ఈ విమర్శ ఆంగ్లంలో ప్రధానంగా కాల్పనిక కవిత్వాన్ని తెలుగులో భావ కవిత్వాన్ని విశ్లేషించి చూపే విమర్శగా కొనసాగింది. ఆంగ్ల కాల్పానిక కవుల ప్రభావం తెలుగు, భావకవులపైన ఎక్కువగా ఉండటం మూలంగా తెలుగు భావ కవిత్వాన్ని కూడా విశ్లేషించి చూపే విమర్శగా ఈ కాల్పనిక విమర్శ కొనసాగింది. ఆంగ్ల కాల్పానిక కవులు, తెలుగు భావకవుల సున్నితమైన మనస్తత్వాన్ని, వాళ్ళ ప్రకృతి ప్రియత్వాన్ని, ప్రేమతత్వాన్ని ప్రణయతత్వాన్ని, స్మృతి ప్రాధాన్యాన్ని ఆత్మాశ్రయత్వాన్ని, స్వేచ్ఛా ప్రియత్వాన్ని ; తెలుగు భావకవుల భక్తితత్వాన్ని, నిరాశానిస్పృహల్ని వివరించి చెప్పేదిగా, విశ్లేషించి చూపేదిగా ఈ కాల్పనిక విమర్శ కొనసాగింది.

సామాజిక దృక్పథం, సామాజిక స్పృహకు ప్రాధాన్యం ఏర్పడి రచనలు వెలువడిన తరువాత ఈ విమర్శ ప్రాబల్యం బాగా తగ్గిపోయింది.

ఇలా విభిన్నమైన విమర్శనా విధానాలు సాహిత్య విమర్శకోసం ఆవిర్భవించి ఎంతో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ ఉన్నాయి. వీటిల్లో ఒక దానితో మరొకటి ఏదో ఒక రకంగా సంబంధాన్ని కలిగి ఉన్న విమర్శలుగా చాలా సందర్భాల్లో మనకు కనిపిస్తాయి. మనం ఇక్కడ చేసిన స్థూల విభజనలోనూ, సూక్ష్మ విభజనలోనూ కొన్ని సామ్యాలున్న, కొన్ని భేదాలున్న విమర్శలు మనకు కనిపిస్తున్న ఒక దానితో మరొకటి కలగలిసి ఉండటాన్ని ఒకదాని ప్రభావం ఇంకొక దానిమీద ఏదో ఒక రకంగా ఉండటాన్ని మనం చూడగలం. ఇలా వివిధ రకాలైన విమర్శలు, విమర్శనా విధానాలు, పద్ధతులు లేదా భేదాలు అటు ఆంగ్ల సాహిత్యంలోనూ, ఇటు సంస్కృత తెలుగు సాహిత్యాల్లోనూ అలరారుతూ ఉండి సాహిత్య విమర్శల్ని కొనసాగిస్తూ ఆయా కవుల్ని, కావ్యాల్ని, ఆయా రచయితల్ని,

రచనల్ని మనకు పరచయం చేస్తూ, వివరించి చెబుతూ, విశ్లేషించి చూపెడుతూ సాహిత్య సృజనకు, సాహిత్య వికాసానికి దోహదం చేస్తూ విమర్శనా సాహిత్యాన్ని సృజిస్తూ విమర్శనా సాహిత్యాభివృద్ధికి దోహదం చేస్తూ ఉన్నాయి.

## 4.22 మాదిరి ప్రశ్నలు :

1. విమర్శ అంటే ఏమిటో తెలిపి, అందులోని సూక్ష్మవిభాగాల్ని వివరించండి ?
2. విమర్శ అంటే ఏంటో తెలిపి, వివిధ విమర్శనా రీతుల్ని వివరించండి ?
3. విమర్శ అంటే ఏంటో తెలిపి, ప్రాచీన విమర్శనా రీతుల్ని వివరించండి ?
4. విమర్శ అంటే ఏంటో తెలిపి, ఆధునిక విమర్శనా విధానాల్ని గూర్చి తెలుపండి ?
5. విమర్శను స్థూలంగా, సూక్ష్మంగా వర్గీకరించి వివరించండి ?

## 4.23 ఆధార గ్రంథాలు :


1. బ్రహ్మానంద, హెచ్.ఎస్. తెలుగు సాహిత్య విమర్శ - పాశ్చాత్య ప్రభావం, అక్షర ప్రసార ప్రచురణ, అనంతపురం 1954.
2. రామారావు, ఎస్.వి. - తెలుగులో సాహిత్య విమర్శ, ద్వితీయ ముద్రణ, హైదరాబాదు. 1989
3. లక్ష్మీకాంతం, పింగళి - సాహిత్య శిల్ప సమీక్ష, మాలిక్ పబ్లిషర్స్ తిరుపతి, 1966
4. వెంకట రామనరసింహం, కాకర్ల - సాహిత్య దర్శనం, క్వాలిటీ పబ్లిషర్స్, విజయవాడ, 1979.
5. వెంకటావధాని, దివాకర్ల - సాహిత్య సోపానాలు ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1978.
6. William Henry Hudson - An Introduction to the Study of Literature George G. Harrap & Co Ltd. London, 2nd Edn. 1958.


- ఆచార్య ఎస్.జి.డి. చంద్రశేఖర్

**పాఠం - 6.**

# ప్రాచ్య పాశ్చాత్య విమర్శ భేదాలు

**6.0 లక్ష్యం :-** ఈ పాఠంలో మనం ప్రాచ్య విమర్శ భేదాల్ని గురించి వివరంగా తెలుకుంటాం.

**విషయసూచిక**

6.1 అలంకారిత విమర్శ

6.2 స్వతంత్ర విమర్శ

6.3 నైతిక విమర్శ

6.4 మనస్తత్వ విమర్శ

6.5 సాంఘిక విమర్శ

6.6 కళాత్మక విమర్శ

6.7 పౌరాణిక విమర్శ

6.8 లక్షణ విమర్శ

6.9 సూత్ర విమర్శ

6.10 కవి జీవిత విమర్శ

6.11 చారిత్రక విమర్శ

6.12 తులనాత్మక విమర్శ

6.13 పరిష్కరణ విమర్శ

6.14 ప్రకృతివాద విమర్శ

6.15 ప్రతీకవాద విమర్శ

6.16 మార్క్సిస్టు విమర్శ

6.17 నమూన ప్రశ్నలు

6.18 ఆధార గ్రంథాలు

ప్రాచ్యులు అంటే తూర్పుదేశాలవాళ్లు -మనం - భారతీయ దేశీయులం. పాశ్చాత్యులు అంటే పడమటి దేశాలవాళ్లు -గ్రీకు- ఇంగ్లండ్- అమెరికా మొదలైన దేశాల వాళ్లు.


ప్రాచ్య పాశ్చాత్య విమర్శ భేదాల్ని గురించి తెలుసుకునేముందు 'విమర్శ'ను గురించి రెండు మాటలు.

'వి' అనే ఉపసర్గ 'మృశ్' అనే ధాతువుతో చేరగా 'విమర్శ' అనే పదం సంస్కృతంలో ఉత్పన్నం అయింది.

ప్రాచ్య పాశ్చాత్య విమర్శని పలువురు తెలుగు విమర్శకులు వివిధ రకాలుగా విభజించి పరిశీలించారు.

ఆచార్య కె.వి. ఆర్. నరసింహంగారు తమ 'సాహిత్య దర్శనం' అనే గ్రంథంలో విమర్శను మొదట రెండు స్థూల విభాగాలుగా విభజించారు. అవి. 1) ఆలంకారిక విమర్శ (Judicial or Deductive Criticism) 2) స్వతంత్ర్య విమర్శ (Inductive Criticism)

ఆచార్య కె.వి.ఆర్. నరసింహంగారే విమర్శను సూక్ష్మంగా విభజించి ఐదు విభాగాలుగా తేల్చారు. 1) నైతిక విమర్శ (The moral approach) 2.మనస్తత్వ విమర్శ (The Psychological approach) 3. సాంఘిక విమర్శ (The sociological) 4. కళాత్మక విమర్శ (The Formative or Aesthatic approach) 5. పౌరాణిక విమర్శ (The Archetypal approach)




ఆచార్య యస్వీ రామారావుగారు తమ 'తెలుగులో సాహిత్యవిమర్శ' అనే గ్రంథంలో ప్రాచ్య పాశ్చాత్య విమర్శని 8 రకాలుగా విభజించారు. అవి

1. లక్షణ విమర్శ (Legislative Criticism)
2. సూత్ర విమర్శ (Theoritical Criticism)
3. ఆలంకారిక విమర్శ (Deductive Criticism)
4. స్వతంత్ర్య విమర్శ (Inductive Criticism)
5. కవిజీవిత విమర్శ (Biographical Criticism)
6. చారిత్రక విమర్శ (Historical Criticism)
7. తులనాత్మక విమర్శ (Comparative Criticism)
8. పరిష్కరణ విమర్శ (Textual Criticism)

– వీటిని పట్టీలో ఇలా పొందుపరచవచ్చు.

విమర్శ

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
|---|---|---|---|---|---|---|---|
| లక్షణ విమర్శ (Legislative criticism | సూత్ర విమర్శ (Theoritical criticism) | ఆలంకారిక విమర్శ (Deductive criticism) | స్వతంత్ర విమర్శ (Inductive criticism) | కవి జీవిత విమర్శ (Biogrphical criticism) | చారిత్రక విమర్శ (Historical criticism) | తులనాత్మక విమర్శ (Comparative criticism) | పరిష్కరణ విమర్శ (Textual criticism) |

ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు తమ 'ఆంధ్ర సాహిత్యవిమర్శ – ఆంగ్ల ప్రభావం' అనే గ్రంథంలో విమర్శ భేదాల్ని ఇలా పేర్కొన్నారు. (1) గ్రంథ పరిష్కార విమర్శ **(Textual)** (2) కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ **(Biographical)** (3) అభిరుచివిమర్శ **(**Aesthatic or Impressionism**)** (4) మనోవిశ్లేషణాత్మక విమర్శ **(**Psycho-analytical) (5) చారిత్రక విమర్శ **(Historical)** (6) ప్రకృతివాద విమర్శ **(**Naturalist movement**)** (7) ప్రతీకాత్మకవాద/ప్రతీకవాద విమర్శ (8) మార్క్సిస్టు విమర్శ అనేవి.

విమర్శ

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
|---|---|---|---|---|---|---|---|
| గ్రంథ పరిష్కార విమర్శ (Textual) | కవి జీవితకావ్య సమన్వయ విమర్శ (Biographical) | అభిరుచి విమర్శ (Aeshatic or impression) | మనోవిశ్లేషణాత్మక విమర్శ (Psycho-analytical) | చారిత్రక విమర్శ (Historical) | ప్రకృతివాద విమర్శ (Naturalist movement) | ప్రతీకవాద ప్రతీకాత్మక విమర్శ | మార్క్సిస్టు విమర్శ |

ఇక ఒక్కొక్క విమర్శ భేదాన్ని గురించి వివరంగా తెలుసుకుందాం.

**6.1. ఆలంకారిక విమర్శ :** దీనినే ఆంగ్లంలో Judicial, Criticism అని, deductive criticism అని అంటారు. దీనికే 'లాక్షణిక విమర్శ' అని మరోపేరు.

ఈ ఆలంకారిక విమర్శ విమర్శలన్నింటిలో ప్రాచీనం అయింది. సాధారణంగా సాహిత్యం విషయంలో ఆలంకారికులే ప్రమాణం. వారు ఏర్పరచిన ఆలంకారిక నిబంధనల్ని ఆధారంగా చేసుకుని ఏ గ్రంథాన్నయినా విమర్శిస్తే ఆ పద్ధతిని 'ఆలంకారిక విమర్శ' అంటారు.

ఆలంకారిక విమర్శ పద్ధతిలో – ఆలంకారికులు నిర్దేశించిన నియమాలకు అనుగుణంగా గ్రంథం రచించబడితే అది సద్గ్రంథం అని లేకపోతే ' అసద్గ్రంథం ' అని నిర్ణయించబడుతుంది.

పూర్వం ఇటు భారతదేశంలోను అటు పాశ్చాత్య దేశాల్లోనూ ఈ ఆలంకారిక విమర్శే ప్రచురంగా ఉండేది. పాశ్చాత్యులకు ఆరిస్టాటిల్ రచించిన Poetics (పొయిటెక్స్) ప్రమాణ విమర్శ గ్రంథం.

భారతదేశంలో అలంకార గ్రంథాల్తోపాటు రామాయణం మొ॥న కావ్యాలు కూడా ప్రమాణ గ్రంథాలుగా అంగీకరించబడ్డాయి. సాహిత్యంలో ఇతివృత్త స్వీకరణ నుండి భాషా ప్రయోగం వరకు ఆలంకారిక నిబంధనలు ఉండేవి. నాటక పాత్రల విషయంలోనయితే ఈ నిబంధనలకు అంతే లేదు.

ఆలంకారిక విమర్శ వలన కావ్యరచనలో కవులు ఒక పద్ధతినంటూ పాటించడం గొప్ప ప్రయోజనం.

కానీ తరతరాలుగా కవులు అదే నియమాల్ని అనుసరించినందువల్ల కావ్యాలన్నీ మూసలోపోసిన బొమ్మల్లాగా ఒకేరకంగా తయారయ్యాయి. ప్రబంధ లక్షణాల్ని తు.చ. తప్పకుండా పాటించినందువల్లే మన తెలుగు సాహిత్యంలో 'క్షీణయుగం' అంటూ ఒకటి ఏర్పడింది. ప్రబంధ రచనకు ఒరవడిగా వసుచరిత్రను తీసుకున్నందువల్ల ఎన్నో పిల్ల వసుచరిత్రలు తయారయ్యాయి. అందువల్ల అలంకారిక విమర్శ కొంతవరకు దుష్ఫలితాల్ని కూడా ఇచ్చిందని చెప్పుకోవాలి.

లక్ష్యలక్షణ సమన్వయంతో సంప్రదాయ మార్గంలో కొనసాగే వ్యాఖ్యానాలు, శబ్ద సాధుత్వ చర్చలు, ఛందస్సు – అలంకార సంబంధ విమర్శలు అలంకారిక విమర్శ కిందికి వస్తాయి.

**6.2 స్వతంత్ర విమర్శ** :– దీనినే ఆంగ్లంలో Inductive Criticism అంటారు. ఆధి భౌతికశాస్త్ర పరిశీలన విధానాన్ని అనుసరించి ప్రవర్తిల్లే విమర్శను 'స్వతంత్ర విమర్శ' అంటారు. ఏ శాస్త్రజ్ఞునికైనా ఆ శాస్త్రంలో ఉండే అంశాలు సమానమే. వాటిలో ఉచ్చనీచాలు తక్కువ ఎక్కువలు శాస్త్రజ్ఞుడు చూడడు. ఉదా॥ జంతుశాస్త్రజ్ఞునికి ఏనుగూ దోమా ఒకటే. వృక్ష శాస్త్రజ్ఞునికి ఉమ్మెత్తపూవు గులాబీ సమానమే. అంటే శాస్త్రజ్ఞుడు దేని విలువ దానిదిగా, దేనిస్వభావం దానిదిగా మాత్రమే చూస్తాడు. ఇదే పద్ధతిని సాహిత్యానికి అన్వయిస్తే అది 'స్వతంత్ర విమర్శ' అవుతుంది. అంటే ఈ పద్ధతిలో విమర్శకునికి విషయ పరిశీలనే ప్రధానం కానీ, మరోటికాదు. విమర్శకునికి మరోలా చూసే అధికారం లేదు. అంటే విలువల్ని నిర్ణయించి తీర్పు చెప్పే వీలులేదు. ఒక గ్రంథాన్ని మరో గ్రంథంతో పోల్చడం అనవసరం. ఏ గ్రంథానికి ఆ గ్రంథమే ప్రమాణం. ఏ కవికి ఆ కవే ప్రధానం. 'ఆలంకారిక నియమాల్ని అనుసరించి విమర్శించకూడదు' అనేదే 'స్వతంత్రవిమర్శ' విధానం.

ఆంగ్లభాషలో మోల్టన్ (Moulton) మొదలైన మేధావులు స్వతంత్ర విమర్శను ప్రశంసించారు. అయితే ఈ విమర్శ విధానానికి అంత ప్రచారం రాలేదు. ఎందుకంటే – సాహిత్యంశాస్త్రం కాదు కాబట్టి. సాహిత్యం ఒక కళ. కావ్యం కవి ఆత్మీయతకు సంబంధించింది – కవికి స్వతస్సిద్ధంగా ఉండే ప్రేమ, అసూయ, ఈర్ష్య, ద్వేషం, కోపం లాంటి గుణాలన్నీ అతను రచించే కావ్యంలో కొద్దో గొప్పో ప్రతిఫలిస్తాయి.

కావ్యంలో కవి ఆత్మీయత ఒక్కటే ప్రతిఫలించదు. కవికాలంనాటి సమాజం కూడా ప్రతిఫలిస్తుంధి. కవి పుట్టిపెరిగిన సంఘానికి సంబంధించిన ఆచార వ్యవహారాలు, సంస్కృతి ప్రతిబింబిస్తాయి.

సాహిత్యానికి చెందిన మరో ప్రధాన అంశం 'విశ్వజనీనత'. ఇది దేశకాలాలలో బాధింపపడని ధర్మం, ఉదా॥ సత్యం, ధర్మం, అహింస, పరోపకారం, త్యాగం, దానం లాంటి గుణాలు 'విశ్వజనీనత' కు సంబంధించినవి. అందువల్ల కవుల్లో కూడా వైయక్తిక ఇష్టానిష్టాల్ని చిత్రించే కవికన్నా సాంఘికాలైన సంస్కృతి సంప్రదాయాల్ని చిత్రించే కవి శ్రేష్ఠుడని–అంతకన్నా విశ్వజనీత ప్రతిబింబించే కావ్యం రచించిన కవి ఋషితుల్యుడు, క్రాంతదర్శి, మహామహుడని సంఘం ప్రశంసిస్తుంది. అందువల్ల కవుల్లో తరతమ భేదాల్ని చూడడం, విమర్శించడం తప్పనిసరి అవుతున్నది. అలా చేయడానికి ఈ 'స్వతంత్ర పద్ధతి' సహకరించదు.

కవిత్వం ఒక సృష్టి అయినప్పుడు – సృష్టిలోని బాగోగుల్ని ప్రతివాడూ విమర్శించడానికి అధికారం ఉన్నపుడు – కవిత్వాన్ని విమర్శించే హక్కు ప్రతి విమర్శకుడికి ఉండడంలో ఆశ్చర్యంలేదు. అందువల్ల 'స్వతంత్ర విమర్శ' అన్ని కావ్యాలకు అన్వయించడం కుదరదు.

మరి, స్వతంత్ర విమర్శ ఎక్కడ ఉపయోగపడుతుంది ? మహామేధావి అయిన కవి పూర్వసంప్రదాయాన్ని తిరస్కరించి–నూతన సృష్టిచేసినపుడు అలాంటి కావ్యాన్ని సమీక్షించాలనుకున్నపుడు 'ఆలంకారిక విమర్శ' కుదరదు. ఎందుకుంటే ఆలంకారిక నియమాల

ననుసరించి రాయబడలేదు కాబట్టి అది 'అసద్గ్రంథం' అని తేల్చే ప్రమాదం ఉంది. అదే స్వతంత్రవిమర్శను అనుసరిస్తే ఆ గ్రంథం ఉత్తమోత్తమత్వాన్ని నిరూపించవచ్చు.

కావ్యాన్ని ఉన్నదున్నట్లుగా గ్రహించి విషయ పరిశీలన చేసే ఈ స్వతంత్ర విమర్శ ఆధునిక కాలంలో ఆదరణీయం అయి చాలా విమర్శలకు పుట్టినిల్లు అయింది. స్వతంత్ర విమర్శకావ్యానుశీలన పద్ధతికి (Evaluation Criticism) దారితీసింది.

స్వతంత్ర బుద్ధితో కావ్యాన్ని పరిశీలించే స్వతంత్రపద్ధతి అటు అనువర్తిత విమర్శగాను (applied criticism) ఇటు వర్ణనాత్మక విమర్శ (descriptive criticism) గాను విస్తరించింది. కావ్యవిమర్శ విమర్శకుని అభిరుచిని అనుసరించి ప్రవర్తిల్లినపుడు అది అభిరుచి విమర్శ (Impressionstic Criticism) అయింది. విషయపరిశీలన ప్రధానంగా వస్త్వాశ్రయరీతిలో సాగినపుడు Practical Criticism గా, New Criticism గా పేరు గాంచాయి.

**6.3. నైతిక విమర్శ:** దీనినే ఆంగ్లంలో 'moral approach' అంటారు.

నీతి సంబంధం అయిన ఆదర్శాల్ని ఆధారంగా తీసుకొని సాహిత్యాన్ని విమర్శిస్తే అది 'నైతిక విమర్శ' అవుతుంది. మానవుడు జీవితంలో ఏయే అంశాల్ని ప్రధానంగా, ఉత్తమంగా భావిస్తాడో ఆ అంశాలన్నీ నైతికాంశాలు అవుతాయి.

ప్రాచీనకాలంలో ప్లేటో తర్వాతి కాలంలో సర్‌ఫిలిప్ సిడ్నే, రస్కిన్, మేథ్యూ ఆర్నాల్డ్, తా॥జాన్సన్ ఇర్వింగ్ బాబ్బిడ్, టి.యస్.ఇలియడ్ లాంటి కవులు, విమర్శకులు నైతిక విమర్శ విధానానికి పెద్దపీట వేశారు.

భారతీయ ఆలంకారికులు కూడా సాహిత్య రచనలో ఈ నైతిక దృక్పథాన్ని అంగీకరించారు. 'రాముని లాగా ప్రవర్తించు రావణుని లాగా కాదు' (రామాదివత్ వర్తితవ్యం-న రావణాదివత్ అని మూలం) కావ్యప్రయోజనాల్లో ఉపదేశ పరత్వాన్ని మమ్మటాది ఆలంకారికులు అంగీకరించారు.

నైతిక విమర్శకుల ప్రధాన లక్ష్యం మానవ జీవితంలోని నైతిక విలువలు కావ్యంలో ప్రతిఫలించాయా లేదా అని చూడటమే. క్రమస్థితి, క్రమశిక్షణ, సంయమనం లాంటి మానవతా లక్షణాల్ని ప్రబోధించే సాహిత్యమే మంచి సాహిత్యం అని వారి భావన.

పాల్ ఎల్‌నూర్‌మోర్ అనే విమర్శకుడు నైతిక విలువలకు మతాన్ని ముడిపెట్టాడు. నైతిక భావాలకు వ్యతిరేకం అయిన కవిత్వం జీవితానికి విరుద్ధమైన కవిత్వమని, నైతిక విమర్శను చక్కగా నిర్వచించారు.

**6.4. మనస్తత్వ విమర్శ :-** దీనినే Psychological approach అని Psyco-analytical study అని ఆంగ్లంలో పిలుస్తారు. ఫ్రాయిడ్, యాంగ్, అట్లర్ మొదలైన మనస్తత్వ శాస్త్రజ్ఞుల సిద్ధాంతాలకు ఆధునిక సాహిత్య ప్రపంచంపై అపరిమిత ప్రభావం ఉంది.

ప్రకృతి లేక స్వాభావికవాదం (naturalism) మానవుణ్ణి అస్వతంత్రునిగా, బాహ్య పరిస్థితులకు, పాశవికప్రవృత్తులకు దాసునిగా చిత్రీకరిస్తుంది. ఈ ప్రకృతి వాదానికి ఫ్రాయిడ్ సిద్ధాంతాలు శాస్త్రీయ పరిభాషని కల్పించాయి. పాశవిక ప్రవృత్తుల్ని శాస్త్రీయంగా సమన్వయించాయి.

ఈ మనస్తత్వశాస్త్రం ఆధారంగానే చాలామంది విమర్శకులు పూర్వ గ్రంథంలోని పాత్రల మనోధర్మ వైపరీత్యాన్ని సమన్వయించారు. ఉదా॥ హామ్లెడ్ మనస్తత్వాన్ని ఫ్రాయిడ్ సిద్ధాంత ఆధారంగా Oedipus complex గా వ్యాఖ్యానించబడింది.

మనస్తత్వ విమర్శ ద్వారా సాహిత్యాన్ని విమర్శించడం వల్ల కొన్ని లాభాలున్నాయి

1. సృజనాత్మకమైన కళను వివరించడంలో సునిశ్చితం అయిన పరిభాష లభిస్తుంది.

2. కవి జీవితానికి అతని గ్రంథానికి ఉండే సంబంధాన్ని శాస్త్రీయంగా నిరూపించవచ్చు - ముఖ్యంగా ఆత్మాశ్రయ కవిత్వానికి ఇది చక్కగా అన్వర్తిస్తుంది.

3. మనస్తత్వ విమర్శ ద్వారా కల్పితపాత్రల మనస్తత్వాన్ని వివరించగలం.

అయితే - 'మనస్తత్వ విమర్శ'ను అన్ని చోట్లా అన్వయించడం కుదరదు. సాహిత్య జగత్తుకు స్వప్న జగత్తుకు భేదం ఉంది. ఎలాగంటే - మానవుడు నిద్రావస్థలో ఉన్నపుడు వచ్చే కలల్ని అదుపులో పెట్టుకోలేడు. కానీ, సాహిత్య సృష్టిలో కవికి సంపూర్ణ అధికారం ఉంది. కవి తన కావ్యంలోని పాత్రల్ని తన ఇష్టం వచ్చినట్లు సృష్టించగలడు - ప్రవర్తింపజేయగలడు. అంటే, కావ్య జగత్తు కవికి అధీనం అన్నమాట. అందువల్ల ప్రతి కావ్యంలోనూ కవి జీవితానికి, ఆత్మీయతకు ముడిపెట్టలేం.

**6.5. సాంఘిక విమర్శ** :- దీనినే Sociological approach అని ఆంగ్లంలో పిలుస్తారు. ఏ కాలంలోని కవి మీద అయినా ఆనాటి దేశ-కాల-సంఘ పరిస్థితులు ప్రభావం చూపుతాయి. ఆ ప్రభావాల్ని ఆధారంగా చేసుకొని చేసే విమర్శ సాంఘిక విమర్శ' అవుతుంది. కవి ఏ సంఘంలో, ఏ దేశంలో, ఏ కాలంలో పుట్టి పెరుగుతాడో ఆ సంఘ ప్రభావం, ఆ దేశ ప్రభావం, ఆ కాలప్రభావం అతని కావ్యరచనపై ఉంటాయి. ఆ ప్రభావాలు స్పష్టంగానో, అస్పష్టంగానో కనిపిస్తుంటాయి. ఆ ప్రభావాలు అటు ప్రత్యక్షం కావచ్చు లేదా పరోక్షం కావచ్చు.

ఫ్రాన్సు దేశస్థుడయిన, Jaine అనే పండితుడు ఈ సాంఘిక విమర్శను ప్రతిపాదించాడు. కాలం, సంఘం, పరిసరాలు అనే వాటి ఫలమే వాఙ్మయం' అనేది ఆయన సిద్ధాంతం. ఈ మూడింటికి 'ఉత్పత్తి విధానం' అనే నాలుగో అంశం బోధించి మార్క్స్, ఎంగెల్స్- మార్క్సిస్టు విమర్శను రూపొందించారు.

అయితే, సాంఘిక విమర్శ కూడా అన్ని కావ్యాలకు అన్వయించలేం. దేశకాలాదుల ప్రభావం ఎక్కువమంది కవుల మీద ఉండగా - వాటి మీద తమ ప్రభావం చూపగలిగిన కవులు కూడా ఉంటారు. అలాంటి కవుల కావ్యాలకు సాంఘిక విమర్శను వర్తింపజేయడం కుదరదు.

**6.6. కళాత్మక విమర్శ** :- దీనికి Aesthatic criticism, Textual criticism, New criticism అనే పేర్లున్నాయి. దీనిని తెలుగులో 'నవ్య విమర్శ' అని కూడా అంటారు. ఆధునిక కాలంలో ఈ విమర్శకు ఎక్కువ ప్రచారం ఉంది.

'కళను కళాదృష్టితోనే విమర్శించాలి' కానీ దానిని మత, సాంఘిక, రాజకీయ, నైతిక భావ వ్యక్తీకరణల ఆధారంగా విమర్శించరాదని ఈ విమర్శకుల సిద్ధాంతం.

కావ్య నిర్మాణంలో సౌందర్య సంపాదకాలైన ఏయే గుణాలు, ఏయే సంబంధాలు కావ్యంలో ఉంటాయో - ఆయా గుణాలు, ఆయా సంబంధాల అనుభవం, సంపూర్ణ అవగాహనే కావ్య సమీక్ష. ఇది కళా విమర్శకుల సిద్ధాంతం.

ఈ కళావిమర్శ ముఖ్యంగా అంతర విశ్లేషణను (internal analysis) మాత్రమే అంగీకరిస్తుంది. సాంఘీకం, నైతికం, ఆధ్యాత్మికం మొ॥న అంశాలతో దీనికి సంబంధం లేదు.

కవి కావ్యజగత్తు, సృష్టిలో బ్రహ్మ, కావ్య సృష్టిలో అతడు సర్వతంత్ర స్వతంత్రుడు. అతని యిష్టం వచ్చినట్లు కావ్యం నడుస్తుంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని చేసే విమర్శ కళా విమర్శ. దీనిని Inductive criticism గా కూడా చెప్పుకోవచ్చు.

**6.7. పౌరాణిక విమర్శ** : దీనినే ఆంగ్లంలో Archetypal approach అంటారు. 'arche type' అంటే 'నమూనా' అని అర్థం. కళానిర్మాణంలో ఉండే మౌలిక సాంస్కృతిక రూపాన్ని అంటే basic cultural pattern ని ఇది నిరూపిస్తుంది.

పౌరాణిక విమర్శకు మూలాధారం 'యూంగ్' అనే మనస్తత్వవేత్త స్థాపించిన సామూహిక అవ్యక్త చేతన (collective unconscious) అనే సిద్ధాంతం. ఫ్రేజర్ (Trazer) అనే మేధావి మానవశాస్త్రంలోని పరిశోధన పౌరాణిక విమర్శకు మరింత బలాన్నిచ్చింది.

పౌరాణిక విమర్శ ఒక జాతి యొక్క సామూహిక అవ్యక్త చేతనకు సంబంధించి ఉంటుంది. సాంఘికంగా గాని, సాంస్కృతికంగా గానీ ఒక జాతి పూర్వస్థితి దీనిలో పరిశీలింపబడుతుంది. సాహిత్య విలువలు కాల నిబద్ధాలు కావని ఈ విమర్శ నిరూపిస్తుంది.

మౌలిక రూపాలు లేదా నమూనాలు పురాణగాథలు, జానపద గేయాలు, స్వప్నాలు మొ॥న వాటిలో సంకేత రూపంలో అభివ్యక్తం అవుతాయి. పురాణగాథల్లో కనిపించే సంకేతాలు ఏ మౌలిక రూపానికి సంబంధించినవో తెలుసుకోవటం పౌరాణిక విమర్శ లక్ష్యం.

కొన్ని రచనలు మనకు ఎందుకు ఆకర్షణీయాలుగా ఉంటాయో కారణాల్ని ఈ విమర్శ తెలుపుతుందని, సాహిత్య విలువల్ని ఇది నిరూపించలేదని కొందరు విమర్శకుల అభిప్రాయం. విమర్శకుని కల్పనా సామర్థ్యం తెలుస్తుందే గానీ, కావ్య సత్యస్వరూపం వ్యక్తం గాదని మరికొందరు అభిప్రాయపడ్డారు.

**6.8. లక్షణ విమర్శ** : దీనినే ఆంగ్లంలో Legislative Criticism అంటారు. లక్షణ విమర్శ కవులకు మార్గదర్శకంగా కావ్యలక్షణాల్ని ప్రతిపాదిస్తుంది. అంతేగాక శాశ్వత సాహిత్య ప్రమాణాల్ని నిర్దేశిస్తుంది. శాసనసభలో ఎలాగైతే పరిపాలనా విధానాన్ని నిర్ణయించే శాసనాల్ని రూపొందిస్తామో అలాగే ఈ విమర్శ కావ్యరచనా విధానాన్ని నిర్ణయించే సూత్రాల్ని నిర్దేశిస్తుంది. కాబట్టి దీనికి లక్షణ విమర్శ అనేపేరు వచ్చింది. ఉదా॥ సంస్కృత భాషలోని అలంకార శాస్త్రాలు ఇంగ్లీష్ మొ॥న పాశ్చాత్య భాషల్లోని సాహిత్య శాస్త్రాలు ఈ కోవకు చెందినవే.

**6.9. సూత్ర విమర్శ**: దీనినే ఆంగ్లంలో Theoritical Criticism అంటారు. లక్షణ విమర్శ శాశ్వత ప్రమాణాల్ని ప్రతిపాదిస్తుంది. – కాగా 'సూత్రవిమర్శ' ప్రక్రియకు సరిపోయే సాపేక్ష సిద్ధాంతాల్ని ప్రతిపాదిస్తుంది. స్వతంత్ర బుద్ధిగల కవులు చేసే కావ్యచర్చలో ఇలాంటి సూత్రాలు కనిపించడం సహజం.

తెలుగు సాహిత్యంలో నన్నయ, తిక్కన నాచన సోమనాది కవులు తమ కావ్య అనుశీలనకు అనువైన సాపేక్ష ప్రమాణ సూత్రాల్ని పేర్కొన్నారు. అందువల్ల ప్రాచీనాంధ్ర కవుల కావ్యావతారికలో, ఆశ్వాసాంత గద్యలు మొ॥న వాటిలో సూత్రవిమర్శ చోటుచేసుకుంది. ఇది ఆధునిక కవుల సాహిత్యంలో కూడా కనిపిస్తుంది.

**6.10. కవి జీవిత విమర్శ** (Biographical criticism): ఏ కాలంలో కవి అయినా – ఏ ఇతివృత్తం అయినా కవి ఆత్మీయత అతని రచనలో కొద్దోగొప్పో ప్రతిఫలించక మానదు. అందువల్ల కవి జీవితాన్ని పరిశీలిస్తే అతని కావ్యతత్త్వం తెలుసుకోవడం సుగమం అవుతుంది. కవి జీవితానికి కావ్యరచనకు ఉండే సంబంధాన్ని పరిశీలించి, వాటిని సమన్వయించడం "కవి జీవితవిమర్శ" అవుతుంది. దీనినే 'కవి జీవిత సాహిత్య విమర్శ" అని కూడా అంటుంటారు.

కవి వ్యక్తిత్వం అతని జీవితంలోని భౌతిక, మానసిక, తాత్త్విక విశేషాలు అతని కావ్యంలో ఎలా ప్రతిఫలిస్తాయో దీనిలో విశదీకరించబడతాయి. అయితే తెలుగులో అన్నమయ్యలాంటి ఏ కొద్దిమందో కవులకు తప్ప ఇతర కవుల జీవిత విశేషాలు మనకు

తెలియవు. అందువల్ల ఈ విమర్శను ప్రాచీన కవుల సాహిత్యం విమర్శించేందుకంటే – ఆధునిక సాహిత్యకారుల సాహిత్యాన్ని విమర్శించడానికి ఉపయోగించుకోవచ్చు.

**6.11. చారిత్రక విమర్శ** : దీనినే ఆంగ్లంలో **Historical Criticism** అంటారు. కవి జీవిత విమర్శకు తోడుగా నిలిచే విమర్శ చారిత్రక విమర్శ' కవి కాలనిర్ణయం, జన్మస్థల చర్చలు, గ్రంథాల పౌర్వాపర్యం మొదలైన అంశాల నిర్ధారణకు ఇది దోహదం చేస్తుంది. కవి జీవితాన్ని ప్రభావితం చేసేవి అతని దేశకాల పరిస్థితులు కాబట్టి యుగలక్షణ విమర్శతో కావ్యవిమర్శ కావించడం సబబే.

సమకాలంలోని మత, సాంఘిక, రాజకీయ పరిస్థితులు కావ్యరచనకు ఎలాదోహదం చేశాయో – అవి ఆ కవి రచనలో ఏమేరకు ప్రతిబింబించాయో చారిత్రక విమర్శ నిర్ధారిస్తుంది. ఉదా॥ విజయనగర చరిత్ర మనకు బాగా తెలిసి ఉంటే కృష్ణరాయల ఆముక్తమాల్యదలోని రాజకీయ, సాంఘీక, మతఅంశాలు మనకు అంత బాగా బోధపడతాయి.

తెలుగులో కవుల కాలనిర్ణయం, జన్మస్థలనిర్ణయం, కర్తృత్వ నిర్ణయం, కావ్యాల పౌర్వాపర్యం విషయాలు 'కవిజీవిత చరిత్రలు' సాహిత్య సమీక్షలో ఎన్నో చోటుచేసుకున్నాయి.

**6.12. తులనాత్మక విమర్శ** : దీనినే Comparative criticism అని ఆంగ్లంలో పిలుస్తారు.

ఏ రచయితపైన అయినా పూర్వకవుల అభిప్రాయం ప్రసరించడం సహజం. ప్రతిభావంతులైన కవి తర్వాతి తరాల కవులకు మార్గదర్శకుడు అవుతాడు.

సాహిత్యలోకంలో ఒక కవి స్థానాన్ని నిర్ణయించడానికి, కావ్యతత్వాన్ని నిరూపించడానికి తులనాత్మక విమర్శ దోహదపడుతుంది.

ఒక యుగంలోని కవుల్ని గానీ, ఒక పక్రియను అవలింభించిన కవుల్ని గానీ, ఒకే వస్తువును స్వీకరించిన కవుల్నిగానీ తారతమ్యం నిరూపిస్తూ పరిశీలించడమే తులనాత్మక విమర్శ. ఈ విమర్శ ద్వారా వివిధ భాషా కవుల రచనల్లోని సామ్య వైషమ్యాల్ని కూడా నిరూపించవచ్చు. ఉదా॥ తెలుగులో నన్నయ రచనా విధానం మార్గకవులకు, పాల్కురికి సోమన విధానం దేశీకవులకు మార్గదర్శకం అయింది. అలాగే వసుచరిత్ర తర్వాతి ప్రబంధ కవులకు ఒరవడి అయింది.

**6.13. పరిష్కరణ విమర్శ** : దీనినే Textual criticism అని కూడా అంటారు. దీనికే గ్రంథ పరిష్కార అని మరోపేరు.

పరిష్కరించబడిన కావ్యమే సాహిత్య విమర్శకు మూలాధారం. వివిధ ప్రతుల్ని సమీకరించి, వాటిలో మూలప్రతిని నిర్ణయించడం లేదా శుద్ధ ప్రతిని రూపొందించడం పరిష్కరణ విమర్శ లక్ష్యం. కవి హృదయాన్ని అవగాహన చేసుకోడానికి ఈ విమర్శ దోహదపడుతుంది. అటు లిఖిత రూపంలోనున్న – ఇటు ముద్రిత రూపంలో నున్న – ప్రాచీన అర్వాచీన ప్రతుల్ని సేకరించి– వాటిని జాగరూకతతో అధ్యయనం చేసి పాఠనిర్ణయం చేయడం పరిష్కర్త కర్తవ్యం. పీఠిక, వివరణ (Notes) ల్లో పరిష్కర్త విమర్శ కాభిప్రాయులు ద్యోతకం అవుతాయి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం–తెలుగుశాఖ వారి ఆంధ్రమహాభారత పరిష్కరణలో, తాళ్లపాక పెద తిరుమలయ్య భగవద్గీతకు ఆచార్య జి.యన్.రెడ్డి రచించిన పఠికలు పరిష్కరణ విమర్శకు ప్రమాణాలు.

**6.14. ప్రకృతివాద విమర్శ**: దీనినే naturalist movement in criticism అంటారు. చార్లెస్ డార్విన్ పరిణామవాదం (Theory of evolution) ఈ విమర్శకు పునాది. మానవస్వభావాన్ని వంశపారంపర్య లక్షణాలతోను, పరిసర ప్రభావాలతోను పరిశీలించవచ్చునని

ఈ విమర్శ తెలుపుతుంది.

ప్రకృతి వాదంలో నవలలు రచించిన వారిలో జోలా (zola) మొ॥నవారు పాత్రల్ని అనువంశిక లక్షణాల్తో చిత్రించి, పరిసరాల ప్రభావంతో ఆ పాత్రలు పొందే సహజ పరిణామాల్ని వర్ణించి, ప్రకృతివాద రచనగా వెలయించారు.

ప్రకృతివాదం సామాజిక అవగాహనకు తోడ్పడింది. మధ్యతరగతి ఉద్యోగస్థుల, కార్మికుల సామాన్య జీవన వ్యవస్థల్లో కనబడే కష్టనిష్ఠూరాల్ని వాస్తవంగా చిత్రించే యత్నం చేసింది. ఈ విమర్శ కూడా అదే పథంలో నడిచింది. కానీ మానవతావాద విమర్శకు గురై క్రమంగా తగ్గుముఖం పట్టింది.

**6.15. ప్రతీకవాద విమర్శ లేదా ప్రతీకాత్మకవాద విమర్శ** : ఈ వాదం మొదట ఫ్రాన్సులో సంగీత, చిత్రలేఖనం లాంటి కళలకు అన్వయించబడి – తర్వాతికాలంలో సాహిత్య కళలకు కూడా విస్తరించింది. ఫ్రెంచి ప్రతీకవాదుల్లో 'బోద్లేర్' ఈ విమర్శను గురించి ఇలా అంటాడు. కళాకారుడు ప్రకృతిని అనుకరించకుండా, నిత్యజీవితంలోని భావచిత్రాన్ని ఎన్నుకొని, తన దృక్పథాన్ని వాటి ద్వారా అభివ్యక్తీకరించాలని, అప్పుడు బ్రతుకే ఒక ప్రతీకగా భావిస్తుందని ఆయన మాటలు.

'మలార్మే' అనే పండితుడు ఇలా అంటాడు. 'ప్రతీక' అనేది బహురూప అభివ్యక్తిని ఇచ్చే భావచిత్రం ఆలోచనకు అభివ్యక్తి–భావోద్రేకశక్తి – ఒక తత్వానికే ప్రతీక అని ఆయన భావం.

పాశ్చాత్య దేశాల్లో వెలువడిన ఈ ప్రతీకవాదం శబ్దానికి భావప్రకటనం ప్రధానం కాదని, సూచనే ప్రధానలక్షణం అని, వాతావరణకల్పనే ప్రధానలక్షణం భావించింది.

ఉదా॥ ప్రతీకవాదులు వెలుతుర్ని జ్ఞానానికి, చీకటిని అజ్ఞానానికి, వసంతాన్ని జన్మకు, శిశిరాన్ని మృత్యువుకు ప్రతీకలుగా స్వీకరించారు.

ప్రతీకవాదులు ప్రయోగించిన ప్రతీకల్ని అర్థం చేసుకుంటే ఆనందం కలుగుతుంది. లేకపోతే అయోమయం ఏర్పడుతుంది. ప్రతీకవాదం దూరం కావడానికి కారణం దానిలోని అస్పష్ట అభివ్యక్తే. కవితలోని ప్రతీకల పరమార్థవిచారమే ప్రతీకవాద విమర్శకు ప్రాణం.

**6.16. మార్క్సిస్టు విమర్శ** (Marxist criticism) : మార్క్సు, ఎంగెల్స్ ప్రతిపాదించిన గతితార్కిక భౌతికవాదం (dialectical materialism) ఆధారంగా 19 శతాబ్దంలో విలసిల్లిన వాస్తవ విమర్శ నుండి 20వ శతాబ్దంలో మార్క్సిస్టు విమర్శ ఉద్భవించి, విస్తరించింది. సామ్యవాద వాస్తవికత (Socialist realism) దీనికి ప్రాతిపదిక.

సమాజం యొక్క వర్గసహితత్వం – వర్గాల విభిన్న స్వభావాలు, వర్గాల నిరంతర సంఘర్షణ, మార్క్సీయ పరిణామరీతి, సామాజిక పరిస్థితుల్లో కనిపించే హేతుత్వం లాంటి అంశాలేకాక వీటికి పునాదులైన వస్తుఉత్పత్తులు, ఉత్పాదక శక్తులు, వాటిలో మార్పులు ఆర్థిక మౌలికత మొ॥న మార్క్సిస్టు సిద్ధాంతంలోని సర్వ అంశాలు ఈ విమర్శలో చోటు చేసుకుంటాయి.

అన్ని అంశాల్నీ భౌతిక దృష్టితో చూడడం, అవగాహనకు చారిత్రక దృష్టి కలిగి ఉండడం మార్క్సువాదంలో ప్రధాన లక్షణాలు. మరో ప్రధాన లక్షణం అనువర్తనకు గతితర్క దృష్టి కలిగి ఉండడం. ఇలాంటి అంశాలన్నీ సాహిత్య విమర్శలో ప్రమాణాలుగా తీసుకున్న విమర్శే మార్క్సిస్టు విమర్శ.

శాస్త్రం, మతం, రాజకీయం, న్యాయవ్యవస్థ, కళలు – అన్నీ సామాజిక చైతన్య రూపాలే కాబట్టి అవి పరస్పరం ఒకదానిపై

మరొకటి. ప్రభావం చూపుకుంటుంటాయి. సాహిత్యం కళల్లోనిది. సౌందర్యదృష్టి, కళలు శ్రమ నుండి ఆవిర్భవించాయి. శ్రామికవర్గం చైతన్యం కావడం, తిరుగుబాటు, విప్లవాదుల ద్వారా సామ్యవాద సమాజ స్థాపన, దానికి తగిన దోహదీకరణం మొ॥న పూర్వనిర్ణయాల్లో మార్క్సిస్టు సాహిత్య విమర్శ సాగుతుంది.

మార్క్సిస్టు విమర్శలో ప్రధానాలుగా చెప్పబడే సాహిత్యేతర ప్రమాణాల్ని పెట్టుకుని చూసినపుడు దానికి సాహిత్య తత్వ నిర్ణాయక శక్తిలేదని విమర్శకుడు ఈ విమర్శను తప్పుబట్టారు. అంటే–సాహిత్యతత్త్వం సాహిత్య దర్శనం వల్ల, సాహితీ ప్రమాణాల్తో విలువల్ని వివేచించే విమర్శ విధానాల వల్లనే తెలియబడుతుందని వారి వాదన.

స్థూలంగా చూసినపుడు సాహిత్య విమర్శలో వివిధ విధాలున్నట్లు గోచరించినా వాటిలో ఒకదానితో ఒకటి పరస్పర సంబంధం కలిగి ఉన్నట్లు తేలుతుంది. ఉదా॥కు చారిత్రక విమర్శలో కవి జీవిత విమర్శ, స్వతంత్ర విమర్శలో ఆలంకారిక, సూత్ర విమర్శలు మిళితమై ఉంచవచ్చు.

పై విమర్శ భేదాల్ని పరిశీలించినపుడు సాహిత్య విమర్శకుడు తాను ఏ గ్రంథాన్ని విమర్శించాలనుకుంటాడో, దానిలో ఏ కోణాల్ని స్పృశించాలనుకుంటాడో స్పష్టంగా తెలుసుకొని ఆ అంశాలకు తగిన విమర్శ విధానాన్ని ఎన్నుకోవడం సముచితం అని చెప్పవచ్చు.

## 6.17 నమూనా ప్రశ్నలు

1. ప్రాచ్యపాశ్చాత్య విమర్శ భేదాలను తెలియజేయండి.
2. విమర్శలోని భేదాలను వివరించండి.

## 6.18. ఆధార గ్రంథాలు:-


1. సాహిత్యదర్శనం : ఆచార్య కాకర్ల వేంకటరామ నరసింహం
2. తెలుగులో సాహిత్య విమర్శ : ఆచార్య యస్.వి.రామారావు
3. పాశ్చాత్య సాహిత్య విమర్శ–చరిత్ర– సిద్ధాంతాలు : శ్రీ వదిలి మందేశ్వరరావు
4. తెలుగు సాహిత్య విమర్శ : డా॥ వెలమల సిమ్మన్న


– ఆచార్య పి. నరసింహా రెడ్డి

పాఠం - 9

# రస సిద్ధాంతము

**విషయక్రమము :**


**9.1.** పరిచయం

**9.2.** రసశబ్ద అర్థ విచారం

**9.3.** రసం - నిర్వచనం

**9.4.** రసానందం అంటే ఏమిటి ?

**9.5.** రస సూత్రం - వివరణ

**9.6.** రసం - భావాలు - విభజన

**9.6.1** విభావం

**9.6.2** అనుభావం

**9.6.3** వ్యభిచారి భావం

**9.6.4** సాత్త్విక భావం

**9.7.** మాదిరి ప్రశ్నలు

**9.8.** ఆధార గ్రంథాలు


## 9.1. పరిచయం :

భారతీయ కావ్యసిద్ధాంతాల్లో, ప్రప్రథమమైంది రస సిద్ధాంతం. కావ్యానికి ఆత్మ ఏది అనే విషయంపై ప్రాచ్య ఆలంకారికులు శతాబ్దాల తరబడి ఎన్నెన్నో చర్చలు చేశారు. వీటిలో ప్రధానమైన సిద్ధాంతాలు ఆరు వున్నాయి. అవి : 1. రసం 2. అలంకారం 3. రీతి 4. ధ్వని 5. వక్రోక్తి 6. ఔచిత్యం. ఈ ఆరింటిలో రస సిద్ధాంతమే ఉత్తమమైందిగా అలంకారికులు నిర్మించారు.

విశ్వసాహితీ జగత్తులో భారతీయాలంకారికులు కావ్యమీమాంసకు ప్రసాదించిన విశిష్ట వివేచన సిద్ధాంతం రససిద్ధాంతం. రస సిద్ధాంతం ప్రవక్త భరతుడు. ఇతడు క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందినవాడని మానవల్లి రామకృష్ణ కవి చెప్పాడు. మనకు తెలిసినంత వరకు మొట్టమొదటి 'నాట్యశాస్త్రం' భరతునిదే. ఇందులో 37 అధ్యాయాలున్నాయి. 6వ అధ్యాయం రసభావ చర్చకు సంబంధించింది.

సమస్త మానవ కోటి జీవన ధ్యేయం, గమ్యం అనందానుభూతి. ఈ ఆనంద స్వరూపాన్వేషణలో అతడు ఎన్నెన్నో మజలీల్ని అధిగమించాడు. ఎన్నెన్నో కొత్త పుంతల్ని తొక్కాడు. ఆ నిరంతర ఆనందవేషణ ఫలితమే సౌందర్యం. సౌందర్యారాధన అనేది ఆనంద స్థితికి ప్రథమ సోపానమని ఆలంకారికులు గుర్తించారు.

## 9.2. రసశబ్ద అర్థవికాసం :

భారతీయ వాఙ్మయంలో ప్రాచీనమైన రస శబ్దం ఒకటి. 'రసం' అనే పదం ఆయా కాలాల్లో అనేక అర్థాల్లో వాడబడింది. ఈ పదం ఋగ్వేదంలో సోమరసం, జలం, పాలు అనే అర్థాల్లోనూ, అధర్వణ వేదంలో నది, రుచి అనే అర్థాల్లోనూ, ఉపనిషత్తుల్లో సారం అనే అర్థంలో వాడబడింది. ఔషధశాస్త్రంలో పాదరసం, వేదాంత శాస్త్రంలో ఆత్మ, పదార్థం అనే అర్థాల్లో వాడబడింది.

లోకంలో పానకం వంటి ద్రవ్య విశేషాలు అని అర్థం. అయితే అలంకారికులు చెప్పిన రసం ఏమంటే నాటక, కావ్య - కళా రసం. ఈ రసాన్ని సహృదయుడు అనుభవిస్తాడు.

## 9.3. రసం - నిర్వచనం :

ఏ భావం పుష్టి చెంది చిరకాలం చిత్తంలో వుంటుందో, ఏది అలౌకికమైన ఆనందాన్ని కలిగిస్తుందో, ఏది హృదయాన్ని ద్రవింపచేస్తుందో అది రసం అని అలంకారికులు చెప్పారు.

ఏదైన ఒక కమనీయ కావ్యంలోని మధురాతి మధురమైన పద్యాలు చదివినపుడుకానీ, ఒక గొప్ప నాటకాన్ని చూసినప్పుడుగానీ లేదా మనోహర గాన మాధుర్యం ఒకడు వినిపించినప్పుడు కానీ మన మనసుకు ఒక విధమైన హాయి కలిగి అలౌకికమైన ఆనందాన్ని పొంది, పరవశత్వం చెందుతాం. ఈ అలౌకికమైన ఆనందాన్ని కలిగించే భావ స్వరూపానికే రసం అని పేరు.

## 9.4. రసానందం అంటే ఏమిటి ?

ఆనందంగా పరిణమించిన భావాన్ని సహృదయుడు ఆస్వాదించి, మైమరచిపోవడమే రసానందం అనుభవించడం లేదా రస సిద్ధి పొందడం అని చెప్పవచ్చు.

రసానందం బ్రహ్మానంద సహోదరం, లోకోత్తర చమత్కార భాజనం, విగళిత వేద్యాంతరం, అనిర్వచనీయం, వాచామగోచరం, అని పెక్కు విధాలుగా అలంకారికులు వివరించారు.

## 9.5. రస సూత్రం - వివరణ :

**ఎ. భరతుడు - నాట్యశాస్త్రం :** రససూత్రం గూర్చి మొట్టమొదట చెప్పిన భారతీయ అలంకారికుడు భరతుడు.

**'విభావానభావ వ్యభిచారీ సంయోగాద్రస నిష్పత్తిః'**

విభావాలు, అనుభవాలు, వ్యభిచారి భావాలు వీటి యొక్క చక్కని కలయిక వల్ల రసం నిష్పన్నమవుతుందని భరతుడు చెప్పాడు.

రస సిద్ధాంతానికి మూలం భరతుడు చెప్పిన ఈ రస సూత్రమే. అయితే భరతుడు ఈ సూత్రంలోని సంయోగ, నిష్పత్తి అనే పదాల అర్థాల్ని గూర్చి ఎక్కడా వివరించలేదు. అందువల్లే అలంకారికులు ఈ పదాల అర్థాల గూర్చి వారి వారి సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యాఖ్యానించారు.

ఏది ఏమైనప్పటికీ రస సూత్రాన్ని గూర్చి స్పష్టంగా, సుస్పష్టంగా, సంక్షిప్తంగా, సులభంగా, క్లుప్తంగా, నిర్దుష్టంగా నిర్వచించింది నాటికీ నేటికీ భరతుడు ఒక్కడే.

### బి. ధనంజయుడు - దశరూపకం :

భరతుని రససూత్రాన్ని ఆధారంగా చేసుకొని ధనంజయుడు తన 'దశరూపకం' లో రసాన్ని గూర్చి నిర్వచించాడు.

**"విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభి చారిభిః**
**ఆనీయమానః స్వాదుత్వం స్థాయీ భావోరసస్మృతః"**

విభావ, అనుభావ, సాత్త్విక, వ్యభిచారి భావాలచేత ఆస్వాద యోగ్యతను పొందింపబడిన (అనుభవించబడిన) స్థాయి భావమే రసం అని చెప్పాడు. పాఠకులు లేక సామాజికుల హృదయాల్లో వున్న స్థాయియే రసం. కావ్య జనితమయిన మనోభావమే స్థాయి భావం. అదే విభావాది 'సాధన సామగ్రి'తో కలిసి రసంగా వెలుగొందుతుంది.

రస సూత్రాన్ని గూర్చి హేమచంద్రుడు 'కావ్యా సుశాసనం' లోనూ విశ్వనాథుడు 'సాహిత్య దర్పణం'లోనూ వివరించారు. అయితే విశ్వనాథుడు, హేమచంద్రులు సాత్త్విక భావాల్ని చెప్పలేదు. దీనికి కారణం అవి అనుభావ రూపాలవడమే.

సహృదయునిలో వాసన రూపంలో కొన్ని భావాలు దాగి వుంటాయి. ఒక కావ్యాన్ని చదివేటప్పుడు, శబ్దశక్తి చేత అవి ఉద్బిన్నాలై బాగా పోషించబడతాయి. చక్కగా పోషించబడిన ఆ సాత్త్విక భావాలచే రసం అభివ్యక్తమై ఆనందాన్ని కలుగజేస్తుంది. ఈ రసానుభావం అనేది అనుభవ సాక్షికమైంది. దీన్ని సహృదయుడు అచ్చంగా అనుభవిస్తాడు. దీన్ని 'అభివ్యక్తివాదం' అంటారు. దీన్ని ప్రతిపాదించినవాడు అభినవగుప్తుడు.

మొత్తం మీద తేలిన సారాంశం ఏమంటే రససూత్రంలో **4** భావాలు వుంటాయి. అవి ఇవి **1.** విభావం **2.** అనుభావం **3.** వ్యభిచారి భావం / సంచారి భావం **4.** సాత్త్విక భావం.

భావం అంటే చిత్త వృత్తి విశేషం. ఇది కావ్యార్థాన్ని సహృదయులచే ఆస్వాదింపచేస్తుంది. ఈ నాలుగు భావాల్లో మొదటి రెండు భావాలు కావ్యంలో వుంటాయి. మిగిలిన రెండు భావాలు ప్రేక్షకులలో వుంటాయి. మొత్తం ఈ నాలుగు భావాల్ని 'రస సాధన సామాగ్రి' అని అంటారు.

**విభావం - మనుష్యులు / మానవులు**

(i) మనిషి

(ii) ప్రకృతి లోని వెన్నెల, సముద్రం, తోట, తుమ్మెద మొ॥

- అనుభావం - మానవుల చేష్టలు
- వ్యభిచార భావం - మనసు యొక్క ఉపరితంలోని కదలికలు
- స్థాయి భావం - జీవ సంపుటిలో సంస్కార రూపంలో వాసనా రూపంలో వున్న సూక్ష్మభావాలు.

## 9.6. రసం - భావాలు - విభజన :

## రసం - భావాలు - విభజన

- I. విభావం
  - ఆలంబన విభావం
  - ఉద్దీపన విభావం
- II. అనుభావం
  - ప్రయత్న పూర్వక చేష్టలు, సంభాషణాదులు
  - అప్రయత్న పూర్వకంగా కలిగే స్వేదాదులు
- III. వ్యభిచారి భావం/ సంచారి భావం/
  - ఇవి ముప్పయి మూడు
- IV. సాత్త్వికభావం
  - ఇవి ఎనిమిది
    1. స్తంభం
    2. స్వేదం
    3. రోమాంచం
    4. స్వరభంగం
    5. వేసథువు
    6. వైవర్ణ్యం
    7. ఆశ్రువు
    8. ప్రళయం

### 9.6.1. విభావం :

**"విశేషేణ భావ్యతే ఇతి విభావః"**

విశేషంగా భావింపజేసేవి విభావమని అర్థం. రతి హాసం మొదలైన స్థాయి భావాల ఉత్పత్తికి కారణమైనవి విభావాలు. అంటే రసోత్పత్తికి కారణమైంది విభావమన్న మాట. ఒక్కమాటలో చెప్పాలంటే సహృదయులైన సామాజికుల హృదయంలో వాసనా రూపంలో అంటే బీజప్రాయంగా వున్న రత్యాది భావాలు దేనిచేత అంకుర రూపాన ఆస్వాద్యమానాలవుతాయో అవి విభావాలు.

ఈ విభావాలు చిత్త వృత్తి విశేషాలు కావు. అంచేతనే భరతుడు చెప్పిన 49 భావాల్లో ఇవి చేరలేదు. భరతుడు చెప్పిన భావాలు ఇవి. స్థాయి భావాలు 8, సాత్విక భావాలు 8, వ్యభిచారి భావాలు 33, 8+8+33 - మొత్తం 49.

రసోత్పత్తికి హేతువయ్యే ఈ విభావం మళ్ళీ రెండు విధాలు.

1. ఆలంబన విభావం
11. ఉద్దీపన విభావం

**'విభావః కథ్యతేత్రరసోత్పాదన కారణం**
**ఆలంబనోద్దీపనాత్మా సద్విధాపరికీర్త్యతే"**

### ఎ) ఆలంబన విభావం :

ఆలంబనం అంటే ఆధారం. రతి మొదలైన స్థాయి భావాలు దేనిని ఆధారంగా చేసుకొని వుంటాయో అవి ఆలంబన విభావాలు అవుతాయి. ఉదా : రతి అనే స్థాయి భావం నాయికా నాయకుల్ని ఆధారం చేసుకొని వుంటుంది కాబట్టి నాయికా నాయకులు అంటే సీతారాములు మొదలైన వారు ఆలంబన విభావాలు అవుతాయి.

కల్పిత జీవులైన కావ్యగత వ్యక్తులు, వారి వాక్యాలు, దృశ్య కావ్యమైతే నటులు, వారి వాక్యాలు ఆలంబన విభా వాలు.

శృంగార రసంలో నాయికా నాయకులు ఆలంబన విభావాలు. ఈ శృంగార రసం నాయికా నాయకుల నాశ్రయించుకొని వుంటుంది. సీత విషయకమైన రాముని రతికి సీత ఆలంబనం. ఆలాగే రామ సీత రతికి రాముడు ఆలంబనం.

ఉదా ॥ సీతారాములు, శకుంతలా, దుష్యంతులు, రతీ మన్మథులు మొదలైనవారు.

### బి) ఉద్దీపన విభావం :

ఆలంబనంచే ఉత్పన్నమైన స్థాయిని కొంచెం ఉద్దీపింప చేయడం / ప్రేరేపించడం / ఉద్దీపన విభావం అవుతుంది. నాయికా నాయకులను అనుసరించి రసోదయమవుతుంది. కాబట్టి దానిని ఉద్దీపన చేసే ఉద్దీపన విభావం. ఉద్దీపన విభావం అంటే స్థాయి వికాసానికి ఉచితమైన వర్ణనలు మొదలైనవి.

మనసులోని భావాలకు ప్రకృతి పరిసరాలు, ఉద్రేకతను కలిగిస్తాయి. మనసులో ప్రేమ భావం కలిగించేవి - వెన్నెల, తోట, పాట, పువ్వుల్లాంటివి. ప్రణయ భావానికి ఇవి పదునుపెడతాయి. అంచేతనే / ఉత్ + దీపనం / ఉద్దీపనం అయింది. అంటే ఉత్తేజం కల్పించేవి అన్నమాట.

రతికి ఉద్యాన వన విహారం, చంద్రోదయాది వర్ణనం, కోకిల కూజిత శ్రవణం, మొదలైన రమ్య రమణీయ సుందర ప్రకృతి వర్ణనలు ఉద్దీపన విభావం. ఈ ఉద్దీపన విభావాన్నే ఆధునికులు 'రసోచిత వాతావరణం' అని అంటారు. దీనిని ఆంగ్లంలో Atmosphere అని అంటారు.

'శృంగార తిలకం'లో రుద్రకవి ఈ ఉద్దీపన విభావాన్ని నాలుగు విధాలుగా చెప్పాడు. ఒకటి ఆలంబన గుణాలు, రెండు ఆలంబన చేష్టలు, మూడు ఆలంబన అలంకరణాలు, నాలుగు ఆలంబన తటస్థాలు.

## 9.6.2 అనుభావం :

విభావం కారణం పుట్టేవి కాబట్టి ఇవి అనుభవాలు అయ్యాయి.

విశ్వనాథుడు 'సాహిత్య దర్పణం'లో అనుభావ లక్షణాన్ని ఈ క్రింది విధంగా చెప్పాడు.

"ఉద్బుద్ధం కారణైః స్వైర్బహిర్భావం ప్రకాశయున్
లోకేయుః కార్యరూపః సో అనుభావః కావ్య నాట్యయోః"

తన తన కారణాలచే ఉద్బుద్ధమైన భావాన్ని బయటకు వెల్లడిస్తూ లోకంలో ఏది కార్యరూపంలో వుందో అదే కావ్య నాట్యాల్లో అనుభావం అవుతుంది.

సాధారణంగా లోకంలో కార్య కారణ సంబంధాల్ని బట్టి సంఘటనలు ఏర్పడతాయి. పొగాకు కారణం నిప్పు, నిప్పుకు కార్యం పొగ. అలాగే పగకు కారణం కోపం. కోపానికి కార్యం పగ. ఇలా లోకమంతా కార్యకారణ సంబంధం మీద నడుస్తుంది. కాబట్టి కావ్యంలో విభావం కారణంగా కార్యాలైన అనుభావాలు ఏర్పడుతున్నాయి. కనుక విభావం కారణం అనుభావం కార్యం.

పాత్రల మనోభావాల్ని వ్యక్తపరిచే శారీరక చేష్టల్ని అనుభావాలు అంటారు. శ్రవ్య కావ్యంలో ఇవి వర్ణన రూపంలో వుంటాయి. దృశ్య కావ్యంలో ఇవి అభినయ రూపంలో వుంటాయి. ఉదాహరణకు - చిరునవ్వు, క్రీగంటిమాపులు, చిలిపిచేష్టలు, విలాసచేష్టలు మొదలైనవి శృంగార రసానికి అనుభావాలు.

## 9.6.3 వ్యభిచారి భావాలు / సంచారి భావాలు :

'రస సాధన సామాగ్రి' లో మూడోది వ్యభిచారి భావం. రసోత్పత్తికి సహాయపడిన భావాలు వ్యభిచారి భావాలు. విశేషంగా చరించే భావాలు వ్యభిచారి భావాలు. 'వి + అభితః + చరంతి' - వ్యభిచారిణః. ఈ భావాల్ని వ్యభిచారి భావాలని ఎందుకంటారు ? వి, అభి అనేవి రెండు ఉపసర్గలు. చర అనేది గత్యర్థకమైన ధాతువు. రసంలో వివిధ రకలుగా సంచరించేవి కాబట్టి ఇవి వ్యభిచారులని పిలువబడుతున్నాయి. ఈ వ్యభిచారి భావాలనే 'సంచారి భావాలు' అని కూడా అంటారు.

**"విశేషణ అభితః చరం తీతి వ్యభిచారిణః"**

అని వ్యుత్పత్తి . అంటే అంతటా విశేషంగా రసంలో సంచరిస్తుండేవి అని అర్థం.

**"విశేషాదాభి ముఖ్యేన చరంతో వ్యభిచారిణః
స్థాయి న్యున్మగ్న నిర్మగ్నాః కల్లోలా ఇవ వారి ధౌ"**

సముద్రంలో తరంగాలు పైకి లేస్తూ, కిందకు పడుతూ, ఆ సముద్రానికి ఒక అతిశయాన్నికలిగిస్తూ అవి తిరిగి సముద్రంలోనే కలుస్తాయి. అదే విధంగా వ్యభిచారి భావాలు కూడా స్థాయి భావాల్లో విశేషంగా సంచరిస్తూ చివరకు రసాత్మను పొందుతాయి. అంటే ఈ వ్యభిచారి భావాలు స్థాయి భావంలోనే మునుగుతూ తేలుతూ స్థాయికి పోషకాలై తాముూ ఆ స్థాయి రూపాన్నే పొందుతాయి. రసానికి సహకారులవడం అంటే ఇదే.

స్థాయి భావాలకూ, వ్యభిచారి భావాలకూ స్వరూప స్వభావాల్లో చాలా భేదం వుంది. పుట్టినదాదిగ, ప్రతి ప్రాణిలోనూ వాసనా రూపంలో వుండేవి స్థాయి భావాలు. నడుమ నడుమ పుట్టుతూ గిట్టుతూ వుండేవి వ్యభిచారి భావాలు. అంటే రసాస్వాదనం అయ్యే వరకు వుండవన్న మాట. అసలు కొందరిలో ఇవి పుట్టనే పుట్టవు. స్థాయి భావం ఒకప్పుడు వ్యభిచారి భావం కావచ్చు కానీ వ్యభిచారి భావం ఎన్నడూ స్థాయి భావం కాదు.

భట్టుమూర్తి తన 'కావ్యాలంకార సంగ్రహం' లో వ్యభిచారి భావాల్ని 33 విధాలుగా పేర్కొన్నాడు.

"నిర్వేద శ్రమదైన్యజాడ్యములు గ్లాని త్రాసశం కార్తిరు
డ్గ ర్యావేగ ధృతి స్మృతుల్, చపలతో గ్రత్వావహిత్థాత్రపాం
తర్వైక్లబ్యమదోత్సు కత్వ మతినిద్రామోహబోధాంతము
త్సర్వాలస్య వితర్క సుప్త్య సహతా ధ్యాన భ్రమాపస్మృతుల్".

| | | |
|---|---|---|
| 1. నిర్వేదం | 2. శ్రమం | 3. దైన్యం |
| 4. జాడ్యం | 5. గ్లాని | 6. త్రాసం |
| 7. శంక | 8. ఆర్తి | 9. రోషం |
| 10. గర్వం | 11. ఆవేగం | 12. ధృతి |
| 13. స్మృతి | 14. చపలత | 15. ఉగ్రత |
| 16. అపహిత్థ | 17. త్రప | 18. విషాదం |
| 19. వైక్లబ్యం | 20. ఉత్సుకత్వం | 21. మతి |
| 22. నిద్ర | 23. మోహం | 24. బోధం |
| 25. మృతి / అంతం | 26. మదం | 27. ఆలస్యం |
| 28. వితర్కం | 29. సుప్తి / స్వప్నం | 30. అసూయ |
| 31. చింత | 32. ఉన్మాదం | 33. అపస్మృతి |

### 9.6.4 సాత్త్విక భావాలు :

భరతుని రససూత్రంలోలేని సాత్త్విక భావాల్ని ధనంజయుడు చెప్పాడు. ఇతడు తన 'దశరూపకం' లో ఇలా చెప్పాడు.

**"విభావైరానుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః**
**ఆనీయమానః స్వాదుత్వం స్థాయీ భావోరసః స్మృతః"**

అనుభావాల్లోనే అంతర్భూతాలైనవి సాత్త్విక భావాలు. ఇతరులకు కలిగే కష్ట సుఖాల్ని అనే మార్పులు భావించడం వల్ల మనసుకు కలిగే తన్మయత సత్త్వం. సాత్త్విక భావాలు సత్త్వం నుండి పుట్టాయి. సత్త్వ జన్యాలవడంచేత వీటికి సాత్త్వికాలని పేరు వచ్చింది. ఈ సాత్త్విక భావాలు మనసుకు సంబంధించినవి. ఈ సాత్త్విక భావాలచే రతి, హాసం మొదలైన స్థాయి భావాలు సూచించబడతాయి. ఇవి శరీర జొలపడం చేతా సత్త్వం నుంచి పుట్టడం చేతా అను భావాలు కాక సాత్త్విక భావాలు అయ్యాయి.

వ్యభిచారులు బాహ్యహేతుకాలు. సాత్త్వికాలు అబాహ్యహేతుకాలు అంటే బాహ్యాకారణాల వల్ల వ్యభిచారి భావాలు పుడతాయి. అంతర కారణాల వల్ల సాత్త్విక భావాలు పుడతాయి.

### సాత్త్విక భావాలు - 8

**"స్తంభః స్వేదో థరోమాంచః స్వర భంగో థవేపథుః**
**వైవర్ణ్య మశ్రు ప్రళయ ఇత్యష్టౌ సాత్త్వికాః స్మృతాః"**

**- సాహిత్య దర్పణం.**

| సాత్త్విక భావం | | అర్థం |
|---|---|---|
| 1. స్తంభం | - | నిశ్చేష్టత |
| 2. స్వేదం | - | చెమట పుట్టడం |
| 3. రోమాంచం | - | పులకరించడం |
| 4. స్వరభంగం | - | కంఠస్వర గాద్గద్యం |
| 5. వేపథువు | - | శరీరం వణకడం |
| 6. వైవర్ణ్యం | - | పాలిపోవడం |
| 7. అశ్రువు | - | కన్నీరు |
| 8. ప్రళయం | - | స్పృహ తప్పడం / మూర్ఛ / |

పై విషయాల్ని నిశితంగా విశ్లేషించిన తర్వాత తేలిన సారాంశం ఏమంటే, అన్నింటిలోనూ అంతర్గతంగా 'సాధారణీకరణం' అనే ధర్మం సమానంగా వుంటుంది. దీనిని భారతీయాలంకారికులు అందరూ అంగీకరించారు. అంటే రస సిద్ధాంతానికి ఉద్గమ స్థానం భావ సాధారణీకరణమనడం గుర్తించాం. ఈ భావసాధారణీకరణ ధర్మం, విభావ, అనుభావ, వ్యభిచారి, సాత్త్విక భావం మొదలైన రససాధన సామగ్రిచే మనలో ఉద్బుద్ధమవుతుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే విభావ, అనుభావ, వ్యభిచారి సాత్త్విక భావాలు సామగ్రి హేతువు. సాధారణీకరణం కార్యం. రసం దాని ఫలం.

ఈ విధంగా రస సిద్ధాంత స్వరూప స్వభావాన్ని గూర్చి విపులంగా వివరంగా తెలుసుకున్నాం.

సంగ్రహంగా రససిద్ధాంతం ఇది.

## 9.7 మాదిరి ప్రశ్నలు :

ఈ పాఠం మీద పరీక్షల్లో అడగబోయే ప్రశ్నల్ని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమైన ప్రశ్నలు ఇక్కడ ఇవ్వడం జరిగింది.

1. రస సిద్ధాంతాన్ని విపులీకరించండి?
2. రస సాధన సామగ్రి గూర్చి వివరించండి?
3. రస స్వరూప స్వభావాన్ని గూర్చి తెలియజేయండి?
4. రస భావాన్ని గూర్చి విశదీకరించండి?

## 9.8 ఆధార గ్రంథాలు :


1. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - సూత్రాలు - డా. వెలమల సిమ్మన్న
2. కావ్యాలోకం - డా. నండూరి రామకృష్ణమాచార్య
3. భరతనాట్యశాస్త్రం - అనువాదం - డా. పోణంకి శ్రీరామ అప్పారావు
4. రస సిద్ధాంతం - తెలుగు అకాడమి
5. సాహిత్య దర్శనం - ఆచార్య కాకర్ల వేంకటరామనరసింహం
6. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు
7. సాహిత్య సోపానములు - ఆచార్య దివాకర్ల వేంకటావధాని
8. సాహిత్య సౌందర్య దర్శనము - చర్ల గణపతిశాస్త్రి
9. సాహిత్య శిల్ప సందర్శనము - వారణాసి వేంకటేశ్వర్లు
10. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం


**డా॥ వెలమల సిమ్మన్న**

పాఠం - 10

# రస సంఖ్య విచారం

**విషయక్రమం**

10.1 పరిచయం
10.2 భరతుడు - రసాలు
10.3 దండి - రసాలు
10.4 భట్టోద్భటుడు - రసాలు
10.5 శాంతాన్ని రసంగా అంగీకరించిన ఆలంకారికులు
10.6 శాంతాన్ని రసంగా అంగీకరించని ఆలంకారికులు
10.7 శాంత రసం - ప్రముఖుల అభిప్రాయాలు
10.8 రుద్రటుడు - రసాలు
10.9 విశ్వనాథుడు - రసాలు
10.10 మధుసూదన సరస్వతి - భక్తి
10.11 రూపగోస్వామి - మధుర రసం
10.12 స్నేహం - మరి కొందరి అభిప్రాయాలు
10.13 భోజుడు - రసాలు
10.14 భానుదత్తుడు - మాయారసం
10.15 రస సంఖ్యా విచారం - మరికొందరి అభిప్రాయాలు
10.16 మాదిరి ప్రశ్నలు
10.17 ఆధార గ్రంథాలు

## 10.1 పరిచయం :

లోకంలో రసాలు 9 అనడం ప్రసిద్ధం. కాని భరతుడు 8 చెప్పాడని కొందరు, 9 చెప్పాడని మరికొందరు విపులంగా చర్చించారు. అసలు ఈ చర్చకు ప్రధాన కారణం శాంతం రసం అవునా? కాదా । అనేది.

## 10.2 భరతుడు - రసాలు :

" శృంగార హాస్య కరుణా రౌద్రవీర భయానకాః
భీభత్సాద్భుత సంజ్ఞా చేత్యష్టౌనాట్యే రసాః స్మృతాః ॥"

భరతుడు తన 'నాట్యశాస్త్రంలో' 8 రసాల్ని మాత్రమే చెప్పాడు. అతడు శాంతాన్ని రసంగా చెప్పలేదు. భరతుని మతంలో శాంతం రసం కాదు.

భరతడు తాను చెప్పిన ఎనిమిది రసాలకు ఎనిమిది స్థాయి భావాలు చెప్పాడు.

**'రతిర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా**
**జుగుప్సా విస్మయశ్చేతి స్థాయి భావాః ప్రకీర్తితాః'**

## 10.3 దండి - రసాలు :

భరతుడు తర్వాత దండి కూడా 'కావ్యదర్శం' లో 8 రసాలనే పేర్కొన్నాడు.

## 10.4 భట్టోద్భటుడు - రసాలు :

శాంతాన్ని కలుపుకొని రసాలు 9 అని మొట్టమొదటిసారిగా చెప్పినవాడు భట్టోద్భటుడు.

**'శృంగార హాస్యకరుణా రౌద్ర వీర భయానకాః**
**బీభత్సాద్భుత శాంతాశ్చ నవ నాట్యే రసాః స్మృతాః'**

భట్టోద్భటుడు తన 'కావ్యాలంకార సార సంగ్రహం' లో శాంతాన్ని ఒక రసంగా పేర్కొన్నాడు.
భట్టోద్భటుడు నవరసాలకు నవ స్థాయీ భావాలు కూడా చెప్పాడు.

**'రతిర్హా సశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌభయం తథా**
**జుగుప్సా విస్మయ శమాః స్థాయి భావాః ప్రకీర్తి తాః'**

## 10.5 శాంతాన్ని రసంగా అంగీకరించిన ఆలంకారికులు :

ఉద్భటుని తర్వాత ఆనందవర్ధనుడు, భట్టనాయకుడు, అభినవగుప్తుడు, విశ్వనాథుడు, జగన్నాథ పండితరాయలు మొదలైన ఆలంకారికులు శాంతాన్ని ఒక రసంగా ప్రతిపాదించి వివరించారు.

### అభినవగుప్తుడు :

అభినవగుప్తుడు శాంతానికి రసత్వం వుందని సమర్థించాడు. శాంతం అనుభవించలేరు అనేది తప్పు అని ఖండించాడు. ఈ రసాన్ని సర్వసాధారణమైన సామాన్య జనులు అనుభవించలేకపోవచ్చు. రాగద్వేషాలకు అతీతమైన మహా పురుషులు ఆస్వాదిస్తారు కదా! నటుడు అభినయించ లేకపోవడం వల్ల ఈ భావం రసం కాకపోతుందా ? కనీసం శమట ప్రధానమైన వాక్యాలైనా అనగలడు కదా! అటువంటప్పుడు ఆ శబ్ద శక్తిచే సహృదయ సామాజికుడు శాంతాన్ని చాలా చక్కగా అనుభవించగలడు. ఇలా అభినవగుప్తుడు శాంతరసంపై తన అభిప్రాయాన్ని విపులంగా వెలిబుచ్చాడు.

### విశ్వనాథుడు : సాహిత్య దర్పణం - శాంతరసం :

విశ్వనాథుడు అనే అలంకారికుడు తన 'సాహిత్య దర్పణం' లో శాంతాన్ని రసంగా అంగీకరించాడు. శాంత రసం కావ్య నాటకాలు రెండింటిలోనూ వుండవచ్చునని పేర్కొన్నాడు.

### జగన్నాథ పండితుడు - రస గంగాధరం :

శ్రవ్య దృశ్య కావ్యాల రెండింటిల్లోనూ శాంతం వుండవచ్చునని అంగీకరించాడు జగన్నాథ పండితుడు.

### 10.6 శాంతాన్ని రసంగా అంగీకరించని ఆలంకారికులు ధనంజయుడు-దశరూపకం-శాంతం రసం కాదు :

ధనంజయుడు తన 'దశరూపకం' లో శాంతాన్ని ఒక రసంగా అంగీకరించలేదు. శాంతానికి నాటకంలో స్థానం లేదని నొక్కి వక్కాణించాడు. మీదు మిక్కిలి భరతుని మతాన్ని పూర్తిగా సమర్థించాడు.

శాంతానికి స్థాయి భావమైన శమం నిర్వికారచిత్త లక్షణం కలది. అంచేత శాంతం రసంగా పరిణమించడానికి అవకాశం లేదని చెప్పాడు. అంతేకాక శాంతాన్ని అభినయించడం అసాధ్యమనీ పేర్కొన్నాడు. నాటకంలో శాంతం లేకపోయినా శ్రవ్యకావ్యంలో రసంగా వుండవచ్చునని ధనంజయుడు చెప్పాడు.

### 10.7 శాంతరసం - మరికొందరి అభిప్రాయాలు :

మరికొందరు శాంతాన్ని అంగరసంగానే వుండవచ్చు కానీ అంగిరసంగా వుండడానికి వీలులేదని చెప్పారు.

తెలుగు సాహిత్యంలో పెద్దన 'మనుచరిత్ర', దగ్గుపల్లి దుగ్గన 'నాచికేతూ పాఖ్యానం' శాంతరస ప్రధానాలు. సంస్కృతంలో కృష్ణమిశ్రుడనేకవి 'ప్రబోధ చంద్రోదయం' అనే నాటకాన్ని శాంతరస ప్రధానంగా రాశాడు.

శాంతం రసరాజమని పెక్కుమంది ఆలంకారికులు అంగీకరించలేదు. సర్వజన హృదయాహ్లాదకారి అయిన శృంగారమే రస రాజమని తీర్మానించారు. అయితే శాంత రస ప్రధానమైన గ్రంథాలకు లోకంలో గౌరవం ఎక్కువగానే వుంది. 'మహాభారతం', 'సౌందర నందం', 'బుద్ధచరిత్రం' మొదలైన శ్రవ్యకావ్యాలు, 'ప్రబోధ చంద్రోదయం' లాంటి దృశ్యకావ్యాలు శాంతరస ప్రధానమైనవి. ఈ గ్రంథాలు సమాజంలో ప్రముఖుల మన్ననల్ని ప్రశంసల్ని అందుకొన్నాయి.

### 10.8 రుద్రటుడు - రసాలు :

రుద్రటుడు అనే ఆలంకారికుడు తన 'కావ్యాలంకారం' అనే గ్రంథంలో ఉద్భటుడు చెప్పిన 9 రసాలకు 'ప్రేయస్సు' అనే దానిని చేర్చి, రసాలు 10 అని చెప్పాడు. దండి, భామహుడు ఇద్దరూ ప్రేయస్సును రసంగా పేర్కొన్నారు. ఈ అభిప్రాయం అభినవగుప్తునకు సమ్మతం కాదు.

మిత్రులు, మాతాపుత్రులు మొదలైనవారి మధ్య వుండే ప్రీతి శృంగార ప్రీతి కంటే భిన్నం కాబట్టి దీనిని ప్రత్యేక రసంగా గ్రహించాలని అభిప్రాయపడ్డాడు. ఈ 'ప్రేయస్సు' రసమే మిత్రుల మధ్య స్నేహంగానూ, పెద్దలకు పిన్నలయెడ వాత్సల్యంగానూ, పూజ్యుల యెడ భక్తిగానూ ప్రకాశిస్తుందని చెప్పాడు.

### 10.9 విశ్వనాథుడు - రసాలు :

'సాహిత్య దర్పణ' కర్త విశ్వనాథుడు 'వత్సల' రసాన్ని ప్రతిపాదించాడు. 'వత్సల' రసానికి స్థాయి భావం 'వాత్సల్యం' అని పేర్కొన్నాడు. జగన్నాథ పండితరాయలు వత్సల, భక్తి భావాలు రసాలు కావని నొక్కి వక్కాణించాడు. ఇవి భావాలే అని చెప్పాడు. వత్సల రసానికి ఉదాహరణంగా విశ్వనాథుడు 'రఘువంశం' లోని రామలక్ష్మణుల వాత్సల్య భావాన్ని చూపాడు. తర్వాత ఆలంకారికులు ఈ వాదాన్ని అంగీకరించలేదు.

### 10.10 మధుసూదన సరస్వతి భక్తి :

మధుసూదన సరస్వతి తన 'భక్తిరసాయనం' అనే గ్రంథంలో 'భక్తి' అనే మరో రసాన్ని పేర్కొన్నాడు. భక్తి రసానికి భగవంతుడే ఆలంబనమనీ, భక్తునికి సాధనలో కలుగు దుఃఖ, శంకా, హర్ష నిర్వేదాదులు వ్యభిచారి భావాలనీ చెప్పాడు. ఇతడు భక్తియే ప్రధాన రసం అనీ ఈ రసం నుంచే శృంగారాది రసాలు ఉద్భవిస్తాయని వివరించాడు.

### 10.11 రూపగోస్వామి - మధుర రసం :

రూపగోస్వామి తన 'ఉజ్జ్వల నీలమణి' అనే గ్రంథంలో 'మధుర రసం' అనే ఒక రసాన్ని గూర్చి చెప్పాడు. దీనికి స్థాయి భావం 'మధురరీతి' అని ప్రతిపాదించాడు. ఇతడు చైతన్య మహాప్రభువు శిష్యుడు. భాగవత మతస్థుడు. శ్రీకృష్ణభక్తుడు. భాగవతంలో శ్రీకృష్ణుని ఆశ్రయించి భక్తి రసాన్ని స్థాపించాడు.

భారతీయాలంకారికుల్లో ఎక్కువ మంది భక్తిని రసంగా అంగీకరించలేదు. మధుసూదన సరస్వతి, రూపగోస్వామి మొదలైన విష్ణుభక్తులు భక్తిని రసంగా ప్రతిపాదించారు.

దేవాది విషయకమైన రతి, భావమే కాని రసం కాదని ధనంజయుడు వాదించాడు. 'భక్తికి' రసాన్ని ఆపాదించడం అంగీకరించలేదు. ప్రీతి, భక్తి, మృగయ, ఆక్షక్రీడలు మొదలైనవి హర్షోత్సాహాదుల్లో అంతర్భవిస్తాయని వాటిని ప్రత్యేక రసాలుగా చెప్పనక్కరలేదని ఆలంకారికులు ఎక్కువ మంది భక్తిని రసంగా అంగీకరించకపోయినా లోకంలో మాత్రం 'భక్తి రసం' అనే వ్యవహారం వుంది.

### 10.12 స్నేహం - మరికొందరి అభిప్రాయాలు :

స్నేహం కూడా మరో రసంగా కొందరు పరిగణించారు.

### ఖండన : హేమచంద్రుడు - కావ్యానుశాసనం :

హేమచంద్రుడు తన 'కావ్యానుశాసనం' గ్రంథంలో పైన చెప్పిన స్నేహం, వాత్సల్యం, భక్తి రసాలన్నింటిని ఖండించాడు. ఇవి అన్నీ రతి భావాల యొక్క విశేషాలు అని పేర్కొన్నాడు.

సామాన్యులైన వారిలో పరస్పరం కలిగే, రతియే స్నేహం అనీ, పిల్లలకు పెద్దల యందూ, గొప్పవారి యందూ కలిగే రతియే భక్తి అనీ, పెద్దలకు పిల్లల యందు కలిగే రతియే 'వాత్సల్యం' అనీ వివరించాడు. అంచేత ఇవి అన్నీ శృంగార రసంలో అంతర్భాగాలే అవుతాయని చెప్పాడు.

### 10.13 భోజుడు - రసాలు :

భోజుడు, ప్రేయసి, ఉదాత్తం, ఉద్ధతం మొదలైన రసాల్ని కూడా పేర్కొన్నాడు. అసలు ఎన్ని భావాలు వున్నాయో అన్ని రసాలు వున్నాయని చెప్పాడు. కాబట్టి స్థాయి, సాత్త్విక వ్యభిచారి భావాలన్నీ పరిపోషణం పొంది రసాలు కాగలవని చెప్పాడు.

### 10.14 భానుదత్తుడు - మాయారసం :

భానుదత్తుడు తన 'రస తరంగిణి' లో మాయారసాన్ని గూర్చి చెప్పాడు. శాంతం నివృత్తి రసం. మాయారసం ప్రవృత్తి రసం. మాయా రసానికి స్థాయి భావం 'మిధ్యాజ్ఞానం' అని చెప్పాడు. ఎక్కువ మంది ఆలంకారికులు మాయా రసాన్ని అంగీకరించలేదు. అంతేగాక తీవ్రంగా ఖండించారు.

### ఖండన - విశ్వేశ్వరుడు - రస చంద్రిక :

విశ్వేశ్వరుడు తన 'రస చంద్రిక' లో మాయారసాన్ని ఖండించాడు.

## 10.15 రస సంఖ్యా విచారం - మరికొందరి అభిప్రాయాలు :

ఇంకా మరి కొంతమంది అక్షక్రీడ, ప్రీడ, మృగ, శ్రద్ధ మొదలైనవి కూడా రసాలని పేర్కొన్నారు.

చివరకు కొంతమంది రసాలు అనంతాలని అన్నారు. 'అనంతావై రసాః' అని అన్నారు.

ఆనంద స్వరూపం ఒక్కటే అని తలచి కొందరు రసం ఒక్కటిగా పేర్కొన్నారు.

అసలు ఇన్ని రకాలు లేనే లేవనీ, ఒకటే రసం వున్నదనీ, దానికి స్థాయి భావం 'ఆనందం' అని ప్రతిపాదించారు. 'రసోవైసః' అని రసాన్ని భగవత్స్వరూపంగా కూడా చెప్పడం గమనించదగింది.

పైన చెప్పిన ఆలంకారికుల వాదాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తేలిన సారాంశం ఏమంటే రసాలు అనంతాలైనా, అందులో కొన్ని రసభావాలు మాత్రమే స్థాయి భావాలుగా నిలబడి రస ప్రతీతి కల్పిస్తాయి. అంచేత అన్ని భావాలకు రస సిద్ధి లేదన్న విషయం మనం గుర్తుంచుకోవాలి.

## 10.16 మాదిరి ప్రశ్నలు :

1. రస సంఖ్యా విషయాల్లో ఆలంకారికుల్లో వచ్చిన వాదాల్ని తెలియజేయండి.
2. రస సంఖ్యా విభావాన్ని గూర్చి వివరించండి ?
3. రసాలు ఎన్ని? చర్చించండి ?

## 10.17 ఆధార గ్రంథాలు :


1. తెలుగు సాహిత్య విమర్శ - సిద్ధాంతాలు - సూత్రాలు : డాక్టర్ వెలమల సిమ్మన్న
2. కావ్యాలోకం : డా. నండూరి రామకృష్ణమాచార్య
3. భరత నాట్యశాస్త్రం - అనువాదం : డా. పోణంకి శ్రీరామఅప్పారావు
4. రస సిద్ధాంతం : తెలుగు అకాడమీ
5. సాహిత్య దర్శనం : ఆచార్య కాకర్ల వేంకటరామనరసింహం
6. సాహిత్య భావలహరి : ఆచార్య యస్వీ జోగారావు
7. సాహిత్య సోపానములు : ఆచార్య దివాకర్ల వేంకటావధాని
8. సాహిత్య సౌందర్య దర్శనము : శ్రీ చర్ల గణపతిశాస్త్రి
9. సాహిత్య శిల్ప సందర్శనము : శ్రీ వారణాసి వేంకటేశ్వరులు
10. సాహిత్య శిల్ప సమీక్ష : ఆచార్య పింగళి లక్ష్మీకాంతం


**డాక్టర్ వెలమల సిమ్మన్న**

పాఠం - 10A

# రస నిష్ఠ

**విషయక్రమం :**

10A.1 పరిచయం
10A.2 భరతుడు - రస సూత్రం
10A.3 రససూత్రం - వ్యాఖ్యానాలు
10A.4 రస సిద్ధాంత కర్తలు - సిద్ధాంతాలు
10A.5 రసనిష్ఠ - రస నిష్పత్తివాదాలు
10A.5.1 భట్టిలొల్లటుడు - ఉత్పత్తివాదం
10A.5.2 శ్రీశంకుకుడు - అనుమితవాదం
10A.5.3 భట్టినాయకుడు - భుక్తివాదం
10A.5.4 అభినవగుప్తుడు - అభివ్యక్తి వాదం
10A.6 **మాదిరి ప్రశ్నలు**
10A.7 ఆధార గ్రంథాలు

## 10A.1 పరిచయం :

రసాన్ని అనుభవించేవాడు సహృదయుడైన సామాజికుడనీ, శ్రవ్య కావ్య పఠిత అనీ అలంకారికులు నిర్ణయించారు. ఈ విషయంలో పలువురు పలురకాల చర్చలు వాదోపవాదాలు చేశారు. ఈ చర్చలన్నీ జరగడానికి మూలకారణం భరతుడు రస సూత్రం. రసం కావ్యాత్మ కావ్యం నవరస భరితం. లోకోత్తరానంద ప్రాప్తియే కావ్య ప్రయోజనం. రస స్వరూపానికి ఆద్యుడు ఆరాధ్యుడు భరతుడు.

## 10A.2 భరతుడు - రస సూత్రం :

'విభావనుభావ వ్యభిచారి సంయోగాత్ రస నిష్పత్తిః'

భరతుడు విభావ, అనుభావ, వ్యభిచారి సంయోగం వల్ల రస నిష్పత్తి జరుగుతుందని చెప్పాడు. భరతుడు / దృశ్యకావ్యం/ నాటకాన్ని ఆధారంగా చేసుకొని రస సిద్ధాంతాన్ని రూపొందించాడు.

ఈ సూత్రంలో వున్న 'సంయోగ', 'నిష్పత్తి' అనే రెండు శబ్దార్థాన్ని వేరు వేరుగా నిర్వచించి, నిరూపించడంలో రకరకాల మతాలు పుట్టడానికి అవకాశం లభించింది. ఈ రస సూత్రాన్ని వారి వారి బుద్ధి విశేషాలతో వ్యాఖ్యానించి తమ తమ సిద్ధాంతాల్ని శాస్త్రకారులు వెలిబుచ్చారు.

## 10A.3. రస సూత్రం - వ్యాఖ్యానాలు :

భరతుని రస సూత్రాన్ని వివరంగా, విపులంగా వ్యాఖ్యానించినవారు పదకొండుమంది వున్నారు. వీరిలో ముఖ్యులు నలుగురు. వారిలో మొదటి వాడు భట్టలోల్లటుడు. ఇతడు మీమాంసకుడు. రెండోవాడు శ్రీశంకుకుడు. ఇతడు తార్కికవాది.

మూడోవాడు భట్టనాయకుడు. ఇతడు సాంఖ్యవాది. నాల్గోవాడు అభినవగుప్తుడు. ఇతడు వేదాంతి. వీరు తమ తమ సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యాఖ్యానించారు. భారతీయాలంకారికుల్లో, మొట్టమొదటిసారిగా రసం కిం నిష్ఠం అని ప్రశ్న లేవనెత్తిన వాడూ, దానిని విపులంగా విశ్లేషించినవాడూ, సమగ్ర చర్చ చేసినవాడూ భట్టలోల్లటుడే.

- భట్టులోల్లటుడు రసం 'పాత్ర' నిష్ఠయని ప్రతిపాదించాడు / నాయికానాయిక నిష్ఠమని /
- శ్రీశంకుకుడు రసం 'నట' నిష్ఠమని ప్రతిపాదించాడు.
- భట్ట నాయకుడు రసం 'ప్రేక్షక' నిష్ఠయని ప్రతిపాదించాడు.
- అభినవగుప్తుడు రసం 'సామిజికునిలో వాసనా / సంస్కారం / రూపంలో ఉంటుందని ప్రతిపాదించాడు.

## 10A.4 రస సిద్ధాంత కర్తలు - సిద్ధాంతాలు :

| సిద్ధాంత కర్తలు | సిద్ధాంతాలు |
|---|---|
| 1. భట్టలోల్లటుడు | ఉత్పత్తివాదం |
| 2. శ్రీశంకుకుడు | అనుమితివాదం |
| 3. భట్టనాయకుడు | భుక్తివాదం |
| 4. అభినవగుప్తుడు | అభివ్యక్తివాదం / వ్యక్తివాదం |

## 10A.5 రస నిష్ఠ - రస నిష్పత్తివాదాలు :

ఈ రస సిద్ధాంత కర్తలు నలుగురు రసం ఎవరిలో వుంది, అంటే రసం యున్నిష్ఠమ్ ? లేదా కిం నిష్ఠమ్ ? అనే విషయాలపై విపులంగా వివరంగా చర్చించారు.

### 10A.5.1 భట్టలోల్లటుడు - ఉత్పత్తివాదం :

భరతుని రస సిద్ధాంతాన్ని వ్యాఖ్యానించిన మొట్టమొదటి ఆచార్యుడు భట్టలోల్లటుడు. ఇతడు మీమాంసకుడు. రసం 'పాత్ర' నిష్ఠమని ఇతనివాదం. 'దీన్నే ఉత్పత్తివాదం' అని 'ఆరోపవాదం' అని కూడా అంటారు. ఇతడు 'రసం' అనుకార్య నిష్ఠం అని చెప్పాడు. 'అనుకార్య నిష్ఠం' అంటే 'నాయక' నిష్ఠం అని అర్థం.

మీమాంస వేద సమ్మతమైన దర్శనం. వ్యాకరణం వల్ల శబ్దజ్ఞానం, న్యాయంవల్ల ప్రమాణజ్ఞానం, మీమాంస వల్ల కావ్యజ్ఞానం వస్తుంది. అసలు మీమాంసకు ఆధారం వేదాలు. మీమాంసకులు జ్ఞానాన్ని రెండు విధాలుగా వర్గీకరించారు. ఒకటి ప్రత్యక్షజ్ఞానం. రెండు స్మృతి జ్ఞానం. వస్తు జ్ఞానానికి ప్రమాణం వస్తువే. ఇది ప్రత్యక్ష ప్రమాణం. ఏ వస్తువు ఏ సమయంలో ఏ రీతిని ప్రతీతమవుతుందో అప్పటి ఆ వస్తు బోధయే సత్యజ్ఞానం. ఇది ఈ వస్తువు కాదు అని తర్వాత బోధపడినప్పటికీ ఆ సమయంలో ఆ వస్తువు ఏ రీతి బోధపడుతున్నదో ఆ జ్ఞానం, ప్రత్యక్ష్యానికి విరోధమైన జ్ఞానం అయినా సత్యం అని అనుకోవలసిందే.

తాడు నేల మీద పడివున్నప్పుడు లావుపాటి మోకు అన్పిస్తుంది. అంతేకాక ఆ తాడు సర్ప భ్రాంతి కల్గిస్తుంది. అప్పుడు ఆ సమయంలో మనకి ఆ రెండు వస్తువులకి తేడా వుందని తెలియదు. అంతేకాక రెండింటిలో సంబంధం ఏమివున్నది అని కూడా తెలియదు. ఒక వస్తువును సదృశ్యంగా అన్యవస్తువు నెంచి, మనం ప్రథమ వస్తువుపై ద్వితీయ

వస్తువును ఆరోపిస్తాం. ఇదేవిధంగా వ్యవహరిస్తాం కూడా. అంటే అన్య వస్తువులో తదితర వస్తు ధర్మబుద్ధిని తేవడం ఆరోపం అంటారు. మీమాంసకుల దృష్టిలో భ్రమ భిన్న తత్త్వంగా కన్పించడం లేదు. కాబట్టి తత్కాల జ్ఞానం సత్యమే. అది భ్రాంతి మాత్రం కాదు.

రసం రామాది పాత్రల్లో వుండి ఆ పాత్రల్ని అభినయించే నటునిలో వున్నట్లు ప్రేక్షకునికి అన్పిస్తుంది. కానీ యదార్థంగా రసం పాత్ర యందే వుందని ఇతని వాదం.

భట్టలోల్లటుని వాదం మీమాంసపై ఆధారపడి వున్నది. రజ్జు సర్పదృష్టాంతం వల్ల, దీనిని స్పష్టపరచవచ్చు. రస స్థితి అనే కార్యం రామునిలో వున్నది. నటుడు తన నిజ నటనా ప్రతిభ చేత సహృదయ ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని ఒనరించి రాముడు అనిపించుకొంటాడు. ఇందులో భ్రాంతికి స్థానం ఏమీ కూడా లేదు. కాబట్టి శంకకు ఇసుమంత కూడా తావులేదు. రాముడు, ప్రేక్షకులు, అనే తేడా కూడా లేదు. ఇక్కడి నటుని రామునిగా భావించి సహృదయ ప్రేక్షకులు ఆనందిస్తారు.

భట్టలోల్లటుడు 'సంయోగం' అనే శబ్దాన్ని నిర్వచించాడు. 'సంయోగం' అంటే సంబంధం. ఈ సంబంధం మూడు విధాలు. ఒకటి ఉత్పాద్య ఉత్పాదక భావం, రెండు గమ్య గమక భావం, మూడు పోష్య పోషక భావం. 'నిష్పత్తి' శబ్దాన్ని గూర్చి కూడా భట్టలోల్లటుడు వివరించాడు. 'నిష్పత్తి' అంటే ఉత్పత్తి, అభివ్యక్తి లేక ప్రతీతి, పుష్టి అనే మూడు అర్థాలు వున్నాయని చెప్పాడు. రస నిష్పత్తి అంటే రసోత్పత్తి. ఇది ఉత్పత్తి వాదాన్ని సూచిస్తుంది. స్థాయి భావంతో విభావాది సంయోగం వల్ల రస నిష్పత్తి ఏర్పడుతుంది. విభావాలు చిత్తంలో స్థాయీ ప్రవృత్తిని అందజేసే కారణ స్వరూపాలు. రత్యాది రూప స్థాయీ భావం నాయకుడైన రామునిలో ఉత్పన్నమవుతుంది. నాయకుని వేషాన్ని ధరించిన నటునిలో రత్యాది రూపస్థాయీ భావం ఉత్పన్నమవుతుంది. వాస్తవిక జీవితం తెలిసినవాడు రాముని ప్రేమానందాన్ని గాంచి ముగ్ధులైనట్లు, నటుని శృంగార రసానుభవాన్ని సహృదయ ప్రేక్షకులు పొందుతారు.

రస సూత్రం మీద మొదటిగా వ్యాఖ్యానం రాసినవాడు భట్టలోల్లటుడు. ఆనాటికి వివరణ పద్ధతిలో సశాస్త్రీయ దృక్పథం రాలేదు. దండిలాంటి ఆనాటి అలంకారికులు కూడా రసాన్ని ఈ విధంగానే వ్యాఖ్యానించారు. అంచేత ఈ వాదం చాలా ప్రాచీనమైంది.

ఇతని వాదంలో దోషం స్పష్టంగా కన్పిస్తుంది. ఎందుకంటే లౌకిక రసం అనుకార్య నిష్ఠం అయినప్పుడు సామాజికునకు ఆనందం ఎలా కలుగుతుంది ? రసం అనేది రామాదులకు సంబంధించింది. కాబట్టి వారికే ఆ ఆనందం కలగాలి. తత్సంబంధం లేని సామాజికునికి ఆనందం ఎలా కలుగుతుంది ? ఇక్కడ సామాజికుడు రసాన్ని ఏవిధంగా అనుభవిస్తాడు అనేది సరిగా నిరూపించలేదు. కాబట్టి ఈ వాదంలో దోషం చోటుచేసుకుంది.

రసం ఆనంద రూపం. ఇది లోకోత్తరానందానుభూతి. సమాజంలో రసాన్ని అనుభవించే వాడు సహృదయుడు మాత్రమే.

### 10A.5.2 శ్రీశంకుకుడు - అనుచితవాదం :

శ్రీశంకుకుడు రస సిద్ధాంత వ్యాఖ్యాతల్లో రెండో వాడు. భట్టలోల్లటుని ఉత్పత్తివాదాన్ని, శ్రీశంకుకుడు ఖండించాడు. శ్రీశంకుకుడు కొత్తగా అనుమితివాదాన్ని స్థాపించాడు. దీనినే 'అనుమానవాదం' అని కూడా అంటారు.

మొదటిసారిగా రససూత్రంలో భరతుడు స్థాయి భావాన్ని చేర్చలేదని గుర్తించి, ఎందుకు చేర్చలేదో సశాస్త్రీయంగా విపులంగా వివరించిన ఆలంకారికుడు శ్రీశంకుకుడు. ఇతడు తార్కికుడు. కాబట్టి ఇతని వాదం తర్క ప్రధానమైంది.

అంచేతనే అతని వాదానికి ఆ పేరు వచ్చింది. తార్కిక మతంలో జ్ఞానానికి అనుమానం ఒక ప్రమాణం. అనుమానం చేతనే లభించిన జ్ఞానం అనుమితం.

శ్రీశంకుకుని మతంలో 'సంయోగ' పదానికి అనుమానం గమ్యగమకభావం లేక జ్ఞాప్య జ్ఞాపక భావం అని అర్థం. 'నిష్పత్తి' పదానికి అనుమతి లేక జ్ఞప్తి అని అర్థం.

అనుమానం అనేది బుద్ధికి సంబంధించింది. అనుమానం ద్వారా రసానుభూతి ఎలా సాధ్యమవుతుంది ? ఇక్కడ మనం తప్పనిసరిగా గుర్తుంచుకోవలసిన విషయం ఒకటి వుంది. జాగ్రత్తగా ఆ విషయాన్ని గమనించాలి. శ్రీశంకుకుడు ప్రయోగించిన 'అనుమితి' శబ్దానికి మనం నిత్య వ్యవహారంలో వాడుతున్న 'అనుమాన' శబ్దానికీ అర్థం విషయంలో ఏమీ సంబంధం లేదు.

శ్రీశంకుకుని అనుమతి లేదా అనుమానం అనే పదాలు తర్క శాస్త్రానికి సంబంధించిన పారిభాషిక పదాలు. నేడు మన వ్యవహారంలో వున్న అర్థం కంటే ఇవి ఎంతో విస్తృతార్థంలో వాడబడుతున్నాయి. అది తెలుసుకోవడానికి తప్పనిసరిగా తర్కశాస్త్ర పరిజ్ఞానం అవసరమవుతుంది.

'యత్ర ధూమః తత్ర వహ్నిః' అనేది దాని దృష్టాంతం. నిప్పెక్కడ వుంటుందో 'పొగ' అక్కడే వుంటుంది. నిప్పు లేకుండా పొగ రాదు కాబట్టి 'నిప్పు' కారణం. 'పొగ' కార్యం. ఈ రెండూ ఒకచోట ప్రత్యక్షంగా వుండకపోవచ్చు. ఈ రెండింటిలో ఏ ఒక్కటివున్నా, రెండోది కన్పించకపోయినా మనం ఊహించుకోవచ్చు. దీన్నే 'అనుమానం' అంటారు. అంటే కొండ అవతల పొగ కన్పిస్తుంది. కాని నిప్పు కనిపించదు. నిప్పు లేకుండా పొగరాదు. కాబట్టి నిప్పు మనకు కన్పించకుండా వుండి వుండాలి అని ఊహించడం 'అనుమానం' అంతేకాని అనుమానమంటే ఇక్కడ సందేహం కాదు. కాబట్టి కారణాల్ని అనుసరించి కార్యం కానీ, కార్యాన్ని బట్టి కారణం కానీ అనుమితి అవుతుంది. మనిషి తన మేధాశక్తిచే, దీన్ని పెంపొందించుకుంటాడు. సర్వశాస్త్రాలకు ఇదే మూలబీజం. ఈ తరశాస్త్ర పరిజ్ఞానంతో శ్రీశంకుకుడు రససూత్రాన్ని వివరించాడు. ఇతని వాదం ప్రకారం అనుమానంచేత రస నిష్పత్తి జరుగుతుంది. కాబట్టి రసం అనుమితమౌతుంది. నిష్పత్తి అంటే అనుమితి అని అర్థం.

శ్రీశంకుకుని మతంలో రసం 'అనుకర్త నిష్ఠం' అనుకర్త అంటే రామాది పాత్రలు నటించే నటుడు. రసం నటునిలో వుంటుంది. నటుడు అభినయించే విభావానుభావ వ్యభిచారుల యొక్క సంయోగం వల్ల అంటే గమ్య గమక భావం వల్ల సామాజికుడు నటునిలో రత్యాదుల్ని అనుభవిస్తున్నాడు. కాని నటునిలో రసమున్నది. తార్కిక వ్యాప్తివల్ల నటగత వేష, భాషా నాట్యాది నైపుణ్యం వల్ల, సుందరంగా భాసిస్తుంది. నటగతమైన రత్యాది స్థాయి భావమే సామాజికుడు అనుభవించి, ఆనందిస్తున్నాడు.

రసం అంటే అభినయించే నటునిలో మాత్రమే వుంటుంది. రామునిలో వున్న శోకంనో, రతినో, నటుడు అనుమానించి భావించి దాన్ని అభినయముఖంగా ప్రదర్శిస్తున్నాడు. ఈ అభినయించబడిన శోకం లేదా రతి రసం అవుతుందని శ్రీశంకుకుని భావన.

నటుని యొక్క నైపుణ్యం చేత విభావాది భావాలన్నీ తనలో లేకపోయినప్పటికీ వున్నట్లు నటించడంచేత సామాజికుల్లో రత్యాది భావాలు అనుమానించబడి ఒక విధమైన చమత్కారం పుట్టి, రసానందం అనుభవింపబడుతుందని శ్రీశంకుకుని వాదం.

శ్రీశంకుకుడు ఇలా వాదించి చిత్ర తురగ న్యాయాన్ని ఉదాహరణగా పేర్కొన్నాడు. చిత్ర లేఖనంలో చిత్రించబడిన గుర్రం, లోకంలోని గుర్రం రెండూ ఒకటి కావు. కానీ సామాన్యుడికి ఒకటిగానే కన్పిస్తాయి. కళాకారుడికి మాత్రమే ఆ చిత్ర తురగం, లౌకిక తురగం కంటె భిన్నమైందిగా కళాత్మకంగా తోస్తుంది. అలాగే అభినయం ద్వారా ప్రదర్శించబడేది స్థాయి భావం. దీన్ని ద్వారా రసం నటునిలో వున్న భావం ప్రేక్షకునికి ఆనుమితమౌతుంది అని శ్రీశంకుకుడు రస సూత్రాన్ని వివరించాడు.

రసం నట నిష్ఠమైతే నృసింహ పాత్రధారి హిరణ్య కశపుణ్ని రంగస్థలంలో వాస్తవంగా చంపవలసి వస్తుంది. కాబట్టి ఈ వాదం కూడా అంగీకార యోగ్యం కాదు.

ఉత్తమ నటుడు తనలో తాను నవ్వుకుంటూ దుర్భరమైన దుఃఖాన్ని చూపెట్టగలడు. కాబట్టి అనుకార్యునితో వలెనే, నటునిలోనూ, రసానుభావం కలుగదు.

అసలు చమత్కారం ఇచ్చేది ప్రత్యక్ష జ్ఞానం కాని, పరోక్ష జ్ఞానం కాదుగదా ! రసం 'సాక్షాత్కరోమి' అనే వచనం లోకంలో వుంది. రసానందాన్ని ప్రత్యక్షంగా పొందుతున్నానని సహృదయుడు చెప్తుండగా అనుమాన జ్ఞానంచేత రసం అనుభవిస్తున్నాడనడం స్వభావ విరుద్ధం నటుడు రసాన్ని గ్రోల్చువాడే, కాని గ్రోలేవాడు కాడు.

భట్టలోల్లటుని సిద్ధాంతంలో వున్న లోపాలు, యథాతథంగా శ్రీశంకుకుని సిద్ధాంతంలో కూడా చోటు చేసుకున్నాయి. నాయకాదుల్లో, రసం వున్నప్పటికీ, నటునిలో రసం వున్నప్పటికీ, రసం వల్ల సామాజికునకు ఆనందం ఎలా గలుగుతుందో భట్టలోల్లటుడు, శ్రీశంకుకుడు ఇద్దరూ చెప్పలేదు. అంచేత ఈ ఇద్దరి వాదాలు అంగీకార్యాలు కావు.

## 10A.5.3 భట్టనాయకుడు - భుక్తివాదం :

భరతుని రస సిద్ధాంతాన్ని వివరంగా విపులీకరించిన మూడో ఆలంకారికుడు భట్టనాయకుడు. భట్టలోల్లటుని ఉత్పత్తి వాదాన్ని, శ్రీశంకుకుని అనుమతి వాదాన్ని, భట్టనాయకుడు ఖండించి 'భుక్తివాదం' అనే వాదాన్ని ప్రతిపాదించాడు. ప్రేక్షకుడు / ప్ర + ఈక్షకుడు / రసాన్ని భుజిస్తున్నాడు. కాబట్టి ఇది భుక్తి వాదమని ప్రసిద్ధి పొందింది. భట్టనాయకుడు మీమాంసకుడు. దార్శనికుడు. సాంఖ్య మతామయాయి. రసానికి సంబంధించిన వ్యాఖ్యానం కోసం భట్టనాయకుడు సాంఖ్యమతాన్ని అనుసరించాడు.

పాత్రధారిలో రసం వుంటే చూస్తున్న సామాజికునికి ఎలా ఆనందం కలుగుతుంది ? నటన చేస్తున్నప్పుడు నటునిలో శృంగారాది రసాలు వున్నాయంటే సీతను భార్యగా చూస్తే రాముడనే, నేనని వాడనుకోవాలి. ఇది అసంభవం ఎలాంటి పరిస్థితులల్లోనూ ఇది జరగదు. కాబట్టి భట్టనాయకుడు పై రెండు వాదాల్ని ఖండించాడు.

భట్టనాయకుని రస సిద్ధాంతం ఇంతకు ముందు చెప్పిన రస సిద్ధాంతాల రెండింటి కంటే ఒక అడుగు ముందుకు వేసిందని చెప్పక తప్పదు. ఎందుకంటే భట్టనాయకుడు 'ప్రేక్షకుని' స్వీకరించి అతని హృదయంలో రస స్థితి వుంటుందని చెప్పాడు. రసం కావలసినపుడు ఉత్పన్నమయ్యే వస్తువు కాదు, అంతేగాక రసం ప్రతీతియునూ కాదు. అనుమాన జ్ఞానం వల్ల, ప్రత్యక్ష వస్తుజ్ఞానంవల్ల, కలిగినంత ఆనందం కలగదు. నటునిలో పుట్టిన రసం మరో వ్యక్తిలో అనుమానం వల్ల స్వీకరించడం తగని పని. పాత్రలో రసానుభూతి కలగడం లేదు. ప్రేక్షకుల్లో అనుమానం వల్ల రస ప్రతీతి కలడగం లేదు. కలగడానికి అవకాశం లేదు. కాబట్టి అనుమానం వల్ల ఆనందం ఎలాంటి పరిస్థితుల్లోనూ కలగదు. ఇందులో సందేహం లేదు. రసానందం ఒక అలౌకికానందం. ఇదే భోగం. రస రహస్యం భోగంలో ఇమిడి వుంది. కాబట్టి ఇదే రసభుక్తి అని భట్టనాయకుని మతం.

భరతుడు చెప్పిన రస సూత్రంలోని 'సంయోగ', 'నిష్పత్తి' శబ్దాలను భట్టనాయకుడు ఇలా విపులీకరించాడు.

**"తస్మాద్వి భావాదిభిః సంయోగాద్ భోజ్య**
**భోజక భావ సంబంధా ద్రసస్య నిష్పత్తి ర్భుక్తిరితి సూత్రార్థాః"**

సంయోగ శబ్దానికి అర్థం భోజ్య భోజక భావమనీ, నిష్పత్తి శబ్దానికి అర్థం భుక్తి అని భట్టనాయకుడు వివరించాడు.

కావ్యం శబ్దాత్మకం. రస రహస్యం తెలుసుకొనటానికి ముఖ్యంగా శబ్ద వ్యాపారాలు తోడ్పడుతాయి. ఇవి రసావిర్భావక శక్తులు. ఈ వ్యాపారాలు మూడు. 1. అభిధాశక్తి 2. భావనాశక్తి / భావకత్వం 3. భోగం / భోజకత్వం.

శబ్దానికి అభిధా వ్యాపారం / వాచ్యార్థాన్ని బోధిస్తుంది / భావకత్వ వ్యాపారం / రసాదుల్ని భావింపచేస్తుంది / భోజకత్వ వ్యాపారం / రసాదుల్ని భోగింపచేస్తుంది / అనే మూడు వ్యాపారాలు వున్నాయి.

అభిధా వ్యాపారం శబ్దం యొక్క వాచ్యార్థాన్ని బోధిస్తుంది. భావకత్వ వ్యాపారం శబ్దం యొక్క రసాదుల్ని బోధిస్తుంది. భోజకత్వ వ్యాపారం ఈ రసాదుల్ని సహృదయుని చేత భోగింప చేస్తుంది.

అభిధాశక్తి వల్ల కావ్యం లేక నాట్యం యొక్క అర్థాన్ని మనం గ్రహిస్తాం. భావనాశక్తి స్ఫురణశక్తి. లౌకిక జీవితంలో మానవుడు పొందే అనుభవాలకు కార్యకరణ సంబంధం వుంది. కళా రూపంలో మానవుడు పొందే అనుభూతికి భావ్య భావక రూప సంబంధం వుంది. కావ్యాల్లో లేక నాట్యాల్లో విలసిల్లే శక్తియే భావనాశక్తి. ఈ శక్తి వల్ల సహృదయుడు స్వ, పర భేదాల్ని విస్మరిస్తాడు. కళాకారుడు మనుష్య మాత్రుని మనోభావాల్ని చిత్రిస్తున్నాడే కాని నాయకుని భావాలుకాదని, ఈ భావనాశక్తి వల్ల సహృదయుడు తలుస్తాడు. రాముడు, సీత విశిష్ట వ్యక్తులుగా కాక, సామాన్య వ్యక్తులుగా భావింపబడతారు. ఈ భావనా శక్తియే సాధారణీకరణ క్రియ అనబడుతుంది. భావన వల్ల వ్యక్తిలో, పుట్టిన రత్యాది స్థాయి భావాలు సామాన్య రూపాన్ని దాల్చుతాయి. సీతారాముల ప్రేమ సామాన్య దాంపత్య ప్రేమగా పరిణమిస్తుంది. ఈ భావనాశక్తి వల్ల దేశకాల పాత్రాది సంబంధాలు పోయి రసాస్వాదానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది.

కావ్యాలు కానీ, నాటకాలుకానీ, నాయికా నాయకులకు సంబంధించి భావాల్ని విడిచి సామాన్యమైన కామం, రతి అనే అనుభవాలు కలగడం భావుకత్వ వ్యాపారం. ఈ భావాలు సాధారణ భావాలు. మూడో వ్యాపారం భోగం లేక భోజకత్వం. సహృదయుని చేత ఆస్వాదింపబడి రస నిష్పత్తి జరుగుతుంది. దీనిని భోజకత్వ వ్యాపారమంటారు.

భట్టనాయకుని మతంలో రసం 'సామాజిక నిష్ఠం'. కావ్యగత నాయకులు అలౌకిక వ్యక్తులు. తదాశ్రితమైన రసం అలౌకికం. అలౌకిక రసం అలౌకిక నాయకాశ్రితమై ఆస్వాదించేవారు సామాజికులు. కావ్యరసం సామాజిక నిష్ఠయని భట్టనాయకుడు భావించాడు.

అసలు శబ్దానికి భావకత్వ, భోజకత్వ వ్యాపారాలు వుండటం అనేది భట్టనాయకుని కేవలం కల్పిత విషయం. శబ్దానికి ఈ మూడు వ్యాపారాలు వుండడం అనేది ప్రామాణిక పండితసమ్మతం కాదు. మీదుమిక్కిలి వీలుపడదు కూడా. తప్పు కూడా.

సామాజికునిలో వాసనా రూపమైన రత్యాది స్థాయిభావాలు లేకపోతే భావకత్వ వ్యాపారంవల్ల లాభం వుండదు కదా !

## 10A.5.4 అభినవగుప్తుడు - అభివ్యక్తి వాదం :

భరతుని రస సిద్ధాంతాన్ని వ్యాఖ్యానించిన వారిలో నాల్గోవాడు అభినవగుప్తుడు. ఈయన అభినవభరతుడు, రస దర్శనకారుడు. శైవమతానుయాయి. ఈయన మతాన్ని 'అభివ్యక్తివాదం' అంటారు. దీన్ని 'వ్యక్తివాదం' అని కూడా అంటారు.

భట్టలోల్లటుడు చెప్పిన ఉత్పత్తి వాదాన్నీ శ్రీశంకుకుడు చెప్పిన అనుమితివాదాన్నీ, భట్టనాయకుడు చెప్పిన భుక్తి వాదాన్నీ, తీవ్రంగా ఖండించాడు అభినవగుప్తుడు. ఇతడు అభివ్యవక్తి వాదం అనే దానిని ప్రతిపాదించాడు. దీన్నే వ్యక్తివాదం అని కూడా అంటారు. వ్యక్తి అన్నా, అభివ్యక్తి అన్నా ఒక్కటే. భరతుని సిద్ధాంతాన్ని శ్రవ్యకావ్యాలకు కూడా అనుసంధిస్తూ అభినవ గుప్తుడు 'అభివ్యక్తి వాదం' ప్రవేశపెట్టాడు. రసం వాసనానిష్ఠమని ఇతని సిద్ధాంతం.

రసం సామాజిక నిష్ఠమవడం చేతనే కావ్యం చిరస్థాయిగా సహృదయుల్ని ఆనంద తన్మయత్వంలో ముంచుతుంది. ఈ మతాన్నే భారతీయ ఆలంకారికులు అందరూ ఆమోదించారు. ఈ వాదమే సర్వ సమ్మతమైంది. ఆదర్శమంతమైంది.

బీజం లేనిదే అభివ్యక్తి లేదు ఆ బీజం సామాజికునిలో, వాసనా రూపంలో నిగూఢంగా వుంటుంది. కాబట్టి దాని అభివ్యక్తి వల్ల ఆనందాన్ని అనుభవించేవాడు సామాజికుడే అని అభినవ గుప్తుడు నొక్కి వక్కాణించాడు. ఈ ఆనందమే అభివ్యక్తం కాకపోతే మానవునకు కావ్యపఠనం వల్ల కానీ, నాటకంవల్ల కానీ ప్రయోజనం లేదు.

సహృదయుడికి, వాసనారూపమైన సంస్కారం జన్మసిద్ధంగానే వుంటుంది. వాసన అనేది రసాస్వాదనకు ముఖ్యసాధనం. ఒక కావ్యాన్ని చదివే సమయంలో శబ్ద శక్తిచేత అవి ఉద్బిన్నాలై బాగా పోషించబడతాయి. చక్కగా పోషింపబడిన తర్వాత ఆ సాత్త్విక భావాలే రసాభివ్యక్తాలై ఆనందప్రదాలవుతాయి. ఈ రసానుభవం అనేది అనుభవ సాక్షికమైంది. ఇది సహృదయుడు అచ్చంగా అనుభవిస్తాడు. దీన్నే అభివ్యక్తి వాదమంటారు.

మీమాంసకులకు, వైయాకరణులకు రసాస్వాదనం కలగదని ఆనందవర్ధనుడు చెప్పాడు. వాసన లేని వారికి రసాస్వాదనం కలగదని సాహిత్య దర్పణకారుడు కూడా చెప్పాడు. ఈ వాదాన్ని వేదాంతులు కూడా అంగీకరించారు. ఆలంకారికులు ఆమోదించారు.

రస సిద్ధాంత విషయంలో భట్టనాయకునికి, అభినవగుప్తునికి చాలా భేదం వుంది. భట్టనాయకుని మతంలో 'వాసన' అనే ప్రస్తావనేలేదు. అసలు 'వాసన' అనే ప్రస్తావనేలేదు. అసలు 'వాసన' లేకపోతే రసాస్వాదనం కలగదు. కలగడానికి అవకాశం లేదు కూడా.

'అభివ్యక్తి' అంటే వున్న దానిని వెల్లడించడం. సహృదయులు హృదయాల్లో వాసనా రూపంగా వున్న రత్యాది స్థాయి భావాల్ని విభావాదులు వ్యక్తం చేస్తాయి. అవ్యక్తమైన స్థాయి భావమే రసమౌతుంది.

ప్రతి హృదయంలోనూ స్థాయి భావాలు వాసనా రూపంలో నిరంతరం విలసిల్లుతాయి. పూర్వజన్మ సంస్కారం వల్లా, ఈ జన్మలో కావ్యాద్యనుశీలనం వల్లా, కవి సత్సంగం వల్లా, ఈ భావాలు మేల్కొల్పబడతాయి. ఈ స్థాయి భావాలు విభావ, అనుభావ, సంచారీభావాల సాయంతో అభివ్యక్తమవుతాయి.

**అభివ్యక్తివాదం - గొప్పదనం :**

ఇందులో అభివ్యక్తి వాదమే సర్వశాస్త్రి కర్తలకు శిరోధార్యమైన వాదంగానే నేటికీ నిలిచి వుంది. ఆధునిక మనస్తత్వ శాస్త్ర పరిశోధనలు కూడా దీన్నే ఋజువు చేస్తున్నాయి.

మొత్తం మీద తేలిన సారాంశం ఏమంటే నాటకంలోని పాత్ర, పాత్రధారి, ప్రేక్షకుడు / శ్రోత / మూడింటిలో ప్రేక్షకునిలోనే 'రసం' వుంటుందని సుస్పష్టంగా తేలింది.

ఒక్కమాటలో చెప్పాలంటే అసలు నాటకం ప్రేక్షకుని కోసం మాత్రమే రాయబడింది. నటుని కోపయో, పాత్ర కోసమో కాదన్న విషయాన్ని మనం గ్రహించాలి.

అభినవగుప్తుని 'అభివ్యక్తివాదం' ఎంతగానో ప్రశంసనీయమైంది. పూర్వ వ్యాఖ్యాతలందరూ భరతుని నాట్యశాస్త్రాన్ని దృష్టిలో పెట్టుకొని తమ తమ వాదాల్ని వెలిబుచ్చారు. అభినవగుప్తుడు అలాకాక, తన వాదాన్ని దృశ్య శ్రావ్య కావ్యాలు రెండింటికి సరిగా సరిపోయే విధంగా ప్రతిపాదించాడు.

భారతీయ దర్శన సాహిత్య సమన్వయం రస విషయంలో సమకూడింది. భారతీయ రస సిద్ధాంతాలన్నీ దర్శనంపై ఆధారపడివున్నాయన్న విషయం మనం మరచిపోకూడదు. ఒక్కమాటలో చెప్పాలంటే భారతీయ దర్శనశాస్త్రం క్షుణ్ణంగా అవగాహన చేసుకుంటే తప్ప రస సిద్ధాంతం బోధపడదు. ఇది నగ్న సత్యం.

సంగ్రహంగా రసనిష్ఠ ఇది.

## 10A.5.6 మాదిరి ప్రశ్నలు :

ఈ పాఠం మీద పరీక్షల్లో అడగబోయే ప్రశ్నల్ని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమైన ప్రశ్నలు ఇక్కడ పొందుపరచడం జరిగింది.

1. రసనిష్ఠ గూర్చి తెలియజేయండి ?
2. రసం కింనిష్ఠ గూర్చి వివరించండి ?
3. రసం ఎవరు అనుభవిస్తున్నారో విపులీకరించండి ?
4. రస విషయంలో వచ్చిన వాదాల్ని రాయండి ?
5. అభినవగుప్తుని సిద్ధాంతం అలంకారికులందరికీ మార్గదర్శం ఎందుకైయిందో విశదీకరించండి ?

## 10A.5.7 ఆధార గ్రంథాలు :


1. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - సూత్రాలు - డా॥ వెలమల సిమ్మన్న
2. కావ్యాలోకం - డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు
3. భరతనాట్య శాస్త్రం అనువాదం - డా॥ పోణింకి శ్రీరామఅప్పారావు
4. రస సిద్ధాంతం - తెలుగు అకాడమీ
5. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు
6. సాహిత్య దర్శనం - ఆచార్య కాకర్ల వెంకట రామనరసింహం
7. సాహిత్య సోపానములు - ఆచార్య దివాకర్ల వేంకటావధాని
8. సాహిత్య సౌందర్య దర్శనం - శ్రీ చర్ల గణపతిశాస్త్రి
9. సాహిత్య శృసందర్శనము - శ్రీ వారణాసి వేంకటేశ్వరులు
10. సాహిత్య శిల్పసమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం.


**- డా॥ వెలమల సిమ్మన్న**

పాఠం - 11

# త్రివిధ శబ్ద వృత్తులు

**విషయక్రమం :**


11.1. పరిచయం
11.2. శబ్ద వృత్తులు
11.3. త్రివిధ శబ్ద వృత్తులు
11.3.1. అభిదా వృత్తి
11.3.2. లక్షణా వృత్తి
11.3.3. వ్యంజనా వృత్తి
11.4. మాదిరి ప్రశ్నలు
11.5. ఆధార గ్రంథాలు


## 11.1 పరిచయం :

రస సిద్ధాంత పరిణత రూపమే "ధ్వని సిద్ధాంతం". ధ్వని సిద్ధాంత ప్రవక్త ఆనందవర్ధనుడు. ఇతడు రాసిన గ్రంథం "ధ్వన్యాలోకం". ఈ గ్రంథం భారతీయాలంకారశాస్త్ర గ్రంథాల్లో శిరోధారమై పరమ ప్రామాణికమైంది. "ధ్వన్యాలోకం" అనే గ్రంధాన్ని "కావ్యాలోకం", "సహృదయాలోకం" అనే పేర్లతో కూడా పిలుస్తారు. ఈ గ్రంథంలో ఆనందవర్ధనుడు ధ్వన్యభావవాదాల వాదాలన్నింటినీ చాలా తీవ్రంగా ఖండించి ధ్వనియే "కావ్యాత్మ" అని నొక్కివక్కాణించి ఉదాహరణ పూర్వకంగా నిరూపించాడు కూడా.

ఈ ధ్వని సిద్ధాంతాన్ని మహిమభట్టు 'వ్యక్తి వివేకం' లోనూ, కుంతకుడు "వక్రోక్తి జీవితం" లోనూ, భట్టనాయకుడు "హృదయదర్పణం" లోనూ ఖండించారు. వీరి తర్వాత వచ్చిన ఆలంకారికులు, వీరి వాదాల్ని అంగీకరించలేదు. "ధ్వని"యే 'కావ్యాత్మ' అని అంగీకరించిన వారిలో మమ్మటుడు, విశ్వనాధుడు, జగన్నాధ పండిత రాయలు మున్నగువారు ప్రముఖులు.

అభినవగుప్తుడు "ధ్వన్యాలోకం" కు "లోచనం" అనే వ్యాఖ్యానం రాశాడు. ప్రముఖుల మన్నల్ని ప్రశంసల్ని అందుకున్నాడు. ఇతడు భరతుడు రాసిన "నాట్యశాస్త్రం" కు "అభినవభారతి" అనే పేరుతో వ్యాఖ్యానం కూడా రాశాడు. అభినవగుప్తుడు "లోచనం" వ్యాఖ్యానానికి ముందే "ధ్వన్యాలోకం" కు "చంద్రిక" అనే వ్యాఖ్యానం వున్నట్లు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ గ్రంథం ఇప్పుడు అందుబాటులో లేదు.

ఆనందవర్ధనుడు కాశ్మీరును పరిపాలించిన అవంతివర్మ ఆస్థానంలో వుండేవాడు. ఇతడు "విషమ బాణశీల", "దేవీశతకం", "అర్జున చరితం", "వినిశ్చయ టీకా వివృత్తి", "తత్త్వాలోకం" అనే గ్రంథాలు రాశాడు.

ధ్వని సిద్ధాంతాన్ని, దాని భేదాల్ని తెలుసుకోవడానికి పూర్వం, శబ్దవృత్తుల్ని గూర్చి తప్పనిసరిగా తెలుసుకోవాలి. ఇవి తెలిస్తే తప్ప ధ్వనిసిద్ధాంతం సమగ్రంగా అర్ధం కాదు. ఇందులో సందేహం లేదు.

కావ్యానికి శబ్దార్ధాలు "శరీరం". ధ్వని "జీవం". అలంకారాలు "సొమ్ములు". గుణములు "గుణములు". అభిధావృత్తులు వృత్తులు. శబ్దానికి అర్ధాన్ని బోధించే శక్తికి "వృత్తి" అని పేరు.

## 11.2. శబ్దవృత్తులు :

"తిస్రః శబ్ద స్వశక్తియః" - సాహిత్య దర్పణం

శబ్దవృత్తులు మూడు. అవి ఇవి.

1 అభిధ

2 లక్షణ

3 వ్యంజన

"అర్థోవాచ్యశ్చ లక్ష్యశ్చ వ్యంగ్యశ్చేతి త్రిధామతః" - సాహిత్య దర్పణం

అభిధా శక్తిచే చెప్పబడే అర్థాన్ని "వాచ్యం" అనీ, లేదా "అభిధేయం" అనీ అంటారు. లక్షణాశక్తిచే చెప్పబడే అర్థాన్ని "లక్ష్యం" అని అంటారు. వ్యంజనాశక్తిచే చెప్పబడే అర్థానికి "వ్యంగ్యం" అని అంటారు.

| వ.సం | శబ్దవృత్తులు (శక్తి) | శబ్దం | అర్థం |
|---|---|---|---|
| 1. | అభిధ వాచకం | వాచ్యం | వాచ్యం (అభిధేయం) |
| 2. | లక్షణ | లక్షకం | లక్ష్యం |
| 3. | వ్యంజన | వ్యంజకం | వ్యంగ్యం |

మూడు విధాలైన శబ్దాలకి మూడు విధాలైన అర్థాల్ని బోధించే శక్తులు కూడా మూడే. వాటినే "త్రివిధ శబ్దవృత్తులు" అని అంటారు.

వ్యంజానికి "ధ్వని", "ధ్వనకం", "గమనం", "ద్యోతకం", "ప్రత్యాయనం" అనేవి పర్యాయ పదాలు. మీమాంసకుల్లో ఒక తెగకు చెందివారు శబ్దార్థాల్ని బోధించు అభిదా లక్షణా వ్యంజనా శక్తులతో పాటు వాచ్యార్థాన్ని బోధించు తాత్పర్యశక్తి అనే నాల్గోశక్తి కూడా అవసరమని భావించారు. దీన్నే అభిహితాన్వయవాదులు నిషేదించారు. మీమాంసకుల్లో రెండో తెగవారు తాత్పర్యశక్తిని అంగీకరించరు. వీరిని అన్వితాభిదానులు అని అంటారు. విద్యానాథుడు వ్యంజనాశక్తి కంటే తాత్పర్యశక్తి వేరు కాదని అభిప్రాయపడ్డాడు. ఆనందవర్ధనుడు వైయాకరణుల స్ఫోటవాదాన్ని ఆధారంగా గ్రహించి ధ్వని సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు.

## 11.3. త్రివిధ శబ్ద వృత్తులు :

### 11.3.1. అభిధావృత్తి (అభిధాశక్తి) :

సంకేతికార్థకమైన అర్థాన్ని బోధించు శబ్దశక్తి లేక "వృత్తి" ని "అభిధ" అని అంటారు. సంకేతితార్థకం అంటే వాచక శబ్దానికి గల ముఖ్యార్థం ప్రధానార్థం. దీన్నే "వ్యాచ్యార్థం" అని అంటారు. ఇది వ్యాకరణం, ఉపమానం, ఆప్తవాక్యం, వ్యవహారం, వివరణం, అన్యపద సాన్నిధ్యం అనే వానిచే నిర్ణయించబడుతుంది. అభిధావృత్తి నాలుగు విధాలు.

## త్రివిధ శబ్దవృత్తులు - పట్టిక

- I. అభిధావృర్తి
  1. యౌగికం
  2. రూఢం
  3. యోగ రూఢం
  4. యోగిక రూఢం
- II. లక్షణావృత్తి
  1. జగత్ లక్షణ
  2. అజహత్ లక్షణ
  3. సారోప లక్షణ
  4. సాధ్యావసాయ లక్షణ
- III. వ్యంజనావృత్తి
  1. శబ్ద శక్తి మూల వ్యం జన
  2. అర్థ శక్తి మూల వ్యం జన
  3. ఉభయ శక్తి మూల వ్యం జన

అభిధావృత్తి

1. యౌగికం
2. రూఢం
3. యోగరూఢం
4. యౌగికరూఢం

## 1. యౌగికం :

"యోగం" అంటే అవవార్థం. అవయవార్థాన్ని మాత్రమే బోధించే శబ్దం "యౌగికం". యోగం కలది "యోగికం". అంటే వ్యుత్పత్త్యర్థమే ప్రధానంగా కలదన్నమాట.

ఉదా॥ పాచకుడు పాకం చేసేవాడు అనే వ్యుత్పత్తియే ఇక్కడ ప్రధానం.

## 2. రూఢం :

వ్యుత్పత్త్యర్థంతో సంబంధం లేకుండా కూడా నియతమైన అర్థాన్ని బోధించే శబ్దం "రూఢం" అన్పించుకుంటుంది.

ఉదా॥ అవవార్థంతో ఏమాత్రమూ సంబంధం లేకుండానే ఆ పదాలు భోదించవలసిన అర్థాలని బోధిస్తాయి. కాబట్టి ఇలాంటి పదాలని "రూఢసంజ్ఞ" అని అంటారు.

## 3. యోగరూఢం :

యోగత్వ, రూఢత్వాలు రెండూ ప్రధానమైనచో అది "యోగరూఢం". అంటే వ్యుత్పత్తి, వాడుక ఇక్కడ ప్రధానమైనవి.

ఉదా॥ పంకజం, అల్లుడు.

"పంకజం" (బురద) నుండి పుట్టింది అనే వ్యుత్పర్థం వున్ననూ "పంకజం" అనే పదానికి "పద్మం" అనే అర్థమే రూఢం. "అల్లుడు" అనే పదానికి కూతురు మొగుడు అనే అర్థమేకాక, కుటుంబాన్ని విస్తరింపజేయువాడు అనే వ్యుత్పర్థం వుంది. అంచేత ఇలాంటి పదాలు "యోగరూఢం" అన్పించుకుంటాయి. సర్వసాధారణంగా ఇలాంటి పదాలకూ, రూఢికీ ప్రాధాన్యం వుంది. అయితే వ్యుత్పత్తి కూడా కన్పించుటచే ఈ పదాలు "యోగరూఢం" అయ్యాయి.

## 4. యౌగికరూఢం :

కొన్ని శబ్దాల్లో వ్యుత్పత్తి వల్ల వచ్చిన అర్థం వేరుగానూ, రూఢి వల్ల వచ్చిన అర్థం వేరుగానూ వుంటుంది. ఇలాంటి పదాలు "యౌగికరూఢం" అవుతాయి.

ఉదా॥ ఉద్భిదం. నేలను భేదించుకొని పుట్టింది అనే వ్యుత్పత్తిచే, ఈ పదానికి తరుగుల్మాదికం అని అర్థం. ఇట అవయవార్థం ప్రధానం అగుట యౌగికత్వం. ఒక యాగంనకు ఉద్భిదం అనే పేరువుంది. ఇక్కడ రూఢికి ప్రాధాన్యం. యౌగికార్థంలో తరుగుల్మాదికమునూ, రూఢిలో యాగవిశేషమూ బోధించుటచే ఈ పదం "యౌగికరూఢం" అవుతుంది.

### 11.3.2. లక్షణావృత్తి :

"ముఖ్యార్ధబాధే, తద్యోగేరూఢితో థప్రయోజనాత్
అన్యోర్థోలష్యితేయత్సా లక్షణా రోపిత క్రియా" - - కావ్యప్రకాశం

శబ్దం యొక్క ముఖ్యార్థానికి బాధ కలిగేటప్పుడు రూఢిచే కానీ, ప్రయోజనంచే కానీ, ముఖ్యార్థ సంబంధం కల మరో అర్థం దేనిచో బోధింపబడునో ఆ ఆరోపిత శబ్ద వ్యాపారమే "లక్షణ" అనబడుతుంది.

మన అలంకారికలకు "లక్షణావృత్తి"ని గూర్చి ఒక్కొక్కరు ఒక్కోరకంగా తమ తమ అభిప్రాయాల్ని చెప్పారు. అవి ఇవి.

## A కావ్య ప్రకాశం - మమ్మటుడు :

- లక్షణ
  - శుద్ధ లక్షణ
    1. సారోప పాదాన లక్షణ
    2. సాధ్యవ సాయో పాదశ లక్షణ
    3. సారోప లక్షణ
    4. సాధ్యవ సాయ లక్షణ
  - గౌణి లక్షణ
    1. సారోప గౌణి
    2. సాధ్యవ సాయగౌణి

## B వృత్తివార్తికం :

- లక్షణ
  - శుద్ధ లక్షణ
    1. నిరూఢ
    2. ఫల లక్షణ సారోప
    3. ఫల లక్షణ సాధ్యవ సాయ
    4. జహల్లక్షణ
    5. అజ హల్లక్షణ
    6. జహదజ హల్లక్షణ
  - గౌణి లక్షణ
    1. నిరూఢ
    2. ఫల లక్షణ సారోప
    3. ఫల లక్షణ సాధ్యవ సాయ

## C రసగంగాధరం - జగన్నాథపండితరాయలు

- లక్షణ
  - శుద్ధ లక్షణ
    1. జహత్స్వార్థ
    2. అజహత్స్వార్థ
    3. సారోప
    4. సాధ్యవసాయ
  - గిణి లక్షణ
    1. సారోప
    2. సాధ్యపసాయ

## D సాహిత్యం దర్పణం - విశ్వనాథుడు :

- లక్షణ
  - శుద్ధ లక్షణ
    1. ఉపాదన లక్షణ
    2. లక్షణ లక్షణ
    3. సారోప
    4. సాధ్యవసాయ
  - గౌణి లక్షణ

ఈ లక్షణావృత్తి సంబంధ నిబంధన, సాదృశ్య నిబంధన అని రెండు విధాలు. సంబంధ మూలకమైన లక్షణ రెండు విధాలు. ఒకటి జహత్ లక్షణ, రెండు అజహత్ లక్షణ. సాదృశ్య మూలకమైన లక్షణ రెండు విధాలు. ఒకటి సారోప లక్షణ రెండు సాధ్యవసాయ లక్షణ. ఈరకంగా లక్షణ ప్రధానంగా మొత్తం నాలుగు భేదాలుగా వర్గీకరించవచ్చు.

- లక్షణ
  1. జహల్లక్షణ
  2. అజహల్లక్షణ
  3. సారోప లక్షణ
  4. సాధ్యవసాయ లక్షణ

**1. జహల్లక్షణ :**

తనకున్న అర్థాన్ని కోల్పోయి దానికి సంబంధించిన అర్ధం ఎక్కడ బోధించబడుతుందో ఆ వృత్తి "జహల్లక్షణ" అన్పించుకుంటుంది.

ఉదా॥ "గంగలో గొల్లపల్లె"

"గంగలో గొల్లపల్లె" అనేటప్పుడు "గంగ" అనే పదానికున్న అర్థం విడిచిపెట్టబడి, దానికి సంబంధించిన "తీరం" అనే అర్థం బోధించబడుతుంది. కావున ఇది "జహల్లక్షణ" లక్ష్యం అవుతుంది.

"ప్రతాపరుద్రుని జైత్రయాత్రా సందర్భంలో శత్రు రాజుల పట్టణాలు గట్టిగా ఆక్రోశిస్తున్నాయి"

అనేటప్పుడు పట్టణాలు అచేతనాలు కాబట్టి ఆక్రోశించడం జరగదు కదా! ఇక్కడ పట్టణాలు అనేపదం స్వార్థత్యాగం పొంది అంటే తనకున్న అర్థాన్ని కోల్పోయి పట్టణాల్లోని ప్రజలు అనే వాచ్యార్థానికి సంబంధించిన మరో అర్థాన్ని విడిచిపెట్టే బోధిస్తుంది. "జహత్" అంటే విడిచి పెట్టటం అని అర్థం. తనకున్న అర్థాన్ని లక్షణం వుంది. కావున ఇది "జహల్లక్షణ" అవుతుంది.

**2. అజహల్లక్షణ :**

స్వార్థత్యాగం లేకుండా దానికి సంబంధించిన అర్థాన్ని బోధించే శబ్దవ్యాపారం "అజహల్లక్షణ" అవుతుంది.

"ప్రతాపరుద్రుని పాద పీఠాన్ని, ప్రకాశిస్తున్న రత్నకాంతుల సముదాయాలు గల కిరీటములు అలంకరిస్తున్నాయి."

ఇక్కడ "కిరీటములు" అనేటప్పుడు తన అర్థాన్ని నిలుపుకొంటూ దానికి సంబంధించిన అంటే కిరీటములు ధరించిన రాజులు అనే అర్థం బోధించబడుతుంది. కాబట్టి ఇది అజహత్. అజహత్ అంటే విడిచి పెట్టని అని అర్థం. జహత్ అంటే విడిచిపెట్టే అని అర్థం.

**3. సారోప లక్షణ :**

సాదృశ్యం ఆధారంగా ఏర్పడిన లక్షణ "సారోప లక్షణ" (స+ఆరోప లక్షణ). ఉపమేయం, ఉపమానం విడిగా చెప్పబడుతూ ఆరోపించబడి అభిన్నాలని చెప్పబడితే అది "సారోపలక్షణ" అవుతుంది.

"చంద్రుని లోని నల్లని మచ్చన్ని కొందరు సారంగం అంటారు. నేను మాత్రం కాకతి ప్రతాపరుద్రుని కీర్తి సంపదచే ఓడిపోయిన చంద్రుడు ఆ ప్రతాపరుద్రుని లాంఛనమైన వరాహాన్ని ధరిస్తున్నాడని భావిస్తాను."

ఇక్కడ సారంగం ఉపమేయం. వరాహం ఉపమానం. పై ఉదాహరణలో ఉపమేయ ఉపమానాలు రెండూ విడిగా పేర్కొనబడి అభిన్నాలని చెప్పబడింది. సారంగు వరాహం అని ఆరోపించబడి అభేద ప్రతిపత్తి వర్ణించబడింది. కాబట్టి ఇది "సారోప లక్షణ".

**4. సాధ్యవసాయ లక్షణ :**

ఉపమేయాన్ని కప్పిపుచ్చి ఉపమానంతో అభేదాత్మకంగా చెప్పితే అయితే "సాధ్యవసాయ లక్షణ". (స + అధ్యవ సాయ లక్షణ). ఇది కూడా సాదృశ్య ఆధారంగా ఏర్పడిందే.

"కాకతి ప్రతాపరుద్రుని ఉద్దేశించి "కాకతీయ కులాంబోధి నుండి ఈ చంద్రుడు ఉద్భవించాడు. తన ఉదయం చేత కువలయానికి ఉల్లాసం కల్గిస్తున్నాడు".

ఇక్కడ ప్రతాపరుద్రుడు ఉపమేయం. చంద్రుడు ఉపమానం. ఇక్కడ ఉపమేయాన్ని చెప్పక అంటే కప్పిపుచ్చి ప్రతాపరుద్రుడు అనే చంద్రుడు అని చెప్పక, ఉపమానంతో అభేద ప్రతిపత్తి వర్ణించబడింది. ప్రతాపరుద్రుడను ఉపమేయం కప్పిపుచ్చబడి కాకతీయ కులాబ్ధి నుండి పుట్టిన చంద్రుడు అనే ఉపమానం మాత్రమే చెప్పబడింది. అంటే ఉపమానంతో అభిన్నంగా వర్ణించబడింది. కావున ఇది "సాధ్యవసాయలక్షణ" అవుతుంది.

## సామ్య నిబంధన లక్షణ :

సామ్యనిబంధనా లక్షణలో 1. లక్షిత లక్షణ 2. విపరీత లక్షణ అనే రెండు భేదాలు చోటు చేసుకున్నాయి.

### 1. లక్షిత లక్షణ :

వాచ్యార్థానికి సంబంధం కలుగక, వాచ్యార్థానికి సాక్షాత్తుగా ఉపపత్తి గల అర్థంకాక పరంపరగా సంబంధించిన మరో అర్థం బోధించే శబ్దశక్తి "లక్షిత లక్షణ".

ఉదా॥ ద్విరేఫం

రెండు రేఫాలు కలది అని వ్యుత్పత్తి. వ్యవహారంలో రెండు రేఫాలు గల పదం అనే భావం కలుగవచ్చు. ద్విరేఫం అంటే "భ్రమరం" (తుమ్మెద) అనే రూఢియగు అర్థం వుంది. శబ్దాన్ని బట్టి తుమ్మెద అనే అర్థం కలుగదు కదా! అయితే ఇందులో వాచ్యార్థానికి సంబంధం కలుగక, రూఢ్యర్థం అనుసరించి "భ్రమర" మైంది. ఈ విధంగా వాచ్యార్థం కాక పరంపరగా సంబంధం గల మరో అర్థం బోధించబడింది. కావున ఇది "లక్షిత లక్షిణ".

మరో ఉదా॥ రోదరం

ఉదరంలో రకారం కలది అని వ్యుత్పత్తి. చక్రవాకం ("ర" ఉదకం కలది) అని అర్థం. ఇందులో కూడా పై పదం వలే వాచ్యార్థానికి సంబంధం కలుగక, రూఢ్యర్థంలో ప్రయుక్తమైంది.

### 2. విపరీత లక్షణ :

వాచ్యార్థానికి విపరీత (విరుద్ధ లక్షణం) లక్షణం కలది "విపరీత లక్షణ".

ఉదా॥ వాడుబృహస్పతి

ఇది ఒక పామరుని గూర్చి చెప్పిన వాక్య ప్రయోగం. "వాడుబృహస్పతి" అనే వాక్యం వినగానే బృహస్పతి వలె బుద్ధిశాలి అనే లక్ష్యార్థం తోస్తుంది. అయితే ఇది పామరుని గూర్చి ప్రయోగించబడింది. కాబట్టి వట్టి మూర్ఖుడు అనే విపరీతార్థం స్ఫురిస్తుంది. ఇందులో వాచ్యానికి సంబంధం లేకపోవడం, తర్వాత దానికి విరుద్ధమైన మూర్ఖుడు అనే లక్షణార్థం తోచుటచే ఇది "విపరీత లక్షణ".

మరో ఉదా॥ అబద్ధాల కోరును చూచి సత్యహరిశ్చంద్రుడను "విపరీత లక్షణ". దీనివల్ల వ్యతిరేక అర్థం గోచరిస్తుంది.

## 3. వ్యంజనావృత్తి :

అభిదా శక్తి ప్రాకరిణతమైన వాచ్యార్థాన్ని మాత్రమే తెలుపుతుంది. లక్షణా శక్తి వాచ్యార్థానికి బాధ కలిగేటప్పుడు దానితో సంబంధం గల అర్థాంతరాన్ని బోధిస్తుందది. వ్యంజనా శక్తి శబ్దాలకు వాచ్యార్థం పొసగిన పిదప దానికి ఉత్కర్షను కల్గించునట్టి అర్థాంతరాన్ని బోధింప చేస్తుంది. అంటే ప్రకృతార్థాన్ని, దాని కంటె సుందరమైన అప్రకృతార్థాన్ని స్ఫురింపచేసేది వ్యంజన.

**ఉదా॥** "పదమెత్తం గల హంసలీల, యధరస్పందంబుసేయన్ శుభా
స్పద మౌరాగ కదంబకంబు శ్రుతి చూపన్ శ్రీ విలాసంబు,
కేర్ కదలింపన్ సుకుమార పల్లవనవైలా లక్ష్మి వీక్షింప
ట్పదియుంబొల్చు, తరంబె కన్నెగొని యాడన్ గేయవాక్ప్రౌడిమన్"

వ్యంజనా వృత్తి మూడు విధాలు

- శబ్ద శక్తి మూల వ్యంజనం
- అర్థ శక్తి మూల వ్యంజనం
- ఉభయ శక్తి మూల వ్యంజన

## 1. శబ్దశక్తి మూలవ్యంజన :

కొన్ని శబ్దాలకు అనేక అర్థాలు బోధించే శక్తి వుంటుంది. దీన్నే "శబ్దశక్తి" అని అంటారు. అది ప్రధానంగా కలది "శబ్దశక్తి మూల వ్యంజన". ఆ శబ్దాలకు పదాల వేరే పర్యాయ పదాల గూర్చినచో వ్యంగ్యార్థం రాదు.

**ఉదా॥** "నరస భూపాలుని కరమున తనరెడు ఖడ్గము తన సమగ్ర
ధారాజలమున మునుగు వైరులకు
అనిమిష భావము (రెప్పపాటు కాని) ను గూర్చును". అనేది ప్రకృతార్థం.

నరస భూపాలుని ఖడ్గం తన ధారాజలంలో మునుగు శత్రువునకు అనిమిష భావం అంటే దేవత్వం నందించును. అనే వ్యంగ్యార్థం. దీన్నే అప్రకృతార్థం అని అంటారు. ఇందులో "నరసింహుని - నరులకు అనిమిత్వము" అనే పదాలు వ్యంజకాలైనవి. వానిని తొలగించి నరసింహుని వైరులకు అనిమిషత్వం అని ప్రయోగించినచో వ్యంగ్యార్థం లేదు. కాబట్టి ఇది "శబ్దశక్తి మూల వ్యంజన" (వ్యంగ్యం).

మరో ఉదా॥ "కేశవం పతతం దృష్ట్వా భీమంబైన గతాయుషమ్
రుదన్తి కౌరవా స్సర్వే పాండవా హర్ష మాయుయుః"

## 2. అర్థ శక్తి మూల వ్యంజన :

అర్థశక్తి ప్రభావం కలది "అర్థశక్తి మూల వ్యంజన". వ్యంజక పదాలకు బదులుగా పర్యాయపదాలు ప్రయోగించిననూ వ్యంగ్యార్థానికి భంగం లేనిదని భావం.

ఉదా॥ "నృసింహభూపా! నీ శత్రువు భార్య పర్వత ప్రదేశముల వసించుచు
నచ్చటి బోయ కాంతలతో "మయూరి యందలి చందురుడు
చల్లనివాడు మయూరి మందమారుతము గూడ చల్లనిదే అని తెలుపును".

దీనివల్ల నరసభూపాలుని శత్రువు భార్య ముగ్ధ అనీ, భర్తృవియోగంచే విరహబాధ పొందుచున్నదనీ, నరసరాజు తన శత్రురాజులనందరినీ జయించెననీ వ్యంగ్యార్థం కలుగుతుంది. కాబట్టి ఇది "అర్థశక్తి మూల వ్యంజన".

మరో ఉదా॥ విరాటపర్వంలో కీచక వధ ఘట్టంలో వున్న పద్యాన్ని దీనికి మంచి ఉదాహరణగా తీసుకోవచ్చు. అది విరాట సభ. కీచకుడు ద్రౌపదిని పరాభవించుట చూచిన భీముడు ఉగ్రుడైయ్యాడు. సమయ భంగమగు ప్రమాదాన్ని గుర్తించి కంకరూపమున వున్న ధర్మరాజు వలలుడైన భీముని వారించాడు.

"వలలుండెక్కడ జూచెనొండెడన సేవ్యక్ష్మాజముల్ పుట్టలే
ఫలితంబై వరశాఖ లొప్పగ, ననల్ప ప్రీతి సందించుచున్
విలసచ్ఛాయను పాశ్రిత ప్రతితికిన్ విశ్రాంతి కావింపగా
గల యీ భుజము వంటకట్టయలకై ఖండింపగా నేటికిన్"

ఇందులోని అర్థం సుగమం. ఇందులోని పదాల్ని తొలగించి తత్సమానార్థమైన పదాలు వచ్చినప్పటికీ వ్యంగ్యం స్థిరంగా వుంటుంది.

### 3. ఉభయశక్తి మూల వ్యంజన :

ఇందులో "శబ్దశక్తి మూల వ్యంజన", "అర్థశక్తి మూల వ్యంజన" రెండూ వున్నాయి. అంచేతనే ఇది "ఉభయ శక్తి మూల వ్యంజన" అయ్యింది.

"అరిదరికరుడై, సుమనో
వరభరణధురీణుఁడై, యవారితలక్ష్మీ
స్థిరనివాస భాసురుఁడై
నరసింహుడు వొచ్చు ఁద్రిభువనస్తుత మహిమన్"

నరసింహుడు, అరిదరకరుడై = శత్రువులకు భయం కల్గించువాడై, సుమనోవర = పండిత శ్రేష్ఠుల్ని, భరణధురీణుడై = పోషించు భారం దాల్చినవాడై, రాజ్యలక్ష్మి = రాజ్యమచే, స్థిరనివాస = స్థిరనివాసంచే, భాసురుడై = ప్రకాశించువాడై, త్రిభువనస్తుత మహిమన్ = ముల్లోకముల పొగడిక మహిమచే, పొల్చున్ = ఒప్పును. ఇది వ్యంగ్యార్థం.

ఇందులోని "అరిదరికరుడు - సుమనోవరభరణ ధురీణుడు, నరసింహుడు" అనేవి పరివృత్తిని ఒప్పుకొనవు. లక్ష్మీ నివాస భాసురుడు అనేది సహించును. ఇలా కొన్ని పదాలు పరివృత్తిని సహించి మరికొన్ని సహింపక వుండునట్లు చెప్పడం "ఉభయశక్తి మూలవ్యంజన".

**మరో ఉదా॥**

"పార్శ్వ స్థదారో భగవాన్ మేశః
ముఖస్థదారో భగవాన్ విధాతా
ఉరస్థ దారో భగవాన్ రమేశః
శిరస్థ దారో క్వచనత్వ దన్యః"

పై శ్లోకంలో మొదటి మూడు పాదాలు అర్థశక్తిమూల వ్యంజనానికి సంబంధించినవి. చివర నాలుగోపాదం శబ్దశక్తిమూల వ్యంజనానికి సంబంధించినది.

సంగ్రహంగా త్రివిధ శబ్దవృత్తులు ఇవి.

## 11.4 మాదిరి ప్రశ్నలు :

1. త్రివిధ శబ్దవృత్తులు గూర్చి తెలియచేయండి.
2. వ్యంజనావృత్తి గూర్చి వ్రాయండి.
3. లక్షణా వృత్తి గూర్చి వివరించండి.
4. అభిధావృత్తి గూర్చి విపులీకరించండి.

## 11.5 ఆధార గ్రంథాలు :


1. తెలుగు సాహిత్య విమర్శ - సిద్ధాంతాలు - సూత్రాలు - డా॥ వెలమల సిమ్మన్న
2. విమర్శ - వివేచన (అముద్రితం) - డా॥ వెలమల సిమ్మన్న
3. విమర్శ - మౌలిక లక్షణాలు - ఆచార్య మూదికొండ వీరభద్రయ్య
4. సాహిత్య దర్శనం - ఆచార్య కాకర్ల వేంకట రామనరసింహం
5. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు
6. సాహిత్య సోపానములు - ఆచార్య దివాకర్ల వేంకటావధాని
7. సాహిత్య సౌందర్య దర్శనం - శ్రీ చర్ల గణపతిశాస్త్రి


**- డా॥ వెలమల సమ్మన్న**

పాఠం - 13

# దశవిధ రూపకాలు

## 1. పరిచయం :

భారతీయాలంకారికులు కావ్యాన్ని స్వరూప, స్వభావ, వస్తు భావాన్ని బట్టి నాలుగు విధాలుగా వర్గీకరించారు. అందులో స్వభావాన్ని బట్టి లేదా ప్రదర్శన ప్రమాణం బట్టి మరల కావ్యాన్ని రెండు విధాలుగా విభజించారు

శ్రవ్య కావ్యం వినటానికి, చదవటానికి మాత్రమే వుపయోగపడుతుంది.

దృశ్యకావ్యం శ్రవణేంద్రియాలతోపాటు నేత్రేంద్రియాన్ని కూడా అలరిస్తుంది.

వినుటవేరు, చూచుటవేరు. ఒక వృత్తాంతాన్ని చెవులార వినవచ్చు కాని కనులార చూచేటప్పుడు ఒక దృశ్యం సహృదయాలపై చెరిగిపోనట్టి ముద్రవేయటం సహజం. అందువల్ల "కావ్యేషు నాటకం రమ్యమ్" అని పండితులు అన్నారు.

## దృవ్యకావ్యం - స్వరూప లక్షణాలు :

"దృశ్యశ్రవ్యత భేదేనపునః కావ్యంద్విధామతమ్
దృశ్యంతత్రాభినేయంత ద్రూపారోపాత్తు రూపకమ్"

దృశ్య శ్రవ్యత భేదం చేత మరల కావ్యం రెండు విధాలు. అందులో దృశ్యం అభినయం, రూపం ఆరోపించుట చేత అది రూపకమనబడుతుంది.

దృశ్యకావ్యానికి రూపమనీ, రూపకమనీ, నాటకమనీ అంటారు. ఈ మూడు పదాలకి ప్రదర్శనీయమైన కావ్యమని అర్థం.

### 1. రూపం :

"దృశ్యతయా రూపమ్" దృశ్యత్వం చేతనే ఈ కావ్యం రూపమని పిలువబడుతుంది.

### 2. రూపకం :

"దృశ్యతయా రూపమ్ ఇతి రూపకమ్" అని వ్యుత్పత్తి అంటే ఈ కావ్యంలోని చిత్రాలన్నీ కంటికి కన్పించేటట్లు చేయుచున్నారు. కనులకు రూపింప చేయుచున్నారు. కాబట్టి రూపకం అని దీనికి పేరు వచ్చింది.

లోకంలో జరిగిన వృత్తాంతానికి ఆధారభూతమైన వ్యక్తుల యొక్క మూర్తుల్ని, వారి స్వభావాల్ని నటులు తమకు ఆరోపించుకొని నటిస్తారు. కావున రూపం రూపకమైంది. దీనికి పాత్రారోహణం (Assumption of Character) అని కూడా అంటారు.

### నృత్యం :

ప్రాచీన మానవుడు నోటితో గీతాన్ని మానవుడు కాలితో నృత్యం చేసేటప్పుడు గీతం లోగల తాళానికి అనుగుణంగా చేశాడు. కాని తాళబద్ధంగా కాని ఉత్తచిందులు వేయలేదు. తాళబద్ధమైన పాదన్యాసమే నృత్తం, సమాజంలో నాగరికత పెరిగినకొద్దీ మానవ మనస్సు వికసించినకొద్దీ, మనిషిలో నృత్తం చేయవలెనని కోరిక పుట్టింది. ఆ తర్వాత నృత్యం వృద్ధి పొందింది.

**నృత్తం :**

హస్త న్యాసం, పాదన్యాసం, నేత్రన్యాసం ఈ మూడింటిని "గాత్ర నిక్షేపవిద్య" అని అంటారు. ఈ మూడు శబ్దార్థ సూచకంగా సైతం వుండాలనే తలపుతో చేసిన మరో ప్రక్రియ నృత్యం. నోటితో గీతం పాడుతు అందులోని శబ్దాల అర్థాన్ని చేతితో, ముఖ భంగిమలతో ప్రదర్శించడం దాని ప్రధానాశయం. అంచేతనే ఈ నృత్యం నృత్తం కంటె గుణాధికమై శాస్త్ర నిబద్ధమైంది. అందచేతనే నృత్తాన్ని మార్గ అనీ నృత్యాన్ని "దేశీ" అని అలంకారికులు పేర్కొన్నారు

**అభినయం :**

శబ్దార్థ ప్రదర్శనమే కాక భావాశ్రయ ప్రధానమైన వ్యాక్యార్థాన్ని సైతం ప్రదర్శించాలనే కుతూహలంతో మానవుడు మరికొంత ముందుకు వెళ్ళి మనస్సుకు పదునుపెట్టాడు. దాని ఫలితంగా గాత్ర, నిక్షేప విద్య అవస్థానుకృతమై "అభినయం" అనే పేరు గాంచింది. శబ్దార్థాన్ని ప్రదర్శించే నృత్యం, పద్యానికి ప్రతి పదార్థం చెప్పడం లాంటిది. భావాశ్రయమైన అభినయం పద్యంలోని భావాన్ని రసాన్ని వివరించడం వంటిది.

**నాట్యం :**

నాటకంలో అనేక నటీనటులు చేసే అభినయానికి సమిష్టి మీద "నాట్యం" అని పేరు వచ్చింది. కాబట్టి నాట్యం అంటే నాటకాన్ని అభినయించడం అని అర్థం.

**రూపకం - నాటకం - సమాహార కళ :**

దృశ్యకావ్యాన్ని "సమాహారకళ" అని అంటారు. అంటే కవిత్వం, చిత్రలేఖనం, సంగీతం, నాట్యం, నృత్యం, నృత్తం ప్రయోగానుకూలత మొదలైన లక్షణాలన్నీ ఇందులో వుండడం వల్ల దీన్నే "సమాహారకళ" అని అన్నారు. అంటే లలిత కళలన్నీ ఈ రూపకంలో ప్రతిబింబించడంచేత ఇది సంపూర్ణం, సర్వాంగ సుందరం అయిన కళగా ప్రసిద్దికెక్కింది. మనిషిలో పంచేంద్రియాలు చోటుచేసికున్నాయి. చక్షువు, చెవి అనే రెండు ఇంద్రియాలు ఏకకాలంలో పనిచేయడం వల్ల చూసేది, విన్నది ఒకే మారు మనస్సులో ప్రవేశించి హత్తుకొని మరచిపోవడానికి అవకాశం వుండదు. కేవలం శ్రవణేంద్రియం మాత్రమే పని చేసినపుడు మనస్సుకు సరాకురావడానికి అవకాశం వుంది. ఎందుకంటే రెండు ఇంద్రియాలు పని చేస్తాయి. అంచేతనే శ్రవకావ్యం కంటే దృశ్యకావ్యం రెట్టింపు ఫలితం ఇస్తుంది. కాబట్టి అలంకారికులు శ్రవ్యకావ్యం కంటే దృశ్యకావ్యం గొప్పదని పేర్కొన్నారు. అందుకే "నాటకాంతం హి సాహిత్యం" అనే నానుడి పుట్టింది.

**రూపకం - ప్రయోజనం :**

మానవుడు నిరంతరం శ్రమించే జీవి. మనిషి జీవితంలో కష్ట, సుఖాలు రెండూ వుంటాయి. దుఃఖాన్ని మరచిపోవడానికి మానవుడు ఆనందాన్ని కోరుకుంటాడు. ఇక్కడ చెప్పొచ్చేది ఏమంటే మనస్సునకు విశ్రాంతిని, తాత్కాలిక ఆనందాన్ని పంచి ఇచ్చే దాన్ని దృశ్యకావ్యం అంటారు. దీన్నే రూపకం అనీ, నాటకం అనీ, వ్యవహరిస్తారు.

రూపకాన్ని చూస్తున్నంతసేపు ఆ రూపకంలోని పాత్రలు ఏయే భావాల్ని ఏయే రసాల్ని అభినయం చేస్తున్నాయో చూస్తూ, వింటూ ప్రేక్షకుడు కూడా ఆ పాత్రలో, ఆ పాత్ర భావనలో, ఆ పాత్ర రసపోషణలో లీనమై తాత్కాలికంగా పాత్రతోపాటు తాను కూడా సుఖ దుఃఖాన్ని పొందుతాడు. తర్వాత తీరికగా వున్నప్పుడు ఆయా పాత్రల జీవితాది విశేషాల్ని ఆకళింపు చేసికొని, తన జీవిత విధానంతో బేరిజు వేసుకొని, అంతకు ముందు గడిపిన జీవితం కంటే సుఖవంతమైన జీవితాన్ని గడపడానికి ప్రయత్నం చేయడానికి అవకాశం ఈ నాటకం లేదా రూపకం ఇస్తుంది.

**3. నాటకం :**

పాత్రారోపణ చేసికొన్న నటులు, ఎవరి పాత్రను వారే పాత్రానుగుణంగా చక్కగా అభినయిస్తారు. సమిష్టి మీద అందరి అభినయం కలిసి నాటక ప్రదర్శనం అగుతుంది. కాబట్టి నాట్యమంటే నాటకాభినయం అని అర్థం. "లోకావృత్తాంత దర్శకం నాటకం" నాటకం లోకవృత్తాంత దర్శనం. ఏ నాటకమైనప్పటికీ ఈ జగన్నాటకంలో ఒక అంతర్నాటకమే. ఈ అనుభూతిని లేశమాత్రంగానైనా సామాజికులు పొందగల్గినచో వారు ఆక్షణ మాత్రమైన జీవన్ముక్తులు అవుతారు. నాటకం శిల్పంలో ఉత్తమ పాత్ర చిత్రణం, సజీవపాత్ర చిత్రణం, వుండవచ్చు. హృదయంగమమైన సంభాషణా ప్రౌఢి వుండవచ్చు. చతుర్విధాభినయ వినీతమైన సన్నివేశ కల్పనం వుండవచ్చు. కాని అంతమాత్రం చేత అది నాటకం కాజాలదు. నిజమైన నాటకం జగన్నాటకానికి ప్రతిబింబం కావాలి. అప్పుడే అది మంచి నాటకం అన్పించుకుంటుంది.

**దశరూపకాలు - వివరణం :**

సంస్కృతంలో ఒక అంకం మొదలుకొని పది అంకాల వరకు గల రూపకాలు 10 వున్నాయి. వస్తు స్వభావాన్ని బట్టి కథా తత్త్వాన్ని బట్టి, రస స్వరూపాన్ని బట్టి నాకయ నిర్ణయాన్ని బట్టి, అంక నియమాన్ని బట్టి, ఆయా రూపకాల విభజన జరిగింది. ఈ పదింటిలో సర్వ లక్షణ సంపన్నం, సర్వ సామాజికానంద సంధానం అయిన రూపకానికే నాటకమని పేరు. ఇది దశవిధ రూపకాల్లో ప్రథమ గణ్యమైంది. రూపక శబ్దం జాతి వాచకంగా కూడా ప్రయోగించబడింది. రూపకములన్నింటినీ నాటకాలు అని అనడం పరిపాటి అయింది.

అసలు ఇంతకీ ధనంజయుడు రూపకాల్ని పది విధాలుగా ఎందుకు విభజించాడు అని నిశితంగా పరిశీలిస్తే ఒక విషయం తేటతెల్లమవుతుంది. సమాజంలో ఒక తరహాకు చెందిన మనుష్యులే వుండరు. కొందరు కొన్ని రసాలకు ఆనందాన్ని పొందుతారు. ప్రతీ మనిషికి ఆనందాన్ని కలుగజేయవలసిన అవసరం నాటకకర్తకు వుంది. సమాజంలో పలువిధాలైన సంస్కారాలు వుంటాయి. మనుషుల అభిరుచుల్లో, అవగాహనలో, అలవాట్లలో, అంతస్థుల్లో చాలా భేదం కన్పిస్తుంది. వీటిని దృష్టిలో పెట్టుకొని రూపకాల్ని విభజించివుండవచ్చు. ఎన్నిరూపకాలైనా అంతిమ కర్తవ్యం సామాజికుడికి ఆనందాన్ని కలుగజేయడమే ముఖ్య ఉద్దేశ్యం.

**దశరూపకాలు - ఇతివృత్తం :**

ఈ దశరూపకాల్లో ఇతివృత్తం ప్రధానంగా మూడు విధాలుగా ఉంటుంది. అవి 1) ప్రఖ్యాతం 2) ఉత్పాద్యం 3) మిశ్రమం.

**1. ప్రఖ్యాతం :** ప్రఖ్యాతం అంటే పురాణేతిహాసాల్లో గానీ, చరిత్రలోగానీ చెప్పబడి వున్న కథ. గ్రంథాల్లో కాకుండ లోకంలో ప్రఖ్యాతమైన ఇతివృత్తం కూడా ప్రఖ్యాతమే.

**2. ఉత్పాద్యం :** ఉత్పాద్యం అంటే కేవలం కల్పితం అని అర్థం. కవి, తానే ఒక కథా ప్రపంచాన్ని సృష్టించుకుంటాడు.

**3. మిశ్రమం :** మిశ్రమం అంటే ప్రసిద్ధమైన కథతో నాటకకర్త తాను ఊహించి కల్పించిన కథను కొంత చేర్చడం.

**దశవిధ రూపకాలు - భేదాలు :**

దశవిధ రూపకాలు సంస్కృత సాహిత్య చరిత్రలో ఒక ప్రధానమైన అంశం. తెలుగుసాహిత్యం సంస్కృతం నుంచి అనువదించబడినది. అనుకరించబడింది. అనువాదం ఆదికవి నన్నయ నుంచి శ్రీ కృష్ణదేవరాయ యుగం వరకు అంటే ఆరు వందల సంవత్సరాలు అనువాద ప్రక్రియే తెలుగు సాహిత్యంలో జరిగింది. ఈ విషయం అందరికీ తెలిసిందే. ఇక్కడ ఒక

విషయం మనం గుర్తుంచుకోవాలి. సంస్కృత సాహిత్యాన్ని అదే పనిగా అనువదించిన మన కవులు సంస్కృత నాటకాల వంకకు వెళ్ళలేదు. ఒకవేళ అవి అనువాదం చేయవలసి వచ్చినా వాటిని పద్యరూపంలోనే అనువదించారు. ఈ రూపకాల ప్రభావం సమాజంపై బాగా పడింది. అన్ని ప్రక్రియల కన్నా రూపకక్రియ సమాజంలోకి దూసుకుపోయింది. ప్రజల మన్ననల్ని, ప్రసంశల్ని అందుకుంది. దీనికి ప్రధాన కారణం రూపకం ఆనందాన్ని కలుగజేయడమే కాక విజ్ఞానాన్ని కూడా కలుగజేసింది అనే విషయం మనం తెలుసుకోవాలి.

"దశరూపకం"లో ధనంజయుడు రూపక శబ్ద వ్యుత్పత్తిని వివరిస్తూ

"అవస్థాను కృతిర్నాట్యం, రూపం దృశ్యతయోచ్యతే
రూపకం తత్సమారోపాత్, దశధైవరసాశ్రయమ్"

అని పేర్కొన్నాడు. అవస్థానుకరణం నాట్యం. ఈ నాట్యం దృశ్యమానం కావటంచేత రూపం అనిపించుకుంటుంది. రూప ఆరోపం గలది. కాబట్టి రూపం రూపకమైంది. రసాశ్రయం అయిన రూపకం పది రకాలుగా ధనంజయుడు అందించాడు. దీన్నిబట్టి మనకు అర్థమైంది ఏమంటే రూపకం నాట్యం అభేదకాలని తెలుస్తుంది. నాట్యం అంటే ప్రదర్శించడానికి వుపయోగపడే రూపకం. దీన్నే జన వ్యవహారంలో నాటకం అని అంటారు.

దశవిధ రూపక భేదాలు - పట్టిక

| | | లక్షణం | | | | | | లక్ష్యం |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 | 6 | |
| క్రమ సంఖ్య | రూపకం | ఇతివృత్తం | నాయకుడు | రసం | అంకాలు | సంధులు | వృత్తులు | ఉదాహరణ |
| 1. | నాటకం | ప్రఖ్యాతం | ధీరోదాత్తుడు | శృంగారం | 5 - 10 | 5 | 4 | కాళిదాసు - అభిజ్ఞాన శాకుంతలం |
| 2. | ప్రకరణం | ఉత్పాద్యం | ధీరశాంతుడు | శృంగారం | 5-10 | 5 | 4 | శూద్రకుడు - మృచ్ఛకటికం |
| 3. | డిమం | ప్రఖ్యాతం | ధీరోద్ధతుడు | రౌద్రం లేదా భయానకం | 4 | 4 | 2 సాత్వతీ ఆరభటి | వత్సరాజు త్రిపురదాహం |
| 4. | సమవ కారం | ప్రఖ్యాతం కానీ ఉత్పాద్యం కానీ వుండవచ్చు | దేవ దానవులు | వీరం | 3 | 4 | 3 భారతీ సాత్వతీ ఆరభటీ | వత్సరాజు సముద్ర మథనం |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5. | ఈహా మృగం | కొంత ప్రఖ్యాతం కొంత ఉత్పాద్యం కలిసి మిశ్రమై వుంటుంది | ధీరోదాత్తుడు | శృంగారం | 4 | 4 ముఖ సంధి ప్రతి ముఖ సంధి నిర్వహణ సంధి | 3 భారతీ సాత్వతీ ఆరభటి గర్భసంధి | రుక్మిణీ కళ్యాణం రుక్మిణీ పరిణయం కనుమ శేఖర విజయం |
| 6. | భాణం | ఉత్పాద్యం | ధూర్తుడైన విటుడు | శృంగారం లేదా వీరం | 1 | 2 ముఖ సంధి నిర్వహణ సంధి | 1 భారతీ | కర్పూర చరితం |
| 7. | వీధి | ఉత్పాద్యం | ధీరోదాత్తుడు | శృంగారం | 1 | 2 ముఖసంధి నిర్వహణ సంధి | 1 కైశికీ | శ్రీనాథుని వీధి నాటకం మాధవి వీధి నాటకం మాలతీ వీధి నాటకం |
| 8. | ప్రహసనం | ఉత్పాద్యం | పాషండాదులు | హాస్యం | 1,2, వుండవచ్చు | | | మహేంద్ర వర్మ - మత్త విలాప ప్రహసనం |
| 9. | అంకం | ప్రఖ్యాతం | పామర జనులు | కరుణం | 1 | 2 ముఖ సంధి నిర్వహణ సంధి | 1 భారతీ | విశ్వనాథ కవిరాజు - ఉన్మత్త శర్మిష్ఠాయయాతి |
| 10. | వ్యాయోగం | ప్రఖాతం | ధీరోద్దతుడు | వీరం | 1 | 3 ముఖసంధి, ప్రతిముఖసంది, నిర్వహణ సంధి | 3 భారతీ, సాత్త్వతీ ఆరభటీ | వత్సరాజు - కిరాతార్జునీయం |

* 10 అంకాలు వుంటే అది మహా నాటకం.

దశవిధ రూపకాల్లో నాటకం ప్రధానమైన భేదం. మనం రూపం లేదా రూపకం అనే పదాల్ని విడిచిపెట్టి నాటకం అనే పదాన్నే సామాన్యవాచకంగా వాడుతున్నాం. లోకస్వభావాన్ని నటులు తమలో ఆరోపించుకోవడం చేత నాట్యం రూపకమౌతుంది. అదే నాటకం దృశ్యకావ్యాన్ని దీన్ని "ప్రేక్ష" అని వ్యవహరించారు. శ్రవ్య కావ్యాల నుంచి నాటకాదుల్ని వేరుపరిచే భేదాల్లో దృశ్యత్వం ప్రధానమైంది. అంచేతనే రూపకానికి "దృశ్యకావ్యం" అని పేరు వచ్చింది. ఆంగ్లంలో "Drama" అనే పదానికి సమానార్థకంగా వాడబడేది రూకం పదం. నిజానికి "Drama" అనే పదం గ్రీకు పదం. గ్రీకుల కాలం నుంచి ఇంచుమించుగా 18వ శతాబ్ది వరకు "Drama" అనే పదాన్నే పాశ్చాత్యులందరూ వాడారు. ఇప్పుడు Play అనేక పదం కూడా ప్రచారంలో వ్యవహారంలో ఉంది.

## 1. నాటకం :

రూపకాలన్నింటిలోనూ నాటకం ప్రశస్తమైంది. సకల లక్షణాలతో విరాజిల్లుతుంది. తక్కిన రూపకాల్ని కూడా నాటకం అనే పేరుతోనే వ్యవహరిస్తారు. నాటకం అనేది జాతి అంతటకీ వుపయోగించే సామాన్య శబ్దం నాటకం దశవిధ రూపకాల్లో ఎక్కువ ప్రాచుర్యం కలిగిన భేదం.

**ఎ. లక్షణం :**

దశరూపకంలో ప్రధానమైంది నాటకం. నాటకంలో ఇతివృత్తం ప్రఖ్యాతమై వుండాలి. ధీరోదాత్తుడు నాయకుడు. నాయకుడు రాజర్షి కానీ, మానవ రూపంలో అవతరించిన దైవంగానీ అయి వుండాలి. అసలు నాయకులు నాలుగు విధాలు. 1. ధీరోదాత్తుడు 2. ధీరోద్ధతుడు 3. ధీరశాంతుడు 4. ధీరలలితుడు.

వీరశృంగార రసాలు రెండింటిలో ఏదో ఒకటి ప్రధాన రసమై వుండాలి. ఇతర రసాలు అంగ రసాలుగా సందర్భానుసారంగా పోషించవచ్చు.

అంకాలు 5కు తక్కువకాకుండా 10కి మించకుండా వుండాలి. సంధులు : 5 వుండాలి, వృత్తులు : 4 వుండాలి.

ఒకే సమయంలో రంగస్థలంపై నాలుగు, ఐదు పాత్రల కన్నా ఎక్కువ వుండకూడదు. ప్రతి అంకంలో నాయకుడు కానీ, నాయిక కానీ వుండాలి. లేదా ఇద్దరూ వున్నా ఫరవాలేదు. ప్రతీ అంకంలోనూ ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ నాయకునుకి సంబంధించిన ఇతివృత్తాన్ని ప్రదర్శించాలి.

**బి. లక్ష్యం (ఉదాహరణ) :**

కాళిదాసు రాసిన "అభిజ్ఞాన శాకుంతలము" నాటకం ఈ నాటకంలో శకుంతలాదుష్యంతుల వృత్తాంతం వర్ణించబడింది. ఈ కథకు మూలం మహాభారతం కనుక ఇది ప్రఖ్యాతమైన ఇతివృత్తమే అన్నమాట. దీనిలో నాయకుడు దుష్యంతుడు. ఈతడు ధీరోదాత్తుడు. ఈ నాటకంలో దుష్యంతుడు శకుంతలను చూసి ప్రేమించడం వారి గాంధర్వవివాహం, విరహం, పునస్సమాగమం ఇత్యాదిగా వర్ణింపబడినది గనుక అభిజ్ఞాన శాంకుతలంలో శృంగార రసానికి ఎక్కువ ప్రాముఖ్యం వున్నదన్నమాట. ఇందులో హాస్యం, అద్భుతం మొదలైన ఇతర రసాలు కూడా అక్కడక్కడ సందర్భానుసారంగా పోషించబడ్డాయి. అంకాలు - ఇందులో ఏడు అంకాలు వున్నాయి. మొత్తం మీద "అభిజ్ఞాన శాకుంతలం"లో నాటక లక్షణాలు చక్కగా పోషించబడ్డాయి.

**మరో ఉదా :** లక్ష్యం : భాసుడు - "అభిషేకం".

రామాయణంలో నుంచి ఇతివృత్తం తీసుకోబడింది. కాబట్టి ప్రఖ్యాతం ఇందులో రాముడు నాయకుడు. రాముడు, వాలిని, రావణాసురుణ్ణి సంహరించుకోవడం, రామపట్టాభిషేకం వర్ణించబడింది. కనుక ఈ నాటకం వీర రసప్రధానమైంది. ఇందులో ఇతర రసాలు కూడా చోటు చేసుకున్నాయి.

**మరికొన్ని ఉదా :** ముద్రా రాక్షసం, ఉత్తర రామచరిత్రం, ప్రబోధ చంద్రోదయం

**నాటిక :** పై లక్షణాలు అన్నీ కలిసి 4 అంకాలు వుంటే దాన్ని "నాటిక" అని అంటారు.

## 2. ప్రకరణం :

**ఎ. లక్షణం :** ఇందులో ఇతివృత్తం ఉత్పాదం. నాయకుడు - ధీరశాంతుడు. బ్రాహ్మణుడు కానీ, పురోహితుడు కానీ, అమాత్యుడు కానీ, వైశ్యుడు కానీ కావచ్చు. అతడు కష్టదశలో నుండి ధనం కోసమో, ప్రణయం కోసమో, విధి నిర్వాహణ కోసమో విధితో పెనుగులాడి నెగ్గుతాడు.

నాయికల్ని బట్టి ప్రకరణం 3 విధాలు. 1. కేవలం కులజ కలది. ఉదా ॥ మాలతీమాధవం 2. కేవలం వేశ్య కలది ఉదా ॥ తరంగ దత్తం, 3. కులజ, వేశ్యలు కలది ఉదా ॥ మృచ్ఛకటికం. రసం - శృంగారం 5 నుంచి 10 వరకు అంకాలు ఉండవచ్చు. సంధులు 5 ఉండాలి, వృత్తులు 4 వుండాలి.

ప్రకరణంలో నాటక లక్షణాలు కన్పించినా ఇందులో దేవతా చరిత్ర, ఉదాత్తుల చరిత్ర ఉండదు. రాజ మర్యాదలతో నాగరిక లక్షణాలలో దీని ప్రదర్శించరు. వేశ్యల శృంగారం, విటుల సరసం, దాస దాసీలు మొరటు వర్తనలు, నాగరికులు కాని గృహస్థులు చరిత్రలు ఇందులో ప్రధానం కాబట్టి ఇది నాటక స్థాయి నుంచి తగ్గి ప్రకరణం అయింది.

**బి. లక్ష్యం :**

శూద్రకుడు 'మృచ్ఛకటికం' ఇందులోని కథ కల్పించి రాయబడింది. కాబట్టి ఇతివృత్తం ఉత్పాద్యం. నాయకుడైన చారుదత్తుడు ధీరశాంతుడు 'మృచ్ఛకటికము' నాటకంలో వసంత సేన అనే ఒకవేళ అందమైనవాడు, సుందరాంగుడు, ధనం లేనివాడు, శాంతి స్వరూపుడైన ఒక పేద బ్రాహ్మణుని ప్రేమిస్తుంది. నాటకాంతంలో వాళ్ళిద్దరూ ఒకటి అవుతారు. కాబట్టి ఇందులో శృంగారం ప్రధాన రసంగా పోషించబడింది.

## 3. డిమం :

**ఎ. లక్షణం :** దీనికి కింబం, నిద్రవం అనేవి పర్యాయపదాలు ఇందులో ఇతివృత్తం ప్రఖ్యాతం నాయకుడు ధీరోద్ధతుడు దేవ, గంధర్వ, పిశాచుల్లోని వాడగా వుండాలి. వీరుల యుద్ధాలతో రౌద్రభయానక రసాలు వుండాలి. ఇందులో 4 అంకాలు వుంటాయి. వృత్తుల్లో సాత్వతీ, ఆరభటీ ఈ రెండే కూర్చాలి.

**బి. లక్ష్యం :** వత్సరాజు రాసిన "త్రిపురదాహం" శివుడు త్రిపురాసుర సంహారం కావించిన వృత్తాంతం దీనిలోని కథ కనుక ప్రసిద్ధమైన ఇతివృత్తమన్నమాట. నాయకుడైన శివుడు దేవతా జాతికి చెందినవాడు. ధీరోద్ధతుడుగా ఇందులో చిత్రించబడింది. ఇందులో రౌద్రరసం, ప్రధానరసం 4 అంకాలు ఇందులో వున్నాయి.

## 4. సమవకారం :

**ఎ. లక్షణం :** ఇందులో ప్రయోజనం చల్లబడుతుంది. కాబట్టి సమవాకారం అయింది. ఇతివృత్తం ప్రఖ్యాతం కానీ, ఉత్పాద్యం కానీ కావచ్చు. సమవాకారంలో 12 మంది నాయకులుంటారు. దేవదానవులు మొదలైనవారు నాయకులు. వీరరసం ప్రధానం. అంగరసం శృంగారం ఇందులో 3 అంకాలు మాత్రమే వుంటాయి. ముఖ, ప్రతిముఖ, గర్భసంధి, నిర్వహణ అనే 4 సంధులు వుండాలి. భారతీ,సాత్వతీ, ఆరభటీ వృత్తులు ఉండాలి. ఇందులో మూడు కపటాలు వుంటాయి. మూడు నిద్రవాలు వుంటాయి. మూడు శృంగారాలు వుంటాయి. ఒక్కొక్క అంకంలో ఒక కపటం, ఒక నిద్రవం, ఒక శృంగారం వుండాలి. ఉపాయ విషయంలో కపటం, వ్యాపత్తి సంభావనా విషయంలో నిద్రవం, ఫల విషయాలలో శృంగారం ప్రయుక్తమౌతుంది.

**i) కపటాలు :**

సుఖ దుఃఖోత్పత్తి కృతమైన కపటం మూడు రకాలు. ఒకటి వస్తుగత క్రమవిహితం, రెండు పరప్రయుక్తం, మూడు దైవ వశగతం.

**1. వస్తుగత క్రమవిహితం :** కార్యం సాధించే వాని దోషం లేకపోయినా వంచకుడు చేసే మోసం.

**2. పరప్రయుక్తం :** కార్యం సిద్ధించే వాణ్ణి అపరాధంతో వంచకుడు చేసే మోసం

**3. దైవ వశగతం :** ఇరువురి దోషం లేకుండా దైవవశంగా లేక కాకతాళీయంగా సంభవించే మోసం.

**ii) నిద్రవాలు :** నిద్రవం అంటే చెదిరిపోవడం. ఇవి మూడు విధాలు. 1. యుద్ధ, జల సంభవం (వరదలు), 2. వాయు, అగ్ని, గజేంద్ర, సంభ్రమ కృతం, 3. నగరముట్టం.

iii). **శృంగారాలు** : ధర్మార్థ కామ సంబంధ భేదాలచే శృంగారాలు మూడు విధాలు.

**1. ధర్మం** : ఏ శృంగారంలో సాధనం ప్రతనియమమైతే పోయుక్తమై ధర్మ ప్రాపకం ఆత్మహితం అవుతుందో అది ధర్మ శృంగారం.

**2. అర్థం** : ఎక్కడ అర్థంలోని ఇచ్ఛవల్లకానీ, బహు ప్రయోజనాల్ని ఆశించికానీ, స్త్రీ సంయోగ విషయకమైన రతీ కలుగుతుందో అది అర్థ శృంగారం.

**3. కామం** : సావేగం, నిభృతం (తన్ను మరుగు పరచుకోవడం) అయిన సంయోగం కామశృంగారం.

**బి. లక్ష్యం** : వత్సరాజు - "సముద్రమథనం" భాసుడు : "పాంచరాత్రం", సముద్రమధనం పూరణ ప్రసిద్ధం కాబట్టి ఇందులోని ఇతివృత్తం ప్రఖ్యాతం. దేవదానవులు ఇందులో నాయకులు, దేవదానవుల పరస్పర విజయోత్సాహంలో వీర రసం పోషించబడినది. అంకాలు 3 వున్నాయి.

## 5. ఈహామృగం :

**ఎ. లక్షణం** : 'ఈహా' అంటే కోరిక. మృగం వలె అలభ్యమైన నాయికను నాయకుడు కోరుతాడు. కాబట్టి దీనికి ఈ పేరు వచ్చింది. పన్నెండుగురు దివ్య పురుషులు ఒక స్త్రీని అపహరించే సందర్భంలో కలిగే శృంగార అవస్థలు ఇందులో ప్రదర్శిస్తారు.

ఇతివృత్తం కొంత పౌరాణికం, కొంత కల్పితమై మిశ్రమై వుంటుంది. నాయకుడు ధీరోదాత్తుడు శృంగార రసం ప్రధానంగా వుంటుంది. అంకాలు 4 కలిగి వుంటుంది. ముఖసంధి, ప్రతిముఖసంధి, నిర్వహణ సంధులుండాలి. భారతీవృత్తి, సాత్వతీవృత్తి ఆర భటీవృత్తులు వుండాలి.

**బి. లక్ష్యం** : రుక్మిణీ కళ్యాణం, రుక్మిణీ పరిచయం, కనుమశేఖర విజయం.

మిగిలనవన్నీ ఏకాంకికలు అంటే భాణం, వీథీ, ప్రవాసనం, అంకం, వ్యాయోగగం ఐదూ ఏకాంకికలు. ఈ రూపకాల్లో ఒకే అంకం వుంటుంది.

## 6. బాణం :

**ఎ. లక్షణం** : ఇతివృత్తం ఉత్పాద్యం నాయకుడు ధూరుడైన విటుడు. ఇందు సమర్థుడు విద్యావంతుడైన విటుడను ఒక పాత్రనే ప్రయోగించాలి. శృంగారమో, వీరమో ప్రధానరసంగా వుండాలి. అంగరసంగా అద్భుతం వుండాలి. అంకం ఒకటి మాత్రమే ముఖ సంధి, నిర్వహణ సంధి రెండే ప్రయోగించాలి. భారతీవృత్తిని ప్రయోగించాలి.

దీని స్వరూపం కూడా చాలా చిన్నది దీనిలో ఒకే పాత్ర వుండాలి. ప్రవేశించిన పాత్ర తన చరిత్రకానీ, మరో ధీరుడైన విటుని చరిత్రం కానీ చెప్పుతాడు.

ఇందులో లాస్యాంగాలు తప్పకుండా వుండాలి. లాస్యాంగాలు అంటే లాస్య విశేషం. (లిఖితమైన నటన గల భాగాలు) ఒకే పాత్ర తన అనుభవాలు గానీ, ఇతరులు అనుభావాలు గానీ ఆకాశ భాషితం వంటి పద్ధతుల్లో ప్రదర్శించే రీతి, ధూర్తుల వ్యవహారాలు చమత్కారంగా ప్రదర్శించే రీతి పాత్ర తానే ప్రశ్నించుకొని, తానే సమాధానం చెప్పుకొనే రీతిలో దీన్ని ప్రదర్శిస్తారు.

**బి. లక్ష్యం** : కర్పూర చరితం ఇతివృత్తం కల్పితం ఇందులో జూదరి నాయుడు కాబట్టి ధూర్తుడన్నమాట ఒక జూదరి రంగస్థలం మీదికి ప్రవేశించి తన ద్యూత క్రీడా వృత్తాంతాన్ని వేశ్యతో తన ప్రణయ వృత్తాంతాన్ని వర్ణించి చెబుతాడు కనుక శృంగారం పోషించబడింది.

**మరో ఉదా :** లీలామధుకరభాణం, శారధా తిలకభాణం, శృంగార భాణం.

**7. వీధి :**

**ఎ. లక్షణం :** ఇతి వృత్తం కల్పితం, నాయకుడు ధీరోద్దత్తుడు, రసం, శృంగారం వీధిలో ఒక అంకం మాత్రమే వుండాలి. ముఖసంధి నిర్వహణ సంధి మాత్రమే వుంటాయి కైశికి వృత్తి ఒకటే వుంటుంది. అలంకారికులు లక్షణం చెప్పి ఒకటి, రెండు పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి. కాని గ్రంథాలు దొరకలేదు.

**బి. లక్ష్యం :** శ్రీనాధుని నాటకానికి మూలం త్రిపురాంతకుడు సంస్కృతంలో రాసిన 'ప్రేమాభిరామము'. కాని ఈ గ్రంథం దొరకలేదు. అలాగే 'మాధవి' అనే మరో వీధి నాటకం పేరు వినబడుతుంది కాని ఆ గ్రంథం కూడా దొరకలేదు.

**మరో ఉదా :** మాలతీ వీధి నాటకం.

**8. ప్రహసనం :**

ప్రహసనీయమైంది అంటే పరిహాస ప్రధానాలైన ఆభాషణలు అధికంగా కలిగింది ప్రహసనం.

**ఎ. లక్షణం :** ఇతివృత్తం ఉత్పాద్యం పాషండాదులు నాయకులు రసం హాస్యం 1,2 అంకాలుండాలి లౌకికమైన వార్తలు, డంబాలు, మోసగాళ్ళ చేష్టలు ప్రదర్శించేది ప్రహసనం. ఇందులో విష్కంబం, ప్రవేశకం వుండవు.

**బి. లక్ష్యం :** మహేంద్రవర్మ రాసిన "మత్త విలాస ప్రహసనం". ఇది క్రీ.శ. 7వ శతాబ్దంలో రాయబడింది. ఒక కాపాలికుడు యువతితో కూడా మద్యపానం సేవిస్తూ వుంటాడు, వాని దగ్గర వున్న కపాలంలో మాంసం ముక్క వుండడం వల్ల దానిని ఒక కుక్క ఎత్తుకొని పోతుంది. మద్యం మత్తులో వున్న కాపాలికుడు దాన్ని గుర్తించడు. అందువల్ల బౌద్ధ బిక్షకుడొకణ్ణి చూచి అతడే దాని ఎత్తుకుపోయినాడనుకొని జగడానికి దిగుతాడు. పోయిన కపాలం ఒక పిచ్చిదాని దగ్గర దొరుకుతుంది. ఇది ఇందులోని ఇతివృత్తం. దీన్నిండా హాస్యం పోషించబడింది. దీనిలో ఒకటి లేదా రెండు అంకాలు వుంటాయి. కాపాలికుడు నాయకుడు నాయకుడు బ్రాహ్మణుడు, సన్యాసి, రాజు, విటుడు, వీరిలో ఎవడైన ఒకడు కావచ్చు. మిగతా పాత్రలన్నీ కూడా విటులు, భిక్షకులు, వేశ్యలు, సేవకులు మొదలైన వారుంటారు.

**ప్రహసనం - భేదాలు :**

ప్రహసనాన్ని మరల 3 విధాలుగా వర్గీకరించటం జరిగింది. 1. శుద్ధ ప్రహసనం, 2. వైకృత ప్రహసనం, 3. సంకీర్ణ ప్రహసనం.

**1. శుద్ధ ప్రహసనం :** ఉత్తమ ప్రకృతుల వారు వుండేదాన్ని శుద్ధ ప్రహసనం అని అంటారు. ఉదా ॥ కందర్పకేళి

**2. వైకృత ప్రహసనం :** షండకంచుకీ తాపసులుండేది వైకృత ప్రహసనం. ఉదా ॥ భగవదజ్జాకం

**3. సంకీర్ణ ప్రహసనం :** అధమ ప్రకృతులవారు, వేశ్యలు, నపుంసకులు మొదలైనవారు వుంటే సంకీర్ణ ప్రహసనం అంటారు. **ఉదా॥** ధూర్త చరితం, లకటమేళకం, డిండింలోని యోగానంద ప్రహసనం.

**9. అంకం :**

నాటకంలో ఒక భాగానికి 'అంకం' అని పేరు. అది వేరు దశవిధ రూపకాలలోని ఈ అంకం అనేది నాటిక విభాగం కాదు. దీనికి ఒక ప్రత్యేకత వుంది.

**ఎ. లక్షణం :** అంకంలో ఇతివృత్తం ప్రఖ్యాతం. పామరజనులు నాయకులుగా వుంటారు. యుద్ధం నుంచి తిరిగి వచ్చిన వాళ్ళూ, గాయాలు తగిన సైనికులు ఇందులోని పాత్రలు. స్త్రీల రోదనం, శోకాలు, విలాపాలు ప్రధానంగా వర్ణితమౌతాయి.

ప్రధాన రసం కరుణం కథ అంతా ఒకే అంకంలో వుండాలి. సంధుల్లో ముఖసంధి, నిర్వహణ సంధులు మాత్రమే వుండాలి. భారతీ వృత్తి మాత్రమే ఉండాలి.

**బి. లక్ష్యం :** విశ్వనాథ కవిరాజు రాసిన "ఉన్మత్త రాఘవం" అంకం (ఈ గ్రంథం లభ్యం) 'శర్మిష్టాయయాతి' అంకం పేరు వినవస్తున్నది. (ఈ గ్రంథం అలభ్యం.)

## 10. వ్యాయోగం :

**ఎ. లక్షణం :** ఇందులో అనేకమంది పురుషులు కూర్చున్నందున వ్యాయోగం అనబడుతుంది. 12 మంది పురుషుల వరకూ వుండాలి. స్త్రీలు తక్కువగా వుండాలి. ఇతివృత్తం ప్రఖ్యాతం. నాయకుడు - ధీరోద్ధతుడు ప్రధాన రసం - వీరం, రౌద్రం ఒకే అంకం ముఖ, ప్రతిముఖ, నిర్వహణ సంధులుండాలి. భారతీ, సాత్త్వతీ, ఆరభీటీ వృత్తులుండాలి.

**బి. లక్ష్యం :** వత్సరాజు రాసిన "కిరాతార్జునీయం" కథ ప్రసిద్ధం కాబట్టి ప్రఖ్యాతం వీరరసం పోషించబడింది. ఒకే అంకం. ఏ ఏకాంకికలోని ఇతివృత్తమంతా ఒక దినంలో జరిగిన కథ మాత్రమే అయి వుంటుంది.

'వ్యాయోగం'లో తప్ప తక్కిన నాలుగింటిలోనూ వచ్చే పాత్రలు, ధూర్తులు, విటవిటీలు, పామరులు అయి వుండి, సూచ్యంగానో, ప్రత్యక్షంగానో, కాముక వ్యవహారాలుంటాయి. అవి కారణంగా కలహాలు ఏడ్పులు, నవ్వులు రేగుతుంటాయి. ఇవన్నీ మన ప్రాచీన సంప్రదాయ రూపక భేదాలు ఇప్పటి నాటకాలతో వీటి లక్షణాల్ని పోల్చుకోవడం వీలుపడదు.

### మాదిరి ప్రశ్నలు :

1. దశవిధ రూపకాలను వివరించండి.
2. భారతీయాలంకారికుల మేరరూపక భేదాలను వివరించండి.
3. రూపక భేదాలు తెలియజేయండి.

### ఆధార గ్రంథాలు :


సాహిత్య దర్శనము - ఆచార్య కె.వి. ఆర్. నరసింహం

సాహిత్య శిల్పసమీక్ష - పింగళి లక్ష్మీకాంతం

సాహిత్య సౌంద్యాదర్శనము - చర్ల గణపతిశాస్త్రి

భరతనాట్య శాస్త్రం (అనువాదం) - నండూరి రామకృష్ణమాచారి


**డా॥ కొండపల్లి సుదర్శనరాజు**

**పాఠం - 14**

# ప్రాచ్య పాశ్చాత్య నాటకాలు

**విషయక్రమము :**

- **14.0** లక్ష్యం
- **14.1** పాఠ్య నిర్మాణం
- **14.2** పాఠ్య వివరణ
- **14.3** ముగింపు / సారాంశం
- **14.4** మాదిరి ప్రశ్నలు
- **14.5** ఉపయుక్త గ్రంథాలు

## 14.0 లక్ష్యం :

ప్రాచ్య నాటకాన్ని, పాశ్చాత్య ట్రాజెడి కామెడీలను నిర్వచించి, లక్షణాలను తెలపటం, పాశ్చాత్య ధోరణులలోని విభాగాలను పరిచయం చేయటం ఉద్దేశ్యం.

## 14.1 పాఠ్య నిర్మాణం :

i) ప్రాచ్య నాటకం
ii) పాశ్చాత్య నాటకం - ట్రాజెడి
iii) పాశ్చాత్య నాటకం - కామెడి

## 1. ప్రాచ్య నాటకం :

దృశ్యకావ్యం శ్రవ్యకావ్యాలుగా కావ్యం ద్వివిధం. దృశ్యకావ్యం దశరూపాలుగా ఉంటే నాటకం అందులో అత్యుత్తమంగా నిల్చేది. నాటకం, నాట్యం పర్యాయంగా ఉపయుక్తమయిన పదాలు. దృశ్యకావ్యాలన్నింటికి నాటకం పర్యాయంగా అలంకారికులు పేర్కొన్నారు. భరతుడు, నాట్యశాస్త్రంలో రూపక సామాన్యవాచిగా నాటకాన్ని వాడాడు. దృశ్య ప్రాధాన్యం వల్ల దృశ్యకావ్యం, ప్రేక్ష్యకావ్యం, రూపారోపణ వల్ల రూపకం అని నాటకం ఉపయుక్తమయింది.

**నాటక స్వరూపం :**

భరతుడు నాటకాన్ని 'సుఖదుఃఖ సమన్వితమైన లోక స్వభావాన్ని అంగికాభినయోపేతం చేయటాన్ని 'నాట్యం' అంటారన్నాడు.

సుఖదుఃఖ సహిత మానవ జీవిత యధార్థ చిత్రణను, నటీనటులు అనుకరించి, తమ అభినయ కౌశలంతో ఆ చిత్రణను ఆరోపించుకొని ప్రదర్శించుటమే నాటకం అన్నాడు. లౌకిక వృత్తాంతం, దృశ్యకావ్యంగా రూపుదిద్దుకొని, అది ఆస్వాద ఆనంద యోగ్యమయితే, ఆ వృత్తాంతాన్ని ఆపాదించుకొని దానికి నటీనటులు రసవత్తరంగా రక్తి కట్టిస్తారు. లోకాదస్న అనుకరణే నాటకం అనవచ్చు.

అభినయం వాచికం ఆంగికం సాత్త్వికం అని త్రివిధం. ఆహార్యంతోకూడి చతుర్విధం. ఆంగికాభినయం శిరం, హస్తం, కటి, ఊరువు, పార్శ్వం, పాదం ద్వారానూ, కళ్ళు, కనుబొమ్మలు, ముక్కు, పెదవులు, కపోలం, చిబుకం అనే ఉపాంగాల ద్వారా వ్యక్తం అవుతుంది. శరీరాంగాలు, ముఖాంగాలు అంగికాభినయ హేతువులు.

సాత్వికాభినయం సత్త్వసంబంధ స్థితిలో జరిగేది. సత్త్వం మనోసంబంధం, ఏకాగ్రతను తెలిపేది. అభినయించవలసిన భావాన్ని ఏకాగ్రతతో తనపై నటుడు ఆరోపించుకోవటం అంటే, దుఃఖితుడు కాకపోయినా, పాత్రస్వభావాన్ని నటుడు ఆరోపించుకొని దుఃఖాభినయం చేయటం. ఇలా అభినయించేందుకు సహకరించేది సత్త్వం, దాని సంబంధాభినయం సాత్త్వికం అవుతుంది.

వాచికం దృశ్యరూపకంలో ప్రధానం. వివిధ భావాలను మాటరూపంలో విరామాది నియమాలను పాటిస్తూ వాచికాభినయం సాగుతుంది. భాషా సారళ్యత తప్పనిసరి. భావానికనుగుణమైన ఉచ్చారణను, కాకుస్వర వ్యంజనం అంటారు. దీనినే ఆంగ్లంలో Modulation అంటారు.

ఆహార్యం నాటకానికి చాలా అవసరమైనది. అన్నిటికంటే ముఖ్యం కూడాను. నటుడు రంగస్థలం మీదకు రాగానే ఆహార్యమే ఆ నటుడికి గుర్తింపును, ఆకర్షణను ఇస్తుంది. పాత్రోచిత వేషధారణ, పాత్ర పరిచయం చేస్తుంది. ఆ పాత్ర స్వభావాన్ని, నాటకంలో ఆ పాత్ర స్థానం అన్ని ఆహార్యం ద్వారా తెలుస్తాయి. ఉదా : రాజు, భటుడు పాత్రలు.

నాటకా చతుర్విధ అభినయం ఆ నాటక ప్రదర్శనలో తలెత్తే అంశాలు. అభినయ చాతుర్యం నాటకాన్ని రక్తి కట్టిస్తుంది.

**నాటక లక్షణాలు :**

**1. నాంది :**

నాటక ప్రదర్శనకు జరిగే దైవస్తుతి నాంది. ఏ ఆటంకం కలగకుండా, లేకుండా నాటక ప్రదర్శన విజయవంతంగా ముగియటానికి జరిగే ప్రార్థన. నాటకం దిగ్విజయంగా జరగటానికి తెరలోపల దేవతలకు చేసే పూజను పూర్వరంగం అంటారు. నాటక ప్రదర్శనకు ఇది పూర్వారంగ విఘ్నోపశాంతికి చేసే పూజ ఇది. ఇది క్రియారూపం, వాగ్రూపం అని రెండు విధాలు. క్రియారూపమగు నాంది, నందీశ్వరుని చేసే అర్చనే. మహేశ్వరుని నృత్యానికి నందీశ్వరుడు రంగంగా నిలిచిందట. అట్టి పుణ్యతను ఆపాదించుకొన్న రంగానికి చేసే పూజను నాంది అంటారు.

తెరలోపల క్రియారూపమైన పూజ ముగిశాక, తెర ముందుకు వచ్చి సూత్రధారుడు వాగ్రూప నాందీశ్లోకాన్ని పఠిస్తాడు. అశిర్నమస్క్రియా రూపంగా ఉండే ఈ శ్లోకం కావ్యార్థ సూచన కలిగి ఉంటుంది. శుభకరంగా వుండే ఈ శ్లోకం దేవద్విజ కవి నటాదుల శ్రేయస్సును కాంక్షించేదిగా ఉండాలి. శుభకరమైన పదాలతో మంగళద్యోతములైన శంఖ చంద్ర అబ్జ కోక కైరవాదుల ప్రశంస ఉండాలి. నాందీ శ్లోకంలో వాడే పదాల సంఖ్య విషయంలోనూ నియమం ఉంది. శ్లోకంలో పదసంఖ్య ఎనిమిదికాని పన్నెండుకాని, పద్దెనిమిదికాని, ఇరవైరెండుకాని పదాలుండాలి. ఇటు పదం అంటే సుప్తింజంతం, పద్యపాదం, వాక్యం ఏదైనా కావటానికి అవకాశం ఉంది. నాందీ శ్లోకాన్ని సూత్రధారుడు మధ్యమ స్వరంలో పఠించాలి.

**2. ప్రవర్తన :**

క్రియారూపం వాగ్రూపమైన నాంది ముగిశాక, నాందీ శ్లోకాన్ని పఠించిన సూత్రధారుడు నిష్క్రమిస్తాడు. మరొక సూత్రధారుడు ప్రవేశించి నటి మారిష విధూషకులలో ఒకరితో ప్రస్తావన చేస్తాడు. కనుకే ఈ సూత్రధారుడికి 'ప్రస్తావన స్థాపకుడు' అని పేరు ఏర్పడింది. ప్రస్తావనను ఆముఖము స్థాపన అని కూడా అంటారు. కృతికర్త, కృతిభర్త కథాసంవిధానాన్ని సూత్రధారుడు సూచిస్తాడు. కావ్యవస్తు సూచన చేస్తాడు. సూత్రమంటే సూచన. దానిని ధరించిన వాడు సూత్రధారుడు.

ప్రస్తావనను నడుపుతాడు కనుక ప్రస్తావన స్థాపకుడంటారు. వీటితోపాటు ఋతువర్ణన జరుగుతుంది. నాటక రసానుగుణంగా ఈ వర్ణన ఉంటుంది. శృంగార వీర రసాలలో ఒకటి అంగి రసంగా ఉండాలి. తదనుగుణంగా వసంత, శరత్తు,గ్రీష్మఋతువుల వర్ణన జరుగుతుంది. ఋతువర్ణన నాటకంలోని రసాన్ని బట్టే ఉంటుంది. ప్రస్తావన అభినయ ప్రాధాన్యం తక్కువగా, వాక్ప్రధానంగా సాగుతుంది. ప్రస్తావనానంతరం సూత్రధారుడు నాటకంలోని పాత్రలను ప్రవేశపెట్టి నిష్క్రమిస్తాడు.

### పాత్ర ప్రవేశ సూచన :

ఇది ప్రస్తావనలో భాగమే. ప్రస్తావనకు కథోద్ఘాతము, ప్రవర్తకము, ప్రయోగాతిశయము అనే అంగాలున్నాయి. ప్రకృతి కథానుగుణంగా సూత్రధారుడు ఉపయోగించి వాక్యాన్నో దాని అర్థాన్నో ఆశ్రయించుకొని వాత్ర ప్రవేశించటం కథోద్ఘాతము. ప్రవృతకాలాన్ని ఆశ్రయించి సూత్రధారుడు వర్ణన చేస్తే, అందులోని, ఆ శ్లేషలోని ద్వితీయార్థాన్ని గ్రహించి పాత్ర ప్రవేశించటం ప్రవర్తకం. సూత్రధారుడు ఇదిగో ఇతడు వస్తున్నారు అని పేరు పెట్టి చెప్పగానే ఆ పాత్ర రంగస్థలాన ప్రవేశించటం ప్రయోగాతీశయం. ఇవేగాక ఉద్ఘాత్యకము, అవలగితము అనే మరో రెండు అంగాలు కలిపి మొత్తం అయిదు అంగాలు ప్రస్తావనకు అని విశ్వనాథుడు పేర్కొన్నారు.

**3. ఇతివృత్తం :** నాట్య / నాటకానికి శరీరం ఇతివృత్తం. ఇది రెండు రకాలు. ఒకటి అధికారికం, రెండు ప్రాసంగికం.

**అధికారికం :** ఇది ప్రధాన కథ. ఫలాపేక్ష కలది. దానిని సాధించుకొనే ఆశతో కార్యం సామర్థ్యంతో నిర్వహించబడే కథ అధికారికం. ప్రధాన ఫలంతో సంబంధముండే ఇతివృత్తం అధికారికం.

**ప్రాసంగికం :** ఇది ఉపకథ. ప్రసంగ వశమున వచ్చేది ప్రాసంగికం. ప్రధాన ఫల నిష్పత్తికి సహకరించేది. ప్రధాన కథకు ఉపకారిగా ఉంటూ తన స్వప్రయోజనాన్ని కూడా సిద్ధింప చేసుకొనేది - ప్రాసంగీకం. ఇతివృత్తం ఈ రెండింటి సమాహారం. ఇతివృత్తం - నాటకేతివృత్తం - లో పంచసంధుల ప్రమేయం అనన్యం. ఇతివృత్తం పంచసంధుల సమాహారం.

**4. పంచసంధులు :** కార్యావస్థలు, అర్థ ప్రకృతులు కలయికే సంధులు. ఆరంభ యత్నం ప్రాప్త్యాశ నియతాప్తి ఫలాగమం కార్యావస్థలు, బీజం, బిందువు, పతాక, ప్రకరి, కార్యం అర్థప్రకృతులు. ముఖ, ప్రతిముఖ, గర్భ, అనమర్శ, నిర్వహణ సంధులు కార్యవస్థలు అర్థప్రకృతుల యథాసంఖ్య కలయిక వలన ఏర్పడుతాయి.

**6. కార్యావస్థలు :** కథా సంబంధ కార్యదశను తెలుపుతాయి కార్యావస్థలు.

### ఆరంభం :

ఫలాన్ని పొందటంపై దృష్టి నిలిపి, దాయకాది పాత్రలు చూపే ఉత్సాహం. ఫల లాభాన్ని ఔత్సుక్య మాత్రంగా ఆశించటం ఆరంభం. దీనిని నేను సంపాదిస్తాను అనే నాయకుడి పూనికే ఆరంభం. భరతుడు దీనిని 'ఫలారంభం' అన్నాడు.

### యత్నం :

సాధించదలచిన ఫలము లభించనప్పుడు, ద్విగుణీకృతమైన పూనికతో వేగవంతంగా చేసే వ్యాపారం యత్నం. దీన్ని భరతుడు 'ప్రయత్నం' అన్నాడు.

**ప్రాప్త్యాశ** : కార్యఫలం చేకూరుతుందో లేదోననే ఉపాయపాయ శంకలతో అనిశ్చితమైతే అది ప్రాప్త్యాశ. భరతుడు దీనిని 'ప్రాప్తిసంభవం' అన్నాడు.

**నియతాప్తి** : ఫలప్రాప్తికి అవరోధాలు కల్పించే అపాయాలు తొలగి ఆశించిన ఫలం తప్పక సమకూరుతుందనే దృఢనిశ్చయం నియతాప్తి. భరతుడు 'నియతఫలప్రాప్తి' అన్నారు.

**ఫలాగమం** : ఏ ఫలాన్ని ఆశించి పూనిక వహించాడో అది సంపూర్ణంగా లభించటం ఫలాగం. దీనిని భరతుడు 'ఫలప్రయోగం' అన్నాడు.

**ఆ) అర్థప్రకృతులు** : కథానిర్మాణంలోని వివిధ భాగాలు అర్థప్రకృతులు.

**బీజం** : కార్యానికి కారణము బీజం. మొదటం అల్పంగా ఉండి క్రమంగా విస్తరిస్తుంది. నాయకోపనాయ ప్రతినాయక సంబంధ కథాంశాలతో విస్తరిస్తుంది. వీరిని కార్యోన్ముఖులను చేసే హేతువు బీజం.

**బిందువు** : అవాంతర ప్రయోజనాలతో ముఖ్య ప్రయోజనానికి విచ్ఛేదం కలగకుండా అవిచ్ఛేద కారణమై నిల్చేది బిందువు. అప్పుడప్పుడు మరుగైపోయిన బీజాన్ని నాయకాదులకు జ్ఞప్తికి తెచ్చి కార్యోన్ముఖులను కానిస్తుంది బిందువు.

**పతాక** : ప్రధాన కథకు పోషకమై దానితోపాటు కొంతదూరం వ్యాపించే కథ పతాక. ప్రాసంగికేతి వృత్తం. ప్రధాన ప్రయోజనాన్ని, స్వప్రయోజనాన్ని సాధిస్తుంది. ఉదా : రామాయణంలో సుగ్రీవ విభీషణాదుల కథ.

**ప్రకరి** : ప్రత్యేక ఫలం లేనిది, కేవలం ప్రధాన కథకు తోడ్పడే కథ - ప్రకరి. ఉదా : రామాయణంలో జటాయువు కథ.

**కార్యం** :

ప్రధాన వస్తునిర్వాహణలో చివరి అర్థం (ఫలం) కార్యం. కార్యం అంటే ఉపాయసామగ్రి అని అర్థం. ప్రధాన ఫలసాధనకు తన శక్తులన్ని నాయకుడు వినియోగించటం కార్యం. ప్రధాన ఫలాభిలాషే నాయక ప్రయత్నాలన్నింటికి కారణం కాబట్టి కార్య శబ్దానికి ముఖ్యఫలం అని అర్థం.

కార్యావస్థలు ఐదూ ఆరంభాది క్రమంలో రూపకంలో నిర్వహించాలి. కాని అర్థప్రకృతులలో బీజం, బిందువు, కార్యం ఈ మూడింటికే ప్రాధాన్యం. ఇవి లేకుండా నాటకం ఉండదు. వీటిలో ఏదీ లోపించరాదు. కాని పతాక ప్రకరిలకు ఆ నియమం లేదు. ఏ ఒక్కటైన ఉండొచ్చు. రెండూ లేకనూపోవచ్చు.

**ఇ. పంచ సంధులు** :

అర్థ ప్రకృతులు కార్యావస్థలు యథాసంఖ్య కలయికతో పంచసంధులు ఏర్పడుతాయి. ఆరంభ బీజ సంబంధాన ముఖసంధి యత్న బిందు, సంబంధాన ప్రతిముఖ సంధి, ప్రాప్త్యాశ పతాకాల బంధావ గర్భసంధి, నియతాప్తి ప్రకరుల బంధాన అవమర్శ సంధి, ఫలాగమ కార్యాల సంబంధాన నిర్వహణ సంధి ఏర్పడుతాయి.

**ముఖసంధి** : నానా ప్రయోజనాలకు, రసాలకు హేతువయ్యే బీజ సముత్పత్తి, అది ఆరంభమనే కార్యావస్థననుసరించి ఉండటం ముఖసంధి.

**ప్రతిముఖ సంధి :** బీజప్రకాశం ప్రతిముఖ సంధి. ఒక అంశాన కనపడి, మరోచోట కనపడక వున్న బీజం, తిరిగి సుస్పష్టమైయే కథా భాగం ప్రతిముఖసంధి.

**గర్భ సంధి :** లభించినట్టు, ప్రాప్తించనట్టు ఉన్న బీజాన్ని మరల మరల అన్వేషించటం గర్భసంధి. ప్రాప్తి, అప్రాప్తి, అన్వేషణ ఉంటాయి. ముఖసంధిలో ఉత్పన్నమై, ప్రతిముఖ సంధిలో స్పష్టమై, గర్భసంధిలో ఉద్భిన్నమవుతుంది ఫలోన్ముఖం అవుతుంది బీజం.

**అవమర్శ సంధి :**

దీన్ని 'విమర్శ సంధి' అని అంటారు. ఫలోన్ముఖమైన బీజార్థం శాస, భయ, క్రోధాది వ్యసనాల వల్ల విఘ్నం కలిగి ఫలసిద్ధి సందేహాస్పదం అయినప్పుడు ఆ ఆటంకాలను తొలగించుకోవటానికి నాయకాదులు చేసే యోచనే అవమర్శ సంధి.

**నిర్వహణ సంధి :**

ముఖసంధ్యాది అర్థాలు ఆరంభాది అవస్థలు ఫలసిద్ధికి సంబంధించి ఉండేటట్లు కూర్చబడిన కథాంశమే నిర్వహణసంధి. ముఖాది సంధుల పరస్పర సంబంధాన్ని, వాటికి ప్రధాన ఫలంతో ఉన్న సంబంధాన్ని నిర్ణయించేది నిర్వహణ సంధి.

కథాగమనానికి సంబంధించినవి కార్యావస్థలు కాగా, దానికి హేతువులు అర్థప్రకృతులు. నాటకంలోని కథాభాగాలను సంధులని అంటారు.

**5. అంకం :**

నాటకం అంకాలుగా విభజితమై ఉంటుంది. నాటక భాగాలకు అంకాలని పేరు.

నాటకంలో ఒకరోజుకు సంబంధించిన సంఘటనలతో ఒక అంకం కూడి ఉండాలి. నాటక కథ ఎంత విస్తారకాల నిర్ణీతమైనా, అంకంలో ఒకరోజుకు మాత్రమే కథాంశం పరిమితమై ఉండాలి.

కార్యానుగుణంగా కథా నిర్మాణం ఉండాలి. అనేక ఘటనా సహితంగా ఉండాలి. కథ నాయకునికి ప్రయోజనకారిగా ఉండాలి. అన్ని అంకాలలో నాయకుడు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉండాలి. అనేక పాత్రలకు అవకాశం ఉన్న నాటకంలో ప్రతి అంకానికి పూర్వపర అంకాల కథతో సంబంధం ఉండాలి. అంకాంతంలో పాత్రలన్నీ నిష్క్రమించాలి.

నాటకం ఐదు అంకాలు. అంతకంటే ఎక్కువ కూడా ఉండవచ్చు. ఐదునుంచి పది వరకు సాధారణంగా నాటకంలో అంకాలుంటాయి.

నాటకంలో ప్రదర్శన యోగ్యాలు, సూచ్యాలు రెండు రకాలు. రంగస్థలంపై అంకంలో ప్రదర్శించ వీలయినవి ప్రదర్శన యోగ్యాలు. ప్రదర్శనార్హం కానివి సూచింపబడుతాయి. అవి సూచ్యాలు. రంగస్థలంపై ప్రదర్శించరాని నిషిద్ధాలు - వస్త్రాధారణ, చుంబనం, స్నానాదులు ప్రదర్శించ అసాధ్యాలు - యుద్ధం, రాజ్యదేశాది విప్లవాలు - అయినవి సూచింపబడతాయి. ఇవి అర్థోపక్షేపకాల ద్వారా సూచింపబడతాయి.

**బి) అర్థోపక్షేపకాలు :**

ఇతివృత్తం సూచ్యాసూచ్యం అని రెండు విధాలని పేర్కొన్నాం. అసూచ్యం తిరిగి దృశ్యశ్రవ్యమని మరల రెండు విధాలు. నీరసం అనుచితం అయిన అంశాలు సూచితాలు. ఇవి ప్రతిపాదించు విధాలు ఐదూ అర్థోపక్షేపకాలు. విష్కంభం, ప్రవేశికం, చూళిక అంకాస్యం అంకావతారం.

**అ) విష్కంభం :**

జరిగిన, జరగబోవు కథాంశాలను స్పష్టంగా చెప్పేది విష్కంభం. ప్రథమాంకం నుంచి చివరి దశకు ఎక్కడైనా, ప్రథమాంక ఆదిలోనైనా ప్రయోగింపవచ్చు. మధ్యమ పాత్రల చేత నిర్వహింపబడాలి. ఒకటి లేదా ఇద్దరు ఉండవచ్చు. మధ్యమ పాత్రల చేత నిర్వహింపబడితే, సంస్కృత భాషను మాట్లాడే పాత్రల చేత నిర్వహింపబడితే అది శుద్ధ విష్కంభం; నీచ మద్యమ పాత్రల చేత ప్రయుక్తమైతే, ఒక పాత్ర సంస్కృతంలోనూ మరోపాత్ర ప్రాకృతంలోనూ సంభాషణ జరిపితే దాన్ని మిశ్రవిష్కంభం అని అంటారు. ఇందులో ప్రధాన నాయక ప్రదేశం ఉండరాదు.

**ఆ) ప్రవేశికం :**

కేవలం నీచ పాత్రలచే నడిచేది. ప్రాకృత భాష మాట్లాడే పాత్రచే ప్రయుక్తమయ్యేది ప్రవేశికం. ప్రథమాంక ప్రారంభంలో రాదు. మిగిలిన అంశాలలో విష్కంభంతో సమానం.

**ఇ) చూళిక :**

ఇది ఆకాశ భాషితం. అశరీరవాణి మాటలు. తెరలోని పాత్రలు కథాసూచన చేస్తాయి. ఇందులో పాత్ర ప్రదేశ నిష్క్రమణాలుండవు. చూళిక, ఖండచూళిక అని రెండు విధాలు. ఖండచూళిక అంటే తెరలో వున్నపాత్ర, రంగస్థలంపై నున్న పాత్రతో సంభాషణ జరపటం. దీనిని అంకం మొదట ప్రయోగించాలి.

**ఈ) ఆంకాస్యం :**

ఇది జరగబోయే కథను సూచిస్తుంది. ఇక అంకం చివరలో పాత్రల సంభాషణ రాబోయే పాత్రలను సూచించటం అంకాస్యం.

**అంకావతారం :**

ఒక అంకంలోని పాత్రతో తిరిగి ఉత్తరాంకంలో కూడా అసూచితాలై ప్రవేశిస్తే అది అంకావతారం. పూర్వోత్తరాంకాలలో విష్కంభం ప్రయోగింపబడి ఉండకూడదు.

ఇవి అర్థోప్రక్షేపకాలు. సూచితాలకు మార్గాలు.

**7. భరతవాక్యం :**

భరతుడనగా నటుడు. అతడు తెలిపే వాక్యం కనుక భరత వాక్యం అయింది. ఇది నాటకాంతంలో ఉంటుంది. దీనితో నాటకం ముగుస్తుంది. దీనిలో నాయకుడు లేదా ప్రధాన పురుషుడు లోకశ్రేయస్సును కాంక్షిస్తూ భరత వాక్యాన్ని పలికితే పెద్దలు తథాస్తు అంటారు.

**నాట్య /నాటక ప్రయోజనం :**

నాటక ప్రయోజనం ఆనంద సిద్ధి కలగటం. అది రస భరితంగా ఉండటం వలన రసానంద జనకత్వం పరమ ప్రయోజనంగా చెప్పబడుతూ ఉంది.

# పాశ్చాత్య నాటకం - ట్రాజెడి

పాశ్చాత్య నాటకాలు ప్రధానంగా ట్రాజెడి, కామెడి అని రెండు రకాలు. ఈ రెంటికి ఒకే మూలం. ట్రాజెడిని గూర్చి అరిస్టాటిల్ తన పొయెటిక్సులో ఎంతో చర్చించాడు.

## ట్రాజెడి ఆవిర్భావం :

దీన్ని మేష గీతం అంటారు. Tragas - మేక Oide - పాట, Tragedy మేకపాట. సస్యానికి, మద్యానికి దేవతలైన డయోనిసస్‌కు గ్రీకు దేశస్థులు పూజిస్తారు. ఈ పూజలలో మేకను బలి ఇవ్వటం వలన దీనికి ఈ పేరు వచ్చింది. ఉత్సవ సందర్భంలో ఆడిపాడుకునే ట్రాజెడి కాలక్రమంలో విషాదాంతంగా స్థిరపడిపోయింది.

## ట్రాజెడి రూపక ఉత్పత్తి :

ఆటపాటల స్థితి నుంచి విషాదాంతంగా రూపకల్పన జరిగి స్థిరపడడం వెనుక ఒక పరిణామం ఉంది. అది వివిధ దశలలో కనిపిస్తుంది.

గ్రీకు దేశీయులు డయోనిసస్ దేవతను పూజించెదరు. ప్రతి సంవత్సరం రెండుసార్లు ఉత్సవం జరిగిన మార్చి మాసంలో జరిగే ఉత్సవం విశేషమైనది. ప్రజలందరూ ఈ జాతరలో ఆనందోద్రేకాలతో పాటలు పాడేవారు. వీటిని 'డితిరాంబు'లనేవారు. దేవతను స్తుతిస్తూ ఎవరికి వారు ఇవి పాడుకునేవాడు.

క్రమంగా ఇది ఎవరికి వారు పాడుకోవటం మాని గుంపుగా పాడటం ఆరంభమైంది. యాభై మంది దాకా ఈ సంఖ్య పెరిగింది. ఇదే 'కోరస్'గా స్థిరపడింది. ఆరంభంలో ఆసువుగా పాడుకునే ధోరణిపోయి కల్పిత గీతం స్థానంలో కవి రాసిన గేయం పాడటం మొదలయింది. ఏడవ శతాబ్దానికి సంతరించుకొన్న ఈ మార్పు కారకుడిగా, 'ఏరియన్'ని పేర్కొంటారు. ఇతను ఛందోబద్ధంగా రాసి పాడించేవాడు. నాటి నుంచి దితిరాంబు సారస్వత స్థానం సంపాదించుకొంది.

బృందంగా ఉన్నవారికి నాయకుడు ఏర్పడ్డాడు. ఇలా ఏర్పరచిన వాడు 'థెస్పిస్'. కృత్రిమమైన ముఖాలను (Masks) తగిలించుకొని ఆ నటుడు వివిధ భూమికలు అభినయించేవాడు. ఈ దశలో నృత్యగాన రూపం నుంచి నాటకీయతకు, డయోనిసస్ బదులు పురాణగాథకు పరిణామం చెందింది. 'ఇస్కిలిస్' తన రూపకాలలో రెండవ నటుడిని, సోఫోక్లిజ్ మూడవ నటుడిని ప్రవేశపెట్టారు. దీనితో ట్రాజెడి పరిణామం ఆగిపోయింది.

## ట్రాజెడి - ఇతర గ్రీకు నాటకశాఖలు :

కొందరికి డయోనిసస్ గాథలంటే ఎక్కువ ఇష్టంగా ఉండేది. గ్రీకు ట్రాజెడికి సమాంతరంగా డయోనిసస్‌ను అభిమానించే వారికోసం 'శాటిర్' రచనారంభమైంది. డయోనిసస్ అనుచరులను శాటిర్స్ అంటారు. అశ్వ / మేష ముఖంతో తోకతో మానవాకారంతో వీరుంటారని అభిప్రాయపడ్డారు. స్వభావంలో ఇది డితిరాంబులకు దగ్గరగా ఉన్న రూపకం. డితిరాంబు నుండి శాటిర్ ట్రాజెడిలు రెండు శాఖలుగా ఏర్పడ్డాయని కొందరు, డితిరాంబు నుండి శాటిర్, దాని నుంచి ట్రాజెడి ఏర్పడ్డాయని అంటారు.

మరో రూపకం ప్రయోగంగా కనిపించేది Trilology ఏథెన్సులో నాటక పోటీలు జరిగేవి. ఇందులో పాల్గొనేవారు మూడు విషాదాంతాలు, ఒక శాటిర్ రూపకాన్ని రచించి ప్రయోగించాలి. ఈ మూడూ ఒకే కథను తీసుకొని రాయాలి.

**ట్రాజెడి నిర్వచనం :**

ఉదాత్తం, స్వయం సంపూర్ణమై, తగినంత పరిణామం కలిగిన లోకేతివృత్త అనుకరణే ట్రాజెడి. స్వరతాళాది అలంకారాలతో కూడిన విశిష్టభాష ఉండాలి. ఛందోబద్ధంగా గేయరచనగా వివిధ భాగాలు ఉండాలి. అఖ్యానరూపంగా కాక నాటకీయంగా ప్రదర్శింపబడాలి. అది, శోక భయాలవల్ల ఆ భావాలకే సముచిత క్షాళనం (Catharsis) జరగాలి.

ఈ నిర్వచనం ట్రాజెడి స్వరూపాన్ని స్వభావాన్ని, తెలుపుతూ దానిలోని భాషను, అది వ్యక్తీకృతమయ్యే విధానాన్ని - నాటకీయతను తెలిపి, చివరికా నాటక ప్రయోజనం - కొన్ని భావాల క్షాళనను - తెలిపింది. ఇందులో పేర్కొన్న Catharsis బహుచర్చిత అంశం అయింది.

**కెథార్సిస్** (Catharsis) :

అరిస్టాటిల్ నాటక ప్రయోజనంగా పేర్కొన్న కెథార్సిస్‌ను గూర్చి ఎక్కడా వివరించలేదు. అందువల్ల ఇది చర్చకు, వివిధ వాదాలకు కారణమయింది. ఇది ఏ అర్థంలో ఉపయోగించాడు, నాటక ప్రయోజనం ఎలా సాధిస్తుంది వంటి ఆలోచనలకు విమర్శకులలో వివిధాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

కేథార్సిస్ అనే వైద్యశాస్త్ర సంబంధ పదానికి క్షాళనం అని అర్థం. మనిషిలోని శోకభయాది ఆ వేగాలు ఆయా భావాల ద్వారానే క్షాళితం కావటం అరిస్టాటిల్ సాహిత్య రంగాన ప్రతిపాదించిన కెథార్సిస్ ఉద్దేశ్యం.

చెడ్డవాడికి కష్టం కలిగితే అది చూసేవారికి దుఃఖహేతువు కాదు. కష్టాలు రాకూడని ధర్మనిరతి కలిగిన వాడికి కష్టంవస్తే చూపరులకు శోకం సహజం. మనకూ అలా జరుగుతుందేమోననే భయమూ సహజం. అరిస్టాటిల్ ప్రకారం భయం లేనిదే శోకం లేదు. నాటకం చూడటం వల్ల చెలరేగిన ఆయా భావాలు, నాటకాంతానికి క్షాళితం కావటం కెథార్సిస్.

శోక భయాలనే అరిస్టాటిల్ పేర్కొనటానికి కారణంగా విమర్శకులు చెప్పే హేతువు హేతుబద్ధంగా ఉంది. నాడు ఏథెన్సు దండయాత్రల బెడదతో ఉండేది. కనుక ఆ నగరం నిత్యం యుద్ధ సన్నిద్ధమై ఉండేది. మూలబలంగా నగరంలో ఉండే సైనికులు తప్పనిసరిగా నాట్యశాలకు వెళ్ళాలి. వారిలోని శోకభయాలు నాటక దర్శనం ద్వారా క్షాళితం కావాలి. ఈ రెండూ యుద్ధావేశానికి ఆటంకాలు. కనుక ఈ భావాల క్షాళనం అత్యవసర కార్యంగా ట్రాజెడిలో నిల్చింది.

కెథార్సిస్ అనే పదం అరిస్టాటిల్ కాలానికే మత, వైద్య రంగాలలో ప్రాచుర్యంలో ఉంది. దీనిని గురించి వ్యక్తమైన వివిధ వాదాలలో ప్రధానమైనవి నాలుగు.

క్షాళన వాదం (Theory of Purgation)
పవిత్రీకరణ / శోధన వాదం (Theory of Purification)
సామరస్య రసం (Theory of Balancing)
స్పష్టీకరణ వాదం (Theory of Clarification)

**6. క్షాళనవాదం** (Theory of purgation) :

వైద్య పరిభాషనుంచి తీసుకున్నది క్షాళన. ఈ వాదాన్ని అనుసరించి, హోమియో వైద్య సిద్ధాంతం దృష్టిలో వుంచుకొని దీనిని ప్రతిపాదించాడు. చాలామంది ఈ వాదాన్ని అంగీకరించారు. ఫ్రాయిడ్ ఈ సిద్దాంతమే తన చికిత్సకు వాడాడు. శోకభయాది అవేగాల క్షాళన అంటే సంపూర్ణ క్షాళనమని అరిస్టాటిల్ ఉద్దేశించలేదు. అధికంగా కాని అతి తక్కువగా కాని ఉండక సమస్థితిలో ఉంచటం అని అరిస్టాటిల్ పేర్కొన్నారు. అయితే దీనిలో లోపం కూడా ఉంది.

అధికంగా ఉంటే, అవసరానికి మించిన భావాల క్షాళన జరుగుతుంది. తక్కువగా ఉంటే ఏమవుతుంది? దీనికి సమాధానంగా 'పోయెటిక్సు'లో లేదు. పైగా అవి మాలిన్యానికి అరిస్టాటిల్ ఎక్కడా పేర్కోలేదు.

వీరత్వానికి పిరికితనానికి గుణదోషాలకు నిరంతర వైరుధ్యం ఉంటుంది. అది ట్రాజెడిలో అభివ్యక్తం అవుతుంది. శోక భయాలను సహింపగల శక్తి ట్రాజెడి ద్వారా కలుగుతుంది.

### ఆ. పవిత్రీకరణ వాదం / శోధన వాదం (Theory of Purification) :

వీరు సంపూర్ణ క్షాళనం అంగీకరించరు. శోక భయాలకే కాక ఇతర ఆవేగాలకు కూడా కెథార్సిస్ సమన్వయించవచ్చని అంటారు. వీరి దృష్టిలో కెథార్సిస్ ఒక విధమైన నైతిక సంయమం. ఇది నైతికతను ఒక పద్ధతిలో ఉంచే మార్గం కెథార్సిస్. ట్రాజెడిని చూసినప్పుడు శోకభయానెలా సక్రమంగా వినియోగించుకోవచ్చో నేర్చుకుంటాడు. అదే దాని ప్రయోజనం.

ఈ వాదంలో భేదాలనేకం. రోచెర్టల్లో, కాస్టల్ వెట్రోలు, ట్రాజెడిలో చూడటం వల్ల కఠినత్వం నుండి నిత్యజీవితంలో కూడా శోక భయాలకు దూరంగా ఉంటారని సైనిక జీవితాన్ని చూపారు. జిరాల్డి సింధియా ట్రాజెడిలో కష్టాలు సద్వర్తనకు దోహదమవుతాయన్నాడు. థామస్ టైలర్ ట్రాజెడిలో ఏ దుర్గుణాల వల్ల పాత్రలు పతనమయ్యాయో చూడటం వల్ల అతనిలో ఆ గుణాలు పవిత్రీకరింపబడుతాయి. ఈ విధంగా భిన్న వాదాలనేకం ఇందులో చోటుచేసుకున్నాయి.

### ఇ. సామరస్య వాదం (Theory of Balancing) :

ట్రాజెడిలో సంపూర్ణ క్షాళన వీరూ అంగీకరించరు. ఇతర ఆవేగాలకు - శోకభయాలకే కాక - కూడా కెథార్సిస్ వర్తిస్తుందని విశ్వసిస్తారు. మనిషిలో, అధికంగా ఉన్న శోక భయాది ఆవేగాలను క్షాళనం చేయటమే దీని పరమ ప్రయోజనం. దీనివలన సామాజికునికి ఉపశమనం రూపకాన్ని చూసిన ఆనందం కలుగుతాయి.

### ఈ. స్పష్టీకరణవాదం (Theory of Clarification) :

కెథార్సిస్‌కు వైద్యపరమైన Purgation క్షాళనం, మతపరమైన Purification - పవిత్రీకరణ అనే అర్థాలేకాక Clarification స్పష్టీకరణ అనే అర్థమూ ఉంది. వీరి ననుసరించి, కెథార్సిస్ శోకభయాలు వంటి భావాలకు కాక, సంఘటనలకు అన్వయిస్తుంది. అరిస్టాటిల్ అనుకరణ, దానివల్ల కలిగే అనుభూతిని చర్చించాడు. అందులో కవికి, చరిత్రకారునికి భేదం చెప్పాడు. కవి, చరిత్రను సన్నివేశానుగుణంగా మలచుకొంటాడు. విశ్వజనీనం చేస్తారు. ఈ ట్రాజెడి కల్గించే అనుభూతే ఆనందం, పరిజ్ఞానం.

కవి ట్రాజెడి రచించేటప్పుడు శోకభయాక్షిక సన్నివేశాలనే చరిత్ర, పురాణాల నుంచి ఎన్నుకుంటాడు. ఈ సన్నివేశాలను ఒకే కార్యానికి బంధించే సంభావ్యత (Probability) , అవశ్యకత (Necessity) ఉండేటట్లు, నాటకాన్ని రూపుదిద్దుతాడు. ఈ సూత్రానికి బద్ధమై కార్యానుఖంగా ఉన్న వివిధ సన్నివేశాలను చూసే సామాజికునికి విశ్వజనీనాంశాలతో ఉన్న సంబంధం స్పష్టమవుతుంది. ఈ కలిగే స్పష్ట పరిజ్ఞానకు ఆనందం కలిగిస్తుంది.

వీరు క్షాళినను గూర్చి పేర్కొనలేదు. అయితే మొదలు ఉన్న శోకభయాలు కనుమరుగయి, చివరికి ఆనందం ప్రాప్తిస్తూ ఉంది అంటే నడుమ ఎక్కడో అవి క్షాళితమయ్యాయని గ్రహించలేదంటే ఆనందం కలగదు.

**ట్రాజెడి : లక్షణాలు :**

ఆరు అంశాల ప్రాధాన్యం ట్రాజెడిలో ఉన్నాయి. ఇతివృత్తం (Plot) పాత్ర (Character) భావం (Thought) భాష (diction) సంగీతం (Melody) రంగప్రసాధన (Spectacle) ఈ ఆరు అంశాలు.

**1. ఇతివృత్తం** (Plot) :

అత్యంత ప్రాధాన్యమిచ్చాడు అరిస్టాటిల్ ట్రాజెడిలో ఇతివృత్తానికి ఆత్మప్రాయంగా గుర్తించాడు. కామెడి కంటే ట్రాజెడీకి ప్రాధాన్యమిచ్చిన అరిస్టాటిల్ ఏకకార్య నిష్ఠంగా ఇతివృత్తం ఉండాలన్నాడు. ఇతివృత్తం శుద్ధం సంకీర్ణమని రెండు రకాలు. ఈ రెండు శుభాంతాలు, అశుభాంతాలుగా ఉండవచ్చు. శుద్ధ, సంకీర్ణ, ఇతివృత్తాల మధ్య భేదం వ్యత్యస్త ఫలం అభిజ్ఞానాలలో ఉంది.

వ్యత్యస్తఫలం అంటే ఆశించిన దానికి విరుద్ధంగా ఫలం లభించటం. సిరిసంపదలతో తులతూగే పాత్ర ఒక్కసారి కష్టాలలో దుఃఖానికి గురికావటం. అభిజ్ఞానం అంటే అజ్ఞానంగా ఉన్న అంశం జ్ఞానంలోనికి రావటం. తెలియని విషయం తెలియటం - అభిజ్ఞానం. ఆడిపస్‌రాజుకు ఉపకారం చేయాలని వచ్చిన దూత అతని పుట్టుపూర్వోత్తరాలు వ్యక్తం చేసి అతని జీవితం చీకటిమయం కావటానికి కారణమయ్యాడు. దూత ఆశించిన ఫలం వేరు, పొందినది వేరు. ఇది వ్యత్యస్తఫలం. రాజుకు అంతవరకు తెలియని ఒక సత్యం తెలియటం అభిజ్ఞానం. అభిజ్ఞానం వల్ల మిత్రత శత్రుత్వం ఏదో ఒకటి ఏర్పడి, శుభాంతమో అశుభాంతమో అవుతుంది.

అరిస్టాటిల్ సంకీర్ణేతి వృత్తానికి ప్రాధాన్యమిచ్చాడు. ఇది నాలుగు రకాలుగా ఉండే వీలుంది.

సంకీర్ణం శుభాంతేతీవృత్తం - నాయకుడు సర్వసద్గుణ సంపన్నుడు
- నాయకుడు పరమ దుర్మార్గుడు

సంకీర్ణ అశుభాంతేతివృత్తం - నాయకుడు సత్పురుషుడు
- నాయకుడు దుర్మార్గుడు.

ఇందులో సంకీర్ణ అశుభాంతమైన ఇతివృత్తంలో నాయకుడు సత్పురుషుడిగా ఉండటం గ్రాహ్యమైన ఇతివృత్తం ట్రాజెడికి ఇక్కడ నాయకుడు సర్వసద్గుణ సంపన్నుడు కాడు. కాని మంచివాడు. మనం నిత్యం చూసే మనతో జీవించే మనిషి అటువంటి వాడు ఏదో పొరపాటు వలన కష్టాలు పడటం దుఃఖహేతువు. అలాంటి బాధలు మనకు కలుగుతాయేమోననే భయమూ సామాజికునకు సహజం. కనుక ట్రాజెడికి ఇవి తగిన ఇతివృత్తం అన్నాడు అరిస్టాటిల్.

**2. పాత్ర** (Character) :

పాత్రకు నాలుగు లక్షణాలుండాలని నిర్దేశించాడు Goodness, Appropriateness, likeness, Consistency

**అ) సద్గుణం** (Good ness) :

పాత్రలు ట్రాజెడిలో బలపరాక్రమం కలవారు. న్యాయ పరతంత్రత, విధి నిర్వహణశీతల మొదలయిన సద్గుణాలు కూడా అక్కడక్కడ ఉన్నాయి. ధైర్యస్థయిర్యాలు కూడా ఉన్నాయి. శోకం కలగటానికి ఇవి అవసరం. నీచ హీన పతీత పాత్రలై ఉండరాదు. కోపం లాంటి లక్షణాలున్నా, ఏ గుణాల వల్ల పాత్ర ఉదారంగా కనిపిస్తుందో అదే విశిష్టత పాత్రకు ముఖ్య లక్షణం.

**ఆ) ఉపపన్నత** (Appropriateness) :

ఉపపన్నత అంటే తగ్గి ఉండటం. జాతికి తగ్గి ఉండటం. లింగం, వయస్సు, సాంఘిక హోదాలపై జాతి నిర్ణయం ఉంటుంది. ఉదా : అధికారం, ధనం సాంఘిక హోదాను తెల్పుతాయి. మగవారి లక్షణాలు, స్త్రీ లక్షణాలు వేరు వేరు. స్త్రీలవి పురుషులకు, పురుష లక్షణాలకు ఆపాదించరాదు అది అనుపపన్నత అవుతుంది. రాజు స్త్రీ బానిసలను అరిస్టాటిల్ ఉపపన్నతకు ఉదహరించాడు. అంతస్తులో రాజు ఉత్తమోత్తముడు బానిస అధముడు. స్త్రీ కూడా అలాంటిదే. కనుక ఉపపన్నత అంతస్తుకు సంబంధించినదే.

**బి) పోలిక** (Likeness) :

పాత్ర దేనిని పోలి ఉండాలి. బహుశా అనుకార్యాలను ప్రసిద్ధ పురాణ పాత్రలు రాజవంశీయులను ట్రాజెడీలో చిత్రించేవారు. ఆయా వ్యక్తుల గుణవిశేషాలు ప్రాచుర్యంలోనివే కనుక దానికి అనుగుణంగా పాత్ర చిత్రణ చేయాలి, స్వాభావికంగా ఉండాలి.

**ఈ) పరివృత్తి రాహిత్యం** (Consistency) :

పాత్ర రూపకల్పన ఆరంభం నుంచి ఒకే విధంగా ఉండాలి. మార్పుసంతరించుకొన్నట్టు చిత్రించరాదు. నియమబద్ధ పాత్ర స్వభావం ఉండాలి. దాన్ని అతిక్రమించినా, పరిమితంగానే ఉండాలి. స్వభావ సంబంధమైనది ఈ లక్షణం.

ట్రాజెడీలో పాత్ర పోషణకు ప్రాముఖ్యం ఉన్నా ఇతివృత్తానికే అరిస్టాటిల్ పెద్ద పీట వేశాడు.

**3. భావం** (Thought) :

ఒక అంశాన్ని నిరూపించేటప్పుడు, సార్వజనీనమైన సత్యాన్ని వ్యక్తం చేసేటప్పుడు చెప్పే వివిధ విషయాలలో కనిపించేది భాష. సందర్భోచితంగా సంగతంగా ఉన్నదాన్ని చెప్పగల సామర్థ్యాన్ని భావమనవచ్చు. ఫలసాధన సంబంధంగా జరిగే యోచనే భావం.

**4. భాష** (Diction) :

భాషలో, పదజాలాన్ని ఎనిమిది విధాలుగా విభజించాడు. Standard word - సాధారణంగా జనంవాడే భాష, Strange word - మాండలికం, Metaphor - రూపకం, Ornamental word - అసాధారణ పదం ఉపయోగించటం, Coined word - కల్పిత పదం, word lengthened - ఛందంలో హ్రస్వం, దీర్ఘం కావటం, Word Shortened - కుదించిన పదం, altered word - ఒక పదానికి వేరే పదం చేర్చటం.

వీటిలో ఒక్క వ్యావహారికం తప్ప మిగిలినవి కావ్యప్రయోగ యోగ్యంగా అరిస్టాటిల్ చెప్పాడు.

**5. రంగప్రసాధనం** (Spectacle) :

రంగప్రసాధనానికి ప్రాధాన్యం తక్కువ. కథకు, నటులకు ఉన్న ప్రాధాన్యం.

**6. గానం** (Song) :

డితిరాంబులలో ప్రాధాన్యం వహించిన ఆటపాటలలో పాట అనేక మార్పులు సంతరించుకొని ట్రాజెడిలో నిలచింది. దీని ప్రభావం ఎక్కువనే చెప్పాలి రూపకంలో.

**ఐక్యత్రయం :**

కార్యైక్యం (Unity of action) కాలైక్యం (Unity of time) స్థలైక్యం (Unity of place) ఈ మూడు ఐక్యత్రయం.

**కార్యైక్యం** (Unity of Action) **:**

గంభీరం, ఉదాత్తమైన కార్యం, మానవేతివృత్తం, విషాదరూపకం, కార్యనిరపేక్షమైన గుణగణాలు పరిపోషింపబడకూడదు. కార్యం క్రమపరిమాణం కలిగి ఉండాలి. కథ ఎంత సంక్లిష్ట సన్నివేశాల భరితంగా ఉన్నా, నిర్దిష్ట కార్యంపై ఆధారపడి ఉండాలి. ఆద్యంతం నాటకంలో ఒక పరివర్తనం దాని క్రమం ఉండాలి. ఇది సాధారణంగా సుఖంగా నుంచి దుఃఖం వైపుకు సాగుతుంది. కొన్నిసార్లు దుఃఖం నుంచి సుఖానికి సాగవచ్చు. ఇట్టి క్రమపరివర్తనాన్ని వివరించే ప్రధానఘట్టం ట్రాజెడిలో కార్యంగా నిలుస్తుంది. అనుక్రియామాణమైన కార్యం దీర్ఘంగా కాని పరిమితంగా కాని ఉండకూడదు. కార్యాచరణ సంబంధం కలిగి ఉండాలి. ఈ నిర్దిష్టత వలన కార్యంలో ఐక్యత సమకూరుతుంది. దీన్ని గూర్చి అరిస్టాటిల్ స్పష్టంగా చెప్పాడు.

**కాలైక్యం** (Unity of Time) **:**

దీన్ని గూర్చి అరిస్టాటిల్ సూచన ప్రకారం పేర్కొన్నాడు. సాధ్యమయినంతవరకు ఒక సూర్యభ్రమణ కాలంలో ఇమిడేలా ట్రాజెడి ఉండాలన్నారు. సాధ్యమయినంతవరకు అనటం వల్ల ఇది సూచనే కాని నియమం కాదు.

ఈ సూర్యభ్రమణ కాలం, కథకు సంబంధించినా, లేక ప్రయోగ సంబంధమూ అనే ప్రశ్న తలెక్కకపోదు. ట్రాజెడి ఇతిహాసంతో ఎలా విభేదిస్తుందో చెప్తూ సూర్యభ్రమణ కాలాన్ని గూర్చి అరిస్టాటిల్ ప్రస్తావించాడు. ఇది గ్రంథ విస్తృతికి సంబంధించినది. కనుక 'ట్రాజెడి' ఏకదివస ప్రవృత్తాలై ఉండాలి.

Else అనే విమర్శకుడు దీనిని ప్రయోగ సంబంధిగా పేర్కొన్నాడు. ట్రాజెడి రంగస్థల ప్రదర్శనకు రచింపబడుతుంది. కనుక ఈ నియమం ఇతివృత్తానిదిగా కాక ప్రయోగ సంబంధమే అన్నారు. నాడు గ్రీకు నాటక రంగాన రాత్రి ప్రదర్శనకు వీలు కలిగించే సాధనాలు లేవు. కనుక పగలు మాత్రమే రూపక ప్రదర్శన జరగ కలదు. కనుక పన్నెండు గంటల ప్రదర్శనకు తగిన రచనలే ఉండాలన్నది సూచన. ప్రయోగ సంబంధంగానే దీనిని వాడాడు. కథా విస్తృతి, కథాకాలం ఎంతైనా, ప్రయోగకాలం ఏకదీస పరిమితంగానే ఉండాలి. ఇది పగలు పన్నెండుగంటలే కాని రాత్రి కాదు.

**స్థలైక్యం** (Unity of Place) **:**

స్థలైక్యాన్ని అరిస్టాటిల్ ప్రతిపాదించలేదు. ఇది ఆధునికుల సృష్టి.

యవనిక లేని గ్రీకు రంగస్థలాన, స్థలాంతర ప్రదర్శన సాధ్యం కాదు. ట్రాజెడిలోని 'కోరస్' (బృందగాయకులకు) రంగస్థల ప్రవేశమే కాని నిష్క్రమణ లేదు. చూసేవారికి సహజంగా కనిపించాలి. కనుక స్థలైక్యాన్ని ప్రతిపాదించారు. ఈ మూడు ప్రధానమైన అంశాలు స్థలైక్య ప్రతిపాదనలో. ఈ ఐక్యత్రయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవాడు కాస్టెల్‌వెట్రో. సిడ్నీ, కార్నెల్, రేసిన్, మిల్టన్ తదితరులు దీన్ని అంగీకరించారు.

ఈ సిద్ధాంతాన్ని అంగీకరించని వారు ఉన్నారు. షేక్స్పియర్ దీనిని పాటించలేదు. డాక్టర్ జాన్సన్ దీనిని ఖండించాడు.

ఇది ఒకే సిద్ధాంతపు మూడు రూపాలన్నాడు టి.యస్. ఇలియట్. ఐక్యత్రయాన్ని పాటించిన నాటకాలు సర్వశ్రేష్ఠాలుగా నిలిచాయి.

ఐక్యత్రయం ఎంత సమర్థనాన్ని పొందినా కొన్ని లోపాలు ఉన్నాయి. కథావస్తువు సంకుచితమవుతుంది. వస్తు విస్తృతికి అవకాశముండదు. ప్రాసంగికేతివృత్తానికి నవరస పోషణకు అవకాశం ఉండదు.

**రసైక్యం** (Unity of Sentiment) :

టి.యస్. ఇలియట్ ప్రతిపాదించాడు రసైక్యం. కాని రసం కార్యంతో సంవదిస్తుంది. కార్యైక్యం ఒక విధంగా రసైక్యమే. కొన్నిసార్లు హాస్యరసం అవసరమున్నా లేకున్నా పరిపోషింపబడుతుంది. అది ప్రధానరస భంజకం కాకుండా ఉండాలి. ఇవి ట్రాజెడిలో ముఖ్యాంశాలు.

**కోరస్ :**

ట్రాజెడిలోని మరో ప్రధానాంశం ట్రాజెడి. ట్రాజెడి పరిణామంలో డయోనిసస్ దేవత కోసం జరిగే ఉత్సవాలలో నాయకుడు ఏర్పడ్డాక మిగిలినవారు ఆ నాయకుడిని అనుసరించే వారు. ఇలా నాయకుడిని అనుసరించి పాడేవారిని 'కోరస్' (బృందగాయకులు) అన్నారు. ఇది ట్రాజెడి రూపక పరిణామాన్ని చాటే ఒక విశిష్టాంశం. ఐక్యత్రయ సిద్ధాంతానికిది మూలం. అనేక కార్యాలను నిర్వహిస్తుంది. దీనిలో 12 - 50 మంది వరకు ఉంటారు. ఈ సమూహం అంతటిది ఒకే మాట ఒకేపాత్ర. రంగస్థలాన పాత్రలతో సంభాషిస్తుంది. పాత్రలను నిర్దేశిస్తుంది. పాత్రల కష్టసుఖాలకు స్పందిస్తుంది. భూత భవిష్యద్వర్తమానాలను తెల్పుతుంది. కోరస్ ఒకోసారి పాత్రలాగా మరోసారి హితాభిలాషిగా ఇంకోసారి కేవలం ప్రేక్షక పాత్రలా ఉంటుంది.

దీనివల్ల నష్టమూ ఉంది. కోరస్ వల్ల, నాటకకర్త తన ఇచ్ఛానుసారంగా కథను వివిధ రసభరితంగా, సన్నివేశ కల్పన చేయటానికి ఉండదు. కవి స్వేచ్ఛ తగ్గుతుంది. నాటకేతివృత్తం సంకుచితం అవుతుంది. శృంగారాది రసభంజకంగా ఉండటమే కాదు మంత్రాలోచన ప్రదర్శనకూ ఆటంకమే.

ఇది పూర్వం ఉన్నా నేడు అంతరించింది. దాని స్థానంలో నాటక కర్తలితర సాధనాలు అన్వేషించటం జరిగింది ట్రాజెడిలో షడంగాలే కాదు కోరస్ కూడా ప్రముఖమే కీలకమైన పాత్రను పోషించింది.

## 11. పాశ్చాత్య నాటకం - కామెడి :

ఆరంభంలో ట్రాజెడీకి వేసినంతటి పెద్దపీట కామెడికి లభించలేదు. అరిస్టాటిల్ దానిని తక్కువగా భావించటమే కారణం. కామెడిని గురించి చర్చించింది తక్కువే. ఉదాత్తేతివృత్తం ట్రాజెడిలో ఉండగా, మానవునిలోని న్యూన భావాలు చేష్టలతో కామెడి ఉంటుంది.

Komos - Revel, oide-song. Comedy అనే పదానికి గ్రీకు పదాలైన Koneos, Oide, లు మూలం. దాని అర్థం ఆనందోత్సాహాలతో పాడే పాటలు అని అర్థం.

**కామెడి ఆవిర్భావం :**

ట్రాజెడిలాగానే కామెడి కూడా డయోనిసస్‌కు సంబంధించినవే. అయితే ఈ దేవత పునర్జన్మకు సంబంధించిన పాటలివి. అయితే దీని ఆవిర్భావానికి నిర్దిష్ట నిదర్శనాలు లేవు.

**కామెడి నిర్వచనం :**

నీచుల అనుకరణ కామెడి. వీరి లక్షణం దుర్మార్గం కాదు హాస్యాస్పదత్వం. అది కురూపతలో భాగమే. ఈ అనాకారిత్వం ఇతరులకు బాధ కాని హానికాని కలిగించదు. దీనికి నిదర్శనంగా నిల్చేది కృత్రిమ ముఖం (Comic mask) ఇది వికృతంగా అందవిహీనంగా ఉన్నా బాధ కలిగించదు.

కామెడి ఆదర్శాల వల్లేవేత కంటే ఆసక్తిజనకంగా ఉంటుంది. ఆదర్శంగా కంటే వాస్తవికంగాను, వీరోచితంగా కంటే నిత్యజీవిత ధోరణుల్లోనూ కామెడి సాగుతుంది. నైతికతను పెంపొదించటం కంటే ఆహ్లాదం కలిగించటం దీని ప్రథమ ప్రయోజనం.

**కామెడి విభజన (గ్రీకు) :**

గ్రీకు కామెడి కాలానుగుణంగా మూడు విధాలుగా విభజించారు. Old, Middle, New, Comedies

**Old Comedy :**

అంతగా ఇతివృత్త ప్రాధాన్యంలేదు, తీవ్రమైన పదనిందతో కూడిన హేళన ఉంటుంది. కామెడి ఇతరులను నొప్పించని హాస్యంతో ఉండాలనే నియమం Old Comedy కి వర్తించదు. ఈ కామెడికి అరిస్టోఫేన్సు రచనలు నిదర్శనం.

**Middle Comedy :**

ఈ నాటకాలు వ్యంగ్యాత్మకంగా ఉన్నాయి. ఈ రెండింటిలోని (Old & Middle) హేళన, వైయక్తిక దూషణతో, కఠినమైన హేళనతో ఉండి విశ్వజనీనమనే భావనకు దూరంగా ఉన్నాయి.

**New Comedy :**

వ్యక్తి దూషణ తగ్గింది. దాదాపు లేదు. విశ్వజనీన హాస్యం మృదుల హాస్యం చోటుచేసుకొంది. ఈ రూపకాలు లభిస్తున్నది నాలుగే. అవి మెనాండర్ రచించినవి.

**గ్రీకు - రోమను రూపకాలు :**

క్రీ.పూ. 500 - 200 మధ్య కాలంలో ప్రవర్థిల్లిన రూపక (ట్రాజెడి, కామెడి) ప్రభావం రోముపై పడింది. అక్కడా రూపక రచనారంభమైంది. రోమను రూపకాలు ఒక అనుసంధానంగా నిల్చాయి. గ్రీకు పాశ్చాత్య రూపకాల మధ్య - గ్రీకురూపక సంబంధ పరిజ్ఞానాన్నిచ్చాయి. ఆంగ్ల రూపక కర్తలను ప్రభావితం చేశాయి. గ్రీకులో ఉన్న సృజనాత్మకత రోము రూపకాలలో లేకపోయినా తనదైన ధోరణిని ప్రభావాన్ని రోము రూపకం నిలుపుకొంది.

వీరిలో ప్లాటస్, టెరెన్స్ ప్రధాన రూపకర్తలు. టెరెన్స్‌పై గ్రీకు రూపకకర్త మెనాండర్ ప్రభావం ఉంది. హాస్యం, ప్రేమ, వాత్సల్యం, తల్లిదండ్రుల పట్ల భయభక్తులు ఆధారంగా ఇతని రూపక రచన సాగింది. క్రీ.శ. 1వ శతాబ్దానికి రూపకకర్త కంటే నటునికి ప్రాధాన్యం పెరిగింది.

**రూపక క్షీణత / అంధయుగం :**

క్రీ.శ. 6వ శతాబ్దిలో రోమను సామ్రాజ్యం పతనమైంది. రూపకం లేనిదే చెప్పవచ్చు 13వ శతాబ్ది వరకు. అందుకనే దీనిని 'అంధయుగం' Dark age అన్నారు.

### "కామెడి - మత ప్రోత్సాహం - పాశ్చాత్య రూపకం :

రోమను సామ్రాజ్య పతనానంతరం రోములోని చర్చి అధికారులు నిరాకరించిన రూపకాన్ని ఆంగ్లదేశాన చర్చి అధికారులు చేపట్టారు. మతప్రచారానికి రూపకాన్ని వాడారు. చర్చి పండగలలో ఉత్సవాలలో క్రైస్తవ మతగ్రంథమైన బైబిలు కథల ఆధారంగా రూపకాన్ని రచించి ప్రదర్శించారు. ఇవి అద్భుత (Mystery play) దివ్య తలా (Miracle play) నీత్యుపదేశ (Morality play) ఉపరూపకాలు (Interlude). ఇవి ఆంగ్లంలో కామెడీలకు మూలం.

### ఆంగ్ల రూపకం :

క్రీ.శ. 1583 నాటికి సాహితీపరంగా కాని, ప్రదర్శనా యోగంగా కాని రూపకాలులేవని సర్ ఫిలిప్ సిడ్నీ ఆంగ్ల సాహిత్యకృషిని సమీక్షిస్తూ పేర్కొన్నాడు.

### రూపక స్వర్ణయుగం - ఎలిజబెత్ యుగం :

నాటక రచన దీప్తివంతంగా వెలిగిన కాలంలో, అగ్రగణ్యుణిగా నిల్చినవాడు షేక్స్పియర్. కాల్పనిక రచనలు అధికంగా వెలువడ్డాయి. (Comedy of humours) అనే రూపక భేదాన్ని ఏర్పర్చిన డా॥ బెన్‌సన్ మరోముఖ్యుడు పునరుజ్జీవన రచనలలో దేశాభిమానం, రచనలో స్వేచ్ఛా దృక్పథం ఏర్పడింది.

రెండవ జేమ్సు అనంతర పాలించిన పూరిటన్లు నాటక ప్రదర్శన నిషేధించడంతో రూపక రచన తగ్గింది. కాని రెండవ ఛార్లెస్ రాకతో నాటకం తిరిగి పుంజుకొంది. వీటిని Commedy of manners అని Restoration drama అంటారు.

ఫ్రాన్సు (మోలియర్), స్పెయిన్‌ల (లోప్‌డీవేగా, కాల్డిరాన్)లో నాటకం వికాసం పొందింది.

రియలిస్టిక్ రూపకాలు (ఇబ్సన్)
మనోవిశ్లేషణాత్మక రూపకాలు (చెకోవ్ - రష్యా)
స్వాభావిక రూపకాలు (మాక్సిమ్ గోర్కి - రష్యా)
హేళనాత్మక రూపకాలు (బెర్నార్డ్ షా) క్రమ పరిణామంలో ఏర్పడ్డాయి.

### కామెడి విభజన (పాశ్చాత్య) :

గ్రీకు కామెడీల నుంచి క్రమంగా పాశ్చాత్య సాహిత్యంలోనికి ప్రవేశించింది కామెడి. అక్కడ వినూత్న పోకడలతో స్వల్పమార్పులతో కొత్తరూపాలు సంతరించుకొంది. పాశ్చాత్య కామెడి 5 రకాలుగా ఉంది.

**1. Romantic Comedy :**

కాల్పనికత, ప్రణయ ధోరణితో సాగే రచన. షేక్స్పియర్ రాసిన As you like it, A mid Summer nights dream, ఇందుకు నిదర్శనాలు.

**2. Satiric Comedy :**

వ్యంగ్యం, అధిక్షేపం ఉన్న రచన. సమాజంలోని అకృత్యాలకు వ్యతిరేకంగా సాగే రచన. చెడ్డవానికి చివరకు చెడు జరగటం చెప్పబడుతుంది. బెన్‌జాన్సన్ The Alchemist దీనికి ఉదాహరణ.

**3. The Comedy of manners :**

దీన్ని Restoration drama అని అన్నారు. హాస్యంలో కొంత దిగజారినతనం ఉండేది. బాగా నాగరిక సమాజంలోని వ్యక్తుల వ్యవహారాలతో అలవాట్లపై సాగే హాస్యం ఇది. తమాషా అయిన సంభాషణ, ప్రియునితో, భర్తతో సాగటం మాట తిప్పికొట్టటం ఇందులో చూస్తాం. 18వ శతాబ్దానికి హాస్యం కొంచెం మేల్తరంగా నిల్చింది. love's labones lost, Uuch ado about nothing - షేక్స్పియర్‌వి, A School for Scandal - రిచర్డ్ షెరిడన్, ఈ రకమైన రచనలు.

**4. Farce :**

మనసారా ప్రేక్షకులను నవ్వించటం దీని ఉద్దేశ్యం. వీటిని 'Belly Laughs' అన్నారు. సుదీర్ఘ సంభాషణతో నిండిన హాస్యం ఉంటుంది. Noah - వేక్‌ఫిల్డ్ దీనికి నిదర్శనం. దీనిని సినిమాగా రూపొందించిన ఆనవాళ్ళూ ఉన్నాయి -ఛార్లీఛాప్లిన్.

**5. High - Low Comedy :**

ఇది చివరిది. High comedy మేధావులను ఆకర్షించేదిగా ఉంటుంది. షేక్స్పియర్ Much ado about nothing దీనికి ఉదాహరణ. low comedy దానికి వ్యతిరేకం. జోక్సుతో కూడి ఉంటుంది.

కామెడి - సుఖాంత రచన. మొదట్లో వ్యంగ్య వ్యాఖ్యానాలు రచయితనో రాజకీయ నాయకుడినో ఆశ్రయించి ఉంటే, క్రమంగా అది ప్రేమ. సంబంధ ఇతివృత్తాలకు మారింది. ఆధునిక యుగంలో ఇతివృత్తంతో సంబంధం లేకుండా, రచన పొడవునా హాస్యం నిలుస్తూ ఉంది.

## 14.3 ముగింపు :

ప్రాచ్య నాటకం మంగళకరమైన ఆరంభం, మద్యమం, అంతం ఉండటం నియమం. పాశ్చాత్య నాటకం సుఖాంతానికి ప్రాధాన్యమున్నా, విషాదాంతానికి మకుట ప్రాయ ప్రాధాన్యం ఉంది. సంపూర్ణ వైరుధ్యం ప్రాచ్య నాటకానికి పాశ్చాత్య ట్రాజెడికి. ప్రాచ్యనాటకానికి రసానంద లబ్ధి ప్రయోజనమైతే, పాశ్చాత్య ట్రాజెడికి క్షాళన, కామెడికి హాస్య సంబంధ ఆనందం ప్రయోజనంగా నిలుస్తుంది. నాటకం ఇరు ప్రాంతాలలో ఇరుప్రకారాలుగా పురోగమించాయి.

## 14.4 మాదిరి ప్రశ్నలు :

1. ప్రాచ్యనాటక లక్షణాలను వివరించండి.
2. పాశ్చాత్య నాటక ధోరణి ట్రాజెడి స్వరూపాన్ని విశదీకరించండి.
3. కామెడి విశిష్టతను తెల్పండి.

## 14.5 ఆధార గ్రంథాలు :


1. సాహిత్య దర్శనం - ఆచార్య కాకర్ల వెంకట రామ నరసింహం
2. అరిస్టాటిల్ - బి. వెంకటేశం.
3. తెలుగు నాటక వికాసం - పోణంగి శ్రీరామ అప్పారావు
4. సాహిత్య శిల్ప సమీక్ష - పింగళి లక్ష్మీకాంతం


- డా॥ కె. మధుజ్యోతి

**పాఠం - 16**

# తెలుగు వ్యాస పరిణామం

**విషయసూచిక**

**16.1** పాఠ్య ఉద్దేశ్యం : తెలుగు వ్యాస పరిణామం తెలియజేయడం

**16.2** పాఠ్య నిర్మాణం :

- **16.2.1** వ్యాసం : పరిచయం
- **16.2.2** వ్యాస లక్షణం
- **16.2.3** వ్యాసం పరిణామం
- **16.2.4** ముగింపు

**16.3** పాఠ్య వివరణ

## 16.2.1 వ్యాసం :

ఆధునిక కాలం అనేక ప్రభావాలకు తెలుగు ప్రాంతాన్ని గురి చేసింది. పాశ్చాత్య ప్రభావం భాష సాహిత్య సాంఘిక ఆర్థిక రాజకీయ రంగాలను ప్రభావితం చేసింది. తెలుగులోనికి ప్రవేశించిన నూతన ప్రక్రియలలో వ్యాసం ఒకటి.

## వ్యాసం - ఎస్సె :

వ్యాసం అనే పదం ఆంగ్ల పదమైన ఎస్సె (essay) కు తెలుగు రూపం. ఎస్సె పదం అస్సె (assay) అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. ఎక్సాజియమ్ (exagium) అనే పదం నుంచి అస్సె (assay) రూపం వచ్చింది. దీనికి తూచటం పరిశీలించటం అని అర్థం.

'అస్సె' పదానికంటే ఫ్రెంచ్ పదం ఎస్సై (essai) (essay) కి దగ్గరదని, దానికి మూల రూపమని నిర్ణయించారు. ఫ్రెంచి రచయిత మైకల్ డిమాంటేన్ ప్రథమ వ్యాస రచయిత కనుక, ఫ్రెంచి భాషలో వ్యాసానికి మూలపదం అయిన ఎస్సై, ఎస్సెకి మూల రూపంగా భావించవచ్చు. కనుక ఆంగ్లంలోని ఎస్సె అనే పదానికి ఫ్రెంచి 'ఎస్సై' మూల పదంగా భావంచటమే సమంజసం. దీనికి ప్రయత్నం, పరిశీలనమని, అర్థాలు. ప్రయత్నం అన్నది వ్యాస రచనకు వ్యాస నిర్మాణానికి సంబంధించింది కాగా, పరిశీలిన అన్నది ప్రాపంచిక విషయ సంబంధమూ ఆలోచనా సంబంధంగానూ భావింపబడింది.

## వ్యాసం - అర్థం :

పాశ్చాత్య ప్రక్రియా లక్షణం చాలా వరకు తెలుగులోకి అలాగే ప్రవేశించింది. వ్యాసం అంటే ఏదేని యొక విషయమును విరివిగా వ్రాయుట (శబ్దార్థ చంద్రిక) ఏదేని యొక చరిత్రాంశము (ఆంధ్ర వాచస్పత్యం) ఏ విషయమునైనను తెలిసికొని, దానియందలి అంశములను విభజించి వివరించి చెప్పుట వ్యాసమని (భాషా సమితి విజ్ఞాన సర్వస్వాలు) పేర్కొన్నాయి.

ఆంగ్లం నుంచి వ్యాస లక్షణాలు తెలుగులోనికి ప్రవేశించక పూర్వం సంస్కృత వ్యాస ప్రభావం తెలుగుపై ఉంది. సంస్కృతంలో అనేక ప్రకారాలుగా ఉండటం అనే అర్థం తెలుగు వ్యాసానికి వర్తించదు. ఎస్సైకి వ్యాసమనే పేరు తెలుగులో

స్థిరపడక పూర్వం స్వామినేని ముద్దు నారసింహనాయుడు ప్రమేయమని, పరవస్తు వెంకటరంగాచార్యులు సంగ్రహమని, కందుకూరి వీరేశలింగం పంతులు ఉపన్యాసం అన్ని అన్నారు.

ఎస్సె అనే పదానికి వ్యాసం అర్థం అని సి.పి.బ్రౌను తెల్పి యత్నము ప్రయత్నము అని వివరణ ఇచ్చి, Essayist అంటే he who makes an attempt who writes an essay, an author అని పేర్కొన్నారు. గ్రంథస్థంగా ఈ పదాన్ని మొదట వాడినవాడు సి.పి. బ్రౌను.

### వ్యాసం - నిర్వచనాలు :

ఆంగ్ల సారస్వతంలో వ్యాసం ప్రముఖ స్థానాన్నే పొందింది. బహువ్యాసకర్తగా జేకన్, మాంటేన్, వాకర్, హడ్సన్, డ్రిచ్చర్స్ వంటి వారి నిర్వచనాలు వ్యాసాన్ని సంపూర్ణంగా నిర్వచించలేకపోయాయి. వ్యాస స్వరూపాన్ని స్వభావంగా ఆవిష్కరించగల సంపూర్ణ నిర్వచనం ఒక్కటిగా లేదు. కనుక భిన్న నిర్వచనాలలోని వ్యాస స్వభావాన్ని చూడాలి.

1. A composition of moderate length on any particular subject, a branch of a subject; originally implying want of finish, but now said of a composition more or less elaborate in style through limited in range (Oxford Dictionary)
2. As a form of literature the essay is a composition of moderate length, usaually in prose, which deals in an essay, cursory way with a subject, and in strictness, with that subject only as it affects the writer. (Encyclopedia Britanica)
3. .... the true essay, is essentially personal like its verse analogue, the lyric, it belongs to the literature of self - expression. Treatise and dissertion may be objective; the essay is subjective (W.H. Huson)
4. The essay as we now understand it is usually a short literacy prose composition embodying only a selection of its authors knowledge and views on a given subject. It rarely pretends to be exhaustive or final; It is series of personal comments rather than a finalized arguement - cultured glance rather than a careful examination (The Home University Ed.)
5. Essay, a form of writing which may be defined as Non-Technical prose exposition with a personal point of view, composed to be read at a single sitting and as a complete work. (colliers Encyclopedia)
6. An essay is a breaf, usually prose, composition which reveals the authors personality as it given his contemplations on the meaning of life or his observations on various subjects. (Encyclopedia Americana)

పైన పేర్కొన్న నిర్వచనాలు ఒక్కొక్కటి ఒక్కో లక్షణాన్ని తెల్పాయి. మొదటి దానిలో అవిశాలత్వం, అసంపూర్ణత్వం చెప్పబడింది. తర్వాత దానిలో వచనత్వం, సంపూర్ణరాహిత్యం, విశృంఖలత్వంతో రచయిత వ్యక్తిత్వం వ్యాసంలో ఉండటం పేర్కొనబడింది. మూడవ దానిలో, వ్యాసం ప్రధానంగా వ్యక్తిత్వంలో ఉంటుందని, అది ఆత్మావిష్కరణ సాహిత్య సంబంధి అని, చట్టాలు సిద్ధాంత రచనలు పరాశ్రయ రచనలయితే కావచ్చు కానీ, వ్యాసం ఆత్మాశ్రయమని, రచయిత వ్యక్తిత్వ ప్రాధాన్యం చెప్పబడింది. పరిపూర్ణత, పాఠక స్ఫూర్తి, రచయిత వ్యక్తిత్వ ముద్ర తర్వాతి దానిలో తెల్పబడింది. శాస్త్రసిద్ధాంత రహితాలు, ఆలోచనా క్రమపరిణామం, విస్తారం కానిది అని వివరింపబడింది. చివరిగా, వ్యాసం సంక్షిప్తంగా, రచయిత వ్యక్తిత్వ నిరూపణంగానూ, వివిధాంశాల పట్ల అతని పరిశీలనగా ఉండాలని తెలుపుతూ ఉంది.

స్థూలంగా వ్యాసం, వచనంలో రాయబడి ఉంటుంది. అవిశాలత, విశృంఖలత, రచయిత -పాఠక మిత్రత, హాస్యత,

సృజనత, అసంపూర్ణత, రచయిత వ్యక్తిత్వ సహితత లక్షణాలుగా ఆంగ్లవ్యాసం రూపొందింది. తెలుగు వ్యాసం లక్షణాలు చాలా వరకు ఆంగ్ల వ్యాసానివే.

## 16.2.2 వ్యాసం - లక్షణాలు :

వ్యాస నిర్వచనాల పరిశీలనానంతరం, వ్యాసానికి ఉండవలసిన కొన్ని లక్షణాలు స్పష్టమయ్యాయి. వ్యక్తమయిన లక్షణాలన్నీ ఒకే వ్యాసంలో ఉండాలనే నిర్బంధమేమీ లేదు. 1. వచనం 2. సంక్షిప్తత అవిశాలత 3. విశృంఖలత, 4. మిత్రత, 5. హాస్యత, 6. సృజనత, 7. అసంపూర్ణత 8. వ్యక్తిత్వం

### 1. వచనం :

వ్యాసం వచన రచనగా ఉండాలి. నేటి కాలపు అత్యవసర పాశ్చాత్యంలో, పద్యవ్యాసాలు ప్రాచీనంలో ఉన్నాయి. 18 వ శతాబ్దిలోని 'ఎస్సె ఆన్ క్రిటిసిజమ్' 19 వ శతాబ్దిలోని 'ఎస్సె ఆన్ మైండ్‌లు పద్య వ్యాసాలే. కాని ఆధునిక కాలంలో వచన ప్రక్రియగానే వ్యాసం ప్రసిద్ధం. తెలుగులో కొత్తపల్లి సుందర రామయ్య రచన 'వ్యాస వ్యాసము' వ్యాసుడి జీవితం వస్తువుగా సాగిన పద్యరచన. దీనిని వ్యాసంగా పరిగణించటం కుదరదు. కనుకే వ్యాసం తప్పని సరిగా వచన రచనగానే ఉండాలి.

### 2. సంక్షిప్తత / అవిశాలత :

ఏ రచనా ప్రక్రియకైనా, సన్నివేశమో, కథో, పాత్రో ఏదో ఒకటి ఉండి దాని నిడివి కొంత పరిమితమై స్పష్టమవుతూ ఉంటుంది. ఆ ప్రక్రియ ఎక్కడికి ముగుస్తుందో చదువరికి స్పష్టమవుతూ ఉంటుంది. కాని వ్యాసానికి ఇక్కడికి ఇది ముగియాలి ముగుస్తుందనే నియమం, నిర్బందం ఏదీ లేదు. అపరిమితంగా సాగే గుణం వ్యాసానికి ఉంది. కానీ పరిమితంగా, సంక్షిప్తంగా ఒకసారి చదివేయగలిగి, కొద్ది పుటల్లో ముద్రితం కావటానికి అనువైన సంక్షిప్తత కలిగి ఉండాలి. ఈ కురుచదనం పరిమితి స్పష్టం కావు. కాని వ్యాసం మాత్రం అవిశాలత్వంతో ఉండాలి.

### 3. విశృంఖలత :

ఏ రచనా ప్రక్రియలోనైనా గ్రహించిన విషయం ఓ క్రమ పరిణామం పొందుతుంది. ఒక వస్తువు ఏక రీతిలోనో అనేక రీతుల్లోనో పరిణమించవచ్చు. రచనను ఆశ్రయించుకొని జరిగిన పరిణామం, రచనను పరిపుష్టం చేస్తుంది. కాని వ్యాస ధర్మం దీనికి భిన్నంగా ఉంటుంది. వ్యాస విషయం పెంపుదల ఒక మార్గంలో పెరిగినట్లుకాని, ఒక పద్ధతిలో సాగినట్లు కాని, ఒక విధానం అనుసరించినట్లు కాని, ఒక క్రమత కలిగి ఉన్నట్లు కాని అనిపించదు. ' ......... Systematic treatment of it is impossible' అంటారు. హడ్సన్ డబ్ల్యూ. హెచ్.

### 4. మిత్రత :

రచయితకు పాఠకులతో మిత్రత ఉంటుంది. రచన ప్రభు సమ్మితం, మిత్ర సమ్మితం, కాంతా సమ్మితంగా ఉండాలన్నది అలంకారిక సంప్రదాయం. వ్యాసం మిత్ర సమ్మితంగా ఉంటుంది. రచయిత మాట్లాడుతున్నట్టే వ్యాసం ఉండాలి. ఆ మాట్లాడటం అధికారికంగా, పాఠాలు చెప్పే అధ్యాపకుడిలానో కాక, మిత్రుడిలా ఉండాలి. ఇద్దరు మిత్రులు మాట్లాడుకొంటున్నట్లు ఉండాలి. ఒక మిత్రుడికి సలహా ఇస్తున్నట్టో, మిత్రుడి అభిప్రాయం కోరుతున్నట్టో వ్యాసం ఉండాలి. ఇద్దరికి తెలిసిన సంగతులు ముచ్చటించుకొంటున్నట్టు, ఆ పాఠక రచయితలకే పరిమితమైన ఆంతరంగిక సంబంధాల తెరలు తొలగిస్తున్న ధోరణిలో ఉత్తమ

వ్యాసం నడుస్తుంది. ఇద్దరు మిత్రుల సంభాషణలో దొర్లే విషయాలు, ఒకదాని నుంచి ఇంకో దానికి సాగుతూ, ప్రధాన విషయం శాఖోపశాఖలుగా విస్తరిల్లటం శాఖాచంక్రమణం చేస్తూ వ్యాసరచయిత ఆ ధర్మం ప్రదర్శిస్తారు. ఇవి చాలా ఆవేశభరితంగా ఉంటాయి.

## 5. హాస్యత :

వ్యాసం ఆలోచనా ప్రధానం. దాని వలన దాని పఠనం బరువుగా ఉంటుంది. దానికి హాస్యత జోడింపబడితే, ఆ రచన ఆస్వాదయోగ్యం అవుతుంది. ఈ వ్యాసాలలో హాస్యం లేని వ్యాసాలూ ఉన్నాయి. కాని హాస్యం ఉంటే సముచితంగా ఉంటుంది.

## 6. సృజనత :

వ్యాసం సృజన ధర్మం కలది. ఈ ధర్మం వల్లనే హృదయానికి సన్నిహితం అవుతుంది. సృజన వ్యాసం రచయితపైనే ప్రధానంగా ఆధారపడితే విమర్శన వ్యాసం రచయిత పాండిత్యం కృషి పరిశోధనపై ఆధారపడుతుంది. సృజనత లేకపోయినా వ్యాసం ఉంటుంది. కాని, అది పాఠకలోకానికి దగ్గరవ్వదు. వ్యాసం ప్రాథమికంగా సృజన రూపం, కాలాంతరాన విమర్శన రూపం పొందింది.

## 7. అసంపూర్ణత :

చిన్న వ్యాసమైనా, పెద్దదైనా సంపూర్ణంగా ఉండదు. వ్యాసాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించలేదు. వ్యాస సంబంధేతర విషయాలను స్పృశించగలడు కాని వ్యాసానికి సంపూర్ణతన ఆపాదించడం కుదరదు, కుదరకూడదు. తాను చెప్పదలచుకొన్న విషయానికి కూలంకష సమాచారాన్ని సేకరించి వివరిస్తే అది ఏ పరిశోధనో, శాస్త్రగ్రంథమో అవుతుంది కాని విమర్శకాదు. సాధారణంగా వ్యాసకర్త అనుభవంలోని విషయాలు హృదయబలంతో మరే ఇతర సాక్ష్యాలు సహాయాలు అక్కరలేకుండా వ్యక్తీకరింపబడినప్పుడు వెలువడే వ్యాసంలో అసంపూర్ణత తప్పనిసరి అవుతుంది. ఇది అతి ప్రధాన లక్షణం. వ్యాసం స్వయం సంపూర్ణం కాదు.

## 8. వ్యక్తిత్వం :

వ్యాసకర్త వ్యాసంలో ఆత్మాశ్రయంగానో పరాశ్రయంగానో ఉండవచ్చు. రచన చదివినప్పుడు ప్రత్యక్షంగానో పరోక్షంగానో భంగ్యతరంగా రచయిత గుర్తువస్తే అది ఆత్మాశ్రయ రచనగానూ, రచయితే జ్ఞప్తికి రాకపోతే అది పరాశ్రయంగా పేర్కొనవచ్చు. ఆత్మాశ్రయమైనా పరాశ్రయమైనా రచయిత వ్యక్తిత్వం స్పష్టం అవుతూ ఉంటుంది. సాక్షి వ్యాసాలలో పానుగంటి ఆత్మాశ్రయ ధోరణి కనిపిస్తుంది. రచయిత, ఆత్మాశ్రయ ధోరణిలో సాంఘికాది పరిణామాలకు లోనయి, చేసే వ్యక్తీకరణ పాఠకులతో దగ్గరితనాన్ని ఏర్పరుస్తుంది.

వ్యాస విషయం ఏదైనా అక్కడ వ్యాసకర్త వ్యక్తిత్వ ముద్ర ఉండి పాఠకుడిని ఉత్సాహ పరుస్తుంది. వ్యక్తిత్వ ముద్ర పెరిగే కొద్దీ సృజన ధర్మం కూడా పెరుగుతుంది. సృజన ధర్మం వ్యక్తిత్వం పరస్పర దోహదాలుగా నిలుస్తాయి వ్యాసంలో. రచయిత వ్యక్తిత్వం పెరిగే కొద్దీ వ్యాసంలో సంపూర్ణత తగ్గిపోతుంది అదే వ్యాసంలో అభిలషణీయం కూడానూ.

రచయిత వ్యక్తిత్వం వ్యాసలక్షణాలన్నింటికి సంబంధించినది. దాని నుంచే ఇతర లక్షణాలు ఆవిర్భవించాయని చెప్పవచ్చు. రచయిత ఆత్మీయమై ఆత్మావివరణ పొంది, వ్యక్తిత్వ ముద్రితమై గోచరించేది ఉత్తమ వ్యాసంగా నిలుస్తుంది.

## III. తెలుగు వ్యాస పరిణామం :

ఆంగ్ల వ్యాస ప్రభావంతో తెలుగులోనికి ప్రవేశించిన ప్రక్రియ వ్యాసం. దీనివల్ల వచన రచనా సామర్థ్యం రచనావకాశం తెలుగులో పెరిగింది.

తెలుగు వ్యాసం ప్రధానంగా పొందిన పరిణామం రెండు విధాలు

1. సృజన వ్యాసం
2. విమర్శన వ్యాసం

వ్యాస పరిణామంలో ఈ రెండూ ప్రధాన శిఖరాలు ప్రముఖమైనవి. రచనా రీతిని అనుసరించి, విషయ వైవిధ్యాన్ని బట్టి పరికిస్తే స్థూలంగా విస్తృత వైశాల్యం కనిపించినా, ప్రధానంగా రెండే నిర్మాణ రీతులు గోచరమవుతాయి. వ్యాసం ఏ పేరుతో వ్యవహరింపబడ్డా ఏ రీతిలో రచింపబడినా, సృజన వ్యాసమో విమర్శనా వ్యాసమో అవుతుంది. నిర్మాణం వల్ల వస్తువు వల్ల ఏర్పడ్డ వైవిధ్యం కూడా ఈ విభాగానికి కారణం అవుతూ ఉంది.

### 1. సృజన వ్యాసం :

హృదయం ప్రధానమై కాల్పనికత ఉండి, రచయిత వ్యక్తిత్వం ప్రస్ఫుటంగా ఉండి, చాలా వరకు ఆంగ్ల వ్యాస లక్షణాలు గోచరించే వచన రచనలు సృజన వ్యాసాలుగా పరిగణింపబడుతాయి. ఈ సృజనవ్యాసం ఉపన్యాసంగా, ప్రమేయంగా సంగ్రహంగా వచన కావ్యంగా ఆరంభమైనా, కథలు గాథలుగా రూపొందినా, మరే పేరుతో పిలువబడినా విస్తృతంగానే ఆవిర్భవించింది.

ఈ సృజనవ్యాస పరిణామం ప్రధానంగా నాలుగు విధాలు

1. నవయుగ వ్యాసం
2. స్త్రీ వ్యాసం
3. పత్రికా వ్యాసం
4. వివాద వ్యాసం

### 1.1 నవయుగ వ్యాసం :

సృజన వ్యాసం ఉపన్యాస రూపంతో, వ్యాస రూపంతో వెలువడి విస్తృతంగా వ్యాపించింది. సృజన వ్యాసం కొన్ని సందర్భాలలో వ్యాసం కాదేమో అన్నంత దూరంగా జరిగిపోయింది. అయితే ఈ రచనలు వ్యాసాలు కావటమే కాదు, ఇవే అసలైన వ్యాసాలుగా భావించదగ్గవిగా నిల్చాయి.

కందుకూరి ప్రథమ వ్యాసకర్త అనే భావన మొదట్లో ఉన్నా, అంతకంటే పూర్వమే వ్యాసరచన ఉందని విమర్శకులు నిర్ధారించారు.

### అ. ప్రాగ్వ్యాస యుగం :

ఆంగ్ల ప్రభావం సోకని తెలుగు వ్యాస స్థితికి నిదర్శన మీ యుగం. కథ, పాత్ర, సన్నివేశాలు, కల్పనా సహాయం లేకుండా కవి ఆలోచనానుభూతుల అనుసంధానంలో స్వేచ్ఛగా అవతరించినప్పుడు వ్యాసంగా నిలుస్తుంది. శాస్త్ర వాఙ్మయంలో హృదయ సన్నిహితాంశాలుకాని, సృజన వాఙ్మయంలో బుద్ధి ప్రదర్శిత ఘట్టాలు కాని వ్యాసావిష్కరణకు మూలాలు.

ప్రిచ్చర్డ్ సంస్కృత సారస్వతంలో వ్యాసాలనదగ్గ వాటిని పేర్కొన్నాడు. ఏ.వి. రామశర్మ శ్రీమదాంధ్ర మహా భాగవతంలోని సద్ధర్మాలు బ్రాహ్మణులు (చతుర్థ స్కంధం) అనే అంశాన్ని పేర్కొన్నారు. 16 వ శతాబ్ది తత్త్వ వచన గ్రంథం వివేక చింతామణి. మూడు ఖండాల గ్రంథంలో వచనం అధికంగా గ్రాంథికంగా స్పష్టంగా వివరణాత్మకంగా విషయబోధకంగా ఉండి వ్యాస తుల్య రచనగా ఉంది.

ఏకామ్రనాథుడి 'ప్రతాపరుద్ర చరిత్రము' (16 వ శతాబ్దం) ప్రచురిత గ్రంథంలోని పుట 52-55 వరకు ఉన్న రచనా భాగం వ్యాసంగా నిలవదగ్గది. సేలం జిల్లా తీర్పుగా ప్రసిద్ధమైన 108 సంఖ్య వ్యాజ్యం (1843) కంసాలి కులం దేవ బ్రాహ్మణ జాతి కాదని చేసిన తీర్పు భాగం వ్యాసంగా నిలుస్తుంది. 10.10.1852 లో వర్తమాన తరంగిణిలో ప్రచురితమైన 'మతాంతరీకరణం' వ్యాసంగా భావించగలది.

శ్రీ రంగరాజు చరిత్ర (నరహరి గోపాలకృష్ణమ సెట్టి) రచించిన నవలలోని పుట 16-19 వరకున్న భాగం, వేయి పడగలు (విశ్వనాథ సత్యనారాయణ) 27 వ అధ్యాయంలోని వెన్నెల వర్ణన వ్యాస స్థాయివే.

తత్త్వ సంబంధి గ్రంథాలు శ్రీ గీతార్థ సార సంగ్రహము, సారాంశ పంచకము మనసాక్ష్యము నాస్తిక ధ్వాంత భాస్కరము (వెలుగోటి కుమారేచేంద్ర భూపాల) ఇవి గ్రంథాలే అయినా తాత్త్విక వ్యాసాలుగా పేర్కొనదగ్గవి.

నీలగిరి యాత్ర (1902) కోలా శేషాచల కవి రచనదీ వ్యాస ధోరణే. సాంఘిక గ్రంథమైన 'దర్ప విదళము' (గొల్లపూడి శ్రీరామశాస్త్రి) అనువాద గ్రంథంలోని ఏడు భాగానూ ఏడు వ్యాసాలుగా భావింపవచ్చు.

ఇలా వ్యాసం, వ్యాసంగా సర్వలక్షణ శోభితంగా రంగ ప్రవేశం చేయక పూర్వం, వివిధ ప్రక్రియల, రచనల అంతర్భూతంగా ఉండటం ఈ యుగంలో పరిశీలించవచ్చు

## ఆ) వ్యాసారంభయుగం (1862 - 1876) :

వ్యాసం ఒక శాఖగా ఆవిర్భవించక పూర్వం, కందుకూరి వీరేశలింగం పంతులు కంటే పూర్వం వ్యాస రచన చేసిన రచయితలకే ఇక్కడ ప్రాధాన్యం. ఈ కాలంలో వ్యాస రచన చేసిన వారు ముగ్గురు (ఎ) స్వామినీన ముద్దు నరసింహనాయుడు. (బి) పరవస్తు వెంకట రంగాచార్యులు, (సి) జియ్యరుస్వామి. వీరు ముగ్గురు వ్యాసపు తీరుతెన్నులు తీర్చిదిద్దిన వారు కాకపోయినా, వ్యాస సృష్టిలో ఆధిక్యం వహించిన ప్రముఖులపై ప్రభావం చూపిన వారిగా వ్యాస పరిణామంలో ప్రధానమైన వాళ్ళు. ఈ కాలంలో వ్యాసం భవిష్యత్ వ్యాసాభ్యుదయానికి పునాదిగా నిల్చింది.

## (ఎ) స్వామినీన ముద్దు నరసింహనాయుడు - ప్రమేయము హిత సూచని (1862) :

'హితసూచని' (1862) గ్రంథం వచన రూపంగా రచింపబడింది. ఇందులో ఎనిమిది ప్రమేయాలున్నాయి. ఒక్కొక్క ప్రమేయం ఒక్కొక్క అధ్యాయంగా ఉంది. విద్యా, వైద్య, సువర్ణ, మనుష్యేతర జంతు సంజ్ఞా, రక్షఃప్రభృతి, మంత్ర, పరోక్షదిజ్ఞాన, వివాహ ప్రమేయాలు ఉన్నాయి. ఇందులోని విషయాలు ఆలోచనా జన్యాలు. వస్తువులు సంపూర్ణంగా సమగ్రంగా ఉన్నట్లు కనిపించవు.

వ్యావహారిక భాషలో సాగింది వ్యాస రచన. అతి దీర్ఘమయిన పేరాలతో రచన ఉంది. జాతి శ్రేయం రచయిత భాదించి దాని సాధన మార్గంగా వ్యాసాన్ని గ్రహించాడు. వ్యావహారిక భాషా రచన కనుక ఆ భాషకు కొంతవరకు మార్గాన్వేర్పరిచారు.

హితసూచని బహు విమర్శకామోదం పొందిన వ్యాస సంపుటి కావటం వల్ల స్వామినేని ముద్దు నరసింహనాయుడు ప్రథమాంధ్ర వ్యాసకర్త.

### (బి) పరవస్తు వెంకట రంగాచార్యులు - సంగ్రహము ( 1872 - 1874) :

పరవస్తు వెంకట రంగాచార్యులు రచించిన 'సంగ్రహము'లు సంపుటిగా లేవు. వివిధ ఆధారాల వల్ల ఇవి 26 గా తెలుస్తున్నాయి. అవతార సంగ్రహము, ఆర్షమత, ధర్మజన్మ, వర, సృష్టి ప్రమాణ, వేద, శాఖా, ఆత్మ, ఈశ్వర, గుణ, ముక్తి, కర్మ, కాల, దేవతా, ముక్తిమార్గ, రహస్య, వివాహ, స్మృతి, పునర్వివాహ, ప్రాయశ్చిత్త, అలంకార, శ్రుతి సంగ్రహాలు, వర్ణ నిర్ణయము, కాల / కళా సంగ్రహమూ, హిందూ శాస్త్ర సంగ్రహము.

ఆంగ్లవ్యాసలక్షణాలన్నీ సంపూర్ణంగా వర్తించకపోయినా, అల్పంగా అయినా వర్తిస్తున్నందున 'సంగ్రహములు' తెలుగు వ్యాసాలుగా భావించవచ్చు.

### (సి) జియ్యరు సూరి - వచనకావ్యము : స్త్రీ కళా కల్లోలిని (1876) :

ఇది మూడు భాగాల గ్రంథం. ఇది బాలకా పాఠశాలకు ఉద్దేశింపబడింది. స్త్రీలకోసం ఉద్దిష్టమయింది. ఈ గ్రంథాన్ని ఆంగ్ల తమిళ గ్రంథాల వ్యాసాల నుంచి విషయం స్వీకరించి రచించాడు. దీనిని వ్యాసమనో, ఉపన్యాసమనో రచయిత పేర్కొనకపోయినా, వచన కావ్యంగా రాసినా, తాను రాస్తున్నది వ్యాసమేనని ఆంగ్ల పీఠికలో స్పష్టమవుతుంది. ఎస్సె అని పీఠికలో రాసిన దానికి సమాన పదంగా తెలుగు పీఠికలో గ్రంథం అన్నారు. గ్రంథం విస్తృతార్థ బోధిని కనుక 'వచన కావ్యము' అన్నారు.

ఈ వ్యాస వచనం ఉత్తమంగా ఉంది. ఇందులో స్పష్టత సంక్షిప్తత వ్యవహారానికి దగ్గరి గ్రాంధికం ఉంది. రచయిత పాఠకుల మధ్య మిత్రత కనిపిస్తుంది. పరిహార కుశలత అంతర్లీనంగా ఉంది. రచయిత వ్యక్తిత్వం కనిపిస్తున్న ఈ వ్యాసాలలో ఏ ఒక్కటి సంపూర్ణం కాదు. ఈ వ్యాసాలు ఉత్తమ వ్యాస నిలయాలు. స్త్రీ ప్రగతి కాంక్ష ప్రధానంగా సాగిన రచన. వ్యాసం, చాలావరకు దాని లక్షణాలతో ఆవిర్భవించింది జియ్యరు సూరి రచనతోనే.

### (ఇ). ఉపన్యాసము : కందుకూరి యుగం (1874 - 1900) :

కందుకూరి వీరేశలింగం పంతుల్ని ప్రథమ వ్యాసకర్తగా భావించే వాళ్ళు ఉన్నారు. విస్తృతిలోనూ ప్రాచుర్యంలోనూ వ్యాస రచనా విషయంలో కందుకూరి ఉన్నతిని సాధించిన వారు లేరు. వ్యాసం ఉపన్యాసంగా సారస్వత ప్రక్రియగా తీర్చిదిద్దినవాడు కందుకూరే. ఈ వ్యాసకర్త ప్రభావం సమకాలంలోనూ అనంతర కాలంలోనూ ఎక్కువే. కనుకే సృజన వ్యాసకర్తగా కందుకూరి యుగకర్తే.

### కందూకూరి విరేశలింగం పంతులు (1848 - 1919) :

కందుకూరి ఉపన్యాసాలు రాశాడు. సాంఘిక అవసరార్థం ఆవిర్భవించింది. వ్యాసంగా గుర్తింపబడ్డ ఉపన్యాసం సంస్కరణాభిలాష దోహదమయింది. కొన్ని చోట్ల వాగ్రూపంగా కొన్ని సార్లు లిఖిత రూపంగా సాగింది. కందుకూరి ఏర్పర్చిన ఉపన్యాసం సాంఘిక పరిణామం కోసం బలమైన ఆయుధంగా అనేకుల గుర్తించారు. ఏ ప్రక్రియా సాధించలేని చైతన్యం ఈ కాలంలో ఉపన్యాసం తెచ్చింది. ఆంగ్ల వ్యాసధర్మం కంటే భిన్నధర్మం కలిగి భిన్నకార్యం నిర్వహించి, భిన్న రూపం పొంది ఉపన్యాసం తెలుగుదనంతో నూత్నవ్యక్తిత్వం సముపార్జించింది.

వీరి ఉపన్యాసాలు వివరణాత్మకాలు (169) విమర్శనాత్మకాలు (21) విజ్ఞాపనాత్మకాలు (4) ఉపదేశాత్మకాలు (5) గా వింగడించవచ్చు. విషయ ప్రాధాన్యం రీత్యా సాంఘిక (62) మత విషయక (34) స్త్రీ సంబంధి (34) దేశ సంబంధి (11) విజ్ఞాన (10) జీవిత చరిత్ర (9) శాస్త్ర (7) ఆర్థిక (6) శిశు (5) నైతిక (4) వేశ్యాసంబంధి (4) వైద్య (3) విద్య (3) సాహిత్య (3) రాజకీయ (3) చారిత్రాత్మక (1) వ్యాసాలుగా వింగడించవచ్చు.

ఇంత విస్తృత వ్యాస సృష్టి కావించిన కందుకూరిపై పూర్వ వ్యాసకర్తల ప్రభావం ఉంది. దాని వల్ల కొత్త ఆలోచనలు కొత్త రచనం కలిగి వ్యాస రచన పరిపుష్టమై దేశోపకారకమయింది. సామినీన ముద్దు నరసింహనాయని 'విద్యాప్రమేయం' ప్రభావం కందుకూరి 'విద్య'పై ఉంది. పరవస్తు వెంకట రంగాచార్యులు 'శాఖాసంగ్రహము' ప్రభావం కందుకూరి 'శాఖాభేదముల'పై ఉంది. జియ్యరు సూరి స్త్రీ విషయక రచనా ప్రభావం కందుకూరి సంస్కరణాత్మక ఉపన్యాసాలపై అధికంగా ఉంది. ఇవి మచ్చుకు పేర్కొన్నవి ఎన్నో నిదర్శనాలున్నాయి, వారి ప్రభావం కందుకూరిపై ఉందనటానికి.

## కందుకూరి సమకాలికులు :

ఉపన్యాస ప్రక్రియ కందుకూరితో ప్రాచుర్యం పొందిందనటంలో సందేహం లేదు. కందుకూరి అంత ఎక్కువగా వ్యాస నిర్మాణం చేసిన వారు లేకపోయినా కొంత పరిశ్రమ ఉందన్నది మరవరాదు. 1891 లో చింతామణి పత్రికలో ఆరంభించిన అచంట సుందరరామయ్య 'అంతఃపురోపన్యాసములు' కుటుంబ వ్యవహారానికి గృహవాతావరణానికి సంబంధించి ఉన్నాయి. 13 ప్రకరణాలు ఉన్న అచల గ్రంథము (1888) పోకల శేషాచలము నాయుడు రచన వ్యాసాలుగా రచయిత పేర్కొనకపోయినా వ్యాసధర్మం ఉన్న రచనలు. ఆచార నిరుక్తి (1890) దురాచార పిశాచ భంజని (1890) దాసు శ్రీరాములు ఉపన్యాసాలు. కామినీ దుర్గుణ దూషణము, తన్నివారణ మార్గములు (1891) యం.బుచ్చయ్య పంతులు స్త్రీ దోషాలు ఎత్తి చూపే రచన. క్రైస్తవ మత ప్రచారం సారస్వత సంబంధంగా సాగటం క్రిష్టియన్ లిటరేచర్ సొసైటి విషయంలో చూడవచ్చు. 'స్త్రీలకు విద్యనేర్పుట - కలుగు మేలులు' (1892), 'ఋణము : అది తప్పించుకొను విధము' (1894) 'పరిశుభ్రత వలన కలుగు మేలులు' (1894) వంటి ఉపన్యాసాలు పరోక్ష మత ప్రచార దోహదాలు. హుండి రామారావు, కోపల్లి వెంకట రమణరావు, తేకుమళ్ళ రాజగోపాలరావు చింతామణి పత్రికా వ్యాసాలు కందుకూరి సమకాలీన ఉపన్యాస సృజనకు దోహదంగా గుర్తించవచ్చు.

## (ఈ). వ్యాసం గురజాడ యుగం (1901 - 1915) :

భాషా సాహిత్యరంగాలలో తనదైన ముద్రను వేసిన వాడు గురజాడ. వ్యాస సృష్టిలో పరిహాసం జోడించి, వర్తమానాంధ్ర బాగాభ్యుదయానికి ఆద్యుడిగా నిలిచి గురజాడ వెంకట అప్పారావు పంతులు యుగకర్తగా నిలిచాడు. ఈ యుగంలో ఉపన్యాస వ్యాస రచన విస్తృతం అయింది. ప్రాచీనతా గౌరవం అభ్యుదయకాంక్ష పరస్పరం పోటీపడి వ్యాస వాఙ్మయ ప్రోత్సాహ కారకాలయ్యాయి. బాషా విషయంలో వాదోపవాదాలు చెలరేగాయి. పత్రికలు వేగంగా స్థాపితమయి ఎక్కువయ్యాయి. ఉపన్యాసం తగ్గి వ్యాసం పెరిగింది. వ్యాసం ఒక ప్రత్యేక ప్రక్రియగా స్థిరమయి పెరిగింది ఈ కాలంలోనే. కందుకూరి అనుయాయులు ఉపన్యాస వాఙ్మయాన్ని కొనసాగించారు. ఇలా ఉపన్యాసాలు వ్యాసాలు రూపంగా వ్యాసం ఈ యుగంలో అధికంగా ఆవిర్భవించింది.

## గురజాడ వేంకట అప్పారావు (1862 - 1915) :

వ్యాసం పదం ఈ ప్రక్రియార్థంలో (1852) పూర్వంనుంచి ప్రయుక్తం అవుతూ ఉందని సి.పి. బ్రౌను తెలిపినా అప్పటిలో వ్యాసాలున్న ఆధారాలు లేవు. అయితే వ్యాసమన్న పదం ఉపన్యాస సమానార్థకంలో ఎప్పటి నుంచి ఉందో స్పష్టత లేదు. పత్రికలు సాధారణంగా వ్యాసాలు ప్రచురిస్తూ వచ్చినా ఏ పేరూ దానికి పెట్టలేదు. ఆంధ్రపత్రిక ఆరంభం నుంచి వీటిని వ్యాసాలు అంది.

అది రచన అనే అర్థంలోనే కాని ఓ ప్రక్రియగా ప్రయుక్తం కాలేదు. గురజాడ 'ఉపన్యాసం' అనకుండా 'వ్యాసం' అన్నాడు. గురజాడ వ్యాసదృష్టి 1897-1915 మధ్య జరిగింది. ఎక్కువ రచనలు 1910లో జరిగాయి. వ్యాసచంద్రిక 1910లో రచనగా భావితం అవుతూ ఉంది. 1900 ఆరంభం నుంచి వ్యాసం ఈ ప్రక్రియకు పేరుగా నిల్చింది. 'వ్యాసచంద్రిక' 'మాటామంతీ'లలో ఇరవై ఏడు వ్యాసాలు ఈ రచయితవి.

భాష విద్య రాజకీయాలు వ్యాస రచనా విషయాలు. విమర్శనా వ్యాసం వల్ల కంటే సృజన వ్యాసం వల్ల వ్యాసకర్తగా నిలువదగ్గవాడు గురజాడ.

## గిడుగు వేంకట రామమూర్తి పంతులు (1862-1940) :

వ్యావహారిక భాషోద్యమ మూలకర్త గిడుగు రామమూర్తి పంతులు. ఆంగ్ల విద్యాభ్యాసంతో నూత్న దృక్పథాలు ఏర్పరచుకొని, సవరభాషను సముద్ధరించి వ్యావహారిక భాషావాదం పూని, వ్యాసాలు వ్రాసి, ఉపన్యాసాలు ఇచ్చి 'తెలుగు' పత్రిక నడిపి తను నమ్మిన సిద్ధాంతానికి కృషిచేసినవాడు గిడుగు. భాషావాదానుగుణంగా రాసిన ఇరవై నాలుగు వ్యాసాలు కనీసం మూడు దశాబ్దాల ఆలోచన పొంది పాక్షికంగా అసంపూర్ణంగా లోకంలో ప్రచారమై వ్యాసాలుగా నిలిచాయి.

వ్యాసాలు వ్యావహారికంలో ఉన్నాయి. రచయిత వ్యక్తిత్వం స్పష్టమయ్యే వ్యాసంలో భాషపడి రచయిత పట్టుదల సత్యదృష్టి, దీక్ష ఉపన్యాసంలో నిర్భీతి, వాక్చాతుర్యం, ఏకాగ్రత, అన్య పండితులను ఖండించేటప్పుడు నిశితమైన విమర్శ, వక్తి దూషణ రహితత, తన వాదం పట్ల అనన్య నమ్మకం ఈ వ్యాసాలకు ఉన్నతత్వాన్ని ఆపాదించాయి. వ్యావహారిక భాష దోష భూయిష్టంగా గ్రాంథిక భాష నిర్దుష్టంగా భావించి, భాష నియమాలకు లొంగి ఉండదని, దానిని వివరించవచ్చు కాని స్థిరం చేయరాదని, భాషను నిశితంగా శాస్త్రజ్ఞుడిలా పరిశీలించాడు గిడుగు. వ్యావహారిక భాషను రాచబాటలో నిలిపినవాడు గిడుగు రామమూర్తి పంతులు.

## కందుకూరి అనుయాయులు :

వ్యాసం కంటే ఉపన్యాసం ప్రభావం ఉండి కందుకూరి రచనల వల్ల ప్రేరేపితులయిన వ్యాసకర్తలున్నారు. కొందరు కందుకూరిని విమర్శించారు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో కందుకూరి ప్రభావంతో ఉపన్యాస సృజన చేసిన వారు ఈ యుగంలో ఉన్నారు. రాయసం వెంకటశివుడు, బేతపూడి భగవంతరావు, కాశీభట్ట బ్రహ్మయ శాస్త్రి, అత్తిలి సూర్యనారాయణ, శంకర వెంకట్రామయ్య, ఓ.వై. శ్రీదొరసామయ్య, పి.వి. చలపతిరావు, కొవ్వలి శివరామ చంద్రరావు నారాయణరావు, హద్దనూరు గోపాలరావు, నాళము కృష్ణారావు, గోగులపాటి వీరేశలింగం తదితరులు.

## (ఉ). అధిక్షేప వ్యాసం - సాక్షియుగం (1913-1933) :

సాక్షి, వదరుబోతు, బారిష్టరు గారి బాతాఖానీ అధిక్షేప వ్యాస సంపుటాలు. సాక్షి వ్యాసాలు పొందినంత ప్రాచుర్యం మరే ఇతర వ్యాస సంపుటీ పొందలేదు. అధిక్షేపం కావటాన ఆనందకారకాలయ్యాయి. మనిషి తననూ తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ప్రేమించటం మర్చిపోతున్నప్పుడు అధిక్షేపం గుర్తు చేస్తుంది. మనిషి మనుగడకొక అర్థం, బ్రతుకొక విలువ ఇవ్వటం అధిక్షేపం విధి. అధిక్షేపం తెలుగులో తత్పూర్వం లేదు. ఇది ఆధునిక లక్షణం. ఉపన్యాసం కంటే ఆధునికం అధిక్షేప వ్యాసం. సంఘ సంస్కరణాభిలాష గల అధిక్షేపం ఇది.

## సాక్షివ్యాసాలు : పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులు (1865 - 1940) :

సాక్షి సంపుటాలలోనివి, ప్రకీర్ణకోపన్యాసాలలోనివి కలసి 171 వ్యాసాలు ఈ రచయితవి. ఆంగ్లవ్యాస ధర్మాలతో ఉన్నాయి ఈ వ్యాసాలు. పూర్వవ్యాసకర్తలలో ఉంటే బుద్ధి ప్రాధాన్యం, విమర్శన గుణాధిక్యం తగ్గి, హృదయబలం పెరిగి అధిక్షేప బలంతో పఠితులకు దగ్గరయ్యాడు పానుగంటి.

ఈ వ్యాసాలలో సృజన గుణ దోహదమైనది సాక్షి సంఘం. దానిలో సభ్యులున్నట్లు, సభా కార్యక్రమాలు జరుగుతున్నట్లు సభ్యులు యాత్రలు చేస్తున్నట్లు, వాళ్లను సంబోధిస్తున్నట్లు, వాళ్ల రచనా సూచనలు చేస్తున్నట్లు, సంఘ సభ్యత్వం కోరుతున్నట్లు కల్పించిన విషయాలు సృజనాత్మకతకు దగ్గరగా ఉన్నాయి.

## వదరుబోతు :

22 వ్యాసాలు సంపుటి వదరుబోతు. 1932లో అనంతపురం విద్యార్థి సంఘం వీటిని ప్రచురించింది. వీటి స్రష్టలెవరో తెలియదు. ఎంతమందో తెలియదు. పప్పూరు రామాచార్యులు అనంతకృష్ణ శర్మ రాసిన వారితో ఉన్నారని విశ్వాసం. వ్యక్తుల నైచ్యం, సమాజ దైన్యం, ఆధునిక నాగరికతలో మూర్ఖత్వం, ప్రాచీన జీవితౌన్నత్యం ఈ వ్యాసాలలో కనిపిస్తాయి. రాజకీయ వ్యాసాలు సాక్షిలోనూ వదరుబోతులోనూ భాగం కాలేదు.

ఈ వ్యాసాలు కథాబలంతో ఉండి, పాఠకుడి దగ్గరగా ఉన్నాయి. ప్రాచీనాధునిక కవితా తారతమ్యం గుర్తించి, నాటక కళావైశిష్ట్యాలను తిలకించారు.

## బారిష్టరు గారి బాతాఖాని : మొక్కపాటి నరసింహశాస్త్రి :

19 వ్యాసాల సంపుటి బారిష్టరు గారి బాతాఖాని. పత్రికా, రేడియో వ్యాసాలివి. వ్యాసాలు బాతాఖానీ సమాహారాలు. సాక్షి, వదరుబోతు వ్యాస సంపుటాల ప్రభావం దీనిపై ఉంది. బారిష్టరుకి, శర్మ శాస్త్రి, భద్రం రామంటప్పయ్య మిత్రబృందం వీరందరూ కలిసి బాతాఖాని కొట్టే స్థలం క్లబ్బు, జాత్యహంకారం, అనృతవాదం అడంబరం, అజ్ఞానం, అలస్యత, నిర్లక్ష్యం, అవివేకం వంటివి ఆంధ్రజాతిని పట్టుకు వదలటం లేదని నమ్మిన మొక్కపాటి, వీటిని ఆధిక్షేపబలంతో విమర్శించి, సమాజం గుర్తించేటట్లు చేసి క్షాళనం చేసి జాతికి మేలు చేయాలనే కోరిక ఈ వ్యాసాలలో ఉంది.

## మట్నూరి కృష్ణారావు (1879 - 1945) :

ఈ యుగంలో వాడే అయినా అధిక్షేపం సంబంధం లేకుండా వ్యాసాలు రాశాడు. కృష్ణా పత్రికకు రాసిన సంపాదకీయాలు, సారస్వత కళాదిసమీక్షలు, భావవీచికలు వ్యాసాలుగా ఉన్నాయి. ఇవి కళా మత సాంఘిక సంబంధాలు. ఆంగ్ల నాగరికతా ప్రభావంతో తెలుగు దేశంలో తలెత్తిన నూత్న జీవిత రీతులు రచయిత భరించలేక పోవటం నుంచి ఈ వ్యాసాలు వచ్చాయి. వ్యాసకర్తగా మట్నూరి కళారంగంలో, మత సాంఘిక విషయికంగానూ జాతి పతనం కాకూడదు అన్న తీవ్రసంకల్పం ప్రదర్శించాడు. వివరాణాత్మక వ్యాసాలు ఎక్కువ. వేదాంత రహస్యాలను 'లోవెలుగులు'లో సాహిత్య విమర్శలు 'సమీక్ష'లో పొందుపరిచాడు.

## వావిలికొలను సుబ్బారావు :

కవి, వ్యాకరణ కర్త వావిలికొలను సుబ్బారావు వచనరచనలో బాలికా కుమార పతీ కుమారీ సతీ గర్భిణీ హితచర్యలు, ఆధునిక రచన విమర్శనము, ఆర్య విద్యోపన్యాసము, వీరు రాసిన వ్యాసాలు, వ్యావహారిక భాష ప్రయోగార్హం కాదని జాతీయ, విద్యావిధానం పట్ల అభిమానం చూపిన దేశాభిమాని.

**పురాణం సూరిశాస్త్రి :**

'నాట్యాశోకము' 'నాట్యాంబుజము' వీరివి రెండు వ్యాస సంపుటములు. మొదటిది సృజనం. రెండవది విషయ ప్రధానం. వ్యాసాన్ని లేఖారూపంగా ఆవిష్కరించిన మొదటి వ్యాసకర్త పురాణం సూరిశాస్త్రి. నాట్యకళావైదుష్య సంకీర్తనోత్సాహుడు అయిన సూరిశాస్త్రి జీవిత చరిత్ర వ్యాసంగా రూపొందించిన విశిష్టుడు.

**ఇతర వ్యాసకర్తలు :**

అధిక్షేపం వ్యాసం కాని నూత్నగుణశోభితంగా కాని చేయక పాత ధోరణిలో వ్యాసస్పృజన చేసిన వ్యాసకర్తలు అచ్యుతుని సీతారామయ్య, యాదగిరి లక్ష్మి వెంకట రమణ, పెద్దిబొట్ల వీరయ్య, చెలికాని లచ్చారావు తదితరులు.

**(ఊ). చారిత్రక వ్యాసం : చిలుకూరి యుగం (1910-67) :**

దేశ చరిత్రను కాని దేశ చరిత్రతో సంబంధించిన సారస్వత చరిత్రను పలికించే వ్యాసాలివి. సమగ్ర చరిత్రగా కాక, చారిత్రకాంశం కాని, సారస్వత సంబంధ చరిత్ర భాగం కాని చెప్పబడింది ఈ వ్యాసాలలో. రచయిత వ్యక్తిత్వ ముద్రతో ఉన్నవే చారిత్రక వ్యాసాలుగా పరిగణింపబడ్డాయి. సాహిత్యమో, మరే అంశమో బలపర్చటం కోసం చరిత్ర గ్రహించినప్పుడు, రచయిత ప్రభావం చరిత్రనూ, అంశాన్ని అనుసంధించేటప్పుడు వ్యక్తీకరించేటప్పుడు ఋజువు అవుతుంది. ఆ వ్యక్తిత్వ స్పర్శ లేనివి చరిత్రలేకాని చారిత్రక వ్యాసాలు కావు.

**చిలుకూరి వీరభద్రరావు (1872-1939) :**

'ఆంధ్ర చరిత్ర చతురాన' బిరుదాంకితుడు అయిన చిలుకూరి వీరభద్రరావు అనేక పత్రికలు నిడిపి మరికొన్నింటికి సంపాదకత్వం నిర్వహించిన వాడు. రాజమండ్రిలో 'ఆంధ్రేతిహాస పరిశోధక సంస్థ' ప్రారంభించి, ఆంధ్రుల చరిత్రను పదిభాగాలుగా వేయదలచి, ఐదు భాగాలనే వెలువరించాడు. విజయనగరర సామ్రాజ్య చరిత్రను ప్రచురించి, వివిధ సారస్వత చారిత్రక వ్యాసాలు రాసి, చారిత్రక పరిశోధన రచనకు కృషి చేసిన చిలుకూరి ఈ యుగకర్త. చరిత్ర వ్యాసాలకు శాసన చరిత్ర ఆధారమయింది. లభ్యవిషయాన్ని నిశితంగా విమర్శన దృష్టితో పరిశీలించి, పరిశోధించిన కృషి వ్యాసకర్తది. కొన్ని వ్యాసాలు మహాపురుషుల జీవిత చిత్రణంగా ఉన్నాయి. తిక్కన, శ్రీనాథుడు, తిమ్మరుసు, అళియరామరాయలు మొ॥ వీరి జీవిత చరిత్ర వ్యాసాలు చారిత్రక సారస్వత పార్శ్వాలతో ఉత్తమ వ్యాసాలుగా నిల్చాయి. వీరి వ్యాస రచనా ధోరణి చారిత్రక పరిశోధనం ఆ కాలంలో అనంతర కాలంలో అనేకులకు మార్గదర్శకం అయింది.

**కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావు పంతులు (1877-1923) :**

లక్ష్మణరాయ వ్యాసావళి రెండు సంపుటులు కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు చరిత్ర ప్రధానంగా జరిగిన పరిశోధనను వ్యక్తం చేసే వ్యసాలు. తాను పరిశోధన చేయుటకు కాదు అనేకులకు చేయూత నిచ్చినవాడు. వీరి వ్యాసాలు బృహత్ గ్రంథాలు అన్ని చారిత్రకాలే. వీరివి 22 వ్యాసాలు. చరిత్ర మాత్రమే కాక భిన్న విషయాలపై ఉన్నాయి. అయితే ప్రతి వ్యాసమూ చరిత్రతో సంబందం ఉన్నదే. విజ్ఞాన చంద్రికా గ్రంథమాల స్థాపించి, ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం నిర్మించి, సారస్వత సేన చేశాడు. వ్యాసాలలో చారిత్రక విషయాలు. సంస్కృతాంధ్ర శ్లోకపద్యాలు ఉటంకించాడు. రచయిత - పాఠక మిత్రత కనిపిస్తుంది. చారిత్రక భాషా శాస్త్ర సారస్వత సంబంధంగా సాగిన వ్యాసాలలో నిశిత పరిశీలన ఉంది. పరిశోధన దీక్ష, చారిత్రక దృష్టి, విమర్శన వైశిష్ట్యం ఈ వ్యాసాలకు ముప్పన్నెలు.

## మల్లంపల్లి సోమశేఖర శర్మ (1891 - 1963)

'చారిత్రక వ్యాసములు' మల్లంపల్లి సోమశేఖర శర్మ వ్యాసస్పష్టి. ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో అధ్యాపకుడిగా, భారతి పత్రిక సంపాదకుడిగా బాధ్యతలు నిర్వహించాడు. వీరి వ్యాసాలు 13. ఆకాశవాణి ప్రసంగ వ్యాసాల 'ఆంధ్రదేశ చరిత్ర' చిన గ్రంథం. ఆంగ్ల వ్యాస ధర్మాలు గోచరిస్తాయి. వీరి వ్యాసాలలో, గ్రాంధిక భాషలో సాగింది రచన. ఒక్క 'అనాదృత వాఙ్మయంలో తప్ప' ఈ వ్యాసాలలో, అన్నీ బౌద్ధమత సంబంధి చరిత్రకూ సంస్కృతికి పరిమితం ప్రాచీన చరిత్రలోని మత నైతిక సాంఘిక రాజకీయ అంశాల సారభూత విషయ విన్యాసాలు ఈ వ్యాసాలు.

## డా. నేలటూరి వేంకట రమణయ్య (1893) :

నేలటూరి వేంకటరమణయ్య చారిత్రక పరిశోధన కృషి అనన్యం. ఎన్నో ఉన్నత పదవులు అలంకరించి, విజయనగర చరిత్ర వెలుగులోకి తెచ్చాడు. చారిత్రకాంశాలు, చారిత్రక సంబంధ సారస్వత సంగతులూ, కవితా విమర్శలు వ్యాసాలుగా నిల్చాయి. 'చరిత్ర రచన లేక చారిత్రక వ్యాసములు' మొదటి భాగం (6) ఆంధ్రుల చరిత్ర (2) ఆంధ్ర వాఙ్మయ చరిత్ర వ్యాసం, వాఙ్మయ వ్యాసమంజరి (21) త్రిదిశాత్మక వ్యాసాలకు నిదర్శనం. తాను చెప్పదలచుకున్న విషయానికి పూర్వం జరిగిన కృషితో సమన్వయం చేసి ప్రధాన విషయాన్ని విమర్శిస్తూనో, ఖండిస్తూనో రచన చేశారు.

## సురవరం ప్రతాపరెడ్డి (1896 - 1953) :

సాహిత్యరాజకీయ సాంస్కృతిక రంగాలలో కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి గొల్కొండ ప్రజవాణి పత్రికలకు సంపాదకత్వం నిర్వర్తించాడు. పాండిత్యం వ్యక్తిత్వం, పరిశోధకత్వం విమర్శకత్వం మూర్తీభవించినవాడు సురవరం. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, రామాయణ రహస్యములు పరిశోధన గ్రంథాలు. అందరూ దేశ సారస్వత చరిత్రలు రాస్తుంటే, సారస్వత బలంతో సాంఘిక చరిత్రను పరికించాడు. రామాయణ రహస్యములు ఏడు భాగాలున్నా వివిధ వ్యాసాలనదగినంత విశిష్టంగా ఉన్నాయి. సారస్వతం చరిత్ర సరిసమంగా పరిశీలించిన సురవరం వ్యాసస్పష్టి అల్పమే అయినా, పరిశీలనా యోగ్యాలు.

## మారేమండ రామారావు :

కాకతీయ శాతవాహన చారిత్రక వ్యాస సంకలన గ్రంథాల సంపాదకత్వం, కాకతీయాంధ్రరాజయుగ చరిత్ర విమర్శనము, భారతీయ విద్యాచరిత్రము వ్యాస రచనలు మారేమండ రామారావును ఉత్తమ చారిత్రక వ్యాసకర్తలలో నిల్పుతున్నాయి.

## ఇతర చారిత్రక వ్యాసకర్తలు :

చారిత్రక వ్యాసకర్తలుగా విషుభట్ల సూర్యనారాయణ, కె. లక్ష్మినారాయణ, వట్టికోట ఆళ్వారుస్వామి తదితరులు ఈ కోవకు వస్తారు.

## (ఋ). విమర్శన వ్యాసం : కట్టమంచి యుగం (1880 - 1951) :

పూర్వం సారస్వత పరిశీలనకు ఆలంకార శాస్త్రమే ప్రమాణం. కట్టమంచి రామలింగారెడ్డి కవిత్వతత్త్వ విచారము విమర్శనం అయితే వ్యాసమంజరి విమర్శన వ్యాసం. విమర్శన వ్యాసం రచయిత వ్యక్తిత్వంతో తోడయితే అది సృజన వ్యాసంలో చేరుతుంది.

కట్టమంచి రామలింగారెడ్డి విద్యారాజకీయ రంగ ప్రముఖుడు. సృజన కావ్య విమర్శనా వాఙ్మయ స్రష్ట. ఆంగ్లాంధ్ర సారస్వతాలను దర్శించిన జ్ఞాని. లఘుపీఠికా సముచ్చయములోనివి కొన్ని వ్యాసమంజరిలో చేరాయి. ఈ వ్యాసాలలో రచయిత

వ్యక్తిత్వం ఉంది. సాంఘిక విషయ వివరణ వ్యాస వస్తువులు. ఆంగ్లవ్యాస ధర్మ, సృజన ధర్మ శోభితాలు. వీటికి హాస్యకుశలత చేరింది. ఈ రచయితకు పూర్వం కావ్యతత్త్వ దృష్టి వ్యాసాలలో లేదు. ఒక కావ్యంలోని సమిష్టితత్వం సామూహిక శోభ అంతర దీప్తి ఈ వ్యాసాలలోని రీతి తదుపరి వ్యాసాలకు ఆరంభం అయింది. పీఠికలను వ్యాసాలుగా రాసిన ఘనత ఈ వ్యాసకర్తదే. విమర్శ వ్యాస పరిధి విస్తృతం కావించిన ఘనత కట్టమంచిదే.

## జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి :

జొన్నలగడ్డ సత్యానారాయణమూర్తి వ్యాస సంపుటాలు సాహిత్య తత్త్వ విమర్శనము విద్యార్థి ప్రకాశిక. ఇవి సారస్వత విద్యా విషయకాలు. ఆంగ్ల లక్షణాలతో సృజనధోరణితో సాగిన ఈ 21 వ్యాసాలతో సాహిత్యతత్వం, విద్యా ధోరణుల పట్ల చర్చసాగింది. వచనం సునాయాసంగా సాగింది. సుదీర్ఘమైన వ్యాసాలూ ఉన్నాయి. వీటిలో అధిక్షేపం కొంత కాఠిన్యం తొంగి చూస్తూ ఉంది. తెలుగు వచనం కొత్త మార్గంలో సాగటానికి వేగం సాధించడానికి ఈ రచయిత వ్యాసాలు దోహదమయ్యాయి.

## శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (1893 - 1979) :

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ 'వేమన' సిద్ధాంత గ్రంథంగా నిల్చేది కాగా సారస్వతాలోకము వ్యాసాలు నాటకోపన్యాసముతో మొత్తం 9. రాష్ట్ర కేంద్ర సంగీత సాహిత్య అకాడమీలలో గౌరవస్థానం పొంది, సృజన విమర్శన వాఙ్మయ నిర్మాణం చేసి, బుద్ధి హృదయ కేంద్రంలో వ్యాససృష్టి చేసిన బహుముఖ ప్రజ్ఞావంతుడు. వచనం ఈ వ్యాసాలలో రమణీయంగా నిల్చిన ఉత్తమ వచనం. ఇది విమర్శన ప్రధానమైన సారస్వత వ్యసాలు. వ్యాసాలలో రచయిత వ్యక్తిత్వం సంయమనం నిశితమైన పరిశీలనా ధోరణి ప్రశంసనీయం ఒక కాలధర్మం కాని, ఒక కవితా పరిశీలనం కాని, ఒక కావ్యధిక్యం కాని ఒక పాత్ర ప్రాముఖ్యం కాని తెలపటం వరకే వ్యాసరచనం పరిమితమయినా, పరిశీలనలో లోతు పరిశోధనంలో దీక్ష, అభివ్యక్తిలో రమణీయత, అనుభూతిలో ధార్మికత గోచరమయి, వీటి ఔన్నత్యం స్పష్టమవుతుంది. వ్యాస లక్షణాలు కలిగి ఉన్నాయి. ఉత్తమ వచనం, ఉత్తమ రచన, ఉన్న వ్యాసాలివి.

## పింగళి లక్ష్మీకాంతం (1894 - 1970) :

పింగళి లక్ష్మీకాంతం గౌతమ వ్యాసముఉ, నా రేడియో ప్రసంగాలు వ్యాసాలు. కవిగా, రచయితగా, వ్యాసకర్తగా, అధ్యాపకుడిగా ఆకాశవాణి ప్రొడ్యూసర్‌గా సుప్రసిద్ధులు. గౌతమ వ్యాసములలో ఆంధ్రసారసత్వం, నా రేడియో ప్రసంగాలులో సంస్కృత సాహిత్య ప్రాధాన్యంతో ఉన్న సృజన వ్యాసాలు. ఈ రెండు సంపుటాల్లో 27 వ్యాసాలున్నాయి.

## ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనము (1908) :

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనము వ్యాసాలు 'లక్ష్మీరంజన వ్యాసావళీ'గా ప్రచురితమయ్యాయి. ఇవన్నీ సాహిత్య విమర్శకు పరిమితం. ఆచార నియమాలకు సంబంధించిన సాంఘిక వ్యాసం ఒకటి, మిగిలిన సాహితీ వ్యాసాలు ఇరవై. మొత్తం ఇరవై ఒక్క వ్యాసాలు వీరివి. గ్రాంథిక వ్యావహారిక ధోరణులలో సాగింది వ్యాస సృష్టి సమన్వయ ధోరణి, వస్తు వివరణలో నైశిత్యం వచనంలో స్పష్టత ఈ వ్యాసాలలోని విశిష్టత.

## (ఋ). చెళ్ళపిళ్ళయుగం (1934 - 1950) :

సుప్రసిద్ధులు అనేకులు ఈ యుగంలో వ్యాససృష్టి చేశారు. ఈ ప్రక్రియ నిర్మాణంలో పొందిన ప్రసిద్ధి వల్ల, సంఖ్యా పరంగా పెరగటం వల్ల, కథలు గాథలుగా వ్యాసాలు విస్తృత సృజన వాఙ్మయం పెరగటంవల్ల వ్యక్తి ప్రాధాన్యం పెరగటం వల్ల ఇది చెళ్ళపిళ్ళ యుగంగా భావించబడింది. ఈ యుగంలో వ్యాసంలో హాస్యం పెరిగింది.

**చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి (1870 - 1950) :**

జంట కవులుగా ప్రసిద్ధులైన తిరుపతి వేంకట కవులలో ఒకడు, అవధికి వ్యాసకర్త చిళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి. 'కథలు - గాథలు'గా వ్యాసాలు మొదలు ఐదు తర్వాత మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. ఇది మొత్తం 170. భిన్న వ్యాసాలను దాదాపు 25 పత్రికలలో ప్రచురించాడు. ఇందులో వ్యక్తమయ్యే ప్రధాన ధర్మం రచయిత వ్యక్తిత్వం. వివిధ విషయాలు స్పృశింపబడ్డాయి.

**భమిడిపాటి కామేశ్వరరావు :**

హాస్య రచయితగా ప్రసిద్ధుడు భమిడిపాటి కామేశ్వరరావు. 'అవును' 'తనలో' 'మేజువాణి' 'లోకాభిన్నరుచి' ఈ రచయిత వ్యాస సంపుటాలు. కాఠిన్యం లేని పరిహాసం సరసంగా ఈ వ్యాసాలలో కనిపిస్తాయి. సృజన గుణం రచయిత వ్యక్తిత్వం ఈ వ్యాసాలలో కనిపిస్తాయి. విద్య, సాంఘిక విషయాలు వివరణాత్మకంగా ఉన్నాయి. వ్యావహారిక భాషలో గోదావరి మండలికాన్ని వ్యాసంలో ప్రవేశపెట్టాడు. సృజనాత్మకత వ్యక్తిత్వ ప్రాధాన్యం కలిసిన వ్యాసాలు ఈ వ్యాస కర్తది.

**తుంపూడి భగవంతం గుప్త :**

'వ్యాసావళి' తుంపూడి భగవంతం గుప్త వ్యాసాలు. సంఘోద్ధారక విమర్శక చక్రవర్తి అయిన వ్యాసకర్త వ్యక్తిత్వం అన్ని వ్యాసాలలోను కనిపిస్తుంది. సంఘంలోని అ వ్యవస్థను చూసి, ఆవేదన చెందిన రచయిత వ్యాసాలివి. వైశ్యులను తక్కువగా చూడటం భరించలేని ఆవేదన, ఆర్యవైశ్యులు ఆధిక్యం ఉన్నవారని వ్యక్తీకరించాడు. హేతు దృష్టి సంఘ సంస్కరణ ధోరణి, సృజన విధానం, మతమౌఢ్యం తొలగించే ప్రయత్నం ఈ వ్యాసాలలో కనిపిస్తుంది.

**శ్రీ తాపి ధర్మారావు (తాతాజీ) :**

విజయవిలాస వ్యాఖ్యానానికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన శ్రీ తాపీ ధర్మారావు వ్యాసాలు 'కొత్తపాళీ', 'సాహిత్యమొర్మొరాలు,' 'ఆలిండియా అడుక్కు తినేవాళ్ళు మహాసభ' సంపుటాలు. మొత్తం 40 వ్యాసాలు. ఈ వ్యవస్థ పట్ల, దాని మూర్ఖత పట్ల అసహ్యాన్ని, వ్యధను తొలగించాలనే తపన కనిపిస్తుంది. సృజన శక్తి అధికంగా ఉంది. రచయిత వ్యక్తిత్వం, ఆవేశం ఉంది. మూడు సంపుటులు సాంఘిక భాష సాహిత్య విషయప్రధానంగా ఉన్నాయి. వ్యావహారిక భాషలో సాగించి రచన.

**ఇతర వ్యాసకర్తలు :**

దిగవల్లి వేంకట శివరావు, రా.వేం.మ.గం. రామారావు, వి. రామ సుబ్బరాయుడు, ఆలపాటి కామేశ్వరరావు కర్లపాలెం కృష్ణారావు తదితరులు ఈ యుగం వారు.

**ఎ. చలం యుగం (1947 - 1970) :**

అధికంగా కాకపోయినా విశిష్టంగా వ్యాసరచన ఈ యుగంలోనే జరిగింది. వ్యాసం విస్తృతమూ అయింది. ఈ యుగంలో సారస్వతంతో సంబంధం లేని సృజనవ్యాసం ఆవిర్భవించింది. ఈ ధోరణికి మార్గదర్శకంగా నిల్చిన యుగకర్త శ్రీ చలం.

**శ్రీ చలం :**

శ్రీ గుడిపాటి వేంకటచలం లైంగిక భావ విప్లవంతో నవల కథానిక నాటక వ్యాసాదుల సృజన చేశాడు. స్త్రీ ప్రాణమున్న తోటి మనిషిగా చూడమని ప్రబోధించాడు. చలం జీవితం, జీవిత సిద్ధాంతాలు, సాహిత్యం అంతా స్త్రీ అభ్యుదయానికి ముడిపడే

ఉన్నాయి. చలం సాహిత్యంలో వ్యాస రచన పరిమితం. ఆనందం, విషాదం రెండు గ్రంథాలు, మ్యూజింగ్స్ మూడు భాగాలు, ప్రేమలేఖలు, స్త్రీ, చలం వ్యాసాలు 'ఆనందం విషాదం' లలో విశాల జీవిత ధర్మాల ప్రదర్శనం ఉంది. 'మ్యూజింగ్స్' అనుభూతి ప్రాధాన్యంతో సాగే రచనలు. 'ప్రేమలేఖలు' తాత్త్వికుడి హృదయానుభూతులు. 'స్త్రీ' అని వ్యాస లక్షణాలతో ఉంది. భాషా నియమాలను అధిగమించి, ఆంగ్లపదాలు రాయటం ఆంగ్లాంధ్ర లిపులతో రాయటం, పదప్రయోగ స్వేచ్ఛ, పరిమితి రాహిత్యం చలం వ్యాసాల విశేషత. చలం అభ్యుదయవాది. అది వ్యాసంలో కనిపిస్తుంది.

## శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు (1910) :

మొదటి మూడు శ్రీశ్రీ సాహిత్య సంపుటాలలోని వ్యాసాలు వ్యాసాలుగా ఉపన్యాసాలుగా వారం వారం రచనలుగా, సమీక్షలుగా, పీఠికలుగా, ఉపోద్ఘాతాలుగా ఉన్నాయి. అభ్యుదయకవి వ్యాసాలు సృజనధర్మ నిక్షిప్తాలు. వీటిది విశిష్టవచనం. వ్యాసలక్షణ శైతలక్షణ వ్యక్తిత్వం కలిసి లోలోని భావాల ప్రతిబింబాలుగా వ్యాసాలు నిల్చాయి. వస్తు పరిశీలన, భాషాచాతుర్యం వ్యాసాలలో కనిపిస్తుంది. వ్యావహారిక వచనాధోరణి శ్రీశ్రీ ది. భిన్న వస్తు విషయాల స్పర్శ వ్యాసాలలో ఉంది. సాహిత్య సమాజాల సమ్మేళనం ఉంది. గురజాడపై ఇష్టం స్పష్టంగా తెలుస్తుంది. గురజాడ ప్రభావమూ ఉంది. గుండెను స్పృజించి వచ్చిన వ్యాసాలు చదువరుల గుండెల్లో గింగురుమనే శక్తితో సాగాయి.

## నార్ల వేంకటేశ్వరరావు :

సంపాదకుడు, వ్యాసస్రష్ట నార్ల వేంకటేశ్వరరావు. 'పిచ్చాపాటి, మాటమంతి' సంపుటాలలో వ్యాసాలు 28. ఈ రెండూ తెలుగుదనం ఉట్టిపడే పదాలే. రచనది కూడా అదే దారి. ప్రతి వ్యాసం బరువైన వాక్య సందోహంతో సృజన స్థాయిలోనివి. విషయ వైవిధ్యం ఉంది. ఆంధ్రుల గుణాలు అలవాట్లు ఆచారాలు ఎన్నో ధర్మాలు తెలుపుతున్నాయి ఈ వ్యాసాలు. ఆంగ్లవ్యాస లక్షణానుగుణంగా ఉన్నాయి ఈ వ్యసాలు. ఉత్తమ సృజన వ్యాసగుణ శోభితాలు.

## శొంఠి కృష్ణమూర్తి :

'కథలు రాయడమెలా ?' 8 వ్యాసాల సంపుటి శొంఠి కృష్ణమూర్తిది. కథారచనం అభ్యాసంతో సాధించవచ్చని, భావాలెలా పొందుపర్చాలో, కథ భిన్నరూపాలెలా పొందుతుందో వివరించే వ్యాసాలు. విమర్శన పూర్వకంగా సాగిన సృజన వ్యాసాలివి.

## మునిమాణిక్యం నరసింహారావు :

హాస్యాన్ని పండించిన ప్రసిద్ధ రచయితలు మునిమాణిక్యం నరసింహరావు. 'ఇంటావిడతో పోట్లాట', 'ప్రణయ కలహం' సృజన వ్యాసాలు. సృజనంగా హాస్యభరితంగా భిర్యాసంబంధిగా వ్యాసాలు వినోదాత్మకంగా ఉన్నాయి.

## శ్రీ తిరుమల రామచంద్ర :

శ్రీ తిరుమల రామచంద్ర వ్యాస సంపుటాలు 'నుడి - నానుడి', సాహితీ సుగతుని స్వగతం. మొత్తం 80 వ్యాసాలు. భాషాశాస్త్ర సంబంధాలే అధికం వీటిలో. వర్ణ పరిణామం, అర్థ విపరిణామం గురించి ఎంతో పరిశ్రమించారు. మిగిలినవి లలిత కళల చర్చ ఉంది. ఆంగ్లవ్యాస లక్షణ శోభితంగా సాగాయీ వ్యాసాలు. సృజన విమర్శన వ్యాస వాఙ్మయ వైవిధ్యం ఈ రచయితకు తెలిసినంతగా ఈ తరం అందరికీ తెలియదని కొలకలూరి ఇనాక్ ఉవాచ.

## శ్రీ సంజీవదేవ్ :

రసరేఖలు తేజోరేఖలు రెండూ శ్రీ సంజీవదేవ్ వ్యాససంపుటులు. వివిధ విషయాల సమాహారంగా ఉంది రచన. సృజనాత్మకంగా ఉన్నాయి ఈ వ్యాసాలు. చిత్రలేఖనం ప్రధాన వస్తువుగా చాలా వ్యాసాలలో కనిపిస్తుంది.

## కాటూరి వేంకటేశ్వరరావు :

కాటూరి వేంకటేశ్వరరావు 'సాహిత్య దర్శనము' వ్యాస సంపుటి. పింగళి కాటూరి జంట కవులలో ఒకరైన వేంకటేశ్వరరావు వ్యాసాలు ప్రాచీనాధునిక సాహిత్య సంబంధంగా ఉన్నాయి. సాహిత్య విమర్శనంలో వ్యక్తిగత పరిచయాలుండటం ఈ వ్యాసాలలోని ప్రత్యేకత.

## బుచ్చిబాబు :

నవలాకారుడిగా ప్రసిద్ధులైన బుచ్చిబాబు వ్యాస సంపుటి 'నన్ను మార్చిన పుస్తకం' తన జీవితంలో చిన్నతనం నుంచి జరిగిన సంఘటనలతో వాసిన వ్యాసాలు అసంపూర్ణతను కలిగి ఉన్నాయి. బుచ్చిబాబు, సృజన వ్యాసాలలో నూత పద రూపకల్పన ఉంది.

## డా॥ బోయి భీమన్న :

"ఏక పద్యాపాఖ్యానము, సవ్యాఖ్యానము, సాహిత్య వ్యంగ్యరచన" వ్యాసం సాహిత్య వ్యాఖ్యాన విమర్శన విధానానికి ఓ నిదర్శనం. ఒక పద్యకర్తగా, ఆ పద్య వ్యాఖ్యాతగా, ఓ పుస్తకానికి అవతారిక రాసిన పీఠిక కర్తగా మూడు రూపాలతో తానే భిన్న వ్యక్తులుగా వ్యాసకర్తగా ప్రవర్తించటం విశేషం. విమర్శనం పేరుతో రచయితను తెగడటం పొగడటాలను రచయిత తూర్పారబట్టారు. ఇలాంటి రచన ఇంత ప్రతిభావంతంగా తత్పూర్వం లేదు.

## శ్రీ కొడవటి గంటి కుటుంబరావు :

సాహిత్య ప్రయోజనం 32 వ్యాసాల సంపుటి. వివిధ ప్రక్రియలలో సిద్ధహస్తుడయిన కొడవటి గంటి కుటుంబరావు రచన ఇది. సారస్వత సంబంధ విమర్శనంతో సాగిన సృజన రచనలు. వ్యాస రచనకు క్రమత లేదు. విషయాభివ్యక్తి నైపుణ్యం స్పష్టమయిన ఆలోచన ఈ వ్యాసాలలో కనిపిస్తాయి.

## డా.పి. సీతారామారావు :

మృగయావినోదం 13 వేట వ్యాసాల సంపుటి. వేటాడే వ్యక్తి అనుభవం నుంచి వచ్చిన వ్యాసాలు. పి. సీతారామారావు అనుభవాలు కల్పనాత్మక స్థాయిని పొందాయి.

## ఇతర వ్యాసకర్తలు :

శ్రీ అమరేంద్ర, శ్రీ సోమంచి యజ్ఞన్న శాస్త్రి, శ్రీ దరిశి చెంచయ్య తదితరులు సృజన గుణంతో వ్యాస సృజన చేసిన రచయితలు.

## 1.2 స్త్రీవ్యాసం.

వ్యాస సృజనలో స్త్రీ ప్రాధాన్యం ఉంది. సాంప్రదాయపు పరిధిని అధిగమించి స్త్రీ అభ్యుదయాన్ని సాధించారు. సాంఘిక, రాజకీయ, ఆర్థిక కారణాలు దీనికి కారణం. స్త్రీ స్థితిని మెరుగుపరచటానికి చదువుకొన్న పురుషులు చైతన్యంతో శ్రమించారు.

కందుకూరి వంటి వారు స్త్రీ అభ్యున్నతికి కాంక్షకు ఉపన్యాసం వ్యాసంగా సమర్థంగా వినియోగించారు. రచయిత్రులూ ప్రేరేపితులై వ్యాసాలు రాశారు. విద్యావశ్యకత, బాల్యవివాహ, వేశ్యావృత్తి నిరసన, వితంతు పునర్వివాహ ప్రోత్సాహం సమర్థించారు. పతివ్రతలుగా భర్తను సరిదిద్దుకొనే వారిగా ఉండాలని, భక్తి కలిగి ఉండాలన్నారు. స్త్రీలు రచయిత్రులై సారస్వత సాంఘిక ప్రయోజన దోహదమయింది. వ్యాసగతంగా వీరి వ్యాసాలు ఉపన్యాసాలు సంఘసంస్కరణకు దోహదం చేశాయని, రచయిత్రి సృష్టి సత్వర ఫలితాలు సాధించాయి. భావ విషయరీత్యా (స్వాతంత్ర్యపు పూర్వపు) నాటి రచయిత్రులు, (స్వాతంత్ర్యనంతరపు) నేటి రచయితలుగా పరికించవచ్చు.

### అ. నాటి రచయిత్రులు :

ఉపన్యాసం వ్యాసం రాసిన రచయిత్రులపై కందుకూరి ప్రభావం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉంది. స్త్రీ జీవితం చుట్టూ ఉన్న కష్టనష్టాలే ఈ వ్యాసాల్లో ఉన్నాయి.

### బండారు అచ్చమాంబ :

'అచలా సచ్చరిత్ర రత్నమాల' ఈమె వ్యాస సంపుటి సతుల సచ్చరిత్రల అక్షరీకరణ ఇది. జీవిత చారిత్రాత్మకంగా ఈ వ్యాసాలు ఉన్నాయి.

### కొటికలపూడి సీతమ్మ :

'ఉపన్యాస సుమమాలిక' లోని 18 వ్యాసాలు స్త్రీ సమస్యల వివరణగా ఉంది. ఇవి ఉపన్యాసాలు పిమ్మటే ముద్రిత వ్యసాలు. పరిమితంగా భాషసులభంగా విషయం స్పష్టంగా ఉంది. సాహిత్యం కంటే స్త్రీ పురోభివృద్ధి కాంక్ష ఇందులో అధికం.

### టి. సింగమ్మ :

'నారి రత్నములు' వివిధ ఉన్నత స్త్రీలను గురించిన చదివిన వ్యాసం. చక్కని ఉపన్యాసంగా ఉంది.

### పులుగుర్త లక్ష్మీనరసమాంబ :

'పాతివ్రత్యము, అగ్రాసనాధిపురాలి యుపన్యాసము, గుంటూరు ప్రథమ వత్సరపు ఆంధ్ర మహిళా మహాసభోపన్యాములు, ఆధ్యాత్మిక విద్యకును, మన దేశ ప్రకృతిని గల సంబంధము 'విద్యావతుల యర్థ్వకృత్యములు' వీరివ్యాసాలు. వస్తుభాష సమర్థవంతంగా నిల్చాయి. స్త్రీ సంబంధి వ్యాసాలలో వారి పురోభివృద్ధి కాంక్షించి ఉపన్యసించి వ్యాసాలుగా ప్రకటించింది.

### 'ఉపన్యాస మంజరి' రచయిత్రులు :

ఇవి రెండు సంపుటాలుగా వెలువడింది. పుస్తకంగా వెలువడటానికి వెనక పులుగుర్త లక్ష్మీనరసమాంబ ప్రయత్నం ఉంది. పులువురి వ్యాసాల సంకలనం స్త్రీలది ఇదే ప్రథమం. ఈ వ్యాసాల శీర్షికలు, భావవస్తు ప్రకటనలో కందుకూరి ప్రభావం ఉంది. స్త్రీ చైతన్య ప్రదర్శకాలు ఈ వ్యాసాలు 28 మంది రచయిత్రల వ్యాసాలివి.

### వాడ్రేవు జోగాయమ్మ :

'వేదకాలపు స్త్రీలు' పరిశోధనాత్మకమైనదే అయినా 12 వ్యాసాల సంపుటి. జటా వల్లభుల పురుషోత్తము, వాడ్రేవు జోగాయమ్మ రాశారు. వేదకాలపు స్త్రీకి ఉన్న ఉన్నతిని చాటారు.

రచయిత్రుల రచనలు వస్తురీత్యా విశేషమూ అభ్యుదయమూ అయినవి.

## ఆ. నేటి రచయిత్రులు :

స్వాతంత్ర్యానంతరం స్త్రీకి హక్కులు ఏర్పడ్డాయి. స్త్రీ సాంఘికార్థిక రాజకీయ సంరక్షణ అవసరమనే దృష్టి ఏర్పడింది. స్త్రీలూ చైతన్యవంతులయ్యారు. స్త్రీని స్త్రీలు ఇంకొంత నవ్యంగా పూర్వం కంటే భిన్నంగా చూశారు. సాహిత్యరంగంలో స్త్రీలు ముందంజ వేశారు. సృజన స్త్రీ రచనలలో ఎక్కువ. వ్యాసంలోకి కవితా గుణం తెచ్చిన ఘనత శ్రీమతి లతది 'లతవ్యాసాలు' ప్రముఖ రచయితల రచనల పరామర్శ ఎక్కువగా స్త్రీల వ్యాసాలు పత్రికలలో ప్రచురణకు 'గృహలక్ష్మి' పత్రిక స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షించిన పత్రిక. మాలతీచందూర్ 'ప్రమదావనానికి (ఆంధ్ర ప్రభ వార పత్రిక) రాసిన వ్యాసాలు శ్రీమతి కె. రామలక్ష్మి, దారిచూపిన 'దీపకళికలు' (ఆంధ్ర పత్రిక. దిన పత్రిక), శ్రీమతి పురాణం సీత ఇల్లాలి ముచ్చట్లు (ఆంధ్రజ్యోతి వార పత్రిక) ఇందుకు నిదర్శనం. ఆకాశవాణి నిర్వహించిన వనితావాణి రంగవల్లి కార్యక్రమాలు స్త్రీ వ్యాసాలకు ప్రోత్సాహం ఇచ్చినవే. శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతం 'అఖిల భారత కవయిత్రులు, ఆంధ్రకవయిత్రులు' సారస్వత ప్రముఖ స్త్రీల వివరాలతో కూడిన వ్యాసాలు. సాహిత్య సంబంధ విమర్శ సృజనంగా డా. నాయని కృష్ణకుమారి, డా. యశోదారెడ్డి పరిశోధనాత్మకంగా ఉంటే, ఇల్లిందుల సరస్వతీదేవి కృషి సృజనంగా ఉంది. శ్రీమతి జమ్మల మడక శ్రీ కామాక్షి హైమవతీదేవి, శ్రీమతి పిల్లలమట్టి సుశీల, ఇతర వ్యాసకర్తలు. 'జీవన సామరస్యం, నారీ జగత్తు, వెలుగుబాటలు, జీవితరత్నాలు, ఆంధ్రసచిత్ర వారపత్రిక వనితా లోకంలో ప్రచురించి, పునర్ముద్రించిన వ్యాససంపుటులు. వీరి విమర్శన సృజన రీతుల వ్యాసం పూర్వం లేని పరిణామం కలిగి ఉంది. స్త్రీ జీవిత పురోగమన కాంక్ష ఈ ఈ సృజన వ్యాసాలలో ప్రధానంగా నిల్చిన అంశం.

## 1.3 పత్రికా వ్యాసం :

తెలుగు పత్రికల ఆవిర్భావం వ్యాససృష్టికి దోహదమయింది. పత్రికలలో వచ్చి సంపుటాలుగా వ్యాసాలు వెలువడ్డాయి. ఇతర భాషలలోనే తెలుగు పత్రికలు కూడా క్రైస్తవ మతబోధకు ప్రాధాన్యమిచ్చి, క్రమంగా మతబోధ భాష నుంచి వచన రీతి రచనలలోనికి పరిణామం చెందాయి. సాహిత్య సంబంధాలు, సాంఘిక సంబంధాలు, స్త్రీ సంబంధాలు మతదృష్టితో వ్యాసరచన జరిగింది పత్రికలలో. ఆయా దృష్టితోనే పత్రికలు ఏర్పడ్డాయి. ఈ పత్రికలు వ్యాసం విస్తృతం కావటానికి పెట్టిన బహుమతులు తమ లక్ష్యాన్ని ఫలవంతం చేశాయి.

19వ శతాబ్దిలో ఉపన్యాసాలు, 20వ శతాబ్దంలో పేరు మారి వ్యాసమై పత్రికలలో చోటు చేసుకుంది. ఈ వ్యాసాలన్నీ సంపుటాలుగా రానివి చాలా ఉన్నాయి.

## ప్రముఖ పత్రికా త్రయం :

ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలు, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలు, భారతులు వ్యాసాన్ని ప్రోత్సహించాయి, ఎక్కువగా సాహితీ విమర్శనం సారస్వత పత్రికలలో ఎక్కువ. భిన్న విషయాలపై వ్యాస రచన జరిగింది. సృజన వ్యాసం తగ్గింది.

ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికల ముద్రణ వీరితోనే ఆరంభం. ఈ సంచికలలో భాష సాహిత్యం, మతం స్త్రీ సంబంధాది అనేక విషయాలు సృజన వ్యాసాలుగా వ్యావహారిక భాషగా నిల్చాయి.

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక తెలుగుభాషకు వాఙ్మయానికి సంబంధించిన విషయాలను చర్చించే త్రైమాసిక పత్రిక. సాహిత్య భాషా విషయాలతో సృజన ధోరణితో వ్యాసాలు సాగాయి.

భారతి మాసపత్రిక. సారస్వత విమర్శనం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇవి కాక వివాద వ్యాసం, అనువాద వ్యాసం భాష కళాశాస్త్ర సంబంధ వ్యాసాలు ఇందులో నిల్చాయి. సమకాలీన సమస్యలెన్నో ఇందులో చోటుచేసుకొన్నాయి.

**సారస్వత పత్రికా వ్యాసాలు :**

ఇరవైవ శతాబ్ది ఆరంభానికి పూర్వం సారస్వత పత్రికలలో ఉపన్యాసాలు వ్యాసాలు ప్రచురితమయ్యాయి. సృజనత అధికం విమర్శనం తక్కువగా ఉపన్యాసాలలో కంటే వ్యాసంలో ప్రధానంగా సృజనం అప్రధానంగా నిల్చింది. హితవాది దివర్తమాని శ్రీయక్షిణి తత్త్వబోధిని సుజనరంజని వివేకవర్ధని, హాస్యసంజీవని, సతీహితబోధిని వంటి పత్రిక వ్యాసాన్ని ప్రభావితం చేశాయి.

పత్రికలలోని సంపాదకీయాలూ, ప్రత్యేక శీర్షికలు (శారదలేఖలు), కృతి విమర్శనాలు వివిధ సంచికలు (వ్యాస సంగ్రహము) సంచలనాలు (సాహిత్యోపన్యాసములు) వ్యాస సృజనకు నిదర్శనాలు.

## 1.4 వివాద వ్యాసం :

కవులు రచయితలు విమర్శకుల ఆత్మాభివ్యక్తి హృదయావిష్కరణలో అనుభూతి పురస్కారంతో అభిమానాందోళనలు ఆవేశాలోచనలు ప్రతిభా సాహిత్యాలు ప్రతిష్ఠించుకొని సాగించిన సారస్వత చర్చలు వివాద వ్యాసానికి కారణాలు. ఉత్తమ సాహితీవేత్తలు మానవ సహజ సంయమనం కోల్పోవటం వల్ల వ్యాస మర్యాదలన్నీ, సభ్యతాదులు మరచిపోవటంతో వివాదవ్యాసాలు నిందగా మారాయి. ఒక ప్రముఖ స్వభావ ప్రదర్శకంగా వివాదవ్యాసం ఉండటం సమంజసం. సారస్వతం సాంఘిక జీవితం, రచయిత వ్యక్తిత్వం కలిసి వివాదవ్యాసం రూపొందింది. సాంఘిక వ్యత్యాసాలు, ఆర్థిక లోపం వ్యక్తి ప్రాధాన్య ప్రాధాన్యాలు, ప్రాచీన ఆధునిక బేధాలు భిన్న నాగరికతలు, పాండిత్య ప్రకర్షలు వివాద వ్యాసానికి కారణాలు.

వివాద వ్యాసానికి ప్రారంభం, ప్రోత్సాహం, నిర్వహణం, సమాప్తం అన్న నాలుగు లక్షణాలు ఉండటం విశేషం. ఈ వ్యాసం భిన్న విషయ విస్తృతంగా ఉంది. గ్రంథ కర్తృత్వం (భాస్కర రామాయణం ఆముక్తమాల్యద కృతికర్త పట్ల వివాదం) కవుల ఆధిక్యం (నన్నయ, నన్నెచోడడు వీరిలో ఆదుడెవరు? ఎఱ్ఱన సోమనలలో కవితా గుణ అధికులు ఎవరు?) వంటివి వ్యాసాలున్నాయి. గ్రంథ పరిష్కారం, పత్రికా ప్రకటన, కావ్యరచన, తద్విమర్శ అసహజంగా ఉన్నప్పుడు ఉన్నాయనుకొన్నప్పుడు వివాద వ్యాసం రూపొందుతుంది. బేతపూడి భగవంతరావు రాసిన నాటకం 'స్వారోచిష మనుసంభవము' మీద కృష్ణాపత్రిక విమర్శ ప్రకటిస్తే రచయిత 'స్వారోచిష మనుసంభవ నాటిక విమర్శన ఖండనము' రాశాడు. కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వతత్త్వ విచారము' రాస్తే కాళూరి వ్యాసమూర్తి 'కవితత్త్వ విచార విమర్శనము' వెలువరించాడు. శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ 'ఆంధ్ర కవయిత్రులు' పరిశోధనా గ్రంథంపై హోతా వేంకటరామశాస్త్రి విమర్శించాడు. కందుకూరి జీవితాన్ని కొక్కొంత వేంకటరత్నం పంతులు, వేదం వేంకటరామశాస్త్రి, దాసు శ్రీరాములు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి వంటివారు విమర్శించారు.

వ్యాసం సృజనాత్మకంగా అనేకానేక పార్శ్వాలతో పరిఢవిల్లింది. సుదీర్ఘ ప్రయాణంలో తెలుగులో వ్యాసం సాహిత్యావరణకు విమర్శా ప్రముఖంగా పరిణామం చెందింది.

## 5. విశేష పద వివరణ :

## 6. మాదిరి ప్రశ్నలు :

1. తెలుగు వ్యాస వాఙ్మయంలో సృజన వ్యాస పరిణామాన్ని పరామర్శించండి.
2. తెలుగు వ్యాసాన్ని నిర్వచించి, విమర్శన వ్యాస పరిణామాన్ని వివరించండి.

## 7. ఉపయుక్త గ్రంథాలు :


తెలుగు వ్యాస పరిణామం - ఆచార్య కొలకలూరి ఇనాక్

తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము - కొత్తపల్లి వీరభద్రరావు

తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ - ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి


**డా॥ కొలకలూరి మధుజ్యోతి**